# నూహ్ నావ

రచన

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ
వాగ్దత్త మసీహ్ మరియు మహ్దీ
అలైహిస్సలాం



# నూహ్ నావ

రచన

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని

వాగ్దత్త మసీహ్ మరియు మహ్దీ అలైహిస్సలాం

**అనువాదము**

షేఖ్ ఇబ్రాహీమ్ నాసిర్ బి.ఏ.,బి.ఎడ్.

**ప్రచురణ**

నజారత్ నష్రో ఇషాఅత్

సదర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్

کشتی نوح

పుస్తకము పేరు: **నూహ్ నావ**

కూర్పు : హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌఊద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం

అనువాదము : షేఖ్ ఇబ్రాహీమ్ నాసిర్ బి.ఏ.,బి.ఎడ్.

ముద్రణ : 2022

ప్రతులు : 250

ముద్రణాలయం : ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్

ప్రచురణ : నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్-143516, జిల్లా: గుర్దాస్‌పూర్, పంజాబ్, ఇండియా.

**ఇతర వివరాలకు సంప్రదించగలరు**

www.alislam.org

www.ahmadiyyamuslimjamaat.in

Name of Book : **NUH NAAVA (KISHTI NUH, NOAH'S ARK)**

Compiled By : Hazrat Mirza Ghulam Ahmad Qadiani Alaihissalam

First Edition : 2022

Copies : 250

Printed at : Fazl-e-Umar Printing Press Qadian

Published by : Nazarat Nashr-o-Isha'at Qadian, 143516 Dist: Gurdaspur Punjab, INDIA

# విషయ సూచిక


| క్ర.సం | శీర్షికలు | పుట |
|---|---|---|
| 1. | తొలి పలుకులు | IV |
| 2. | నూహ్ నావ ఉర్దు ప్రథమ టైటిల్ | VI |
| 3. | నూహ్ నావ ఉర్దు ప్రథమ టైటిల్ అనువాదము | VII |
| 4. | రచయిత ఫోటో | VIII |
| 5. | రచయిత పరిచయం | IX |
| 6. | పుస్తక పరిచయం | XI |
| 7. | తావూన్ మహమ్మారి టీకా | 1 |
| 8. | మా బోధన | 18 |
| 9. | మసీహ్ సమాధి గురించి ఒక ఇస్రాయీలీ బైబిల్ విద్యావంతుని సాక్ష్యము | 135 |
| 10. | మహిళలకు ఉపదేశాలు | 138 |
| 11. | చివరి పలుకులు | 141 |
| 12. | తావూన్ (ప్లేగు వ్యాధి) గురించి పద్య రూపంలో భవిష్యవాణి | 147 |
| 13. | గృహాన్ని విశాలంగా నిర్మించడం కోసం చందాల విన్నపం | 148 |

# తొలి పలుకులు

హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం '**నూహ్ నావ**' అనే పుస్తకమును పదే పదే పఠించాలని ఇట్లు ఉపదేశించారు.

"నూహ్ నావలో నేను మన బోధనను వ్రాశాను. కావున దీనిని ప్రతి ఒక్కరు తెలుసుకొనుట అనివార్యము. ప్రతి నగరములో ఒక సభ నిర్వహించి దీనిని వినిపించుటకు తగిన ఏర్పాట్లు చేయవలెను. ఒక ఆరోగ్యవంతుడైన చురుకైన వ్యక్తిని వినిపించుటకు పంపవలెను. పంచిపెట్టుకుంటూ పోతే 50 వేల ప్రతులైనను సరిపోవు. ఈ ఉపాయముతో దీని ప్రచారము కూడ జరుగును. తద్వారా మనము ఆశిస్తున్న ఐక్యత కూడ ఏర్పాటగును."

(మల్ఫూజాత్ సంపుటి 3 పుట 408)

ఈ పుస్తకము గురించి హ(జత్ మిర్జా మస్రూర్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ జమాఅత్ సభ్యులకు ఇట్లు సూచలను చేశారు.

"దీనిని పఠించుటకు, వినిపించుటకు జమాఅత్‌లలో తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు ఎమ్.టి.ఏ.లో కూడ వినిపించుటకు ఏర్పాట్లు చేయవలెను. ప్రతి ఒక్కరు దీనిని తమ జీవిత భాగముగా చేసుకోవలెను. అందరు స్వయంగా చదువుతు దీని ప్రకారము ఆచరించుటకు ప్రయత్నించవలెను."

(ఖుత్బా జుమా 13-4-2018)

హ(జత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ పై సూచనలను పాటిస్తు వారి ఆమోదము తో ఈ పుస్తకమును తెలుగు భాషలో ప్రచురిస్తున్నాము. గౌ॥ షేఖ్

ఇబ్రాహీమ్ నాసిర్ నవాబు పేట గారు (జిల్లా మహ్‌బూబ్ నగర్, తెలంగాణ) దీనిని తెలుగులో చక్కగా అనువదించారు. గౌ॥ ముహమ్మద్ లతీఫ్ షరీఫ్ కొండూరు రివ్యూ కమిటి అధ్యక్షుల గారి ఆధ్వర్యములో గౌ॥ ముహమ్మద్ అక్బర్ ముబల్లిఘ్ ఉపసంపాదకులు బదర్ తెలుగు వార పత్రిక, గౌ॥ హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ ఇంచార్జి తెలుగు డెస్క్ ఖాదియాన్ గారలు పరిశీలించి, ప్రూఫ్ రీడింగ్ చేశారు. ఈ పుస్తక ప్రచురణలో సహకరించిన వారందరికి అల్లాహ్ తఆలా ఉత్తమ ప్రతిఫలము నొసంగుగాక! ఈ పుస్తకము తెలుగు పాఠక మహాశయులందరికి ఆధ్యాత్మికంగా ప్రయోజనము కలిగించు గాక!

*హాఫిజ్ మఖ్దూమ్ షరీఫ్*
*నాజిర్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్*




Facsimile of the original Urdu title page printed in 1902

ఈ దైవవాణి "ఆకుపచ్చ రంగు కరపత్రము"లో ముద్రించబడెను.
నాకు అందిన ఈ దైవవాణి పవిత్ర ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది
సూక్తులలో గలదు.

وَيَاِصنَعِ الْفُلْكَ بِأَعْيُنِنَا وَوَحْيِنَا

اِنَّ الَّذِيْنَ يُبَايِعُوْنَكَ اِنَّمَا يُبَايِعُوْنَ اللهَ يَدُاللهِ فَوْقَ اَيْدِيْهِمْ

అనువాదము: "నీవు మా కళ్ళ ముందు మా సువార్త వాణి ప్రకారము నావను నిర్మించుము. ప్రమాణము చేసి నీపై భక్తిని ప్రకటించు వారు ప్రమాణము చేసి కేవలము అల్లాహ్‌పై మాత్రము భక్తిని ప్రకటింతురు. అల్లాహ్ హస్తము వారి చేతులపై నున్నది.

వేగంగా మా నావ వైపు రండి. ఈ నావ సర్వశక్తి మంతుడైన దేవుని తరపున సిద్ధము చేయబడెను.

ప్రపంచ హృదయము ఈ తావూన్ వలన ముక్కలు ముక్కలైనది. ఇది తావూన్ కాదు ఒక పెద్ద తూఫాను.

**ఇది తావూన్ నివారణకు మా జమాఅత్‌కై సిద్ధము**
**చేయబడిన ఆకాశ టీకా. దీని నామము**

# నూహ్ నావ

దీని ద్వితీయ నామము

**విశ్వాసమునకు ఆహ్వానము**

తృతీయ నామము

**విశ్వాసము దృఢపర్చునట్టిది**

اِرْكَبُوْا فِيْهَا بِسْمِ اللهِ مَجْرٖهَا وَمُرْسٰهَا قَالَ لَا عَاصِمَ الْيَوْمَ مِنْ اَمْرِ اللهِ اِلَّا مَنْ رَّحِمَ

(భాగము:12 అధ్యాయము:హూద్)


నూహ్ నావలో ఎక్కుడు, దీని నడక, దీని ఆపుదల అల్లాహ్ శుభ నామము తోనే జరుగును. అల్లాహ్ ఈ (శిక్ష) ఆజ్ఞ నుండి ఈ రోజు అతడు స్వయముగా కరుణించిన వానిని తప్ప ఎవడు (ఎవడిని) రక్షించ లేడు.

మీరు కృతజ్ఞులై, విశ్వాసులైవున్నచో అల్లాహ్ మిమ్ములను ఎలా శిక్షించును? అల్లాహ్ ఉత్తమాభిమాని, సర్వజ్ఞుడు.

مَا يَفْعَلُ اللهُ بِعَذَابِكُمْ اِنْ شَكَرْتُمْ وَاٰمَنْتُمْ وَكَانَ اللهُ شَاكِرًا عَلِيْمًا۔

(భాగము:5 అధ్యాయము: అన్నిసా)

5 అక్టోబర్ 1902
ఖాదియాన్‌లో హకీమ్ ఫజ్‌ల్‌దీన్ భేరవీ ద్వారా జియావుల్ ఇస్లాం ముద్రణలో నా జమాఅత్ మార్గదర్శనము, సత్యాన్వేషుల కొరకు ముద్రించబడెను
ప్రతులు 5,000
(ప్రథమ ముద్రణ ఉర్దు టైటిల్ అనువాదము)



హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ
మసీహ్ మౌవూద్, మహ్ది మాహూద్
అలైహిస్సలాం

# హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని అలైహిస్సలాం

## (రచయిత పరిచయం)

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం 1835 ఫిబ్రవరి 13వ తేదీన భారత దేశములోని ఒక చిన్న పట్టణము ఖాదియాన్‌లో జన్మించారు. బాల్యము నుండే వారు దైవారాధన, దుఆలు (ప్రార్థనలు), పవిత్ర ఖుర్ఆన్‌తో పాటు ఇతర గ్రంథముల పఠనములో నిమగ్నమై వుండేవారు. అప్పుడు నలు వైపుల నుండి ఇస్లాంపై దాడులు జరుగుతున్నందున దాని దయనీయ స్థితిని చూసి తీవ్ర కలతకు గురయ్యేవారు. ఇస్లాం రక్షణతో పాటు దాని బోధనలను స్వచ్ఛమైన రీతిలో ప్రపంచములో వ్యాపింపజేయుటకు వారు (అ) సుమారు 90 కంటే అధిక పుస్తకములను రచించారు. వేల సంఖ్యలో ఉత్తరములు వ్రాశారు. అనేక ధార్మిక సంభాషణలు, చర్చలు జరిపారు. మానవులకు సృష్టికర్తకు మధ్య సంబంధమేర్పరచ గల ధర్మము ఇస్లామ్ మాత్రమే అని, ఇస్లాంను అనుసరించి మానవుడు ప్రవర్తనల పరంగా, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చేరవచ్చునని వారు తెలిపారు.

చిన్నతనము నుండే వారు సత్య, దివ్య స్వప్నములతో పాటు దైవ సంభాషణలతో సత్కరించబడిరి. 1889 మార్చి 23వ తేదీన

అల్లాహ్ తఆలా అభీష్టము మేరకు బైఅత్ ప్రతిజ్ఞ పరంపరను ప్రారంభించి ఒక పవిత్ర సంస్థకు పునాది వేశారు. దైవ సంభాషణల లో క్రమంగా ప్రగతి సంభవించెను. కావున ప్రపంచమంతటా వివిధ నామములతో గుర్తింపు పొందిన ప్రపంచ సంస్కర్త వాగ్దత్త తానేనని అల్లాహ్ తఆలా ఆదేశముతో ప్రకటించుకొనిరి. హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారము అవతరించవలసిన మసీహ్, మహ్దీ తానేనని కూడ వారు ప్రకటించారు. ఇప్పుడు అహ్మదియ్య సంస్థ ప్రపంచ పటము లోని 216 కంటే అధిక దేశములలో స్థిరంగా ఏర్పడినది.

1908 మే 26వ తేదీన వారు పరమపదించిన తర్వాత పవిత్ర ఖుర్ఆన్, ఇస్లాం స్థాపకులైన హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీల ప్రకారము వారి (అ) అవతరణ లక్ష్యమును పూర్తి చేయుటకు ఖిలాఫత్ (ఉత్తరాధికాధిత్వ) వ్యవస్థ అహ్మదియ్య సంస్థలో ప్రారంభమయ్యెను. ప్రస్తుతం మసీహ్ ఐదవ ఖలీఫాగా, అహ్మదియ్య జమాఅత్ (సంస్థ) వర్తమాన ఇమామ్ (అంతర్జాతీయ అధినేత)గా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ లండన్ కేంద్రముగా విధులు నిర్వహిస్తున్నారు.

✿✿✿

# పుస్తక పరిచయం

(హజ్రత్ మౌలానా జలాలుద్దీన్ షంస్)

నూహ్ నావ అనే ఈ పుస్తకము 5 అక్టోబర్ 1902వ తేదీన ముద్రించబడెను. దీని ద్వితీయ నామము 'విశ్వాసమునకు ఆహ్వానము' మరియు తృతీయ నామము 'గట్టి విశ్వాసము' దీని గురించి టైటిల్ పుట మీద ఇట్లు వ్రాసి వున్నది.

**"ఇది తావూన్ నివారణకు మా జమాఅత్‌కై**
**సిద్ధము చేయబడిన ఆకాశ టీకా"**

ఇంకా రెండు పారసీక పద్యములు కూడ వ్రాసి వున్నవి. వాటి అనువాదమిట్లు గలదు.

(1) ప్రపంచ హృదయము ఈ తావూన్ వలన ముక్కలు ముక్కలైనది. ఇది తావూన్ కాదు ఒక పెద్ద తూఫాను.

(2) వేగంగా మా నావ వైపు రండి. ఈ నావ సర్వశక్తి మంతుడైన దేవుని తరపున సిద్ధము చేయబడెను.

**రచన కారణము:**

6 ఫిబ్రవరి 1898వ తేదీన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి.

"నేను స్వప్నములో ఇట్లు చూశాను. దేవదూతలు పంజాబ్‌లోని వివిధ ప్రాంతములలో నల్లటి రంగులో వున్న మొక్కలు నాటుతున్నారు. ఆ వృక్షములు ఎంతో అందవిహీనంగా, నల్లగా, భయంకరంగా వున్నాయి. ఇవి ఎలాంటి వృక్షములని నాటేవారితో నేనడిగినాను. వారిట్లు సమాధానమిచ్చారు. సమీపములోనే

దేశములో వ్యాపించనున్న తావూన్ వృక్షములివి. రాబోవు చలి కాలములో ఈ వ్యాధి వ్యాపించునని చెప్పారా లేక దాని తర్వాత వచ్చే చలికాలములో వ్యాపించునని చెప్పారా నాకు సరిగ్గా తెలియ లేదు. కాని నేను చూసిన దృశ్యము చాలా భయంకరంగా వుండెను." వారు (అ) ఇంకా ఇట్లు తెలిపిరి. నాకు ఇంతకు ముందు కూడ తావూన్ గురించి దైవవాణి అందెను. అదిట్లు గలదు.

إِنَّ اللّٰهَ لَا يُغَيِّرُ مَا بِقَوْمٍ حَتّٰى يُغَيِّرُوْا مَا بِأَنْفُسِهِمْ ۔ إِنَّهٗ اٰوَى الْقَرْيَةَ

(తజ్కిరహ్ పుట 261 నాలుగవ ముద్రణ)

అనగా తమ పరోక్ష పరిస్థితిని మార్చు వరకు అల్లాహ్ ఏ జాతిని మార్చుడు.

ఈ భవిష్యవాణి ప్రకారము పంజాబ్‌లో తావూన్ ప్రబలినది. 1902 అక్టోబర్ నెలలో తావూన్ తీవ్ర స్థాయిలో వుండెను. కావున ప్రభుత్వము పంజాబ్‌లో తావూన్ టీకా పథకమును విస్తృత స్థాయిలో ప్రారంభించి ప్రకటనలు, కరపత్రాల ద్వారా ప్రతి ఒక్కరు టీకా తప్పక వేయించుకోవాలని ప్రచారము చేసిరి. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం టీకా వేయుంచుకొనుటకు నిరాకరించిరి. 5 అక్టోబర్ 1902వ తేదీన "నూహ్ నావ" అనే పుస్తకమును ప్రచురించిరి. ప్రభుత్వము తరపున టీకాకు చేసిన ఏర్పాట్లను ప్రశంసిస్తు ఇట్లు తెలిపిరి.

"ఈ పనికి కృతజ్ఞతతో స్వాగతం పలుకుట
తెలివిమంతులైన పౌరుల కర్తవ్యము."

తమ గురించి, తమ జమాఅత్ గూర్చి వారిట్లు తెలిపిరి.

"ఒకవేళ మాకు ఆకాశ అడ్డంకులు లేనిచో ప్రజానికంలో అందరి కన్న ముందు మేమే టీకాలు వేయించుకునే వారము. ఆ ఆకాశ అడ్డంకి ఏమిటనగా, నేటి కాలంలో మానవులందరికి ఒక

ఆకాశ కరుణా ప్రపూర్ణ చిహ్నమును చూపించాలని అల్లాహ్ ఆశిస్తున్నాడు. కావున అతడే నన్ను ఉద్దేశించి "నీవు మరియు నీ గృహ నలు గోడల మధ్యలో ఉండు వాడు, సంపూర్ణ విధేయతతో, అనుసరణతో, స్వచ్ఛమైన నిష్టాపరతతో నీకు అంకితమైపోవు వారందరు ప్లేగ్‌వ్యాధి నుండి రక్షించబడుదురు. ఈ చివరి కాలంలో దేవుడు జాతుల మధ్య గల వ్యత్యాసములను బహిర్గతం చేసి తన చిహ్నమును ప్రదర్శించును. కాని సంపూర్ణ విధేయత చూపని వారు మీలోని వారు కారు. వారి కోసం నీవు బాధ పడకుము. ఇది దైవాజ్ఞ." అని తెలిపెను. ఈ కారణం చేతనే మాకు, మా గృహ నాలుగు గోడల మధ్య ఉన్న వారికి టీకాలు వేయించుకో వలసిన అవసరం లేదు......"

(నూహ్ నావ పుట 2,3)

ఇంకా ఇట్లనిరి.

"ఒక వేళ ఈ ప్లేగ్ వ్యాధి నుండి కాపాడబడుటకు ఏ బోధనలను క్రమం తప్పకుండా ఆచరించ వలెననే ప్రశ్న ఎవరి లోనైన తలెత్తినచో, నేను ఆ బోధనలను సంక్షిప్త రూపంలో కొన్ని పంక్తులలో ఇక్కడ లిఖిస్తున్నాను."

(నూహ్ నావ పుట 18)

దీని తర్వాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఆ బోధనను పొందుపర్చిరి. అదెంత పవిత్రమైన బోధన అనగా మన జమాఅత్ సభ్యులందరు దీనిని పూర్తిగా ఆచరించినచో వారు ఆదర్శంతులై ప్రపంచములో ఒక అద్భుత ఆధ్యాత్మిక విప్లవము సృష్టించగలరు.

## నూహ్ నావ పుస్తకము

### విశ్వాసమును ధృడపర్చునట్టిది

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ

# తావూన్ మహమ్మారి టీకా

لَنۡ یُّصِیۡبَنَاۤ اِلَّا مَا کَتَبَ اللّٰہُ لَنَا ۚ ہُوَ مَوۡلٰنَا ۚ وَعَلَی اللّٰہِ فَلۡیَتَوَکَّلِ الۡمُؤۡمِنُوۡنَ

(అత్తౌబహ్-9:51) అనువాదం: అల్లాహ్ తఆలా మా కొరకు వ్రాసిపెట్టిన ఆపద తప్ప మరే ఆపద మాకు సంభవించదు. అతడే మా సర్వాధికారి. కావున విశ్వాసులు అల్లాహ్‌నే నమ్మవలయును.

కృతజ్ఞత స్థానమిది. ఆంగ్లేయ ప్రభుత్వం దేవుని భక్తులపై దయచూపుతూ ప్లేగ్ వ్యాధి నుండి కాపాడుటకు మరొకసారి టీకాల కార్యక్రమములను చేపట్టినది. దేవుని దాసుల ఉజ్వల భవిషత్తు కోసం కొన్ని లక్షల రూపాయలను ఖర్చు చేయుటకు సుముఖతను చూపింది. వాస్తవానికి ఇంత గొప్ప ఘన కార్యమును తలపెట్టిన ఈ ప్రభుత్వమును వివేకవంతులైన ప్రజానికం కృతజ్ఞతతో ఆహ్వానించాలి. టీకాలను గూర్చి చెడు అభిప్రాయము కల్గిన వారంత మూర్ఖులు, తమ ప్రాణానికి స్వయం శత్రువులు. ఎందుకనగా ఎన్నో సార్లు ఎదురైన అనుభవంతో తెలుస్తున్నదేమనగా ఈ ప్రభుత్వం అతి భయంకరమైన వ్యాధులకు చికిత్సలు చేయించడమే గాకుండా, పలుసార్లు పరిశోధన చేసిన తరువాతయే ఇలాంటి ప్రయోజనము చేకూర్చు చర్యలను ముందస్తు చర్యగా చేపడుతుంది. ఈ మహెూత్తమమైన ప్రయోజనమును చేకూర్చడం కోసం ఈ ప్రభుత్వం లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తుంది,

ఇప్పటికి చేసింది. ఇది చాలా గొప్ప విషయం. మరియు మానవ ఆలోచనలకు అతీతమైనది. వాస్తవానికి ఈ ప్రభుత్వం చేపట్టిన ఈ సమస్యాత్మక, ఖర్చుతో కూడిన కార్యక్రమము, చూపునట్టి ప్రత్యేక శ్రద్ధ వలన దానికి ఎలాంటి ప్రయోజనమేమైనా చేకూరునా? లేదు. కావున ఇలాంటి ప్రభుత్వమును అభినందించాలి. ఈ కార్యక్రమమును అనుమానించునట్టి స్థాయికి దిగజారిన ఈ ప్రజానికం చాలా దురదృష్టవంతులు. నేటి వరకు ఈ ప్రపంచము లో ఈ ప్రభత్వం చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యలకై తీసుకున్న ప్రణాళికలలో టీకాలు చేయించాలనే ప్రణాళిక కూడ ఉన్నతమైన దనుటలో ఎలాంటి సందేహం లేదు. ఈ ప్రణాళిక ప్రయోజనాన్ని చేకూర్చిందనే విషయాన్ని ఎవరు తిరస్కరించలేరు. ప్రజా శ్రేయస్సు కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అనుసరిస్తూ, ప్రజల ప్రాణాల పట్ల ప్రభుత్వానికి ఉన్న ఆవేదనను దూరం చేయవలసిన బాధ్యత ప్రజానికంపై గలదు. కాని మేము ఎంతో వినయముగా ఈ ఉపకార ప్రభుత్వానికి చేయు విన్నపమేమనగా!, ఒకవేళ మాకు ఆకాశ అడ్డంకులు లేనిచో ప్రజానికంలో అందరి కన్న ముందు మేమే టీకాలు వేయించుకునే వారము. ఆ ఆకాశ అడ్డంకి ఏమిట నగా, నేటి కాలంలో మానవులందరికి ఒక ఆకాశ కరుణా ప్రపూర్ణ చిహ్నమును చూపించాలని అల్లాహ్ ఆశిస్తున్నాడు. కావున అతడే నన్ను ఉద్దేశించి “నీవు మరియు నీ గృహ నలు గోడల మధ్యలో ఉండు వాడు, సంపూర్ణ విధేయతతో, అనుసరణతో, స్వచ్ఛమైన నిష్టాపరతతో నీకు అంకితమైపోవు వారందరు ప్లేగ్‌వ్యాధి నుండి రక్షించబడుదురు. ఈ చివరి కాలంలో దేవుడు జాతుల మధ్య గల వ్యత్యాసములను బహిర్గతం చేసి తన చిహ్నమును ప్రదర్శించును. కాని సంపూర్ణ విధేయత చూపని వారు మీలోని వారు కారు.

వారి కోసం నీవు బాధ పడకుము. ఇది దైవాజ్ఞ.” అని తెలిపెను. ఈ కారణం చేతనే మాకు, మా గృహ నాలుగు గోడల మధ్య ఉన్న వారికి టీకాలు వేయించుకోవలసిన అవసరం లేదు. ఎందుకనగా నేను ఇప్పుడే ప్రస్తావించినట్లుగా నేటి నుండి చాలా కాలం క్రితమే భూమ్యాకాశములకు అధిపతి, సర్వ జ్ఞాని, సకల గోప్యతలను ఎరుగునట్టి ఆ అల్లాహ్ “అన్ని రకాల వ్యతిరేకతలను విడనాడి, పూర్తి స్వచ్ఛత, వినమ్రత, విధేయతలతో బైఅత్ పరంపర లో చేరి, దేవుని ఆదేశాల ముందు, అతని అవతారుని ఎదుట ఎలాంటి గర్వము, అహం, పొగరు, అలసత్వము, స్వార్థము, స్వప్రయోజనమును ప్రదర్శించకుండా కేవలం బోధనలనుసారం ఆచరించుదుననే నిబంధనను పాటిస్తూ నీ ఇంటి నాలుగు గోడల మధ్య ఉన్న వారందరిని ప్లేగ్ వ్యాధి వలన సంభవించు మరణం నుండి కాపాడెదనని” నాపై సువార్తవాణిని అవతరింపజేసెను. మరల అతడు నన్ను ఉద్దేశించి “సాధారణముగా ప్రజలను కుక్కల వలే మరణింప జేయునట్టి, భయభ్రాంతులకు గురి చేయునట్టి భయంకర వినాశనమును సృష్టించునట్టి ప్లేగ్ వ్యాధి ఖాదియాన్‌లో వ్యాపించదు. సహజముగా ఈ జమాఅత్‌లో ఉన్నటువంటి అహ్మదీయులందరు వారు ఎంతమంది ఉన్నను. వ్యతిరేకులకు భిన్నముగా ప్లేగ్ వ్యాధి నుండి సురక్షితముగా ఉండెదరు. కాని తమ వాగ్దానాలపై స్థిరముగా లేని వారు, లేదా అతని విషయంలో మరేదైన అంశం రహస్యముగా నున్నచో, అలాంటి వారిని గూర్చి అల్లాహ్‌కు తెలిసినందున వారిపై ప్లేగ్ వ్యాధి తన ప్రభావంను చూపవచ్చును” అని తెలిపెను. నిష్పత్తి దృష్ట్యా, భిన్నపు దృష్ట్యా ఈ జమాఅత్‌కే దేవుని సహాయ సహకారములు గలవని, తన ప్రత్యేక కరుణతో సాటి లేని విధముగా అతడు వారిని రక్షించినాడనే

విషయాన్ని చివరికి వివేకవంతులు ఆశ్చర్యముతో అంగీకరించె దరు. అంతేగాకా తన ప్రత్యేక కరుణ ద్వారా వారిని కాపాడు విధానానికి మరెక్కడ ఉదాహరణ లభించదు. ఈ విషయమును తెలుసుకున్న కొందరు మూర్ఖులకు మతి పోవును, మరి కొందరు నవ్వు కొందురు, మరి కొందరు నన్ను పిచ్చివానిగా చూసెదరు. ఎలాంటి టీకాలు వేయుంచుకోకున్నా కూడ తన కరుణతో వారిని కాపాడే ఇలాంటి దేవుడు నిజానికి ఉన్నాడా? అని మరి కొందరు ఆశ్చర్య పోవుదురు. వారందిరికి నేనిచ్చు సమాధానమేమనగా, నిస్సందేహముగా ఇలాంటి దేవుడు ఒకడు ఉన్నాడు. ఒకవేళ అతడు అట్టి స్వభావంను కల్గి లేకున్నచో అతనిని విశ్వసించువారు జీవిస్తూనే మరణించెదరు. అతడు విచిత్ర దేవుడు. అతని పవిత్ర శక్తులన్ని కూడ విచిత్రతను కల్గి ఉన్నవి. ఒక వైపు అజ్ఞాన వ్యతిరేకులను తమ మిత్రులపై కుక్కల వలే ఎగదోయును, మరో వైపు వారికి సేవలు చేయుమని దైవ దూతలను ఆదేశించును. ఈ విధముగానే అతడు ఎప్పుడైనా ప్రపంచీకులపై ఇలా ఆగ్రహించి నచో, అతని ఉక్రోషం దౌర్జన్యులపై పడినచో అతని కన్నులు అతని ప్రియమైన వారిని రక్షించుకొనును. ఒకవేళ అలా జరుగనిచో సత్యవంతుల ప్రపంచం చిన్నా భిన్నమైపోయేది. ఆపై వారిని ఎవరు కూడ గుర్తించక పోయేవారు. అతనికి అనేక శక్తులు గలవు. కాని నమ్మకానికి అనుగుణముగా అతడు తన శక్తులను ప్రజలపై ప్రదర్శించును. ఎవరికైతే నమ్మకము, అభిమానము, అతని సమ్మేళన భాగ్యం లభించునో, మనోవాంచల నుండి పూర్తిగా పరిశుద్ధులైనచో వారి కోసమే అద్భుత శక్తులు ప్రదర్శింపబడును. దేవుడు తలచుకున్నది చేయును. కాని ఎవరైతే దేవుని కొరకు తమను తాము మార్చుకుందురో వారికే తన మహత్యములను చూపించాలని

సంకల్పించును. నేటి కాలములో అతని పట్ల అవగాహన కల్గిన వారు, అతని మహత్యములపై నమ్మకమును పెంచుకొనువారు చాలా తక్కువ మంది గలరు. ఒక విధముగా చూసినచో ఆ సర్వోన్నతుడైన దైవంపై విశ్వాసం లేని వారే అధికముగా గలరు. అతని పిలుపును ప్రతి ఒక్కటి ఆలకించును. అతనికి సాధ్యము కాని పని అంటూ ఏదియు లేదు. ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, ప్లేగ్ వ్యాధి వంటి అంటువాధ్యులకు వైద్యం చేయించుకోవడం పాపము కాదు. ఎందుకనగా హదీస్‌లో ఒక కథనము ఇలా గలదు. అల్లాహ్ తఆలా చికిత్స లేని ఏ జబ్బును పుట్టించలేదు. (ముస్లిం) కాని అతడు ఏ నిదర్శనమును ఈ నేల మీద స్పష్టముగా మా కొరకు ప్రదర్శించాలని అనుకున్నాడో అట్టి అల్లాహ్ నిదర్శనమును మేము టీకాలు వేయించుకొని సంశయంలో పడవేయుటను పాపముగా భావించెదను. అందుకే నేను అతని నిజమైన, సత్యమైన వాగ్దానమును అగౌరవ పర్చుతూ టీకాలు వేయించుకోవాలని భావించడం లేదు. ఒకవేళ నేను అలా చేసినచో నా ఈ తప్పు క్షమించరానిది అవుతుంది. పైగా అల్లాహ్ నాతో చేసిన వాగ్దానమునే నేను విశ్వసించని వాడినవుతాను. ఒకవేళ ఇదే జరిగినచో, నా ఈ నాలుగు గోడల మధ్యలో ఉన్నవారందరిని కాపాడుతానని అల్లాహ్ తఆలా నాతో చేసిన వాగ్దానమునకు గాకుండా ఈ టీకాలను వెలుగులోకి తెచ్చిన వైద్యులకే నేను కృతజ్ఞతలు చెప్పిన వాడినవుతాను.

నేను ఎంతో ముందుచూపుతో మీకు తెలుపునదేమనగా, సర్వశక్తివంతుడైన అల్లాహ్ వాగ్దానములు సత్యమైనవి. రాబోవు రోజులు కూడ వచ్చినట్లుగానే నాకు గోచరిస్తున్నవి. ఏ విధముగానైన ప్రజలను ఈ ప్లేగ్ వ్యాధి నుండి కాపాడాలని మన ఆంగ్లేయ

ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనే విషయం కూడ నాకు అర్థమైనది. రాబోవు కాలంలో కూడ ఇలాంటి ప్లేగ్ వ్యాధి నుండి ఒక వేళ ప్రజలను కాపాడుటకు ఈ టీకాలకు బదులుగా మరేవైన అధునాతనమైన మందులు వెలుగులోకి వచ్చినచో వాటిని కూడ ఈ ప్రభుత్వం సంతోషముగా ఆహ్వానిస్తుంది. కావున అల్లాహ్ తఆలా నాకు తెల్పిన విధానం కూడ ఈ క్రమానికి చెందినట్లే అవుతుంది కాని ప్రభుత్వ విధానాలకు భిన్నమైనట్లు కాదు. నేటికి ఇరవై సంవత్సరాల క్రితమే ఈ భయంకరమైన ప్లేగ్ వ్యాధిని గూర్చి నా రచనలో భాగమైన "బరాహీనే అహ్మదియ్యా" లో భవిష్యవాణి రూపంలో పొందు పర్చబడింది. ఈ జమాఅత్ కొరకు అనేక శుభములు కలుగునను వాగ్దానము కూడ అందులో గలదు. ఇందుకోసం "బరాహీనే అహ్మదియ్యా" లోని 518, 519 పుటలను చూడవచ్చును. ఇదియే గాకుండా అల్లాహ్ తఆలా ముందు అతని అవతారుని ముందు ఎలాంటి గర్వమును ప్రదర్శించకుండా నా నాలుగు గోడల మధ్య ఉన్నటువంటి స్వచ్ఛమైన జనులను ఈ ప్లేగ్ వ్యాధి నుండి రక్షించెదనని ఎంతో బలముగా అల్లాహ్ తఆలా నాకు భవిష్యవాణి రూపంలో తెలిపెను. నిష్పత్తి దృష్ట్యా, భిన్నపు దృష్ట్యా ఈ జమాఅత్‌పై అతని ప్రత్యేక అనుగ్రహములు అధికముగా ఉండును. ఒకవేళ ఎవరైన తమ బలహీన విశ్వాసం వలన, లేదా మరేదైన చేయరాని పని చేసినచో లేదా అతని మరణం నిర్ణయించి ఉన్నచో లేదా అల్లాహ్ తఆలా దృష్టిలో ఉన్నటువంటి మరేదైన ఇతర కారణముల వలన పొరపాటున ఈ జమాఅత్ సభ్యులలో ఒకరిద్దరు ప్లేగ్ వ్యాధికి గురై మరణించినచో ఇలాంటి ఒకటి రెండు మరణాలు ప్లేగ్ వ్యాధి మరణాల పరిధిలోకి రావు. ఎందుకనగా పోటిలో అధిక శాతంను మాత్రమే చూడడం

జరుగుతుంది. ఈ ప్రభుత్వం కూడ టీకాలు వేయించుకోని వారికంటే టీకాలు వేయించుకున్న వారు తక్కువ సంఖ్యలో మరణిస్తారని స్వయముగా అధ్యయనం చేసి చెబుతుంది. కావున ఏ విధముగానైతే ఒకటి రెండు మరణాలు టీకా ప్రాధాన్యతను తగ్గించలేవో అదే విధముగా ఈ సంకేతములో కూడ ఇతర ప్రాంతాల కన్న ఖాదియాన్‌లో నామమాత్రముగా ప్లేగ్ వ్యాధికి బాధితులైనను, లేదా ఈ జమాఅత్ సభ్యులలో ఎవరైన ఒకరిద్దరు మృతి చెందినను అట్టి మరణాల వలన ఈ సంకేతపు విలువ కూడ ఏ మాత్రం తగ్గదు. అల్లాహ్ తఆలా పవిత్ర వాక్కుల నుండి వెలువడిన ఈ పదాలను నిబంధనలను అనుసరించి భవిష్యవాణి రూపంలో పొందుపర్చడం జరిగింది. ఆకాశ వాగ్దానాల పట్ల ముందుగానే హేళన చేయడం వివేకవంతుడి లక్షణం కాదు. ఇవి దేవుని వాక్కులు గాని జోతిష్యుని మాటలు కావు. ఇది తేజస్సు భరితమైన చెలిమ నుండి వెలువడినది కాని అంధకారపు కోణాలలో నుండి కాదు. ఇది ప్లేగ్ వ్యాధిని సృష్టించి, దానిని రూపుమాపు శక్తి గల సృష్టికర్త వాక్కు. టీకాలు వేయించుకున్న వారి కంటే ఎక్కువ ఆరోగ్య వంతముగా, సురక్షితముగా జమాఅత్ ప్రజలు ఉండడాన్ని చూసినప్పుడు ఇంతటి అద్భుతము ఏలా జరిగిందని మన ప్రభుత్వం ఆ సమయంలో ఈ భవిష్యవాణిని నిశితంగా గౌరవించును. వాస్తవానికి గత 20 నుండి 22 సంవత్సరాలుగా ప్రాచుర్యం పొందిన ఈ భవిష్యవాణి ఒకవేళ వెలుగులోకి రానిచో నేను దేవుని నుండి వచ్చినవాడిని కాదని స్వీకరించెదనని మీకు నిజముగా తెల్పుచున్నాను. నా ఇంటి నలు గోడల మధ్య ఉన్నటు వంటి స్వచ్ఛమైన ప్రజలు ఈ మరణ వ్యాధి నుండి సురక్షితముగా ఉంటారనునదే నా సత్యమునకు నిదర్శనము. అంతేగాకా నా

జమాఅత్ ప్రజలందరు నిష్పత్తి దృష్ట్యా, భిన్నపు దృష్ట్యా ప్లేగ్ వ్యాధి నుండి ఎక్కువగా రక్షించబడుదురు. వారిలో ఉన్నటువంటి సుఖః శాంతులు ఇతర వర్గీయులలో మరెక్కడా కనిపించవు. ఖాదియాన్‌లో వినాశనంను తలపించు విధముగా ప్లేగ్ వ్యాధి వ్యాపించదు. కేవలం నామ మాత్రముగానే అక్కడక్కడ ఆనవాళ్ళు కనిపించ వచ్చును. ఈ ప్రజలు నిర్మల హృదయులైనచో, సృష్టికర్తకు భయపడినచో ఎంత బాగుండును, అందరు రక్షించబడేవారు. ఎందుకనగా ధార్మిక విభేదాల వలన ప్రపంచములో ఎవరిని శిక్షించడం జరుగదు. ఇందుకు శిక్షలు పరలోకము నందు ఉండును. కేవలం దుష్టత్వము, దురాచారములు, మితిమీరిన పాపముల వలనే ప్రపంచములో శిక్షింప బడుదురు. మసీహ్ మౌవూద్ కాలంలో ప్లేగ్ వ్యాధి వ్యాపించునని పవిత్ర ఖుర్‌ఆన్‌లోనే గాకుండా తౌరాత్‌కు చెందిన కొన్ని సువార్తలలో ۞(1) కూడ స్పష్టముగా గలదు. హజ్రత్ మసీహ్ అలైహిస్సలాం కూడ ఇంజీల్‌లో ఈ సంకేతమును ప్రస్తావించడం జరిగింది. ప్రవక్తల భవిష్యవాణి రద్దు కావడం సాధ్యం కాదు. దేవుని వాగ్దానములకు భిన్నముగా చేయు మానవ ప్రయత్నములను పూర్తిగా విరమించుకోవాలని కూడ మనము గుర్తుంచుకోవాలి. ఫలితముగా దైవ సంకేతమును శత్రువులు ఇతరుల వైపు సూచించకుండా జాగ్రత్త పడవచ్చును. కాని ఒకవేళ అల్లాహ్ తఆలా స్వయముగా ఏదేని ముందు జాగ్రత్త చర్య తెలిపినచో లేదా ఏదేని ఔషధమును సూచించినచో వాటిని

۞(1) మసీహ్ మౌవూద్ సమయంలో ప్లేగ్ వ్యాధి వ్యాపించునను విషయం బైబిల్‌లోని ఈ పుస్తకాలలో గలదు. కావున జకరియ్య అధ్యాయము 12, సూక్తి 14, మత్తేయి ఇంజీల్ అధ్యాయము 7, సూక్తి 24, ముకాషిఫాత్ అధ్యాయము 8, సువార్త 22లో చూడవచ్చును. ***సమాప్తం.***

అనుసరించడంలో ఆ సంకేతములో ఎలాంటి అభ్యంతరము ఏర్పడదు. ఎందుకనగా అది కూడ సంకేతమును ప్రదర్శించు సృష్టికర్త నుండియే అనబడును. కనుక అకస్మాత్తుగా మన జమాఅత్ సభ్యులలో నుండి ఒకరిద్దరు ప్లేగ్ వ్యాధి వలన మృతి చెందినచో ఈ భవిష్యవాణి సత్యతకు కళంకము అంటునని ఎవరు కూడ భావించరాదు. ఎందుకనగా ఎవరైతే ఖడ్గంను చేత బట్టి, అన్యాయముగా వేలాది మందిని హతమార్చిరో వారిని ఖడ్గంతోనే హత మార్చమని పూర్వకాలంలో మూసా, యోషే, చివరికి మన మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు కూడ ఆదేశించడమైనది. ప్రవక్తల సత్యతకు ఇదొక చిహ్నము. దీని తరువాతయే చివరికి వారికి ఒక గొప్ప విజయము చేకూరింది. వాస్తవానికి ఆ యుద్ధాల లో దోషులే కాకుండా సత్యవంతులు కూడ ఆయా ఖడ్గముల ద్వారా ప్రాణాలు కోల్పోయేవారు. కాని చాలా తక్కువ సంఖ్యలో. ఇలాంటి చిన్నపాటి నష్టము వలన సంకేతమునకు ఎలాంటి భంగం వాటిల్లదు. కావున మన జమాఅత్ సభ్యులలో ఎవరైన ఏదేని ఇతర కారణాల వలన ఒకరిద్దరు ప్లేగు వ్యాధికి గురై మరణించినచో, అట్టి ప్లేగ్ వ్యాధి దైవ సంకేతమునకు భంగం కల్గించినట్లుగా భావించబడదు. ఇది గొప్ప భవిష్యవాణి కాదా? నేను పదే పదే తెల్పునదేమనగా అల్లాహ్ తఆలా ఈ భవిష్యవాణిని ఎంత స్పష్టముగా బహిర్గత మొనర్చుననగా ఇందులో ఏ సత్యవంతునికి కూడ ఎలాంటి సంశయం కలుగదు. పైగా అల్లాహ్ తఆలా అద్భుతముగా ఈ జమాఅత్‌ను కాపాడినాడని అర్థం చేసుకొందురు. అంతేగాకా ప్లేగ్ వ్యాధి అనే ఈ దైవ సంకేత నిదర్శనము వలన ఈ జమాఅత్ చాలా అభివృద్ధి చెందును. ఈ మహత్యము కూడ కీర్తింపబడును. ఈ అభివృద్ధిని ఆశ్చర్యముతో చూచెదరు. నేను

**"నుజూలుల్ మసీహ్"** అను పుస్తకములో వ్రాసినట్లుగా వ్యతిరేకులు అన్ని సందర్భాలలో ఓటమిని చవిచూస్తూనే వచ్చారు. ఒకవేళ ఈ భవిష్యవాణి ద్వారా అల్లాహ్ తఅలా నా ఈ జమాఅత్ మరియు ఇతర జమాఅత్‌ల మధ్య ఒక ప్రత్యేక వ్యత్యాసమును చూపించనిచో నన్ను తిరస్కరించు హక్కు వారికి ఏర్పడును. నేటి వరకు వారు తిరస్కరిస్తూ కేవలం ఒక శాపమును కొనుగోలు చేశారు. ఉదా॥ ఆథమ్ 15 నెలల వ్యవధిలో మరణించలేదని పదే పదే అల్లర్లు చేశారు. కాని ఒకవేళ అతడు సత్యము వైపు మ్రొగ్గు చూపినచో 15 నెలల వ్యవధిలో అతడు మరణించడనే వాస్తవాన్ని కూడ భవిష్యవాణి పదాలు ఎంతో స్పష్టముగా తెల్పుచున్నాయి. కావున వాగ్వివాదములు జరుగుచున్న నిండు సభలో 70 మంది గౌరవనీయ సభ్యుల ముందు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను దజ్జాల్ అని పలుకుటకు అతడు వెనుకాడెను. అలా అంతటితో ఆగకుండా అతడు 15 నెలల పాటు మౌనంను, భయంను ప్రదర్శిస్తూ తన తప్పిదమును అంగీకరించినట్లు ఋజువు చేసెను. అతడు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను దజ్జాల్ అని పిలిచినందుకే ఈ భవిష్యవాణి చేయడం జరిగింది. కావున అతడు తన తప్పిదమును స్వీకరించి పొందిన లాభము ఎంతనగా, అతడు 15 నెలల వ్యవధిలో కాకుండ తరువాత మరణించాడు. చివరికి మరణించాడు. ఇలా ఎందుకు జరిగి నదనగా భవిష్యవాణి ప్రకారం ఇరుపక్షాల వారిలో ఎవరైతే తన అభిమతం పరంగా అసత్యవంతుడగునో అతడే ముందుగా మరణించునని గలదు. కావున అతడు నా కన్న ముందుగానే మరణించాడు. ఈ విధముగా అల్లాహ్ తఆలా నాకు తెల్పిన గోప్యములన్ని వాటి సమయానుకూలముగా అవి పూర్తి గావించ

బద్ధాయి. అవన్నియు కలిసి పది వేలకు పైగా ఉంటాయి. కాని "**నుజూలుల్ మసీహ్**"లో ఉదాహరణ కొరకు కేవలం 150 సంకేతములనే సాక్ష్యాధారాలతో పొందుపర్చడం జరిగింది. నేను చేసిన భవిష్యవాణులలో ఏదియును పూర్తి గానిది గాని లేదా దాని రెండు భాగాలలో ఏదేని ఒక భాగం గాని పూర్తిగాకుండా లేదు. అంతేగాకా నా నోటి నుండి వెలువడిన ఫలాన భవిష్యవాణి పూర్తి గాకుండానే మిగిలి పోయినదని నిరూపించుటకు ఒకవేళ ఎవరైన అట్టి భవిష్యవాణుల కోసం అన్వేషిస్తూ, అన్వేషిస్తూ మరణించినను ఏ ఒక్కటిని కూడ నిరూపించలేక పోవుదురు. కాని నిస్సిగ్గుతో, నిరాధారముతో నోటికి వచ్చినట్లు మాట్లాడువారు కూడ ఉంటారు. కావున నేను ప్రకటించిన వాటిలో కొన్ని వేల భవిష్యవాణులు ఎంతో స్పష్టముగా బాహాటముగానే పూర్తి గావించ బడినాయని నేను వాగ్దానము చేయుచున్నాను. వాటికి కొన్ని లక్షల మంది సాక్షులు కూడ గలరు. ఒకవేళ గత ప్రవక్తల కాలంలో అందుకు ఉదాహారణలను చూసినచో కేవలం హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో కాకుండ మరే ప్రవక్త కాలంలో కూడ ఇన్ని ఉదాహరణలు లభించవు. నా వ్యతిరేకులు చివరికి ఈ పద్ధతిలో నన్ను పరీక్షించినను వారికి ఎప్పుడో కనువిప్పు కలిగేది. అంతేగాకా ప్రపంచము మొత్తములో నా భవిష్యవాణులకు ఉదా హరణలను చూపినచో వారికి నేను చాలా గొప్ప గొప్ప బహుమాన ములను బహుకరించే వాడిని. కేవలం అవివేకం, అజ్ఞానంతో ఫలాన భవిష్యవాణి పూర్తి కాలేదని ప్రచారం చేయడం ను మేము దుష్టత్వము, దురభిప్రాయమని కాకుండా మరేమన గలము. ఒకవేళ ఈ విషయంపై చర్చించుటకు వారు ఏదేని సమావేశంలో పాల్గొన్నచో వెంటనే వారు తమ వ్యాఖ్యాలను వెనుకకు

తీసుకో వలసిన పరిస్థితి వచ్చేది. లేనిచో నిస్సిగ్గుడని పిలిపించు కోవలసి వచ్చేది. కొన్ని వేల భవిష్యవాణులు ప్రకటించినట్లుగా పూర్తి గావడం, అవి పూర్తి అయినట్లుగా నేటికి కొన్ని వేల మంది సాక్షులుగా జీవించి ఉండడం చిన్న విషయం కాదు. ఒక రకముగా దీనిని సర్వశక్తివంతుడైన అల్లాహ్‌ను దర్శింపజేయుటగా చెప్పుకో వచ్చును. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి సమయం లో కాకుండా మరే ప్రవక్త సమయములోనైన ఇలా కొన్ని వేల భవిష్యవాణులను ప్రకటించినను అవి ప్రకాశించు సూర్యుని వలే పూర్తి అయినట్లుగా, అందుకు కొన్ని వేల మంది సాక్షులుగా ఉన్నట్లుగా ఎవరైనా, ఎక్కడైనా చూపగలరా? నేను నిశ్చయముగా తెల్పునదేమనగా, ఈ కాలములో అల్లాహ్ తఆలా ఎంతో సమీపము గా బహిర్గతమవుచున్నాడు. కొన్ని వేల రహాస్యములను అతడు తన భక్తునిపై బహిర్గత మొనర్చుచున్నాడు. ఇలాంటి ఉదాహరణలు ఈ కాలములో కన్న గత కాలములలో మనకు చాలా తక్కువగా కనిపించును. ఈ కాలములో దేవుడు తన రూపమును బహిర్గత మొనర్చుటను ప్రజలు అతి త్వరలో వీక్షించెదరు. చూపరులకు అతడు ఆకాశము నుండి దిగి వచ్చునట్లుండును. అతడు చాలా కాలము వరకు తనను తానే దాచుకున్నాడు. తిరస్కరించబడినను మౌనం వహించాడు. కాని ఇకపై అతడు తెరచాటున ఉండాలను కోవడం లేదు. గతంలో తమ తాతముత్తాలు చూడని ఒక వినాశన మూలలను ప్రపంచీకులు చూసెదరు. ఇలా ఎందుకు జరుగుననగా భూమండలీకులు చెడిపోయారు. భూమ్యాకాశముల సృష్టికర్తపై ప్రజల విశ్వాసం కనుమరుగై పోయింది. పెదాలు అతని నామమును ఉచ్చరించుచున్నను, హృదయాలు మాత్రం పరధ్యానంలో ఉన్నవి. అందుకే నేనొక నూతన భూమ్యాకాశములను సృష్టించెదనని

అల్లాహ్ తఆలా తలిచెను. దీని అర్థమేమనగా, భూమండలం నిర్జీవముగా మారింది. అనగా ప్రజల హృదయాలు కఠినంగా మారాయి. కనుక మృతులతో సమానం. ఎందుకనగా దేవుని రూపం వారి నుండి కనుమరుగైనది. గత దైవ గ్రంథములన్నియు కేవలం గాథలుగా మిగిలి పోయినవి. అందుకే అల్లాహ్ తఆలా ఒక నూతన భూమ్యాకాశములను సృష్టించాలని నిర్ణయించు కున్నాడు. క్రొత్త ఆకాశమనగా ఏమిటి? క్రొత్త నేల అనగా ఏమిటి?. ఒక క్రొత్త నేల అనగా అల్లాహ్ తఆలా తన స్వహస్తాలతో సిద్ధము చేయుచున్న పవిత్ర హృదయాలు. వారు దేవుని ద్వారా బహిర్గత మగుదురు. దేవుడు కూడ వారి ద్వార బహిర్గతమగును. మరియు నూతన ఆకాశమనగా, అతని దాసుని హస్తాల మీదుగా అతని ఆదేశానుసారము సంకేతములు బహిర్గతము కావడం. కాని విచారకరమేమనగా, ప్రపంచీకులు దేవుని ఆ నూతనత్వంను ద్వేషించసాగిరి. వారి చేతులలో కేవలం గాథలు తప్ప మరేమియును లేకుండెను. వారు ఊహాగానాలతో వారి దైవాన్ని చిత్రించుకున్నారు. వారి హృదయాలు దారి తప్పినవి. వారి ధైర్యములు అలసి పోయినవి. వారి కనులపై తెరలున్నవి. ఇతర జాతుల వారు నిజ దైవాన్ని కోల్పోయినారు. మానవుని కుమారులను దేవునిగా మలుచుకున్న వారిని గూర్చి ఏమి ప్రస్తావించాలి. అల్లాహ్ నుండి దూరమైన ముసల్మానుల దుస్థితిని చూడుము. సత్యానికి బద్ధ శత్రువులైనారు. సన్మార్గమును ప్రాణ శత్రువు వలే వ్యతిరేకిస్తున్నారు. ఉదాహరణకు నద్వతుల్ ఉలమా ఇస్లాం కోసం చేసిన వాగ్దానాలు లేదా అంజుమన్ హిమాయతుల్ ఇస్లాం లాహొర్ సంస్థ ఇస్లాం నామముపై ప్రజల ధనమును ప్రోగు చేసుకుంటుంది. వీరందరు ఇస్లాం శ్రేయోభిలాషులా? వీరందరు సన్మార్గమునకు ప్రాతినిధ్యం

వహిస్తున్నారా? ఇస్లాం ఎన్ని రకాలుగా అణిచి వేయబడినదో వారికి గుర్తుందా? మరల సజీవపర్చు దేవుని సాంప్రదాయమును గూర్చి వారికి ఏమైన తెలుసునా? నేను తెలుపు సత్యమేమనగా, ఒకవేళ నేను అవతరించనిచో వారు ఇస్లాం శ్రేయస్సు కోసం చేసిన వాగ్దానములన్నియు అంగీకరించబడేవి. కాని ఒకవైపు ఇస్లాం శ్రేయస్సు కొరకు పాటుపడుదుమని వాగ్దానములు చేసి ఆ తరువాత ఆకాశం నుండి ఒక నక్షత్రం అవతరించగా వారిని తిరస్కరించుటలో అందరి కన్న ముందు వీరే అడుగులు వేసి నేడు దేవుని ఉక్రోషానికి గురి అవుచున్నారు.

సమయానుకూలముగా నన్ను అవతరింప జేసిన దేవునికి ఇప్పుడు వారేమని సమాధానమిచ్చెదరు. అయినప్పటికి వారికి ఎలాంటి చింతన లేదు. సూర్యుడు ఉదయించి మిట్ట మధ్యాహ్నమవుచున్నను వారికింకా అర్ధ రాత్రి వలే నున్నది. దేవుని చెలిమ పొంగిపొర్లుచున్నది. అయినా కూడ వారు ఎడారిలో చిక్కుకొని రోధిస్తున్నారు. అతని ఆకాశ జ్ఞానపు ఒక నదియే ప్రవహిస్తున్నది. కాని వారికి ఈ విషయమును గూర్చి ఎలాంటి సమాచారమే లేదు. అతని సంకేతములు బహిర్గతమవుచున్నవి. కాని వీరికి వాటిని గూర్చిన అవగాహనయే లేదు. అవగాహనలేమియే గాకుండా దేవుని పరంపరతో శత్రుత్వమును ఏర్పర్చుకొనుచున్నారు. వారు తమ స్వహస్తాలతో చేయుచున్న ఈ కార్యములే ఇస్లాం ప్రయోజకాలా?, ఇస్లాం అభివృద్ధియా?, ఇస్లాం బోధనలా?. ఆది నుండి ప్రవక్తలందరు సాక్షమిచ్చిన విధానానికి వీరు తమ విముఖతను ప్రదర్శించి దేవుని సంకల్పమును అడ్డుకొనగలరా?. అసాధ్యము. పైగా దేవుని ఈ భవిష్యవాణి అతి తొందరలో నిజము కానున్నది. كَتَبَ اللّٰهُ لَاَغْلِبَنَّ اَنَا وَرُسُلِىْ (ముజాదిలా-58:22)

(అనగా నేను, నా ప్రవక్తలు గెలుపొందుదురని అల్లాహ్ నిర్ణయించి వున్నాడు.) అల్లాహ్ తఆలా నేటి నుండి పది సంవత్సరాలకు పూర్వమే తన దాసుడినైన నా సత్య నిదర్శనం కోసం ఆకాశంలో రమజాన్ మాసం నందు సూర్యచంద్రులకు గ్రహణాలు పట్టించి రాత్రింభవళ్ళ ను ప్రకాశింపజేసి రెండు నిదర్శనములను నా కొరకు సాక్ష్యముగా బహిర్గతమొనర్చినట్లుగా, అతడు ప్రవక్తల భవిష్యవాణుల ప్రకారం కూడ భూమండలంపై రెండు నిదర్శనములను బహిర్గతం చేసెను. వాటిలో మొదటి సంకేతమేమనగా పవిత్ర ఖుర్ఆన్‌లో పఠించి నట్లుగా وَإِذَا الْعِشَارُ عُطِّلَتْ (తక్వీర్-81:5) (పది మాసాల గర్భము గల ఆడ ఒంటెలు విచ్చల విడిగా విడువబడునప్పుడు,) మరియు హదీస్‌లో చదివినట్లుగా وليترکن القلاص فلا يسعى عليها (అనగా ప్రయాణము కొరకు ఒంటెలు వినియోగించబడవు)✽ దీనిని పూర్తి చేయుటకు హిజాజ్ నేలపై అనగా మక్కా, మదీనాల మధ్యలో రైలు ప్రయాణ మార్గాలకు సన్నాహాలు జరుగుచున్నవి.

**రెండవ సంకేతము:** ప్లేగ్ వ్యాధి. దీనిని గూర్చి అల్లాహ్ తఆలా ఈ విధముగా తెలిపెను.

وَإِنْ مِّنْ قَرْيَةٍ إِلَّا نَحْنُ مُهْلِكُوهَا قَبْلَ يَوْمِ الْقِيٰمَةِ أَوْ مُعَذِّبُوهَا

(బనీ ఇస్రాయిల్-17:59). (పునరుత్థాన దినమునకు ముందే నాశనమొనర్చని, లేదా కఠిన శిక్ష విధించబడని నగరము (భూమిపై నుండదు) ఇందుకై అల్లాహ్ తఆలా దేశములో రైలు మార్గాలను సుగమం చేసినాడు. ఆపై ప్లేగ్ వ్యాధిని కూడ వ్యాపింపజేశాడు. తద్వారా భూమ్యాకాశములు సాక్షులుగా నిలుచును. అందుకే దేవునితో పోరాడకుము. దేవునితో పోరాడుట మూర్ఖత్వమనబడును. గతంలో ఆదమ్‌ను ఖలీఫాగా నియమించుచున్నట్లు అల్లాహ్ తఆలా ప్రకటించగా దేవదూతలు అభ్యంతరమును వ్యక్తపర్చిరి. కాని

✽ ముస్లిం బాబ్ నుజూల్ ఈసా (అ) 

అల్లాహ్ తఆలా వారి అభ్యంతరము వలన తన నిర్ణయాన్ని మార్చుకున్నాడా? నేడు రెండవ ఆదమ్‌ను పుట్టించు సందర్భములో కూడ అల్లాహ్ తఆలా اَرَدْتُ اَنْ اَسْتَخْلِفَ فَخَلَقْتُ اٰدَمَ అని తెలిపెను. అనగా నేను ఖలీఫాను నియమించాలని నిశ్చయించుకున్నాను. అందుకే ఈ ఆదమ్‌ను పుట్టించాను. ఇప్పుడు చెప్పండి మీరు దేవుని అభిప్రాయాన్ని అడ్డుకోగలరా? ఎందుకు మీరు నిరాధారమైన, నిష్ప్రయోజమైన ఊహాగానాలను ప్రచారం చేయుచున్నారు. విశ్వాసపు మార్గాలను ఎందుకు అవలంభించడం లేదు? పరీక్షించ బడకుము. దేవుని నిర్ణయాలను అడ్డుకొనువారు ఎవరు లేరను వాస్తవాన్ని నిశ్చయముగా గుర్తుంచుకొనుము. ఇలాంటి పోరాటాలు ధార్మికత రహితమైనవి. అవును! ఒకవేళ ఏదైన సందేహమున్నచో దాని నివృత్తికి మార్గమొకటి గలదు. అదేమనగా, నేను తెల్పినట్లుగా నా బోధనలను అనుసరించు ఒక సామాజిక వర్గాన్ని ప్లేగ్ వ్యాధి నుండి రక్షించుననే శుభవార్తను నేను అల్లాహ్ తఆలా నుండి దైవవాణి రూపంలో పొంది దానిని ప్రచురించాను. కావున మీరు కూడ ఒకవేళ మీ హృదయాలలో మీ జాతి ప్రజల పట్ల మీకు అభిమానం ఉన్నచో, మీ సోదరుల శ్రేయస్సు కొరకు ప్లేగువ్యాధి నుండి రక్షించబడుదురని దేవుని నుండి మోక్ష సందేశమును పొంది నా వలే మీరు కూడ వార్తా పత్రికలలో ప్రచురించగలరు. తద్వారా దేవుడు మీ వెంటే ఉన్నాడని ప్రజలు విశ్వసించెదరు. ప్రత్యేకించి క్రైస్తవులకు ఇదొక సువర్ణావకాశము. ఏసు ద్వారనే మోక్షము లభించునని వారు ఎల్లప్పుడు ప్రచారం చేస్తుంటారు. కావున ఈ కష్ట కాలములో ఈ ప్లేగ్ వ్యాధి నుండి క్రైస్తవులను కాపాడడం కూడ వారి బాధ్యతయే అగును. ఈ మతాలన్నింటిలో అధికముగా స్వీకరించబడిన మతమే ఆమోదయోగ్యమైన మతమగును. కావున

అనవసరముగా భూమండలంపై పరస్పరం వాదోపవాదాలు చేసుకోకుండ తమ ఆమోదయోగ్యతను ఇతరుల కన్న అధికముగా నిరూపించుకోవాలని, ఫలితముగా ప్లేగ్ వ్యాధి నుండి రక్షణ పొందాలని, తమ సత్యతను బహిర్గత పర్చుకోవాలని అన్ని ధర్మాల వారికి నేడు దేవుడు అవకాశమును కల్పించెను. ఇహపర లోకముల మోక్షకుడు మరియమ్మ కుమారుడైన ఏసు అని ప్రచారము చేయు పాద్రీలపై ఈ బాధ్యత అధికముగా గలదు. ఒకవేళ వారు మరియమ్మ కుమారుడైన ఏసునే ఇహపర లోకములకు అధికారి అని మనస్ఫూర్తి గా విశ్వసించినచో వారి త్రికరణ సిద్ధాంతము ద్వారా ముక్తి మార్గమును తప్పక నిరూపించవలెను. తద్వారా ఆంగ్లేయ ప్రభుత్వానికి కూడ చాలా మేలు కలుగుతుంది. తమ ధర్మమే సత్యమని విశ్వసించు బ్రిటీష్ ఇండియా జాతుల వారు కూడ తమ జాతి ప్రజలను వృద్ధి చేసుకోవడం కోసం, ప్లేగ్ వ్యాధి నుండి తమ జాతిని రక్షించుకోవడం కోసం తాము విశ్వసించు దైవం నుండి లేదా దేవుడిని కాకుండా వారు మరేవరినైన తమ ఆరాధ్యుడ ని భావించినచో ఈ కష్ట జీవుల కోసం వారితో మధ్యవర్తిత్వము వహింపజేసి వారి నుండి ఒక ఖచ్చితమైన వాగ్దానమును తీసుకొని మేము ప్రచురించిన విధముగా ఆ వాగ్దానమును ప్రకటన రూపం లో ప్రచురించగలరు. ఈ విధానంలో నిశ్చయముగా ప్రజానికానికి ప్రయోజనాలు మరియు వారి ధర్మ సత్యతకు సాక్ష్యములు లభించును. ఆపై ప్రభుత్వానికి చేయూత నిచ్చినట్లగును. ఈ కష్ట కాలంలో ఈ ప్రభుత్వం తమ ప్రజానికం ఏ విధముగానైన ప్లేగ్ వ్యాధి నుండి రక్షించబడాలని కాకుండా మరేమి ఆశించగలదు?. రక్షించబడుటయే ముఖ్యం. చివరిగా గుర్తుంచుకో వలసినదేమనగా, భారత దేశములోని వివిధ రాష్ట్రాలలో ప్రత్యేకించి పంజాబ్‌లో

నివసిస్తున్న మా జమాఅత్ సభ్యులకు మేము ఈ ప్రకటన ద్వారా టీకాలు వేయించు కోకూడదని తెలుపడం లేదు. ఏ ప్రాంతీయులను టీకాలు వేయించు కోవాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తుందో ఆ ప్రాంతీయులు తప్పకుండా టీకాలు వేయించుకోవాలి. ప్రభుత్వ ఆదేశాలను తప్పక పాటించాలి. ఏ ఏ ప్రాంతీయులను వారి ఇష్టా ఇష్టాలకు వదిలివేయునో, ఆయా ప్రాంతీయులు మేము బోధించిన మా బోధనలపై ఒకవేళ పూర్తిగా ఆచరించ లేకపోవుచున్నచో అలాంటి వారు కూడ తప్పకుండా టీకాలు వేయించుకోవాలి, తద్వారా వారు మోసపోకుండా ఉండగలరు. అంతేగాకా వారి దుస్థితి వలన ఇతరులకు దేవుని వాగ్దానం పట్ల అపోహ కలుగుటకు కారకులు కాకుందురు గాకా! ఒకవేళ ఈ ప్లేగ్ వ్యాధి నుండి కాపాడబడుటకు ఏ బోధనలను క్రమం తప్పకుండా ఆచరించ వలెననే ప్రశ్న ఎవరిలోనైన తలెత్తినచో, నేను ఆ బోధనలను సంక్షిప్త రూపంలో కొన్ని పంక్తులలో ఇక్కడ లిఖిస్తున్నాను.

# మా బోధన

మనస్ఫూర్తిగా దానిని అమలు చేయనంత వరకు కేవలము నోటితో బైఅత్ పదాలు పలుకుట నిష్ప్రయోజనమేనని భావించుము. ఎవడేని నా బోధనను మనస్ఫూర్తిగా అమలు పరచినచో అతడు నా గృహములో ప్రవేశించబడును. ఆ గృహ వాస్తవ్యులను గూర్చి దైవం తన వాక్కుతో ఇలా వాగ్దానం చేసెను. اِنِّىْ اُحَافِظُ كُلَّ مَنْ فِى الدَّارِ అనగా నీ గృహ నాలుగు గోడల మధ్య నున్న ప్రతి ఒక్కరిని నేను రక్షించెదను. మట్టి పెంకలతో నిర్మించుకున్న నా గృహములో నివాసముంటున్న వారే నా గృహ వాస్తవ్యులని మీరు ఇక్కడ భావించకుము. నన్ను పూర్తిగా అనుసరించువారు కూడ నా

ఆధ్యాత్మిక గృహ వాస్తవ్యులుగా పరిగణింప బడుదురు. అనుసరించుటకు ఈ నిబంధనలు గలవు. సర్వాధికారము గల, సర్వము సృష్టించి, స్థిరపర్చిన దేవుడు ఒకడు ఉన్నాడని వారు విశ్వసించవలెను. తన సుగుణాలలో అతడే ఆది, అంతము, అచంచలుడు. అతడొకరికి సంతానుడు కాడు, అతడికి సంతానం లేదు. అతడు దుఃఖములకు, సిలువనెక్కుటకు, మరణమునకు అతీతుడు. అతడు దూరమున్నను దగ్గరుండును. దగ్గరున్నను దూరముండును. అతడు ఒక్కడున్ననూ అతడి మహిమలు అనేకములు. మానవునిలో వచ్చిన ఒక నూతన మార్పునకు అనుగుణముగా అతడు కూడ ఒక నూతన రూపము నందు గోచరించును. ఒక నూతన మహత్యము ద్వారా అతనితో వ్యవహరించును. తనలో వచ్చిన మార్పును బట్టి మానవుడు దైవం లో కూడ మార్పును చూస్తాడు. అలా అని ఆ దైవంలో ఎలాంటి మార్పు రాదు. పైగా అతడు ఆది నుండి అచంచలుడు మరియు పరిపూర్ణుడు. కాని మానవుని పరివర్తనం చెందు సమయంలో సన్మార్గమును అవలంభించినప్పుడు దేవుడు కూడ ఒక క్రొత్త రూపములో అతనికి దర్శనమిచ్చును. మానవునిచే బహిర్గతమగు వివిధ రకాల అభ్యున్నతి స్థితుల యందు శక్తి స్వరూపమైన దైవ అభ్యున్నతి కూడ తన మహత్యము చూపును. ఎక్కడైతే అద్భుతమైన మార్పు సంభవించునో అక్కడే అతడు మహా అద్భుత శక్తిని ప్రదర్శించును. అద్భుతాలకు, మహిమలకు మూలము ఒక్కటే, ఆ మూలమే అల్లాహ్. అతడే మన పరంపర యొక్క నిబంధన. అతనిని విశ్వసించుము. తమ వ్యక్తిత్వంపై, తమ విశ్రాంతులపై, తమ సత్సంబంధాలపై అతనికే ప్రాధాన్యత నిమ్ము. ఆచరణాత్మకముగా, సాహసోపేతంగా అతని మార్గములో స్వచ్ఛతను, విధేయతను

ప్రదర్శించుము. ప్రపంచీకులు తమ సాధనాలపై, సత్సంబంధీకులపై అతనికి ప్రాధాన్యతనివ్వరు. కావున మీరతనికి ప్రాధాన్యత నివ్వుము. ఫలితముగా ఆకాశము నందు మీరతని వర్గీయులుగా లిఖించ బడుదురు. అనుగ్రహ సంకేతములను ప్రదర్శించడం అనాదిగా కొనసాగుచున్న దైవ సాంప్రదాయం. ఈ సాంప్రదాయంలో మీరు భాగస్వాములు కావచ్చును, అందుకు మీకు అతనికి మధ్య ఎలాంటి దూరం ఉండకూడదు. ఆపై మీ అభిష్టమే అతని అభిష్టముగా, మీ ఆకాంక్షలే అతని ఆకాంక్షలుగా మారవలెను. మీరు అన్ని వేళలలో, అన్ని స్థితులలో అది జయంలోనైనను, అపజయంలోనైనను అతని ఆస్థానములోనే శిరస్సు వంచవలెను. ఫలితముగా కోరినట్లు చేయబడును. ఒకవేళ మీరిట్లు నడుచుకున్నచో చాలా కాలంగా తన ముఖమును దాచుకున్న ఆ అల్లాహ్ మీలో దర్శనమిచ్చును. కావున ఇందుకు అనుగుణముగా నడుచు కుంటూ అతని అభిష్టమును కోరువారు, దైవనియోగము పట్ల కోపగించుకోనివారు మీలో ఎవరైన వున్నారా? కనుక మీరు ఆపదలను చూసి ఇంకా ముందడుగు వేయుము. అదే మీ ప్రగతికి వారధి అగును. అల్లాహ్ ఏకేశ్వరోపాసానమును భూమండలంపై వ్యాపింపజేయుటకు తమ శక్తిసామర్థ్యములన్నిటితో ప్రయత్నించుము. అతని దాసులను కనికరించుము. వారిని మాటలతో గాని, చేతులతో గాని, మరే విధముగా నైన ఇబ్బందులకు గురి చేయకుము. ప్రాణులకు మేలు కల్గించుటకు ప్రయత్నించుము. మీ ఆధినములో ఉన్నవారిపై గాని, ఇతరులపై గాని గర్వమును ప్రదర్శించకుము. ఇతరులు దూషించి నను మీరు ఎవరిని దూషించకుము. సామాన్యుడిగా, సహన శీలుడిగా, సత్సంకల్పముతో మానవజాతిపట్ల సానుభూతుడిగా నిలవుము. తద్వారా స్వీకరించబడుదురు. సానుభూతిని చూపువారు

ఎందరో గలరు, కాని వారు అంతర్గతముగా తోడేలు లాంటివారు. బాహ్యముగా సాధువులుగా కనబడువారు అనేకులు గలరు, కాని వారు అంతర్గతముగా సర్పాల లాంటివారు. కనుక అంతర్గత, బహిర్గతల స్థితులు ఒకటి కానంత వరకు మీరు అతని సన్నిధిలో స్వీకరించబడరు. ఉన్నతులై అల్పులను కనికరించుము కాని, వారిని కించపరచకుము. విద్వాంసులై అజ్ఞానులకు ఉపదేశించుము. కాని, ఆడంబరముతో  పరిహసించకుము. ధనవంతులై పేదలకు సహకరించుము కాని, నిన్ను నీవు  పొగుడుకుంటూ గర్వించకుము. వినాశక మార్గాలకు భయపడుము. దైవభీతిని కల్గి యుండుము మరియు ధార్మికతను అవలంభించుము. ప్రాణులను పూజించకుము. తమ ప్రభువు వైపు పూర్తిగా మరులుము. ప్రపంచము పట్ల అయిష్టమును వ్యక్తపర్చుము. అతనికే అంకితమైపోవుము. అతని కొరకే జీవించుము. అతడు పవిత్రుడైనందున అపరిశుభ్రత లన్నింటిని, పాపములన్నింటిని అతని కొరకే విడనాడుము. నీవు రాత్రి యంతయు ధార్మికతతో గడిపినావని నీ కొరకు ప్రతి ఉదయం సాక్ష్యమివ్వవలెను. నీవు పగలంతయు ధార్మికతతో గడిపినావని నీ కొరకు ప్రతి రాత్రి సాక్ష్య మివ్వవలెను. ప్రపంచీకుల శాపనార్థములకు భయపడకుము. అవి చూస్తుండగానే పొగ మాదిరి గా మాయమగును. అవి పగలును రాత్రిగా మార్చలేవు. కావున మీరు అల్లాహ్ శాపమునకు భయపడుము. అది ఆకాశము నుండి పడును. అది ఎవరిపై పడునో వారి ఇహపరలోకములను నాశనం చేయును. మీరు కపటమును అవలంభించి తమను తాము కాపాడు కోలేరు. ఎందుకనగా మీ ఆరాధ్యదైవమైన ఆ భగవంతుడి దృష్టి మానవుని పాతాళమును కూడ చూచును. మీరు అతనిని మోసగించగలరా? కనుక మీరు సాధువులుగా, పవిత్రులుగా, పరిశు

ద్దులుగా, సత్యవాదులుగా మారుము. మీలో కొంచమైన కపటము మిగిలియున్నను అది మీలో నున్న ప్రకాశమునంతటిని కనుమరుగు చేయును. మీలో ఏ కోణ లోనైన గర్వము, కపటము, స్వార్థము, అలసత్వము ఉన్నచో మీరు స్వీకరించబడుటకు అర్హులు కారు. మీరు కేవలం కొన్ని విషయములనాచరించి మా వంతు పని మేము చేసితిమని భావించి తమను తాము మోసగించుకోకుము. ఎందుకనగా మీలో సంపూర్ణ పరివర్తనం రావాలని అల్లాహ్ ఆశిస్తున్నాడు. అతడు మీ నుండి ఒక మరణంను కోరుచున్నాడు. తద్వారా అతడు మిమ్ము జీవింపజేయును. కనుక మీరు తొందరగా పరస్పరము సంధి చేసుకొనుడు, మీ సోదరుల దోషములను క్షమించుము. తన సోదరునితో సంధికి రాజీపడనివాడు జిత్తుల మారి. అతడు నాశనము చేయబడును. ఎందుకనగా అతడు విభేదాలను సృష్టిస్తున్నాడు. మీరు మీ మనోవాంఛలను అన్ని కోణాల నుండి విడనాడుము. పరస్పర వ్యతిరేకతలను దూరము చేసు కొనుము. సత్యవంతులై అసత్యుని వలే వినమ్రతతో జీవించుము, ఫలితముగా మీరు క్షమించబడుదురు. స్థూల స్వార్థబుద్ధిని విడనాడుము. ఏ ద్వారము కొరకు మీరు పిలువ బడుదురో అట్టి ద్వారము లోనికి ఒక స్వార్థబుద్ధుడు ప్రవేశించ లేడు. దేవుని నోటి నుండి వెలువడిన వాటిని నేను ప్రకటించినను వీటిని నమ్మని వాడు ఎంతో దురదృష్టవంతుడు. ఆకాశం నందు మీతో అల్లాహ్ సంతోషపడాలని మీరు కోరుకున్నచో మీరందరు పరస్పరము ఒకే తల్లి బిడ్డలుగా మారుము. తన సోదరుని పాపములను అధికముగా క్షమించువాడే మీలో అందరికన్న గొప్పవాడు. కక్షగట్టి క్షమించని వాడు అభాగ్యుడు. కనుక అతనికి నాలో భాగము లేదు. అల్లాహ్ శాపముతో భయపడుము. అతడు పరిశుద్ధుడు, అభిమానవంతుడు.

దుష్టుడు అల్లాహ్ సామీప్యమును పొందలేడు. గర్వితుడు అతని సామీప్యమును పొందలేడు. దుర్మార్గుడు అతని సామీప్యమును పొందలేడు. మోసగాడు అతని సామీప్యమును పొందలేడు. అతని నామము పట్ల పౌరుషం లేని ప్రతి ఒక్కరు అతని సామీప్యమును పొందలేరు. కుక్కలు, చీమలు, గద్దల వలే ప్రపంచమును దోచుకొను వారు, ప్రాపంచిక భోగభాగ్యములు అనుభవించు వారు అతని సామీప్యమును పొందలేరు. ప్రతి అపవిత్ర నేత్రం అతని నుండి దూరముండును. ప్రతి అపవిత్ర హృదయము అతని నెరుగదు. అతని కొరకు అగ్నిలో పడువాడు, అగ్ని నుండి ముక్తిని పొందును. అతని కొరకు ఏడ్చువారు నవ్వుదురు. అతని కొరకు ప్రపంచమును వీడినవాడు దానిని పొందును. మీరు సహృదయముతో, సత్యతతో, సత్సంకల్ప అడుగులతో దేవునికి మిత్రులగుము. ఫలితముగా అతడు కూడ మీ మిత్రుడగును. మీరు మీ అధీనులు, మీ భార్య పిల్లలు, మీ అభాగ్య సోదరుల పట్ల దయ చూపుము. ఫలితముగా ఆకాశము నందు మీపై దయ చూపబడును. మీరు నిజానికి అతని వారై పోవుము. ఫలితముగా అతడు కూడ మీవాడై పోవును. ప్రపంచము వేల ఆపదలకు నిలయం. అందులో ఒకటి ప్లేగ్ వ్యాధి. కావున మీరు దేవునితో పటిష్ట బంధమును ఏర్పర్చుకొనుము, ఫలితముగా అతడు ఆ ఆపదలను మీ నుండి దూరము చేయును. ఆకాశం నుండి అనుమతి లేనిదే భూమండలంపై ఏ ఆపద సంభవించదు. ఆకాశం నుండి అనుగ్రహం దిగనిదే భూమండలం నుండి ఏ ఆపద తొలిగిపోదు. కనుక మీరు కొమ్మలను విడిచి వేరును పట్టుకొనుటలో తెలివినుపయోగించుము. మిమ్ములను ఔషధమును, ఉపాయములను ఉపయోగించ కూడదని నిలువరించడం లేదు. కాని వాటిపైనే ఆధార పడుటను నిషేదించడమైనది. అల్లాహ్

కోరినదే చివరికి జరుగును. ఒకవేళ ఎవరైన శక్తిని కల్గియున్నను అల్లాహ్‌ను నమ్ముకొను స్థానమే అన్నింటికన్న గొప్ప స్థానమని ఎరుగుము. మీ కొరకు ఒక ముఖ్యమైన హితోపదేశము నిచ్చుచున్నాను. అదేమనగా ఖుర్ఆన్‌ను వియోగుల వలే వదిలి వేయకుము. అందులోనే మీ జీవితము గలదు. ఖుర్ఆన్‌ను ఆదరించు వారు ఆకాశమందు గౌరవించబడుదురు. ప్రతి హదీసు, ప్రతి సుభాషితముపై ఖుర్ఆన్‌కు ప్రాముఖ్యత నిచ్చువారు ఆకాశము నందు అగ్రగణ్యులుగా నిలుచుదురు. సర్వ మానవుల మార్గదర్శనము కొరకు భూమండలంపై ఖుర్ఆన్ తప్ప మరొక గ్రంథము లేదు. సర్వ మానవుల ఆదర్శనమునకు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గాకుండా మరో ప్రవక్తగాని, మధ్యవర్తి గాని లేరు. కావున మీరు ఇట్టి వైభవోపేతమైన గొప్ప ప్రవక్తతో సత్యాభిమానము, సత్సంబంధము ఏర్పర్చుకొనుటకు ప్రయత్నించుము. వారిపై ఇతరులెవరికి ఏ విధమైన ప్రాముఖ్యత నివ్వకుము. ఫలితముగా ఆకాశము నందు మీరు విముక్తి పరులుగా పరిగణించబడుదురు. మరల గుర్తుంచుకొనుము. మరణానంతరము లభించునది ముక్తి కాదు. అది అనగా నిజమైన ముక్తి ఈ ప్రపంచము నందే తమ కాంతిని ప్రజ్వరిల్లించును. ముక్తిపరులెవరు? ఎవరైతే అల్లాహ్ సత్యవంతుడని, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ మరియు ప్రాణులందరి మధ్యవర్తి, సిఫారిసు కర్త అని, ఆకాశము క్రింద వారి సమ స్థానము గల మరో ప్రవక్త లేదని, ఖుర్ఆన్ స్థానము నందుకొను మరో గ్రంథము లేదని నమ్మువారు ముక్తిపరులు. మరెవరిని కూడ సదా జీవించి ఉండాలని అల్లాహ్ కోరలేదు కాని, ఈ గౌరవప్రదమైన సందేశహరుడొక్కరే జీవించి ఉండాలని కోరెను. వారు సదా జీవించి వుండుటకు వారి ఆధ్యాత్మిక

కార్యములను, శాసనాలను పునరుద్ధరణ దినము వరకు జారి చేస్తూ అల్లాహ్ పునాది వేసెను. ఫలితముగా వారి ఆధ్యాత్మిక అనుగ్రహ పరంపరతో ఇస్లామ్ భవన నిర్మాణంను తప్పని సరిగా పూర్తి చేయుటకై రావలసిన ఈ మసీహ్ మౌవూద్‌ను ప్రపంచము నకు పంపెను. అలా రావలసిన ఆవసరం ఎందుకనగా, మూసా (అ) పరంపరకు నొసంగిన విధముగా ముహమ్మద్ (స) పరంపరకు ఆధ్యాత్మిక రూపుడైన ఒక మసీహ్‌ని పంపనంత వరకు ఈ ప్రపంచం అంతము కాజాలదు. ఈ విషయమును గూర్చియే ఈ సూక్తి సూచిస్తున్నది. اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ (ఫాతిహా-1:6,7) పూర్వీకులు పోగొట్టుకొన్న సంపదను మూసా పొందెను. మూసా పరంపర పోగొట్టుకొన్న సంపదను ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పొందెను. కావున నేడు మూసా పరంపరకు ముహమ్మద్ పరంపర ప్రాతినిథ్యం వహిస్తున్నది. కాని వైభవము రీత్య వెయ్యిరెట్ల ఆధిక్యత స్థానములో నున్నది. మూసాను పోలినవాడు మూసా కంటే అత్యున్నతుడు. అదే విధముగా ఇబ్నే మరియంను పోలినవాడు ఇబ్నే మరియం కంటే ఉత్తముడు. అంతేగాకా మసీహ్ ఇబ్నే మరియం మూసా తదనంతరం పద్నాల్గవ శతాబ్ధములో అవతరించినట్లు గానే ఈ మసీహ్ మౌవూద్ కూడ కాలానుగుణంగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత పద్నాల్గవ శతాబ్దములో అవతరించెను ۞(2) అది కూడ మసీహ్ ఇబ్నే మరియం అవతరించినప్పుడు యూదులు ఉన్నటు

۞(2) యూదులు తమ చారిత్రాత్మక సూచనల మేరకు మూసా అవతరించిన 1400ల సంవత్సరాల తరువాత ఏసు అవతరించుననే విశ్వాసాన్ని ఏకాభిప్రాయంతో కల్గియుండేవారు. యూదుల చారిత్రక గ్రంథాలను చూడవచ్చును. ***సమాప్తం.***

వంటి పరిస్థితులలో ముసల్మానులు ఉన్నప్పుడు అవతరించెను. కావున నేనే ఆ మసీహ్‌ను. అల్లాహ్ కోరునదే చేయును. అతనితో పోరాడు వాడు అజ్ఞాని. అలా కాకుండా ఇలా జరుగవలసి ఉండాలని ఆరోపణలు చేయువాడు మూర్ఖుడు. అతడు నన్ను ప్రకాశించు సంకేతములతో అవతరింపజేసెను. అవి పది వేలకు పైగా గలవు. వాటిలో ఒక సంకేతం ఈ ప్లేగు వ్యాధి. కావున నిజాయితిగా నా బైఅత్ చేసి, మనస్ఫూర్తిగా నన్ను అనుసరిస్తూ, నా విధేయతలో లీనమై తన కోరికలన్నింటిని వీడిన వ్యక్తికే ఈ ఆపదల సమయము నందు నా ఆత్మ సిఫారిసు చేయును. కావున తమను తాము నా సమాజీకులుగా పరిగణించుకొను ఓ ప్రజలారా! నీతి, నిజాయితీ లతో ధార్మిక మార్గములను అనుసరించినప్పుడే ఆకాశం నందు మీరు నా అనుయాయులుగా పరిగణింపబడుదురు. కావున మీ ఐదు పర్యాయముల నమాజ్‌లను మీరు అల్లాహ్‌ను చూస్తున్నట్లుగా భయ, భక్తులతో సలుపుము. మీ ఉపవాస వ్రతమును అల్లాహ్ కొరకే స్వచ్ఛతతో పూరించుము. విధి దానము (జకాత్) యోగ్యత గల ప్రతి ఒక్కరు విధి దానము చేయవలెను. హజ్ చేయుటకు అర్హుడైనవారు, అవరోధములు లేకున్నచో తప్పక హజ్ చేయవలెను. పుణ్యకార్యములను జాగ్రత్తగా తలపెట్టుము. దుర్మార్గమును విసిగి వేసారి విడిచి పెట్టుము. నిష్టాపరత రహిత ఏ కార్యము కూడ అల్లాహ్ వరకు చేరదను విషయమును నిశ్చయముగా జ్ఞప్తి యందుంచుకొనుము. పుణ్య కార్యములన్నింటికి మూలము నిష్టాపరతయే. ఏ కార్యములో ఈ మూలము వ్యర్థము కాదో, ఆ కార్యము కూడ వ్యర్థ రహితముగా నుండును. పూర్వ విశ్వాసులు పరీక్షించబడినట్లే రకరకాల కష్ట, నష్టాలతో మీరు కూడ పరీక్షించ బడుట తథ్యం. కనుక జాగ్రత్తగా నుండుము. పొరపాటున కూడ

మోసపోకుము. ఆకాశముతో మీ అవినాభావ సంబంధము పటిష్టము గా ఉన్నంత కాలము ఈ భూమండలం మిమ్ము ఏమియును చేయలేదు. మీకు ఏదేని నష్టము వాటిల్లినచో అది మీ చేతల తప్పిదమే గాని, మీ శత్రువుల చేతల వలన కాదు. ఒకవేళ మీ గౌరవ మర్యాదలు భూమండలంపై మంటగలసినను, అల్లాహ్ తఆలా మీకు తరగని అసాధారణ గౌరవ మర్యాదలను ఆకాశము నందు నొసంగును. కనుక మీరతనిని విస్మరించకుము. మీరు దుఃఖింప బడుట, మీ అనేక కోరికలు నెరవేరక పోవుట కూడ తప్పనిసరి. అట్టి సమయాలలో నిరాశపడకుము. ఎందుకనగా మీరతని మార్గములో స్థిరత్వముగా ఉన్నారో లేదో తెలుసుకొనుటకు మీ దేవుడు మిమ్ము పరీక్షించి చూచును. ఆకాశము నందు దేవదూతలు మిమ్ము ప్రశంసించ గోరినచో మీరు తన్నులు తిని సంతోషించుము. తిట్లుతిని కృతజ్ఞతలు తెలుపుము. అపజయాలకు గురైనప్పుడు సంబంధమును త్రెంచుకొనకుము. మీరు అల్లాహ్ అంతిమ వర్గీయులు. కనుక ఉన్నత స్థాయికి చేరు సత్కార్యములను మీరు ఆచరించి చూపుము. మీలోని ప్రతి బద్ధకస్తుడు మలిన పదార్థము వలే ఈ జమాఅత్ నుండి బయటికి విసిరి వేయబడును. నిరాశతో మరణించును. అల్లాహ్‌కు ఎట్టి నష్టమును కల్గించలేడు. మీ ఆరాధ్య దైవం నిజముగానే ఉన్నాడని నేను చాలా ఆనందముతో తెల్పుచున్నాను. సర్వము అతని సృష్టియే అయినను, అతనిని ఎన్ను కొనువాడినే అతడు ఎన్నుకొనును. అతని వద్దకు వచ్చినవాని వద్దకే అతడు వచ్చును. అతనిని గౌరవించిన వాడినే అతడు గౌరవించును.

మీరు మీ హృదయాలను నిర్మలము చేసుకొనుము. మీ నాలుకలను, కన్నులను, చెవులను పవిత్రముగా చేసుకొని అతని

వైపు పరుగెత్తినచో అతడు మిమ్ము స్వీకరించును. సిద్ధాంతపరంగా అల్లాహ్ తఆలా మీ నుండి కోరుకొనునదేమనగా, అల్లాహ్ ఒక్కడేనని, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని ప్రవక్త మరియు ఖాతముల్ అన్బియా, అందరి కంటే గొప్పవాడని, అతని తరువాత అతని ప్రతి బింబముతో ముహమ్మదియ్య దుప్పటిని ధరింపజేయబడిన వాడు తప్ప మరొక సందేశహరుడు లేడని విశ్వసించవలెను. ఎందుకనగా సేవకుడు తన యజమానికి అన్యుడు కాడు. కొమ్మ చెట్టు నుండి వేరు కాదు. కావున అతడు సంపూర్ణ స్థాయిలో తన యజమానిని అనుసరిస్తూ దైవం నుండి ప్రవక్తుత్వపు బిరుదును పొందును. దీని వలన ఖత్మే నబువ్వత్‌కు భంగం వాటిల్లదు. ఏ విధముగానైతే మిమ్ములను మీరు అద్దములో చూచుకున్నప్పుడు మీరు ఇరువురు కాకుండా ఒక్కరిగానే ఉందురో, అదే విధముగా బాహ్యముగా రెండుగా కనిపించే ఇవి కూడ ఒకటి నిజమైతే, మరొకటి నిదర్శనం. అందుకే అల్లాహ్ తఆలా మసీహ్ మౌవూద్ విషయంలో కూడ ఈ విధానమునే కోరుకున్నాడు. "మసీహ్ మౌవూద్ నా సమాధిలో సమాధి చేయబడును"❁ అని హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పిన భవిష్యవాణి లో కూడ ఈ ఆంతర్యమే దాగి యున్నది. అనగా నేనే ఆ మసీహ్‌ను. ఇందులో ఎలాంటి కపటము లేదు. ఏసుక్రీస్తు మరణించెనని మీరు నిశ్చయముగా తెలుసుకొనుడు. కాశ్మీరులోని ఖాన్‌యార్ వీధిలో అతని సమాధి గలదు. ۞(3) అల్లాహ్ తఆలా తన పవిత్ర

❁మిష్కాత్ కితాబుల్ ఫితన్ బాబ్ నుజూల్ ఈసా అలైహిస్సలాం

۞(3) క్రైస్తవ పరిశోధకులు కూడ ఈ అభిప్రాయమునే వెల్లడించారు. కావున సూపర్ నేచురల్ రిలీజియన్ అనే పుస్తకములోని పుట 522ను చూడుము. ఒకవేళ వివరణాత్మకముగా చదువ దలచినచో మా పుస్తకమైన తోహ్ఫ గోల్డవియా పుట 139ని చూడవచ్చును. ***సమాప్తం.***

గ్రంథము నందు అతని మరణ వార్త నిచ్చి వున్నాడు. ఒకవేళ ఆ సూక్తి భావం మరొకటైనచో మరి మరియమ్మ కుమారుడైన ఏసు మరణ వార్త పవిత్ర ఖుర్ఆన్‌లో ఎక్కడ ఉన్నది? మన వ్యతిరేకులు భావించినట్లుగా ఒకవేళ అతని మరణంను సూచించు సూక్తుల భావం మరొకటైనచో అతడు ఎప్పుడు మరణించును? అని అతని మరణంను గూర్చిన విషయమే పవిత్ర ఖుర్ఆన్‌లో ఎక్కడా ప్రస్తావించబడ లేదా? దేవుడు మన ప్రవక్త మరణ వార్తను ప్రస్తావించినప్పటికి ఏసు మరణ వార్తను పవిత్ర ఖుర్ఆన్‌లో ఎక్కడ ప్రస్తావించక పోవడంలోని ఆంతర్యమేమిటి? ఒకవేళ ఏసు మరణ వార్త ఈ సూక్తిలో ప్రస్తావించబడినదని మీరు తెల్పినచో అనగా فَلَمَّا تَوَفَّيۡتَنِىۡ كُنۡتَ اَنۡتَ الرَّقِيۡبَ عَلَيۡهِمۡ ۞[4](అల్‌మాయిదహ్-5:118) అతడు క్రైస్తవులు మార్గభ్రష్టులు కాక ముందే మరణించాడని ఈ సూక్తి సాక్ష్యమిస్తుంది. ఒకవేళ فَلَمَّا تَوَفَّيۡتَنِىۡ కి అర్థం ఏసును సజీవము గా శరీరంతో పాటు ఆకాశంపైకి తీసుకవెళ్లడం అయినచో మరి అలాంటి వ్యక్తి మరణంను గూర్చి అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్ లో ఎందుకు ప్రస్తావించ లేదు. అతడు సజీవముగా ఉన్నాడనే

۞(4) హజ్రత్ ఈసా అలైహిస్సలాం మరల ఈ ప్రపంచంలో అవతరించరు అనే విషయం ఈ సూక్తి ద్వారనే మనకు తెలియుచున్నది. ఎందుకనగా ఒకవేళ వారు ఈ ప్రపంచములో మరల అవతరించే వారే అయితే క్రైస్తవులు మార్గభ్రష్టులైన విషయం నాకు తెలియదని హజ్రత్ ఈసా అలైహిస్సలాం ఇచ్చిన సమాధానము అబద్ధమగును. ఒక వ్యక్తి మరల ప్రపంచానికి వచ్చి, 40 సంవత్సరముల జీవితంను జీవించి, తనను దేవునిగా భావించే కోట్లాది క్రైస్తవులను వీక్షించి, ఆ తరువాత వారి సిలువలను ముక్కలు ముక్కలు చేసి, క్రైస్తవులందరిని ముసల్మానులుగా మార్చిన తరువాత ఆ వ్యక్తి క్రైస్తవులు మార్గభ్రష్టులైన విషయం నాకు తెలియదని ప్రళయ దినమున అల్లాహ్ ముందు ఎందుకు అబద్ధము పలుకును. ***సమాప్తం.***

ఆలోచనలు లక్షల మందిని నాశనం చేశాయి. ఈ ప్రకారముగా చూసినచో ప్రజలు అన్యారాధకులు, అధార్మికులు కావాలనే ఉద్దేశముతోనే అల్లాహ్ తఆలా అతడికి శాశ్వత జీవితాన్ని ప్రసాదించాడని అర్థం. అంటే ఇందులో ప్రజల తప్పిదమేమి లేదు. దేవుడు కావాలనే ప్రజలను మార్గభ్రష్టులను చేయడానికి ఇలా చేశాడన్నమాట. మరల గుర్తుంచుకొనుము!. మసీహ్ మరణంను విశ్వసించనిదే క్రైస్తవ సిద్ధాంతము అంతరించిపోదు. అతనిని పవిత్ర ఖుర్ఆన్ బోధనలకు విరుద్ధముగా సజీవముగా నుంచుటలో గల ప్రయోజనమేమిటి? అతనిని చనిపోనివ్వుము. ఫలితముగా ఈ ధర్మము జీవము పోసుకొనును. అల్లాహ్ తఆలా తన వాక్యము ద్వారా మసీహ్ మరణమును ప్రకటించెను. అంతే గాకా రసూలు ల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ గగన ప్రయాణం (మిరాజ్) నందు వారిని మృతులలో చూసిరి. ✽ అయినా కూడ మీరు ఈ వాస్తవాన్ని నమ్ముటకు సిద్ధముగా లేనిచో మీది ఎలాంటి విశ్వాసం? మానవ ఉల్లేఖనములకు దేవుని వాక్యములపై ప్రాధాన్యత నిచ్చెదరా? ఇది ధర్మమేనా? ۞(5) అతనిని నేను మృతులలో

✽ బుఖారి-కితాబుత్తౌహీద్

۞(5) సిలువ ఘటన జరిగిన తరువాత మసీహ్, వారి తల్లి ఇరువురు కాశ్మీర్ వైపు వెళ్ళినట్లు పవిత్ర ఖుర్ఆన్‌లోని ఒక సూక్తి ఎంతో స్పష్టముగా సంకేతమునిస్తుంది. ఆ సూక్తి وَاٰوَيۡنٰهُمَاۤ اِلٰى رَبۡوَةٍ ذَاتِ قَرَارٍ وَّمَعِيۡنٍ (అల్ ముమినూన్-21:51) అనగా మరియమ్మ కుమారుడిని, అతని తల్లిని మేము ఒక సంకేతముగా చేసి వుంటిమి. వారిరువురికి మేము ఒక ఎత్తైన స్థానములో శరణము కలిగించితిమి. అది శాంతియుతమైన చెలిమలు గలదై యుండెను. ఈ సూక్తిలో అల్లాహ్ తఆలా కశ్మీర్ ముఖ చిత్రమును వెల్లడించెను. **ఆవా** అనే పదం అరబి నిఘంటువు ప్రకారం ఏదేని కష్టము వచ్చినప్పుడు లేదా బాధ కల్గినప్పుడు దాని నుండి ఆశ్రయం పొందుటకు మాత్రమే

చూశానని స్వయముగా రసూలే కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సాక్ష్యమివ్వడమే గాకుండా, తాను మరణించి, తమ కన్న ముందు ఎవరు కూడ సజీవముగా లేరని నిరూపించారు. మన వ్యతిరేకులు పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలు విడనాడినట్లే సున్నత్‌ను కూడ విడనాడారు. అది ఎలాననగా, సృష్టి ధర్మం ప్రకారం మన ప్రవక్త మరణించి, ఒకవేళ ఏసుక్రీస్తు సజీవుడిగా ఉన్నచో, మన ప్రవక్త మరణించి నందున తాను గౌరవమును కోల్పోవుదురు. కావున మసీహ్ మరణించాడని విశ్వసించనంత వరకు మీరు అటు సున్నత్‌ను అనుసరించు వారుగా, ఇటు పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలను ఆచరించువారుగా పరిగణించబడరు. నిజానికి నేను హజ్రత్ ఏసు క్రీస్తు గొప్పదనమును నిరాకరించు వాడను కాను. కాని స్వయము గా అల్లాహ్ తఆలాయే ముహమ్మదీయ మసీహ్, మూస్వీ మసీహ్ కన్న గొప్పవాడని నాకు తెలిపినాడు. అయినా కూడ నేను సిద్ధాంతము ప్రకారం మరియమ్మ కుమారుడు ఏసును చాలా గౌరవించెదను. ఎందుకనగా ఏ విధముగానైతే మరియమ్మ కుమారుడు ఏసు ఇస్రాయిల్ పరంపరలో ఖాతముల్ ఖులఫాగా అవతరించెనో అదే విధముగా నేను ఆధ్యాత్మిక పరంగా ఇస్లాం యొక్క చివరి ఖలీఫా (ఖాతముల్ ఖులఫా)ను. కావున వారి నామమును కల్గిన నేను వారిని గౌరవించెదను. మూసా పరంపరలో ఏసుక్రీస్తు మసీహ్ మౌవూద్‌గా నిలిచెను. అదే విధముగా నేను

---

ఉపయోగించెదరు. కావున వారు ఆశ్రయం పొందుటకు సిలువ ఘటనకు ముందు ఎన్నడు కూడ ఈసా మరియు వారి తల్లిపై ఎలాంటి కష్టముగాని, దుఃఖ భరిత సమయం గాని రాలేదు. కావున ఇక్కడ స్పష్టముగుచున్న దేమనగా సిలువ ఘటన తరువాత అల్లాహ్ తఆలాయే ఈసా (అ)ను మరియు వారి తల్లిని ఆ ఎత్తయిన ప్రాంతానికి చేర్చినాడు. ***సమాప్తం.***

ముహమ్మదీయ పరంపరలో మసీహ్ మౌవూద్‌గా అవతరించాను. అతని నామము గలవాడను కనుక నేనతనిని గౌరవించెదను. నేను ఏసుక్రీస్తును గౌరవించనని నాపై ఆరోపణ చేయువాడు మోసగాడు, అసత్యుడు. మసీహ్‌నే గాకుండా నేను వారి నలుగురు సోదరులను కూడ గౌరవించెదను. ۞[6] ఎందుకనగా ఐదుగురు ఒకే తల్లి కడుపు నుండి జన్మించినారు. అంతేగాకా ఏసుక్రీస్తు ఇద్దరు సోదరీమణులను కూడ నేను పవిత్రురాలుగానే భావించెదను. ఎందుకనగా వీరందరు మహాత్మురాలైన మరియం బతూల్ (కుమారి) కడుపు నుండే జన్మించారు. మరియం ఎంత గొప్ప వారనగా ఒక నిర్ధిష్ట సమయం వరకు వివాహం చేసుకోకుండా ఉన్నారు. ఆ తరువాత కుల పెద్దలు ఎంతో వినమ్రతతో వారికి నచ్చుజెప్పగా గర్భిణిగా ఉండికూడ వారు వివాహం చేసుకున్నారు. గర్భిణిగా ఉండి తౌరాత్ బోధనలకు విరుద్ధముగా వారు ఎందుకు వివాహం చేసుకున్నారు?కన్యత్వంను ఎందుకు వీడవలసి వచ్చినది? బహుభార్యత్వ సిద్ధాంతంనకు ఎందుకు శ్రీకారం చూట్టారు? అని ప్రజలు ఆరోపణలు చేస్తుంటారు. అనగా యూసూఫ్ వడ్రంగికి భార్య ఉన్నా కూడ మరల అతనినే వివాహం చేసుకొనుటకు ఎందుకు సముఖత చూపించారు? ఈ ప్రశ్నలకు నేనిచ్చు

۞(6) ఏసూ మసీహ్‌కి (4) నలుగురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు ఉండే వారు. వీరందరు ఏసూ మసీహ్ యొక్క సొంత తమ్ముళ్ళు మరియు చెల్లెల్లు. అనగా అందరు యూసూఫ్ మరియు మరియంల ద్వారానే జన్మించారు. వారి నలుగురు సోదరుల పేర్లు ఇలా గలవు. యహూదా, యాఖూబ్, షమూఊన్, యూజస్, ఇద్దరు చెల్లెల్ల పేర్లు ఇలా గలవు. ఆసియా, లీదియా. అపాస్టోలుక్ రికార్డుని చూడుము. రచయిత: పాద్రి జాన్ ఎలన్ గాయల్జ్, ప్రచురణ లండన్ 1886 పుట 159–166. ***సమాప్తం.***

సమాధానము ఏమనగా వారికి కొన్ని తప్పని పరిస్థితులు ఎదురైనాయి. కావున ఇట్టి స్థితిలో వారు ఆదరించబడుదురు గాని, ఆరోపించబడరు.

ఈ అంశ ప్రస్తావన తరువాత నేను మరల మీకు తెల్పునదేమనగా, బహిరంగముగా మేము బైఅత్ (ప్రమాణము) చేసినామని మీరు భావించకుము. బహిరంగానికి ఏ మాత్రం ప్రాధాన్యతలేదు. అల్లాహ్ మీ మనోభావాలను ఎరుగును. అందుకు అనుగుణముగానే మీతో వ్యవహరించును. శ్రద్ధ వహించుడు. ఈ సత్యమును మీకు తెల్పి నేను సందేశ చేరివేత బాధ్యత నుండి విముక్తుడ నగుచున్నాను. పాపమొక పాషాణము, దానికి అలవాటు పడకుము. ఈశ్వర కృతఘ్నత ఒక దుర్మరణం. దాని నుండి రక్షింప బడుము. మీకు బలము చేకూరుటకు ప్రార్థించుము. కొన్ని అపవాద వాగ్దానాలను గూర్చి గాకుండా ప్రార్థించునప్పుడు సర్వాధికారములు అల్లాహ్‌కేనని భావించని వాడు నా వర్గములోని వాడు కాడు. బూటకాలను, కపట మోసాలను వీడనివాడు నా వర్గములోని వాడు కాడు, ప్రపంచ భోగభాగ్యాల యందు మునిగి పరలోకమును పూర్తిగా విస్మరించినవాడు నా వర్గములోని వాడు కాడు. ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యత నివ్వనివాడు నా వర్గములోని వాడు కాడు. మద్యపానము, జూదము, కామము, లంచము మొదలగు వ్యసనాలన్నింటి నుండి ప్రాయశ్చిత్తం చేయనివాడు నా వర్గములోని వాడు కాడు, ఐదు పర్యాయముల ప్రార్థనలను నియమ నిబంధనల ప్రకారము సలుపనివాడు నా వర్గములోని వాడు కాడు. ప్రార్థనలు చేయనివాడు వినయ విధేయతలతో అల్లాహ్ ను ధ్యానించనివాడు నా వర్గములోని వాడు కాడు. తమపై చెడు ప్రభావంను దాల్చు చెడు మిత్రులను వీడని వాడు నా వర్గములోని

వాడు కాడు. తమ తల్లిదండ్రులను గౌరవించనివాడు, పవిత్ర ఖుర్ఆన్ ఆదేశాలకు విరుద్ధము కాని, నిషేధింపబడని వారి సూచనలను, మాటలను విననివాడు, వారు జీవించు వరకు వారి సేవ చేయనివాడు నా వర్గములోని వాడు కాడు. తన భార్యతో, ఆమె బంధు మిత్రువులతో ఆప్యాయత, అనురాగాలతో వ్యవహరించని వాడు నా వర్గములోని వాడు కాడు. తమ  ఇరుగు పొరుగు వారిని చిన్న చిన్న ఆనందాల నుండి దూరం చేయువాడు నా వర్గములోని వాడు కాడు. కపటమునుపయోగించి నిందితున్ని క్షమించగోరని వాడు నా వర్గములోని వాడు కాడు. భార్యను మోసం చేయు భర్త, భర్తను మోసం చేయు భార్య నా వర్గములోని వారు కారు. బైఅత్ సందర్భమున చేసిన వాగ్దానమును ఏ విధముగానైన ఉల్లంఘించిన వాడు నా వర్గములోని వాడు కాడు. నన్ను మసీహ్ మౌవూద్, మహ్ది మ'హూద్‌గా నమ్మని వాడు నా వర్గములోని వాడు కాడు. ధర్మబద్ధమైన అంశాలలో నన్ను అనుసరించని వాడు నా వర్గములోని వాడు కాడు. వ్యతిరేక వర్గీయుల సమావేశాలలో  కూర్చొని వారి మాటలు విని తలలూపు వాడు నా వర్గములోని వాడు కాడు. పతితుడు, అబద్ధమాడు వాడు, త్రాగుబోతు, దొంగ, జూదరి, హంతకుడు, నమ్మకద్రోహి, లంచగొండి, అన్యాయుడు, మోసగాడు, వారి సహచరుడు, తన సోదర, సోదరీమణులను అపనిందలకు గురి చేయువాడు, తమ దుష్కార్యములపై పశ్చాత్తాప పడనివాడు, చెడు సహవాసములను వీడని వాడు నా వర్గములోని వాడు కాడు. ఇవన్నియు విషపూరితములు. వీటిని మ్రింగి మీరెలాగు బ్రతకలేరు. కాంతులు, అంధకారములు ఒక చోట ఉండ లేవు. సహృదయులకు లభించు శుభములు అల్లాహ్‌తో కపటమాడు వాడు సమస్యలను సృష్టించువాడు పొందలేడు. తమ హృదయాలను

పరిశుద్ధపర్చుకొను వారు ఎంతటి అదృష్టవంతులు. వారు తమ హృదయాలను అన్ని రకాల మలినాల నుండి శుభ్రం చేసు కొందురు. తమ దైవం ముందు వినమ్రతతో కూడిన ప్రతిజ్ఞను చేయుదురు. ఎందుకనగా వారు ఎన్నటికి వృధా చేయబడరు. అల్లాహ్ కూడ వారిని ఎన్నడు అప్రతిష్టపాలు చేయడు. ఎందుకనగా వారు అల్లాహ్ దాసులు. అల్లాహ్ వారి ప్రభువు. వారు అన్ని రకాల ఆపదల నుండి కాపాడబడుదురు. వారిని అంతమొందించా లని ప్రయత్నించు శత్రువు మూర్ఖుడు. ఎందుకనగా వారు అల్లాహ్ సన్నిధిలో నున్నవారు. అల్లాహ్ వారి సహాయకుడు. అల్లాహ్‌ను ఎవరు విశ్వసించెదరు? అట్టివారే అల్లాహ్‌ను విశ్వసించెదరు. అదే విధముగా ఒక మోసగాడిని, కపటుడిని, జిత్తులమారిని గురించి చింతించువాడు కూడ అవివేకుడు. ఎందుకనగా వాడు స్వయముగా నాశనమగును. భూమ్యాకాశములను సృష్టించినప్పటి నుండి అల్లాహ్ సజ్జనులను, పుణ్యాత్ములను నాశనము చేయుట ఎన్నడు జరుగలేదు. వారి కొరకు అతడు గొప్ప గొప్ప కార్యములు చేసి చూపెను. నేడు కూడ చేసి చూపును. అల్లాహ్ గొప్ప విశ్వాస పాత్రుడు. విశ్వాస పాత్రుల కొరకు అతడు అద్భుత కార్యము లొనరించును. ప్రపంచము వారిని కబళించగోరును. శత్రువులు వారిని కోపగించుకొందురు. కాని వారి మిత్రుడు వారిని ప్రతి సంహారక కార్యము నుండి రక్షించును. అన్ని రంగాలలో వారికి జయమును ప్రసాదించును. అతని సాన్నిహిత్యంను వీడని వాడు ఎంతటి పుణ్యాత్ముడు. అదృష్టవంతుడు. మేము అతనిని విశ్వసించితిమి. మేము అతనిని గుర్తించితిమి. సర్వ ప్రపంచమునకు అతడే సర్వాధికారి. అతడే నాపై సువార్త వాణిని అవతరింప జేసెను. అతడే నా కొరకు గొప్ప సంకేతములను చూపెను. అతడే

నన్ను ఈ కాలమునకు మసీహ్ మౌవూద్‌గా అవతరింప జేసెను. అతడు తప్ప మరో దైవం ఆకాశము నందు గాని, భూమి యందు గాని లేదు. అతనిని విశ్వసించని వాడు శుభములకు దూరమై ఆపదలలో చిక్కుకొని పోవును. మేము మా దేవుని ప్రకాశవంతమైన సువార్త వాణిని పొందితిమి. ప్రపంచ దేవుడతడేనని మేము గుర్తించితిమి, చూచితిమి. అతడు తప్ప మరొక దైవం లేదు. మేము గుర్తించిన అల్లాహ్ ఎంతో శక్తి మంతుడు. చిరకాలుడు, సర్వాధికారములు గలవాడు. అతని గ్రంథము, వాగ్దానమునకు విరుద్ధముగా వున్నవి తప్ప అతనికి అసాధ్యమైనదేమియును లేదు. కనుక తానూహించి సృష్టించిన శాసనాలనవలంభించు ప్రకృతి ప్రియుల వలే మీరు ప్రార్థించకుము. వాటిని అల్లాహ్ గ్రంథము ధృవీకరించ లేదు. వారు ధిక్కరించబడిన వారు. వారి ప్రార్థనలు ఎన్నడూ స్వీకరించబడవు. వారు అంధులు, దృశ్య శక్తిని కోల్పోయిన వారు, వారు మృతులు, సజీవులు కారు. దేవుని ముందు తాము ఏర్పర్చుకున్న సిద్ధాంతాలను ప్రవేశపెట్టెదరు. మరియు అతని అసాధారణమైన శక్తులకు హద్దులు నిర్ధేశిస్తారు. అతనిని బలహీనుడిగా భావిస్తుంటారు. కావున వారి స్థితిగతుల ప్రకారము వారితో వ్యవహరించబడును. కాని నీ అల్లాహ్ సర్వ శక్తిమంతుడని విశ్వసించి నీవు ప్రార్థించినప్పుడే నీ ప్రార్థన స్వీకరించబడును. మేము చూసిన అద్భుతాలను నీవు చూడగలవు. మా సాక్ష్యము అనుభవ పూరితము. కట్టుకథ కానేకాదు. అల్లాహ్‌ను సర్వశక్తిమంతుడని భావించని వాడు, అతని దృష్టిలో ప్రకృతి సిద్ధాంతాలను వ్యతిరేకించువాడు ఆపదలలో చిక్కుకొనినప్పుడు అతనికి దుఆ చేయాలనే ఆలోచన కలుగడం చోద్యము కాదా? అట్టి వ్యక్తి దుఆ స్వీకరించబడునా? కావున ఓ సజ్జనుడా! నీ వట్లు

చేయకుము. లెక్కించలేనన్ని నక్షత్రములను స్థంభము లేకుండానే వ్రేలాడగట్టిన వాడు, భూమ్యాకాశములను శూన్యము నుండి పుట్టించినవాడే నీ అల్లాహ్. నీ కార్యమెనర్చుట అతనికి సాధ్యము కాదని నీవు ఊహింతువా? ۞(7) నీ ఊహయే నిన్ను నష్టపర్చును. మన అల్లాహ్‌లో అనన్య అద్భుతాలు గలవు. కాని అతనిని నమ్మి, అతనికి విశ్వాస పాత్రులైన వారే వాటిని చూడగలరు. అతడు శక్తిమంతుడని నమ్మని వారికి, విశ్వాసపాత్రులు కాని వారికి, అతనితో సంబంధము ఏర్పర్చుకొనని వారికి అతడు అద్భుతాలు, మహిమలు చూపడు. సర్వాధికారుడు, శక్తిమంతుడైన ఒక దైవమున్నదని తెలియని వాడు ఎంతో దురదృష్టవంతుడు. మన

۞(7) అల్లాహ్ తఆలా ఏ కార్యములో కూడ అలసిపోడు. కాని దైవ గ్రంథము దుఆ విషయంలో ఒక విధానాన్ని ప్రస్తావించింది. అదేమనగా అతడు ఎంతో కరుణామయుడిగా సత్పుర్షులతో మిత్రుల వలే వ్యవహరించును. అనగా అప్పుడప్పుడు అతడు తన ప్రీతిని విడిచి తన దాసుని దుఆలను స్వీకరించును. ఈ విషయమునే అతడు ఈ విధముగా కూడ తెల్పినాడు. اُدۡعُوۡنِیۡۤ اَسۡتَجِبۡ لَکُمۡ (ము'మిన్–40:61) (అనగా మీ ప్రభువు అయిన నన్ను పిలువుడు. నేను మీ ప్రార్థనను విందును.) అప్పుడప్పుడు తన ప్రీతికి అనుగుణముగా నడిపించుకుంటాడు. ఈ విషయాన్ని తెల్పుచూ ఇట్లనెను. وَلَنَبۡلُوَنَّکُمۡ بِشَیۡءٍ مِّنَ الۡخَوۡفِ وَالۡجُوۡعِ (బఖరహ్–2:156) (అనగా మీకు భయము గొలిపి, మిమ్ము ఆకలికి హడలించి మేము మిమ్ములను తప్పక పరీక్షింతుము.) ఇలా ఎందుకు చేయుననగా కొన్ని సందర్భాలలో మానవుని దుఆలను అనుసరించి వారితో వ్యవహ రించి వారికి దైవజ్ఞానం మరియు నమ్మకంలో ప్రగతిని పొందు మార్గంను చూపును. కొన్ని సందర్భాలలో తన ఇష్టానుసారము నడుచు కొంటూ తన ప్రీతికి అనుగున మైన స్థాయిని, సాన్నిహిత్యమును అందించును. ఫలితముగా అతనిని ప్రేమిస్తూ సన్మార్గంలో అతనికి ప్రగతిని ప్రసాదించును. **సమాప్తం**

అల్లాహ్‌యే మన స్వర్గము. మన సర్వానందములు మన అల్లాహ్ యందే గలవు. ఎందుకనగా మేమతనిని తిలకించితిమి. అందము లన్నియు అతనిలో పొందితిమి. ఈ సంపత్తిని ప్రాణాలర్పించైన కొనుగోలు చేయవచ్చును. సర్వస్వము ధారపోసైన ఈ ముత్యమును కొనవచ్చును. ఓ దురదృష్టవంతులారా! ఈ చెలిమ వైపు పరుగెత్తుము, ఇదియే మీ దాహము తీర్చును. ఇది జీవనమిచ్చు చెలిమ, ఇదియే మిమ్ము రక్షించును. నేనేమి చేయవలయును? ఈ శుభవార్తను ప్రజల హృదయాలలో నాటుటకు నేను ఏ విధానమును ఎంచుకోవలెను? ఇతడే మీ అల్లాహ్! అని ప్రజలు ఆలకించుటకు, తెలుసుకొనుటకు నేను ఏ విధముగా చాటింపవలెను? ప్రజలు ఆసక్తితో వినుటకు నేను వారి చెవులకు ఏ విధమైన చికిత్స చేయవలెను?

ఒకవేళ మీరు అల్లాహ్‌కు అంకితమైనచో నిశ్చయముగా అల్లాహ్ కూడ మీవాడగునని భావించుము. మీరు నిద్రించినను అతడు మీ కొరకు జాగరణ చేయును. శత్రువులను మీరెరుగరు, కాని అతడెరుగును. వారి యుక్తులను భంగ పరుచును. మీ అల్లాహ్ యందు ఏ ఏ మహిమలు గలవో మీరింత వరకు ఎరుగరు. ఒకవేళ మీరు తెలుసుకున్నచో ప్రపంచము కొరకు మీరు ఏ రోజు దుఃఖించరు. ఒక నిధి గల సంపన్నుడు ఒక పైసా పోయినచో ఏడ్చునా? విలపించునా? వినాశనమగునా? అవసరములన్నింటిని అల్లాహ్‌యే తీర్చునని, అతడే ఒక గొప్ప నిధియని మీరెరిగినచో ప్రపంచ సంపదల కొరకు మీరిట్లు పరుగిడుదురా? అల్లాహ్ ఒక ప్రియమైన నిధి. అడుగడున మీకతడు సహాయపడును. అతడు లేనిది మీరు లేరు, మీ ఆస్తి పాస్తులు, మీ ఉపాయయుక్తులు అన్ని వ్యర్థములే. కనుక అతనిని గుర్తించుము, ఆదరించుము. ఇతర

జాతుల వారి ననుసరించకుము. వారు పూర్తిగా సాధనాలపై ఆధారపడి యున్నారు. సర్పము మట్టి తిన్నట్లుగా వారు కూడ ప్రాపంచికమనే మట్టిని తిన్నారు. అంతేగాకా రాబందులు, కుక్కలు చచ్చిన మాంసంను తిన్నట్లుగా వారు కూడ మృత మాంసమును తినుటకు అలవాటు పడిపోయారు. వారు అల్లాహ్‌కు చాలా దూరమైపోయారు. మానవులను పూజించిరి, పంది మాంసమును ఆరగించిరి. మద్యపానమును నీటి వలె సేవించిరి. పరిధులు దాటి ప్రాపంచిక పరికరాలపై ఆధారపడినందున, దేవుని నుండి శక్తులను వేడుకోనందున వారు మృత్యువాత పడిరి. పంజరం నుండి ఎగిరిపోయిన పావురము వలే వారిలో నుండి ఆత్మలు వెళ్ళిపోయినవి. వారిలో ప్రాపంచిక వ్యామోహము బలపడినది. ఆ వ్యామోహము వారి అంతరంగమును పూర్తిగా నాశనము చేసినది. కనుక మీరు ఆ రుగ్మతలకు భయపడుము. అవసర నిమిత్తము ప్రాపంచిక సాధనాలను ఉపయోగించుటను నేను తప్పు పట్టడం లేదు. కాని మీరు ఇతర జాతుల వలే ప్రాపంచిక వ్యామోహములో పూర్తిగా మునిగిపోవుటను మరియు పరికరాలను సృష్టించిన అల్లాహ్‌ను విస్మరించుటను తప్పుబట్టుచున్నాను. ఒకవేళ మీకు కన్నులున్నచో సర్వమండలమంతయు మీకు అల్లాహ్‌యే కనిపించును. ఇతరములన్ని అశాశ్వితములు. అతడు కోరనిచో మీరు మీ చేతులను దగ్గరకు గాని, దూరము గాని చేయలేరు. ఒక నిర్జీవుడు ఈ విషయముపై పరిహసించును. ఒకవేళ అతడు మరణించినచో అతని మరణం అతనికి అతని పరిహాసముకన్న ఎంతో ఉత్తమమగును. జాగ్రత్తా! ఇతర జాతుల వారిని చూచి మీరు వారితో పోటి పడకుము. వారు ప్రపంచ పథకాల యందు చాలా ప్రగతిని పొందినారని భావించి మనము కూడ వారినే

అనుసరించెదము అని వారి అడుగుజాడలలో నడుచుటకు ప్రయత్నించకుము. వినుము! మిమ్ము తన వైపు ఆహ్వానించు అల్లాహ్ పట్ల వారు ఎమరుపాటుగా, అజ్ఞానముగా ఉన్నారని అర్థము చేసుకొనుము. వారి దేవుడు ఎవడు? కేవలం ఒక మానవ మాత్రుడు మాత్రమే. అందుకే వారు విస్మరించబడిరి. ప్రపంచ కార్యకలాపాల నుండి, ఆర్జితాల నుండి నేను మిమ్ములను అడ్డు కోవడం లేదు. కాని ప్రపంచమునే సర్వస్వమని భావించు వారిని మీరు అనుసరించకుము. మీరు తలపెట్టు కార్యము ప్రాపంచికము నదైనను, ధార్మికమునదైనను శక్తి, సామార్థ్యములను అనుగ్రహించమని అల్లాహ్‌ను యాచించు పరంపరను కొనసాగించ వలెను. కేవలం నోటితో పదాలను ఉచ్చరించకుండా శుభము లన్నియు ఆకాశము నుండే చేకూరునను గట్టి నమ్మకమును కలిగియుండవలెను. నీవు చేయునారంభించు ప్రతి కార్యమునకు, ప్రతి కష్టనివారణకు ముందు ఎలాంటి యుక్తులు చేయకుండా ద్వారములను మూసివేసి దేవుని ఆస్థానములో మోకరిల్లి నాకు ఈ సమస్య ఎదురైనది, నీ అనుగ్రహముతో ఈ సమస్యకు పరిష్కారము చూపమని వేడుకున్నచో అప్పుడు పరిశుద్ధ ఆత్మ నీకు సహాయమును అందించును. మీ ఊహకందని మార్గములను అతడు మీపై తెరుచును. అప్పుడు నీవు సన్మార్గుడవని లిఖించ బడును. మీ ప్రాణాలపై మీరు కనికరించుకొనుము. అల్లాహ్ తఆలాతో పూర్తిగా అనుబంధమును తెంచుకొని, ఎల్లప్పుడు పరికరాలనే సర్వస్వమని నమ్ముకొని, చివరికి శక్తిని ప్రసాదించమని అల్లాహ్‌ను అడుగుటకు నోటితో **ఇన్ షా అల్లాహ్** అని పలుకని వారిని అనుసరించకుము. మీ యుక్తులన్నింటికి అల్లాహ్‌యే మూలమని గ్రహించుటకు అల్లాహ్ తఆలా మీ కన్నులను తెరుచు

గాకా! ఒకవేళ దూలము పడిపోయినచో వాసములు ఇంటి కప్పును ఆపగలవా? అలా ఎన్నడు జరుగదు. ఒక్కసారిగా, కుప్పగా కూలి పోవును. అలాంటి సమయంలో ఎన్నో ప్రాణాలు పోవుటకు అవకాశము ఉండును. ఆ విధముగానే అల్లాహ్ సహాయ సహకారములు లేనిదే మీ యుక్తులు పనిచేయవు. ఒకవేళ మీరతనిని సహాయమును ఆర్జించనిచో, శక్తి ప్రసాదించమని అతనిని వేడుకొనుటను అలవర్చుకొననిచో మీకు ఎలాంటి సాఫల్యము లభించదు. చివరికి ఎంతో విచారముతో మరణించెదరు. వాస్తవానికి మీ సంపూర్ణమైన, శక్తి మంతుడైన అల్లాహ్‌ను ఇతర జాతులు గుర్తించకున్నను అవి ఎందుకు అభివృద్ధి చెందుచున్నాయని మీరు ఆలోచించకుము. ఇందుకు సమాధానం ఏమనగా, ఆ జాతులు అల్లాహ్‌కు దూరమైనందులకు ప్రాపంచిక పరీక్షలను ఎదురు కొనుచున్నవి. కొన్ని సార్లు అల్లాహ్ ఈ విధముగా కూడ పరీక్షిస్తాడు. అనగా ఎవరైతే అల్లాహ్‌ను వీడి, ప్రాపంచిక భోగా భాగ్యాలపై ఆకాంక్షను పెంచుకొని, ప్రాపంచిక ఐశ్వర్యాలను ఆశించెదరో అట్టి వారి కొరకు ప్రాపంచిక ద్వారములు తెరువ బడుతాయి. కాని ధార్మిక పరంగా అట్టి వ్యక్తులు దిగంబరులుగా, నిరాధారులుగా మిగిలి పోతారు. చివరికి ప్రాపంచిక కోరికలతోనే మరణిస్తారు. అలా వారు ఒక శాశ్వత నరకంలో పడవేయ బడుదురు. మరి కొన్ని సందర్భాలలో అస్వార్థక స్థితిలోనే ఉంచబడి పరీక్షించబడుదురు. కాని ఈ చివరి పరీక్ష మొదటి పరీక్షవలే భయంకరముగా ఉండదు. ఎందుకనగా మొదట పరీక్షించబడు వారు గర్వితులై ఉందురు. మొత్తానికి ఈ ఇరు వర్గీయులు غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ (దైవాగ్రోషమునకు గురైనవారి) పరిధిలోకే వస్తారు. సత్యానందమునకు మూలాధారము అల్లాహ్‌యే. అట్టి

జీవాత్ముడు, శాశ్వితుడైన దైవం పట్ల ప్రజలు ఎమరుపాటుగా ఉన్నారు. ఒక రకముగా పూర్తి అజ్ఞానములో ఉన్నారు. అతని నుండి ముఖములు త్రిప్పుకొని ఉన్నారు. అలాంటప్పుడు వారికి స్వచ్ఛమైన ఆనందము ఎక్కడి నుండి లభించును. ఈ రహస్యమె రిగిన వారు ధన్యులు. ఈ రహస్యమెరుగని వాడు నాశనమొందును. అదే విధముగా మీరు తత్వజ్ఞానులను అనుసరించకుడు. వారిని గౌరవ దృష్టితో చూడకుము. వారివన్నియు అవివేక కార్యములు. అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్ నందు మీకు చూపినదే సత్యతత్వ జ్ఞానము. ఈ ప్రాపంచిక తత్వమును ప్రేమించువారు నాశనమ గుదురు. స్వచ్ఛమైన జ్ఞానమును, వేదాంతాలను అల్లాహ్ తఆలా గ్రంథములో అన్వేషించిన వారే సఫలీకృతులగుదురు. అవివేక మార్గాలను ఎందుకు అనుసరిస్తున్నారు? అల్లాహ్‌కు తెలియదని మీరతనికి విషయములు నేర్పుదురా? మీకు సన్మార్గమును చూపెదరని భావించి అంధుల వెనుక పరుగెత్తుదురా? ఓ అవివేకులారా! వారే స్వయముగా అంధులైనచో మీకు వారెలా సన్మార్గమును చూపెదరు. మీతో వాగ్దానం చేయబడిన స్వచ్ఛమైన వేదాంతము పరిశుద్ధ ఆత్మ ద్వారా లభించును. ఇతరులకు అవగాహన లేని పవిత్రమైన బోధనల వరకు మీరు పరిశుద్ధ ఆత్మ ద్వార మాత్రమే చేరుకొందురు. ఒకవేళ స్వచ్ఛతతో కోరుకున్నచో చివరికి మీకది లభించును. అప్పుడు మనస్సుకు నూతనొత్తేజమును, ఒక నూతన జీవితమును ప్రసాదించునవి మరియు నమ్మకమనే ఉన్నత శిఖరము వరకు చేర్చునవి ఈ బోధనలేనని మీరు అర్థం చేసుకుందురు. చచ్చిన మాంసమును తినువాడు మీకెలా పరిశు భ్రమైన, ధర్మబద్ధమైన ఆహారమును తెచ్చును? వారు స్వయముగా అంధులైనప్పుడు మీకెలా మార్గమును చూపెదరు? పవిత్ర

వివేకములన్నియు ఆకాశము నుండే వచ్చును. అలాంటప్పుడు నీవు ప్రాపంచికుల వద్ద ఏమి వెతుకుచున్నావు. ఎవరి ఆత్మలు ఆకాశము వైపునకు వెళ్ళునో వారే వివేకములకు అర్హులగుదురు. స్వతాహా తృప్తి చెందని వారు మిమ్ములనేలా తృప్తి పర్చెదరు. అందుకు ముందుగా స్వచ్ఛత మరియు హృదయ శుద్ధి తప్పనిసరిగా అలవర్చుకోవలెను. ఆ తరువాతయే ఇవన్నియు మీకు లభించును. గతంలో దేవుని సువార్తవాణి అవతరించేది. ఇప్పుడు అవతరించడం లేదని, ۞(8) పరిశుద్ధ ఆత్మ పూర్వ కాలములోనే అవతరించినది, నేటి కాలంలో అవతరించడం లేదని మీరు భావించకుడు. నేను మీకు తెల్పు సత్యమేమనగా అన్ని ద్వారములు మూయబడినను పరిశుద్ధ ఆత్మ అవతరించు ద్వారము మాత్రము ఎన్నటికి మూయబడదు. మీరు మీ హృదయపు ద్వారములు తెరచి ఉంచుము. ఫలితముగా ఆ పరిశుద్ధ ఆత్మ అందులోకి ప్రవేశించును. పైగా మీరు స్వయముగా సూర్యునితో దూరముగా ఉంటూ దాని కిరణములు చొరబడు కిటికీని మూసుకొను చున్నారు. ఓ మూర్ఖులారా! లెమ్ము! ఆ కిటికీని తెరువుము. అప్పుడే ఆ సూర్య కిరణాలు మీలోకి ప్రవేశించును. నేటి కాలములో అల్లాహ్ తఆలా ప్రాపంచిక అనుగ్రహపు మార్గములను మూసి వేయకుండా మీ కోసం అధిక మార్గములను తెరచినాడు. అలాంటిది నేడు మీకు అత్యవసరమున్న ఆకాశపు శుభముల మార్గములను అతడు మూసి

۞(8) పవిత్ర ఖుర్ఆన్ తరువాత ధర్మశాస్త్రము ముగిసిపోయింది. కాని దైవవాణుల పరంపర ముగిసి పోలేదు. ఎందుకనగా ఆ దైవవాణులే సత్య ధర్మమునకు ప్రాణాలు. ఏ ధర్మములోనైతే దైవవాణుల పరంపర నిలిచి పోవునో ఆ ధర్మము మృతి చెందినట్లు, అల్లాహ్ ఆ ధర్మముతో లేదని అర్థం. ***సమాప్తం.***

వేసినాడని మీరు భావించుచున్నారా? అలా ఎన్నడు జరుగదు. పైగా ఎంతో స్పష్టముగా ఆ ద్వారములు తెరువబడ్డాయి. ఫాతిహా ఆధ్యాయములో అల్లాహ్ తఆలా మీకు నేర్పిన బోధనల ప్రకారము గత అనుగ్రహపు ద్వారములన్నింటిని అతడు మీ కొరకు తెరచినాడు. అలాంటప్పుడు వాటిని స్వీకరించుటకు మీరు ఎందుకు నిరాకరిస్తున్నారు. స్వయముగా మీ వరకు చేరు చెలిమను మీరు కోరుకొనుము. పాల కొరకు తల్లడిల్లు పాప వలే మీరు కూడ విలపించుము. అప్పుడే పాలు చనుపాల వలే దొర్లును. అనుగ్రహ అర్హులుగా మారినప్పుడే మీరు అనుగ్రహింప బడుదురు. ఆవేదనతో విలపించుము, ఫలితముగా సంతృప్తి పొందెదరు. నిరంతరము విలపించుము ఫలితముగా ఒక చెయ్యి మిమ్ములను పట్టుకొనును. అల్లాహ్ మార్గము ఎంతో కష్టతర మార్గము. కాని మరణించు సంకల్పముతో ఆ గుండంలోకి దిగిన వారికి, అగ్నియే ప్రియమైనద ని తమ హృదయాలలో నిర్ణయించుకొను వారికి అది సులభతర మగును. వారు తమ దైవం కొరకు ఆ అగ్నిలో కాలిబూడిద అగుటకు సిద్ధపడుదురు. ఆపై వారు తమకు తామే ఆ అగ్నికి ఆహుతి చేసుకొందురు. చివరికి వారు దానిని ఒక స్వర్గముగా పొందెదరు. ఈ విషయమునే అల్లాహ్ తఆలా ఈ విధముగా తెలిపెను.

وَاِنۡ مِّنۡكُمۡ اِلَّا وَارِدُهَا‌ ۚ كَانَ عَلٰى رَبِّكَ حَتۡمًا مَّقۡضِيًّا

(మర్యమ్–19:72) అనగా ఓ దుర్మార్గులారా! పవిత్రులారా! నరకపు అగ్ని నుండి ప్రయణించకుండా మీలో ఎవరు ఉండరు. కాని అల్లాహ్ కొరకు ఎవరైతే తమను అగ్నికి ఆహుతి చేసుకొందురో వారే ముక్తిని పొందెదరు. కాని ఎవరైతే తమ తుచ్ఛ కోరికల కోసం అగ్నిలో ప్రవేశించెదరో వారిని ఆ అగ్ని కాల్చి బూడిద చేయును. అల్లాహ్ కొరకు తమ తుచ్ఛ కోరికలతో పోరాడు వారు

ధన్యులు. కాని తమ తుచ్ఛ కోరికల కోసం అల్లాహ్‌తో పోరాడు వారు, అతనికి అనుగుణముగా నడుచుకోని వారు అధములు. తన మనోవాంచల కొరకు దేవుని ఆదేశములను ప్రక్కకు పెట్టు ఏ వ్యక్తి కూడ ఆకాశము నందు ప్రవేశించలేడు. కావున పవిత్ర ఖుర్‌ఆన్‌లోని ఏ చుక్క, ఏ బిందువు కూడ మీకు వ్యతిరేకముగా సాక్ష్యమివ్వకుండా ఉండుటకు ప్రయత్నించుము. పొరపాటున వాటి వలన నీవు పట్టుబడకూడదు. ఎందుకనగా ఒక చిన్న తప్పు కూడ శిక్షకు అర్హులను చేయును. సమయం తక్కువగా ఉన్నది వయస్సు పెరుగుతూ పోతుంది. కావున వడివడిగా అడుగులు వేయుము. సాయంకాలం సమీపంలో ఉన్నది. సమర్పించు దానిని పదే పదే పరిశీలించుకొనుము. పొరపాటున కూడ ఏమి మిగిలిపోకుండా చూసుకొనుము. మాటల గారడి లేదా నిరుపయోగ, నిష్ప్రయోజ మైనది, రాజ దర్బారులో సమర్పించుటకు అనర్హత గలది కాకుండా చూసుకొనుము.

మీలో కొందరు హదీసులను పూర్తిగా నమ్మరని నేను విన్నాను. ఒక వేళ అలా చేయుచున్నచో వారు పెద్ద తప్పిదము చేయుచున్న వారగుదురు. ఇలా చేయమని నేను మీకు సూచించడం లేదు. మీ మార్గదర్శనమునకై అల్లాహ్ మీకు మూడు వరములను ప్రసాదించినాడని నా విశ్వాసం. వాటిలో మొదటిది పవిత్ర ఖుర్‌ఆన్. ۞[9] ఇందులో అల్లాహ్ ఏకత్వం, అతని వైభవము,

۞(9) మార్గదర్శనమునకు రెండవ మార్గము సున్నత్. అనగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఆచరణల ద్వారా చేసి చూపిన ఆదర్శవంతమైన ఉదాహరణలు. ఉదా॥ నమాజ్‌ను ఇలా సలుపాలి అని నమాజ్ సల్పి చూపినారు. ఉపవాసములను ఇలా పాటించాలి అని స్వయముగా వారు (స) ఉపవాసములను పాటించి చూపారు. ఈ విధానాన్నే

గొప్పదనమును గూర్చి చర్చించబడినది. యూదులు క్రైస్తవుల మధ్య గల భేదాభిప్రాయాల పరిష్కారము కూడ ఇందులో చూపబడింది. మరియమ్మ కుమారుడైన ఏసు సిలువ ద్వారా మరణించబడ్డాడు. కావున అతడు శాపగ్రస్థుడు. ఇతర ప్రవక్తల వలే వారు ఉన్నత స్థాయిని పొందలేదనునది వారి తప్పిదములలో, భేదాభిప్రాయాలలో ఒకటి. అదే విధముగా పవిత్ర ఖుర్ఆన్‌లో నీవు అల్లాహ్‌ను కాకుండా మరెవ్వరిని ఆరాధించకుమని తెలుపబడింది. మానవుల ను గాని, జంతువులను గాని, సూర్య చంద్రులను గాని, నక్షత్రాలను గాని, మరే ఇతర మాధ్యమాలను గాని, మీ అచంచల కోరికలు గల మనస్తత్వమును గాని. కావున మీరు జాగ్రత్తపడుడు. దేవుని బోధనలకు గాని, పవిత్ర ఖుర్ఆన్ మార్గదర్శనమునకు గాని విరుద్ధముగా ఒక్క అడుగైనా వేయకుము. ఎవడేని పవిత్ర ఖుర్ఆన్ లోని 700 ఆదేశాలలో ఏ ఒక్క చిన్న ఆదేశమునైనా విడిచిపెట్టినచో వాడు విముక్తి ద్వారమును తన చేతులారా తనపై మూసుకొను వాడగునని నేను మీకు నిజముగా తెల్పుచున్నాను. స్వచ్ఛమైన, సంపూర్ణమైన మోక్ష మార్గములను పవిత్ర ఖుర్ఆన్ చూపినది. మిగిలినవన్నియు దాని ఛాయలే. కనుక మీరు ఖుర్ఆన్‌ను శ్రద్ధతో ఏకాగ్రతతో చదువుము. దానిని అమితముగా ప్రేమించుము.

---

సున్నత్ అంటారు. అనగా దేవుని వాక్యములను ప్రవక్తృత్వ తేజస్సుతో ఆచరణాత్మకముగా చూపారు. దీనినే సున్నత్ అంటారు. మార్గదర్శనము నకు మూడవ మార్గము హదీస్‌లు. హుజూర్ (స) తరువాత కాలంలో వారి వచనాలను సమకూర్చడం జరిగింది. ఈ హదీస్‌ల స్థానము ఖుర్ఆన్ మరియు సున్నత్‌ల స్థానము కంటే తక్కువే. ఎందుకనగా హదీస్‌లలో అధికమైనవి తరువాత కాలంలో కూర్చబడినవి. ఒకవేళ వాటికి సున్నత్ తోడుగా నిలిచినచో వాటికి బలం చేకూరుతుంది. ***సమాప్తం.***

ఎంతగాననగా మీరు ఎవరిని ప్రేమించనంతగా. ఎందుకనగా అల్లాహ్ తఆలా నన్ను ఉద్దేశించి اَلْخَيْرُ كُلُّهُ فِي الْقُرْاٰنِ అనగా అన్ని రకాల శ్రేయస్సులు పవిత్ర ఖుర్ఆన్‌లో గలవని తెల్పినాడు. ఇదే సత్యము. ఇట్టి గ్రంథానికి కాకుండా మరొక దానికి ప్రాధాన్యత నిచ్చు వారిపై విచారము. మీ సాఫల్యతకు, మోక్షమునకు గల మూలాధారము పవిత్ర ఖుర్ఆన్‌లో గలదు. మీకు అవసరమున్న అన్ని ధార్మిక ఆవశ్యకతలు అందులో పొందుపర్చబడి ఉన్నవి. ప్రళయ కాలమున మీ విశ్వాసమును ధృడపర్చునది, నిరాకరించునది కూడ పవిత్ర ఖుర్ఆన్‌యే. మీకు పరోక్షముగానైన మార్గదర్శనము చూపుటకు పవిత్ర ఖుర్ఆన్ తప్ప మరే ఇతర గ్రంథము ఆకాశము క్రింద లేదు. ఖుర్ఆన్ వంటి అద్భుత గ్రంథమును మీకు నొసంగి అల్లాహ్ మీకెంతో మేలు చేసినాడు. మీకు ఇవ్వబడిన గ్రంథము ఒకవేళ క్రైస్తవులకు ఇవ్వబడినచో వారు నాశనమయ్యేవారే కారని నేను మీకు సత్యాన్ని తెలుపుచున్నాను. యూదులకు తౌరాత్ బదులు గా మీకు ఇవ్వబడిన ఈ వరమును, మార్గదర్శకమును ప్రసాదించి ఉండినచో వారిలోని కొన్ని వర్గములు ప్రళయకాలమును నిరాకరించేవి కావు. కావున మీకు అనుగ్రహింపబడిన ఈ బహుమానమును గౌరవించుము. ఇది అపూర్వమైన బహుమానము, ఇదొక గొప్ప సంపత్తి. ఒకవేళ పవిత్ర ఖుర్ఆన్ అవతరించకపోయినచో ప్రపంచ మంతయు ఒక కుళ్ళిన మాంసమువలే దుర్గంధముగా ఉండేది. పవిత్ర ఖుర్ఆన్ గ్రంథము ముందు ఇతర మార్గదర్శక సూత్రము లన్నియు వ్యర్థమైనవే. ఇంజీల్‌ను తీసుక వచ్చిన పరిశుద్ధాత్మ ఒక పావుర రూపంలో అవతరించినది. అది బలహీనమైన, శక్తిహీనమైన ఒక పక్షి. దానిని పిల్లి కూడ పట్టుకోగలదు. అందుకోసమే క్రైస్తవులు రోజురోజుకు బలహీనతలకు లోనవుచున్నారు. వారిలో ఆధ్యాత్మికత

కనుమరుగైనది. ఎందుకనగా వారి విశ్వాసపు సుస్థిరత కేవలం పావురముపైనే ఆధారపడి యుండెను. కాని పవిత్ర ఖుర్‌ఆన్‌ను తీసుకవచ్చిన పరిశుద్ధాత్మ మాత్రము భూమిపై నుండి ఆకాశము వరకు విస్తరించిన ఒక వైభవోపేతమైన రూపములో అవతరించి, తన ఉనికి స్వభావమును భూమ్యాకాశములలో నింపెను. కనుక ఆ పావురపు సామర్థ్యము ఎక్కడా? ఈ వైభవోపేతుని ప్రకాశములు ఎక్కడా? ఈ ప్రస్తావన పవిత్ర ఖుర్‌ఆన్‌లో కూడ గలదు. ఒకవేళ ఆధ్యాయములు, అర్థముల నుండి దూరముండనిచో పవిత్ర ఖుర్‌ఆన్ మానవున్ని కేవలం ఏడు రోజులలోనే పరిశుద్ధిన్ని చేయగలదు. మీరు స్వయముగా ఖుర్‌ఆన్ నుండి దూరముగా పారిపోకున్నచో అది మిమ్ములను సందేశహరుల వలే తీర్చిదిద్ద గలదు. పవిత్ర ఖుర్‌ఆన్ కాకుండా మరే ఇతర గ్రంథము తనను పఠించువారి కొరకు ప్రారంభములోనే

اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ۙ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ (ఫాతిహా-1:6,7)

అనే దుఆను నేర్పించి నమ్మకమును కల్పించినది వున్నదా? అనగా పూర్వీకులకు చూపిన నీ వరముల మార్గము మాకు చూపుము. ఆ వరములు ప్రవక్తృత్వం, సత్యవాదుత్వం, అమరత్వం, సంస్కర్తత్వం. అందుకే సాహసించి ముందడుగు వేయుము మరియు పవిత్ర ఖుర్‌ఆన్ ఆహ్వానాన్ని తిరస్కరించకుము. మీ పూర్వీకులకు ఇచ్చిన వరములనే అతడు మీకు ఇవ్వదలిచాడు. ఇస్రాయీలీల రాజ్యం, ఇస్రాయీలీల పవిత్ర ఆరాధన మందిరమును మీకు నోసంగలేదా? అది నేటి వరకు మీ ఆధినములోనే ఉన్నది. కావున ఓ బలహీన అభిమతం గలవారా! ఓ సాహస హీనులారా! మీ దైవం ప్రాపంచిక పరమైన ఇస్రాయీలీల రాజ్యంనకు మిమ్ములను ప్రతినిధులను చేసినను, ఆధ్యాత్మిక పరమైన రాజ్య పరంపరకు ప్రతినిధులను

చేయలేదని మీరు భావిస్తున్నారా? వాస్తవానికి అల్లాహ్ తఆలా వారికన్న అధికముగా మిమ్ము అనుగ్రహించాలని నిశ్చయించు కున్నాడు. అల్లాహ్ తఆలా వారి ఆధ్యాత్మిక, ప్రాపంచిక సిరి సంపదలకు మిమ్ములను వారసులను చేశాడు. కాని మీ సిరి సంపదలకు మాత్రం అల్లాహ్ తఆలా మరెవరిని వారసులుగా చేయడు. ప్రళయకాలం వచ్చునంత వరకు అల్లాహ్ తఆలా దైవ వాణుల, సువార్త వాణుల, సంభాషణల, సంబోధనల వరముల నుండి మిమ్ము ఏమాత్రం దూరం చేయడు. గతంలో పూర్వీకులకు అనుగ్రహించిన వరములన్నింటిని అతడు మీకు తప్పకుండా అనుగ్రహించును. కాని ఏ వ్యక్తి అయితే దైవాన్ని కించపరుస్తూ తనపై దైవ వాణి అవతరించకున్నను అవతరించినదని, దేవుడు సంభాషణల ద్వారా, సంబోధనల ద్వారా అతనిని పలకరించ కున్నను తనను పలుకరిస్తున్నాడని ప్రకటించుకొను వాడు మాత్రం నాశనమగునని నేను దేవున్ని అతని దూతలను సాక్షిగా నిలుపుతూ ప్రకటిస్తున్నాను. ఎందుకనగా అట్టివాడు తన సృష్టికర్తపై నింద మోపెను. అతనిని మోసగించెను. ఎంతో భయంకరమైన దురాశను, దుశ్చర్యను వ్యక్తపర్చెను. కావున మీరు అట్టి స్థితి నుండి భయపడుడు. స్వప్నాలను సృష్టించి వినిపించు అసత్యులను, సంభాషణల, సంబోధనల పరంపర తనపై కొనసాగుతుందని అసత్య ప్రకటనలు చేయువారిని అల్లాహ్ శపించుగాకా! ఒక రకముగా వారు అసలు దేవుడే లేడని వారి హృదయాలలో భావించుకొంటారు. కాని దేవుని పాశాణము వారిని కఠినముగా శిక్షించును. వారి శిక్ష వారి నుండి దూరం కాజాలదు. కావున మీరు సత్యతలో, సన్మార్గములో, ధార్మికతలో, దైవాభిమానంలో స్వయముగా అభివృద్ధి చెందుము. జీవించినంత కాలము ఇదే మీ

పనియని భావించుము. మరల మీలో ఎవరినైతే అల్లాహ్ ఇష్టపడునో వారికి తన సంభాషణల, సంబోధనల వరమును అనుగ్రహించును. కాని మీకు ఇలాంటి కోరిక ఉండకూడదు. మీ మనోవాంఛనల వలన పొరపాటున కూడ షైతాన్‌కు తన పరంపరను ప్రారంభించు అవకాశం లభించ కూడదు. ఇలాంటి వాటి వలనే అనేకులు నాశనమైపోతారు. అందుకే మీరు సేవ, ఆరాధన కార్యక్రమాలలో నిమగ్నమై ఉండుము. దేవుని ఆదేశాలన్నింటిని పాటించాలనే కార్యక్రమములోనే మీ ప్రయత్నాలన్ని ఉండాలి. విశ్వాసంలో ప్రగతిని ఆశించుము. అది ముక్తి కోసమే గాని సువార్త వాణి కోసం కాకూడదు. పవిత్ర ఖుర్ఆన్ మీకు ఎన్నో పవిత్రమైన ఆదేశాలిచ్చింది. మీరు అన్యారాధన నుండి పూర్తిగా దూరముండా లనేది వాటిలో ఒక ఆదేశము. అన్యారాధకుడు ముక్తిమార్గంను పొందలేడు. మీరు అబద్ధమాడకూడదు. ఎందుకనగా అబద్ధము కూడ అన్యారాధనయే అగును.

చెడుచూపుతో, వ్యామోహపు ఆలోచనలతో పరస్త్రీలను చూడకూడదని, అలా కాకుండా ఇతర దృష్టితో చూసినచో తప్పు లేదని ఇంజీల్ బోధించినట్లుగా పవిత్ర ఖుర్ఆన్ మీకు బోధించడం లేదు. పవిత్ర ఖుర్ఆన్ పరస్త్రీలను మంచి దృష్టితో గాని, చెడు దృష్టితో గాని ఏమాత్రం చూడకూడదని ఆదేశిస్తుంది. ఎందుకనగా వారి వలన మీరు సన్మార్గమును విడిచెదరు. పైగా పరస్త్రీలు ఎదురు పడినప్పుడు తమ దృష్టిని నేలకు వాల్చుకోవాలని, వారిని గూర్చి గాని, వారి రూపు రేఖలను గూర్చి తెలుసుకొనుటకు ప్రయత్నించ కూడదని ఆదేశిస్తుంది. కాని తొలికరి జల్లులో ఎదుటి వ్యక్తి కనిపించిన విధముగా సన్నగిల్లిన చూపుతో చూడవచ్చును. అదే విధముగా మీకు మత్తు ఆవహించునంత వరకు మద్యం సేవించ

కూడదని ఇంజీల్ బోధించినట్లుగా పవిత్ర ఖుర్ఆన్ బోధించడం లేదు. పైగా మీరు అసలు మద్యపానమే చేయడకూదని నిషేధిస్తుంది. ఒకవేళ మద్యపానం చేసినచో మీకు మీ దైవమార్గం లభించదని, దేవుడు మీతో సంభాషించడని, మలినముల నుండి మిమ్ములను పరిశుద్ధులుగా తీర్చిదిద్దడని కూడ హెచ్చరిస్తుంది. పైగా ఇవన్నియు షైతాన్ కృత్యాలని, వీటి నుండి తమను తాము రక్షించుకొమ్మని హితోపదేశం చేస్తుంది. అనవసరముగా మీ సోదరునిపై కోపమును ప్రదర్శించకూడదని ఇంజీల్ వలే పవిత్ర ఖుర్ఆన్ బోధించడం లేదు. పవిత్ర ఖుర్ఆన్ కేవలం తమ కోపమును అదుపులో పెట్టుకోవడమే గాకుండా ఇతరులతో وَتَوَاصَوْا بِالْمَرْحَمَةِ (అల్ బలద్-90:18) (అనగా ఒకరి కొకరు కరుణించుటకు ఉపదే శించిరి.) కి అనుగుణముగా నడుచుకొంటూ, ఇతరులు కూడ నడుచుకొనునట్లు ప్రోత్సహించమని, నీవు ఒక్కడివే ఇతరులపై ప్రేమను పంచకుండా, ప్రేమను పంచమని మీ సోదరులకు కూడ తెలియజేయమని ఆదేశిస్తుంది. మీ భార్య వ్యభిచారానికి పాల్పడి నప్పుడు తప్ప మిగిలిన అన్ని తప్పిదాలను క్షమించివేయమని, వారికి విడాకులు ఇవ్వకూడదని ఇంజీల్ తెల్పినట్లుగా పవిత్ర ఖుర్ఆన్ బోధించడం లేదు. పవిత్ర ఖుర్ఆన్ اَلطَّيِّبٰتُ لِلطَّيِّبِيْنَ (అన్నూర్-24:27) అని బోధిస్తుంది. అపవిత్రులు పవిత్రులతో ఉండలేరని పవిత్ర ఖుర్ఆన్ ఉద్దేశం. ఒకవేళ నీ భార్య వ్యభిచారానికి పాల్పడకున్నను పరపురుషులను వ్యామోహపు దృష్టితో చూస్తూ, వారితో అవకాశం కోసం ఎదురు చూస్తున్నచో, అప్పటి వరకు ఆమె శారీరకముగా కలుసుకోకున్నను, పర పురుషులకు తన నగ్నత్వము కనబడునట్లు వ్యవహరించినచో ఆమెపై వ్యభిచారపు వ్యాజ్యము మోపబడుతుంది. ఆమె పరపురుష ధ్యానురాలిగా,

నీచురాలిగా, నీవు విశ్వసించునట్టి పవిత్ర దైవం పట్ల అయిష్టతను కనబర్చునట్టి మహిళగా భావించబడుతుంది. ఒకవేళ ఆమె తన వ్యవహారశైలిని మార్చుకొనని యెడల ఆమెకు విడాకులు ఇచ్చు అనుమతి నీకు గలదు. ఎందుకనగా ఆమె తన కర్మల దృష్ట్యా నీతో వేరుపడినది. ఇట్టి స్థితిలో ఆమె నీ అర్ధాంగి కాజాలదు. కావున ఇకపై నీవు ఆమెతో వెట్టి వాని వలె జీవించవలసిన అవసరం లేదు. ఎందుకనగా ఇకపై ఆమె నీ అర్ధాంగి కాదు. ఆమె నీ శరీరంలో కుళ్ళిన ఒక అవయవము వంటిది. ఆ అవయమును కోసి పడవేయవలసినదే. లేనిచో అది మిగిలిన అవయవాలను కూడ కుళ్ళిపోవునట్లు చేయును. చివరికి నీవు మరణించెదవు. అదే విధముగా మీరు ప్రమాణాలు చేయకూడదని ఇంజీల్ వలే పవిత్ర ఖుర్‌ఆన్ మిమ్ములను నిలువరించడం లేదు. కేవలం నిష్ప్రయోజనమైన ప్రమాణాలు చేయకూడదని మాత్రమే బోధిస్తుంది. ఎందుకనగా కొన్ని విషయాలలో ప్రమాణంనే ప్రామాణికముగా తీసుకోవడం జరుగుతుంది. అల్లాహ్ తఆలా ఒక ఆధారిత మాధ్యమమును వృధా చేయాలని భావించడం లేదు. దాని వలన అతని వివేకత కనుమరుగైపోతుంది. స్వాభావిక విషయమేమనగా మానవుడు ఏదేని వివాదంలో తన వైపు నుండి సాక్ష్యమును ప్రవేశ పెట్టలేక పోయినప్పుడు ఆ వివాదంను పరిష్కరించుటకు దేవున్ని సాక్షిగా ప్రమాణం చేయవలసి ఉంటుంది. కావున ఆ సమయంలో దేవున్ని సాక్షిగా భావిస్తూ ప్రమాణం చేయడం జరుగుతుంది. అదే విధముగా ఏ చోట కూడ దౌర్జన్యమును ఎదురించకూడదని ఇంజీల్ వలే పవిత్ర ఖుర్‌ఆన్ మీకు బోధించడం లేదు. పవిత్ర ఖుర్‌ఆన్ ఈ విషయంలో

جَزٰٓؤُا سَيِّئَةٍ سَيِّئَةٌ مِّثْلُهَا ۚ فَمَنْ عَفَا وَاَصْلَحَ فَاَجْرُهٗ عَلَى اللّٰهِ

(అష్షూరా-42:41) అని బోధిస్తుంది. అనగా చెడుకు ప్రతీకారం మీకు జరిగిన చెడుకు సమానంగానే ఉండాలి, కాని ఎవరైతే క్షమించెదరో, తప్పిదములను మన్నించెదరో, ఈ క్షమాపణ వలన చెడు జరుగకుండా మంచి జరుగుచున్నచో అల్లాహ్ తఆలా అతని పట్ల హర్షంను వ్యక్తపర్చును. అతనికి అతని ప్రతిఫలములను అందించును. కావున పవిత్ర ఖుర్ఆన్ దృష్ట్యా అన్ని చోట్ల క్షమించడం సరికాదు, అన్ని చోట్ల శిక్షించడం సబబు కాదు. సమయస్ఫూర్తితో వ్యవహరించుకోవాలి. శిక్షించుటకు, క్షమించుటకు ముందు వారి జీవిత పూర్వపరాలను పరిగణించాలి. అంతేగాని విచ్చలవిడిగా ఉండకూడదు. ఇదే పవిత్ర ఖుర్ఆన్ ఉద్దేశం. తమ శత్రువులను ప్రేమించుము అని ఇంజీల్ వలే పవిత్ర ఖుర్ఆన్ బోధించడం లేదు. పవిత్ర ఖుర్ఆన్ ప్రకారం వ్యక్తిగతంగా మీకు ఎవరు శత్రువులు ఉండకూడదు. అందరి పట్ల మీరు సమానమైన సానుభూతిని చూపించాలి. కాని నీ దేవుని శ్రతువు, నీ ప్రవక్త శత్రువు, దైవ గ్రంథ శత్రువులనే నీ శత్రువులుగా భావించవలెను. కావున ఇలాంటి వారిని కూడ నీ దుఆలలో మరిచిపోకూడదు. మీరు వారి నడవడికను ద్వేషించాలి గాని, వారి వ్యక్తిత్వాన్ని కాదు. వారు చక్కదిద్దబడుటకు ప్రయత్నించవలెను. ఈ విషయమును గూర్చి మరల ఇట్లు తెలిపెను. اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآئِ ذِی الْقُرْبٰی (అన్నహ్ల్-16:91) అనగా అల్లాహ్ తఆలా మీ నుండి ఏమి కోరుకుంటున్నాడు. కేవలం మీరు మానవజాతితో న్యాయబద్ధముగా వ్యవహరించుము. వారు మీకు ఎలాంటి మంచిని తలపెట్టకున్నను అంతకు మించి వారికి మంచిని చేయుము. మరల అన్నింటిని మించి ఒక తల్లి తన పిల్లలతో వ్యవహరించునట్లుగా మీరు కూడ దైవ ప్రాణులతో వాస్తవానికి వారి స్వంత బంధువుల కన్న ఎక్కువ

సానుభూతితో వ్యవహరించుము. ఎందుకనగా ఉపకారంలో స్వార్థమనే స్వభావం దాగి ఉంటుంది. కొన్ని సందర్భాలలో ఉపకారం చేయువారు తమ ఉపకారమును గుర్తుచేస్తుంటారు. కాని తల్లి వలే స్వాభావికముగా ఉత్సాహంతో పుణ్యము చేయువారు ఎన్నడు కూడ తమ ఉపకారములను ప్రస్తావించరు. అందుకే పుణ్యకార్యము లలో చివరి స్థాయి తల్లి వలే స్వాభావిక ఉత్సాహంతో వ్యవహ రించుట. కావున ఈ సూక్తి కేవలం మానవులకే పరిమితం కాకుండా దేవునితో కూడ న్యాయబద్ధముగా వ్యవహరించుమని తెలియజేస్తుంది. దేవునితో న్యాయబద్ధముగా వ్యవహరించడ మనగా, అతని అనుగ్రహాలను గుర్తుచేసుకొంటూ అతని పట్ల విధేయతను కనబర్చుట. దేవునికి ఉపకారం చేయడమనగా, అతన్ని మనం చూస్తున్నట్లుగా ఖచ్చితమైన నమ్మకాన్ని కల్గియుండడం. దేవునితో اِیۡتَآئِ ذِی الۡقُرۡبٰی అనగా స్వర్గం లభిస్తుందనే ఆశతోగాని, నరకంలో వేయబడుతామనే భయంతో గాని కాకుండా ప్రేమతో, విధేయతతో అతనిని ఆరాధించడం. ఒకవేళ స్వర్గ నరకాలు లేకున్నను అతని పట్ల ఉన్నటువంటి అభిమానం, విధేయతలో ఎలాంటి వ్యత్యాసం రాకుండా అతనిని ఆరాధించవలెను. మిమ్ములను శపించువారికి శుభములు కలుగాలని ఆశించుమని ఇంజీలు బోధిస్తుంది. కాని పవిత్ర ఖుర్ఆన్ మాత్రం నీవు నీ స్వంతముగా ఏ ఆకాంక్షను కోరుకొనకుము అని బోధిస్తుంది. ఇలాంటి వ్యక్తితో ఏ విధముగా వ్యవహరించాలని దైవ తేజస్సుకు నిలయమైన నీ హృదయాన్ని ఫత్వా (తీర్పు) అడుగుము. ఈ శపించు వాడు కరుణించబడుటకు అర్హుడని, ఆకాశంపై ఇతనిని ఎవరు శపించడం లేదని ఒకవేళ అల్లాహ్ తఆలా మీ మనస్సుకు తెలియ జేయబడినచో దేవునికి శత్రువు కాకుండా ఉండుటకై నీవు కూడ

అతనిని శపించకుము. కాని ఒకవేళ నీ బుద్ధి అతడు మందబుద్ధి వాడు కాదని గ్రహించినచో, ఆకాశంపై ఇతడు శపించబడువాడని నీ మనస్సుకు తెలియజేయబడినచో ఏ ప్రవక్త కూడ షైతాన్ కొరకు శుభములను ఆశించనట్లుగా నీవు కూడ అతని కొరకు శుభములను ఆశించకుము. ఏ ప్రవక్త కూడ షైతాన్‌ను శపించకుండా వదిలిపెట్ట లేదు. కాని నీవు మాత్రం ఒకరిని శపించుటలో తొందర పడకుము. ఎందుకనగా అపోహాలలో అనేకములు అవాస్తవములే. ఇలాంటి స్థితిలో అనేక శాపములు శపించువారికే వర్తిస్తాయి. జాగ్రత్తగా అడుగులు వేయుము. పూర్తి స్థాయిలో పరిశీలించిన తదుపరియే ఏదేని పనిని ప్రారంభించుము. దేవున్ని సహాయము ఆర్జించుము. ఎందుకనగా మీరు అంధులు. కావున పొరపాటున కూడ న్యాయబద్ధుడిని దౌర్జన్యుడిగా, సత్యవంతుడిని అబద్ధీకుడిగా భావించకుము. ఇలా జరిగినచో నీ దేవుడి కోపానికి నీవే కారకుడవు అవుతావు. నీ సత్కార్యములన్నియు వ్యర్థమవగలవు. మరల నీవు నీ సత్కార్యములను ప్రజలకు కనిపించకుండా చేయుమని ఇంజీల్ బోధిస్తుంది. కాని పవిత్ర ఖుర్‌ఆన్ మాత్రం నీ సత్కార్యములన్నియు ప్రజలకు కనిపించకుండా చేయకుము అని బోధిస్తుంది. ఒకవేళ నీవు గోప్యముగా చేయునట్టి సత్కార్యముల వలన నీ వ్యక్తిత్వానికి అవి ప్రయోజనం చేకూర్చుచున్నచో అట్టి కారణాల వలన ఆయా సత్కార్యములను గోప్యముగానే చేయుమని, అదే విధముగా బహిరంగముగా చేయునట్టి సత్కార్యముల వలన ప్రజలకు ప్రయోజనం చేకూర్చునని భావించినచో నీకు రెట్టింపు పుణ్యము లభించుటకై ఆయా సత్కార్యములను బహిరంగముగానే చేయుమని ఆదేశిస్తుంది. ఫలితముగా అట్టి సత్కార్యముల ప్రాధాన్యత తెలియని బలహీన ప్రజలు కూడ మిమ్ములను అనుసరిస్తూ ఆయా

సత్కార్యములను చేయుదురు. మొత్తానికి అల్లాహ్ తఆలా తన గ్రంథములో سِرًّا وَّعَلَانِيَةً (అర్రాద్-13:23) అని తెల్పినాడు. అనగా గోప్యముగా మరియు బహిరంగముగా దాన ధర్మాలు చేయుము. ఈ ఆదేశాల వాస్తవికతను కూడ అతడే వివరించినాడు. దీని అర్థమేమనగా కేవలం ప్రజలకు మాటలతో నచ్చజెప్పడమే గాకుండా ఆచరణాత్మకముగా ప్రోత్సహించుమని అర్థం. ఎందుకన గా అన్ని చోట్ల మాటలు ప్రభావంను చూపలేవు. అనేక చోట్ల ఆదర్శమే ప్రభావాన్ని చూపుతుంది.

మరల నీవు దుఆ చేయునప్పుడు నీ భవనంలోకి వెళ్ళిపొమ్ము అని ఇంజీల్ బోధిస్తుంది. కాని పవిత్ర ఖుర్ఆన్ మాత్రం నీవు అన్ని వేళల గోప్యముగా దుఆలు చేయకుండా, కొన్ని సార్లు ప్రజల ముందు బహిరంగముగా, మీ సోదరులతో కలసి సామూహికముగా స్పష్టముగా దుఆలు చేయమని బోధిస్తుంది. ఫలితముగా మీరు చేయు దుఆలు స్వీకరించబడినచో ఆ సామూహికుల విశ్వాసం పటిష్టమగును, ఇతరులు కూడ దుఆల వైపు శ్రద్ధను కనబర్చుదురు.

అదే విధముగా ఇంజీల్‌లో మీరు ఈ విధముగా దుఆ చేయగలరని గలదు. ఆకాశము మీద ఉన్నటువంటి ఓ మా తండ్రి! నీ నామముతో పరిశుద్ధము కలుగు గాక!, నీ ప్రభుత్వమే ఏర్పడును గాక!. ఆకాశము మీద నీకు అధికారము ఉన్నట్లే ఈ భూమండలంపై కూడ నీ అధికారమే కొనసాగును గాక! మా ప్రతి దినపు రొట్టెలలో ఈ రోజువి మాకు ప్రసాదించుము. మేము ఏ విధముగా మా ఋణగ్రస్థులకు ఋణమునిచ్చెదమో నీవు కూడ మాకు ఋణమును ప్రసాదించుము. మమ్ములను పరీక్షించకుము. కేవలం చెడు నుండి రక్షించుము. ఎందుకనగా చక్రవర్తిత్వం, అధికారము, గొప్పదనం ఎల్లప్పుడు నీదే కొనసాగును. కాని పవిత్ర ఖుర్ఆన్ భూమండలంపై

అధికారం లేదని చెప్పకుండా ఆకాశముతో పాటు భూమండలంలో కూడ దేవుని పరిశుద్ధ కీర్తనలు కొనసాగుచున్నాయని చెబుతుంది. ఆ సూక్తి ఇలా గలదు. وَاِنۡ مِّنۡ شَىۡءٍ اِلَّا يُسَبِّحُ بِحَمۡدِهٖ (బనీ ఇస్రాయీల్ -17:45) يُسَبِّحُ لِلّٰهِ مَا فِى السَّمٰوٰتِ وَمَا فِى الۡاَرۡضِ (జుముఅ-62:2) అనగా ఆకాశము మరియు భూమండలంలోని అణువణువు దేవుని పరిశుద్ధతను, స్తోత్రములను కొనియాడు చున్నవి. వాటిలో ఉన్న వన్నియు పరిశుద్ధతను, స్తోత్రములలో లీనమై ఉన్నవి. పర్వతాలు అతని స్మరణలో లీనమై ఉన్నవి. నదులు అతని స్మరణలో లీనమై ఉన్నవి. వృక్షములు అతని స్మరణలో లీనమై ఉన్నవి. ఎందరో సత్పురుషులు అతనిని స్మరించుటలో లీనమై ఉన్నారు. మరల తమ హృదయము మరియు నోటితో అతనిని స్మరించుటలో లీనము కాని వ్యక్తులను, దేవుని ముందు విధేయతతో కూడిన భక్తిని ప్రదర్శించని వ్యక్తులను రకరకాల బంధనాలు, ఆపదలు దైవ విధి ధర్మము వారితో విధేయత భరిత భక్తిని ప్రదర్శింప జేస్తుంటాయి. దేవుని గ్రంథములో అవి చాలా ఉన్నత స్థాయిలో విధేయతను ప్రదర్శిస్తున్నాయని దైవదూతలను గూర్చి కొనియాడినట్లుగా భూమండలంపై గల అణువణువును గూర్చి పవిత్ర ఖుర్ఆన్ కొనియాడుతుంది. సృష్టిలోని ప్రతీది అతని పట్ల విధేయతను చూపుతుంది. అతని అనుమతి లేనిదే ఒక్క ఆకు కూడ రాలిపడదు. అతని ఆదేశము లేనిదే ఏ ఔషధము స్వస్థతను చేకూర్చదు. ఏ పోషకాలు శక్తిని సమకూర్చలేవు. ప్రతి వస్తువు అత్యున్నత స్థాయి భక్తి, శ్రద్ధలతో దేవుని ఆస్థానములో మోకరిల్లుతున్నాయి. అతని పట్ల పూర్తి విధేయతను ప్రదర్శించుటలో లీనమై ఉన్నాయి. పర్వతాలు, భూమండలపు అణువణువు, నదులు, సముద్రపు ప్రతి నీటి బొట్టు, వృక్షాలు, మొక్కల ప్రతి ఆకు, వాటి ఒక్కొక్క

కాండము, మానవులు, జంతువులకు చెందిన అన్ని రకాలు దేవున్ని గుర్తిస్తాయి, అతని పట్ల పూర్తి విధేయతను ప్రదర్శిస్తాయి. అతని పవిత్రతను, స్తోత్రములను స్మరించుటలో లీనమై ఉంటాయి. అందుకే అల్లాహ్ తఆలా يُسَبِّحُ لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ (జుముఅ–62:2) అని తెలుపడం జరిగింది. అనగా ఏ విధముగా నైతే ఆకాశంలో గల ప్రతీది దేవున్ని స్తోత్రించుచు అతని పవిత్రతను కొనియాడు తుంటాయో అదే విధముగా భూమండంలోని ప్రతి వస్తువు అతనిని స్తోత్రించుచు అతని పవిత్రతను కొనియాడు తుంటాయి. అలాంటప్పుడు భూమండలంపై దేవుని స్తోత్రము మరియు పవిత్రత కొనియాడబడదా? ఇలాంటి పదాలు ఏ దైవజనుడి నోటి వెంట వెలువడవు. ఒక విధముగా చెప్పదలచినచో భూమండలంపై గల సకల చరాచర ప్రాణులలో కొన్ని ధర్మశాస్త్రపు ఆదేశాలకు లోబడి విధేయతను ప్రదర్శిస్తుండగా మరి కొన్ని దైవ విధి ధర్మపు ఆదేశాలకు లోబడి ఉన్నవి. మరి కొన్ని ఈ రెండింటికి లోబడి విధేయతను ప్రదర్శించుటలో నిమగ్నమై ఉన్నవి. మేఘాలైన ను, గాలులైనను, నిప్పు అయినను, నేలైనను అన్నియు దేవుని పట్ల విధేయతను ప్రదర్శించుటలో, పవిత్రతను కొనియాడుటలో లీనమైపోయాయి. ఒకవేళ ఏ మానవుడైన దైవ ధర్మశాస్త్రపు ఆదేశాలను ధిక్కరించుచున్నచో అతడు దైవ విధి ధర్మపు ఆదేశాలకు కట్టుబడియే ఉండును. ఈ రెండు అధికారాల నుండి ఎవరు కూడ తప్పించు కోలేరు. ప్రతి ఒక్కరి తల ఏదేని ఆకాశాధికారపు బంధనములో బంధింపబడి ఉన్నది. కాని మానవుని హృదయ సంస్కరణ మరియు అలజడుల కారణముగా నిర్లక్ష్యం, దైవస్మరణ ఒకదాని తరువాత మరొకటి ఈ భూమండలంపై తమ ఆధిపత్యంను ప్రదర్శిస్తుంటాయి. కాని వివేక, విలక్షణుడైన దైవ అనుమతి లేనిదే

ఈ సహాయ సహకారములు స్వయంగా చేకూరలేవు. భూమండలం లో ఈ విధముగా జరగాలని దైవం కోరినది కావున ఆ విధముగానే జరిగెను. కావున మార్గదర్శకం, భ్రష్టత్వ కాలాలు కూడ రాత్రింభవళ్ళ వలే దేవుని ఆదేశం, అనుమతులకు అనుగుణముగా కొనసాగు తుంటాయి. అంతేగాని స్వయం ప్రతిపత్తితో కాదు. అతని సృష్టిలోని ప్రతీది అతని ఆహ్వానాన్ని ఆలకిస్తూ, అతని పవిత్రతను కొనియా డుతుంది. అయినాకూడ భూమండలం దేవుని పవిత్రతో ఖాళీగా ఉందని ఇంజీల్ పేర్కొంటున్నది. అందుకు కారణం ఆ ఇంజీల్‌లో పేర్కొనబడినటు వంటి ఆ దుఆ యొక్క తదుపరి వాక్యములే. ఆ వాక్యములేమనగా ఇప్పటి వరకు ఈ భువిపై దేవుని రాజ్యం స్థాపించబడలేదు. రాజ్యం స్థాపించబడ నందున, ఇతర కారణాల వలన ఆకాశంపై దేవుని ఆకాంక్ష నెరవేరినట్లు భూమండలంపై నెరవేరలేదు. కాని అందుకు పూర్తి భిన్నముగా ఖుర్‌ఆన్ బోధనలు గలవు. అనగా ఖుర్‌ఆన్ ఎంతో స్పష్టముగా ఇట్లు ప్రకటన చేస్తుంది. ఆకాశము నుండి స్వయం ప్రతిపత్తి అనుగ్రహించబడనిదే ఏ దొంగ, హంతకుడు, వ్యభిచారుడు, అవిశ్వాసుడు, మోసగాడు, దుర్మార్గుడు మరేదేని పాపపు పనులు చేయువారు ఈ భూమండలంలో ఏ పనిని చేయలేరు. అలాంటప్పుడు ఆకాశాధికారం భూమండలంపై లేదని ఎలా చెప్పగలరు. దైవాదేశములను కొనసాగకుండా అడ్డుకొను మరేవైన ఇతర శక్తులు ఈ భూమండలంపై ఉన్నాయా? అల్లాహ్ పవిత్రుడు. అలాంటి శక్తులేమి లేవు. కాని అల్లాహ్ తఆలాయే స్వయముగా దేవదూతల కొరకు ఆకాశంపై వేరొక వ్యవస్థను నిర్ణయించాడు. మానవుల కొరకు భూమండలంపై మరొక వ్యవస్థను ఏర్పాటు చేశాడు. అల్లాహ్ తఆలా తన ఆకాశాధికారంలో దేవదూతలకు ఎలాంటి స్వయం ప్రతిపత్తిని కల్పించలేదు. వారి

స్వభావంలోనే విధేయత లక్షణాన్ని చేకూర్చాడు. వారు వ్యతిరేకించ లేరు. మరుపు, బలహీనతలు వంటి ఏ లోపాలు వారిని ప్రభావితం చేయలేవు. కాని మానవుని స్వభావానికి మాత్రం స్వీకరించు, తిరస్కరించు గుణాన్ని ఆపాదించాడు. ఈ స్వయం ప్రతిపత్తి పై నుండి కల్పించబడినంత మాత్రమున దుష్టమానవుని స్థిరత్వం వలన భూమండలం నుండి దేవుని రాజ్యం కనుమరుగైనదని చెప్పలేము. పైగా వివిధ విధానాలలో దేవుని రాజ్యమే నెలకొంటూ ఉంటుంది. కాని ధర్మబద్ధతలు మాత్రం రెండు విధాలుగా గలవు. ఒకటి ఆకాశ దేవదూతల కొరకు ఏర్పాటు చేయబడిన విధి ధర్మం. అనగా వారు ఎన్నడు చెడు తలపెట్టరు. మరొకటి భూమండలంపై గల మానవుని కొరకు దేవుని విధి ధర్మం. పైగా వారికి చెడును ఎంచుకొను అభీష్టమును కూడ ఆకాశం నుండి కల్పించడం జరిగింది. కాని తమకు శక్తిని ప్రసాదించమని దేవున్ని కోరుకున్నప్పుడు అనగా క్షమాపణలు వేడుకున్నప్పుడు పరిశుద్ధాత్మ సహాయ సహకారాల వలన వారి బలహీనతలు దూరమవుతాయి. ఫలితముగా దేవుని ప్రవక్తలు, సందేశహరులు కాపాడబడినట్లుగా వారు కూడ చెడు తలపెట్టు తత్వం నుండి కాపాడబడుదురు. ఒకవేళ పాపాత్ములు కూడ క్షమాపణలు కోరుకున్నచో వారి పాపాల ప్రతిఫలాల నుండి అనగా శిక్షల నుండి వారు రక్షించబడుదురు. ఇదియే వారికి చేకూరునట్టి ప్రయోజనం. ఎందుకనగా వెలుగు రావడంతో అంధకారం దూరమవుతుంది. అదే విధముగా దేవుని నుండి శక్తిని వేడుకోని పాపాత్ములు అనగా, క్షమాపణలు యాచించనివారు వారి పాపాలకు శిక్షలను అనుభవించెదరు. చూడండి. నేడు ప్లేగు వ్యాధి కూడ శిక్ష రూపంలోనే భూమిపై ప్రభలుతుంది. దేవుని పట్ల దుష్టత్వం ప్రదర్శించువారు దానితో నాశనమగుదురు.

అలాంటప్పుడు దేవుని రాజ్యం భువిపై లేదని ఎందుకు భావిస్తున్నారు. ఒకవేళ భువిపై దేవుని రాజ్యమున్నచో మరి ప్రజలెందుకు నేరాలు చేస్తున్నారనే ఆలోచనలను మీ మదిలోకి రానివ్వకండి. ఎందుకనగా నేరాలు కూడ దైవవిధి, ధర్మ పరిధిలోనే ఉన్నవి. కావున ఒకవేళ ఎవరైన బాహ్యముగా ధర్మశాస్త్ర చట్టాల నుండి తమను తాము అతీతులుగా భావించుకున్నను చివరికి వారు సృష్టి ధర్మానికి అనగా దైవ విధి ధర్మానికి మాత్రం అతీతులు కారు. అలాంటప్పుడు నేరస్థుల తలలు దైవాధికార సంకెళ్ళ నుండి తప్పించుకున్నాయని ఎలా చెప్పగలరు? ఈ బ్రిటీష్ ఇండియా ప్రభుత్వంలో దొంగతనాలు, హత్యలు, వ్యభిచారం, మోసాలు, మొ॥లైన నేరాలు జరుగుతూనే ఉన్నాయి. అంతమాత్రమునే ఆంగ్లేయ ప్రభుత్వం ఈ దేశంలో లేదని మనం చెప్పగలమా? అధికారం ఉన్నది. కాని ప్రజల జీవితాన్ని విచ్చిన్నం చేసే కఠిన చట్టాలు అమలు చేయకూడదని ప్రభుత్వమే నిర్ణయించుకున్నది. అలా కాకుండ ప్రభుత్వమే నేరస్థులను ఒక కారాగారంలో బంధించి నేరాలను అరికట్టుటకు ప్రయత్నించినచో ఎంతో సులభముగా ఈ నేరాలన్నింటిని అరికట్టగలదు. లేదా కఠినంగా శిక్షించినచో ఈ నేరాలన్ని కనుమరుగై పోతాయి. కావున మీరు కూడ ఈ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. ఈ దేశంలో మద్యపానం ఏరులై పారుతుంది. వ్యభిచారము పెరుగుతుంది. హత్యలు, దొంగతనాలు పెరుగుచున్నవి. అంతమాత్రమున ఈ దేశంలో ఆంగ్లేయ ప్రభుత్వం లేదని అర్థం కాదుకదా? ఒక విధముగా చూసినచో సున్నితమైన ప్రభుత్వ చట్టాల వలనే నేరాలు అధికమవుచున్నాయి. అంతేగాని ఈ దేశంలో ఆంగ్లేయ ప్రభుత్వం లేనందున కాదు. చట్టాలను కఠినం చేసి, కఠినమైన శిక్షలు విధించి నేరాల సంఖ్యను తగ్గించే

పూర్తి అధికారం ప్రభుత్వానికి గలదు. కావున దేవుని రాజ్యానికి భిన్నముగా ఎలాంటి స్థాయి, సామర్థత లేని ఈ మానవ ప్రభుత్వానికే ఇన్ని అధికారాలున్నచో దేవుని ప్రభుత్వానికి మరి ఇంకెన్ని అధికారాలు, స్వయం ప్రతిపత్తులు ఉండునో ఒక్కసారి ఆలోచించండి. ఒకవేళ దేవుని చట్టాలు వెంటనే కఠినమైపోయి, వ్యభిచారులపై పిడుగులు పడి, దొంగతనాలు చేయు ప్రతి ఒక్కరి చేతులు కుళ్ళి, నశించి ఊడిపోయి, దుష్టులందరు, దైవాన్ని, అతని ధర్మాన్ని తిరస్కరించు వారందరు ప్లేగు వ్యాధికి గురై చనిపోయినచో ఈ ప్రపంచీకులందరు కేవలం ఒకే ఒక్క వారం పూర్తిగాక ముందే సత్పురుషులు, పుణ్యాత్ములుగా మారిపోవుదురు. కావున భూమండలం లో దేవుని రాజ్యం గలదు. కాని ఆకాశ ప్రభుత్వ చట్టాల వెసులుబాటు వలన నేరస్తులు త్వరగా పట్టుబడని విధముగా స్వతంత్రమును పొందియున్నారు. అవును శిక్షలు కూడ తప్పకుండా పడుతుంటాయి. భూకంపాలు వస్తుంటాయి. పిడుగులు పడుతుంటాయి. పర్వత ప్రాంతపు అడువులు మంటలు రాజేసినట్లు గా అగ్నికి ఆహుతిచెందగా కొన్ని వేల సంఖ్యల ప్రాణాలు గాలిలో కలసి పోతాయి. పడవలు మునిగి పోతుంటాయి. రైలు ప్రమాదాల వలన కొన్ని వందల మంది ప్రాణాలు కోల్పోవుదురు. తూఫాన్‌లు వచ్చును. భవనాలు కూలిపోవును. పాము కాటుకు బలి అగుదురు. అడవి మృగాలు చీల్చివేయును. అంటువ్యాధులు ప్రభలును. నేరస్థులను నామరూపాలు లేకుండా చేయుటకు దేవుని సృష్టి ధర్మం ఒకే ద్వారమును కాకుండా అనేక ద్వారములను తెరచి ఉంచినది. అయినా కూడ దేవుని రాజ్యం భువిపై లేదని ఎందుకు అంటూ ఉంటారు. నిజమేమనగా రాజ్యాధికారం ఉన్నది. నేరస్థులందరి చేతులకు బేడిలు వేసి, కాళ్ళకు గొలుసులు కట్టి ఉన్నవి.

కాని దేవుని విజ్ఞత వలన, అతడు చట్టాలను సులువుగా రూపొందించినందున ఆ గొలుసులు, ఆ భేడీలు ప్రస్తుతానికి ఎలాంటి ప్రభావాన్ని చూపలేవు. కాని మానవుడు తన పద్ధతిని మార్చుకోలేక పోయినచో అవి అతనిని నరకం వరకు తీసుకెళ్ళు తాయి. ఆ తరువాత నేరస్థుడిని మరణం, జీవనం లేనటువంటి శిక్షకు గురి చేస్తాయి. మొత్తానికి చట్టాలు రెండు రకాలు. ఒకటి దేవదూతలకు సంబంధించిన చట్టం, అనగా వారు కేవలం విధేయత కొరకే సృష్టించబడ్డారు. వారి విధేయత వారి జ్యోతి స్వభావములోని ఒక భాగం. వారు పాపములకు పాల్పడరు. అదే విధముగా వారు పుణ్యములో కూడ అభివృద్ధిని సాధించలేరు. రెండవ చట్టం మానవుల కొరకు రూపొందించ బడినది. అనగా మానవులు పాపాలకు పాల్పడుదురని వారి స్వభావంలోనే అంతర్లీనం చేయబడింది. కాని వీరు పుణ్యాలలో కూడ అభివృద్ధి చెందవచ్చును. ఈ రెండు స్వభావిక చట్టాలు మార్పులేనివి. అనగా దేవదూతలు మానవులుగా మారిపోనట్లుగా, మానవులు కూడ దేవదూతల వలే పరివర్తనం చెందలేరు. ఈ రెండు చట్టాలను మార్చలేరు. స్థిరమైనవి, నిశ్చలమైనవి. అందుకే ఆకాశ చట్టాలను భువిపై కొనసాగించలేము, అదే విధముగా భూమండల చట్టాలను ఆకాశ ప్రజల కొరకు కొనసాగించలేము. మానవ తప్పిదాలు ఒకవేళ క్షమాపణల ద్వారా అంతమైనచో మానవుడు దేవదూతల కన్న ఉన్నత స్థాయిని పొందగలడు. ఎందుకనగా దేవదూతలలో ప్రగతిని సాధించు లక్షణం లేదు. కాని మానవుడు ప్రాయశ్చిత్తం ద్వారా తమ పాపాల నుండి విముక్తిని పొందవచ్చును. అందుకే దేవుడు తన విజ్ఞతతో ప్రాయశ్చిత్తపు ద్వారమును కొందరి కొరకు తెరిచి ఉంచాడు. ఫలితముగా తమ పాపములను గుర్తెరిగినవారు

ప్రాయశ్చిత్తం చేసుకొని మోక్షంను పొందవచ్చును. ఈ చట్టాన్నే మానవుల కొరకు ఏర్పాటు చేయబడింది. దీనినే మానవ స్వభావం కోరుతుంది. మరిచి పోవడం, తప్పులు చేయడం వంటివి మానవ నైజం కాని దేవదూతల నైజం కాదు. అలాంటప్పుడు దేవదూతల కొరకు రూపొందించబడిన చట్టాన్ని మానవుల కొరకు ఏ విధముగా అమలు చేయడం జరగుతుంది. దేవునికి బలహీనతలను ఆపాదించడం పాపమవుతుంది. భూమండలంపై బహిర్గతమయ్యే ఇవన్నియు కేవలం చట్ట ఫలాలు మాత్రమే. నవూజు బిల్లాహ్ దేవుని చక్రవర్తిత్వం, అధికారం, గౌరవం ఆకాశం వరకే పరిమిత మవ్వడానికి అతడేమైన బలహీనుడా? లేకా భిన్న ఆధిపత్యమును భువిపై చెలాయించడానికి భూమండలానికి మరొక దేవుడు ఉన్నాడా? దేవుని రాజ్యం కేవలం ఆకాశంపైనే ఉంది, ఇప్పటి వరకు భూమిపై ఏర్పడలేదని వాదనలు చేయడం క్రైస్తవులకు సబబు కాదు. ఎందుకనగా వారి దృష్టిలో ఆకాశమనేది లేదు. కావున ఈ కోణంలో చూసినచో దేవుని రాజ్యం ఉన్న ఆకాశం ఇప్పుడు లేదు, పైగా భువిపై దేవుని రాజ్యం ఏర్పడ లేదు. అంటే మొత్తానికి దేవుని రాజ్యం ఎక్కడా లేదని అర్థం. వీటన్నింటిని ప్రక్కకు పెట్టినచో మనము స్వయముగా దేవుని రాజ్యమును ఈ భూమిపై మన కన్నులతోనే చూస్తున్నాము. అతని ధర్మము ప్రకారం మన ఆయుష్షు పూర్తి అవుతుంది. మన స్థితులు మారుతుంటాయి. వివిధ రకాల సౌఖ్యాలను, బాధలను మనము చూస్తూనే ఉన్నాము. దేవుని ఆజ్ఞతోనే వేల మంది మరణిస్తున్నారు, వేలాది మంది జన్మిస్తున్నారు. ప్రార్థనలు ఆమోదింపబడుతాయి. సంకేతాలు బహిర్గతమవుతాయి. అతని ఆదేశంతోనే భూమి వేల రకాల జీవరాశులను, ఫలాలను, పుష్పాలను బహిర్గత పరుస్తుంది.

ఇవన్నియు దేవుని రాజ్యం లేకుండానే జరుగుచున్నాయా?. అంతే గాకా ఆకాశపు వ్యవస్థ ఒకే విధముగా ఒకే కక్షలో కొనసాగుతుంది. వాటి కొనసాగింపులో స్పష్టముగా బహిర్గతమయ్యే మార్పులేవి మనకు కనిపించడం లేదు. కాని భూమి మాత్రం వేలాది మార్పులు చేర్పులకు, నూతనోత్సవంనకు సంకేతముగా నిలుస్తుంది. ప్రతి రోజు కోట్లాది మంది ఈ ప్రపంచము నుండి వెళ్ళిపోతున్నారు, కోట్లాది మంది పుట్టుకొస్తున్నారు. అన్ని రంగాలు, అన్ని కోణాల ద్వారా ఒక ఆధిపత్యం గల రూపకర్త ఉన్నాడనే భావనను కలిగి స్తున్నాయి. అయినా కూడ ఇప్పటి వరకు భూమిపై దేవుని రాజ్యం స్థిరపడలేదా? దేవుని రాజ్యం భూమిపై ఎందుకు స్థిరపడలేదనే విషయంపై ఇంజీల్ ఇప్పటి వరకు ఎలాంటి కారణంను చూపెట్టలేదు. బహుశా మసీహ్ తోటలో తనను కాపాడమని రాత్రియంతయు దుఆ చేయడం, ఆ దుఆ స్వీకరించబడడం, (ఇబ్రానియా, ఆధ్యాయం 5, సూక్తి 7లో తెల్పినట్లుగా) అయినా కూడ దేవుడు వారిని విడిపించుటలో సఫలీకృతుడు కాకపోవడం వంటివి ఆ కాలంలో దేవుని రాజ్యం భూమిపై స్థిరపడలేదని చెప్పుటకు క్రైస్తవులకు ఒక ఆధారముగా నిలబడవచ్చును. కాని మేము అంతకు మించిన ఎన్నో కష్టాలను చూశాము, వాటి నుండి మోక్షమును పొందాము. అలాంటప్పుడు మేము దేవుని రాజ్యంను ఎందుకు వ్యతిరేకించెదము? ఏ హత్య చేయకున్నను కేవలం ధార్మిక భేదాభిప్రాయల వలన నిందారోపణ చేయుచూ ఫిలాతూస్ న్యాయ స్థానములో యూదులందరు కలిసి చేసిన ఫిర్యాదు కన్నా మార్టన్ క్లార్క్‌ను నేను హత్య చేయించాలని చూసినట్లుగా అతడే స్వయముగా కేప్టన్ డగ్లస్ న్యాయస్థానములో నాపై వేసిన వ్యాజ్యము ఏమైన చిన్నదా? కాని దేవుడు ఆకాశాధికారి అయినట్లే ఈ భూమండలానికి

కూడ రాజుయే కావున ఇలాంటి సంఘటన ఒకటి జరుగబోతుందని నాకు ముందుగానే తెలియజేశాడు. అంతేగాకా అతడే స్వయముగా విముక్తిని కలిగించెదనని శుభవార్తను కూడ అందించాడు. ఆ శుభవార్తను ముందుగానే కొన్ని వందల మందికి వినిపించడం జరిగింది. అలా చివరికి నన్ను విముక్తిడిని చేశాడు. క్రైస్తవులు, ముసల్మానులు, హైందవులు కలసి కట్టుగా నాపై మోపిన ఈ వ్యాజ్యము నుండి భూమండలంపై గల దేవుని చక్రవర్తిత్వమే నన్ను కాపాడింది. ఇలా ఒక్కసారి కాకుండా అనేకసార్లు నేను ఈ భూమిపై దేవుని చక్రవర్తిత్వమును చూశాను. అలా దేవుని ఈ సూక్తిని నేను విశ్వసించవలసి వచ్చెను. لَهٗ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ (హదీద్57-:3) అనగా దేవుని చక్రవర్తిత్వం భూమిపై మరియు ఆకాశంపై కూడ గలదు. మరొక సూక్తి اِنَّمَآ اَمْرُهٗٓ اِذَآ اَرَادَ شَيْـًٔا اَنْ يَّقُوْلَ لَهٗ كُنْ فَيَكُوْنُ (యాసీన్-36:83) అనగా భూమ్యాకాశములన్నియు అతనికి విధేయతను చూపుతున్నాయి. అతడు ఒక పనిని చేయదలచినచో కమ్ము అని ఆదేశించును, అందుకు వెనువెంటనే ఆ పని తన పరిపూర్ణతకు చేరుకుంటుంది. మరల ఇట్లనెను.

وَاللّٰهُ غَالِبٌ عَلٰٓى اَمْرِهٖ وَلٰكِنَّ اَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُوْنَ (యూసుఫ్-12:22) అనగా దేవుడు తన సంకల్పంపై పూర్తి పట్టు గలవాడు. కాని అనేకులు దేవుని కోపాగ్నిని, బంధించు లక్షణాలను గూర్చి ఎమరుపాటులో ఉన్నారు. మొత్తానికి దేవుని క్షమాగుణం నుండి ప్రజలను నిరాశ పరుచునట్లుగా ఇంజీల్ ప్రార్థనలు గలవు. అవి దేవుని సంరక్షణ, శ్రేయస్సు, ప్రళయ దినపు తీర్మాణంల నుండి క్రైస్తవులను అజ్ఞానంలో పడ వేస్తున్నవి. పైగా భూమిపై అతని సామ్రాజ్యం ఏర్పడనంత వరకు అతడు భూవాసులకు సహాయంను అందించలేని నిస్సహాయుడిని చేస్తుంది. కాని అందుకు భిన్నముగా

పవిత్ర ఖుర్ఆన్ ముసల్మానులకు నేర్పించిన దుఆల ద్వారా దేవుడు భూమండలంలో తిష్ట వేసిన చక్రవర్తుల వలే అప్రయోజకుడిగా లేడని, అతని కరుణా, దయా, సంరక్షణ, ఇతర లక్షణాలన్ని భూమండలంపై ప్రయోజనంను చేకూర్చుతున్నాయని, అతడు తన దాసులకు సహాయము నందించు శక్తిని కల్గి ఉన్నాడని, నేరస్తులను తన ఆగ్రహంతో శిక్షించునని తెలుస్తున్నది. ఆ దుఆ ఈ విధముగా గలదు.

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ - الرَّحْمٰنِ الرَّحِيْمِ - مٰلِكِ يَوْمِ الدِّيْنِ -
إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ - اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ -
صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ - آمين

(ఫాతిహా-1:2-7) అనువాదం: ఆ సకల లోకాల సంరక్షకుడికే సకల సంకీర్తనములు. అనగా అతని చక్రవర్తిత్వంలో ఎలాంటి లోపం లేదు. ఈ రోజు లభించలేనిది రేపు లభించునని అతని విశిష్టతలు తెలుసుకోవడానికి ఏదేని ప్రత్యేక స్థితికోసం ఎదురు చూడవలసిన అవసరం లేదు. అతని చక్రవర్తిత్వపు మాధుర్యంలో ఏదియును వ్యర్థం కాదు. సకల లోకాలను పోషిస్తున్నాడు. ఆచరణలు లేకున్న ను అతడు అనుగ్రహించును. ఆచరణలున్నచో ప్రతిఫలంగా అనుగ్రహించును. నిర్ణీత సమయంలో ప్రళయ దినమును ఏర్పర్చును. అతనినే మేము ఆరాధించెదము. అతని నుండే మేము సహాయమును కోరెదము. నీ అనుగ్రహపు మార్గాలన్నింటిని చూపుము, నీ కోపానికి కారణమయ్యే మరియు మార్గభ్రష్టులయ్యే మార్గాల నుండి దూరముగా ఉంచుము.

ఫాతిహా అధ్యాయము అనబడే ఈ దుఆ ఇంజీల్ దుఆ కన్న పూర్తి భిన్నముగా ఎంతో పవిత్రముగా నున్నది. ఎందుకనగా

భూమండలంపై ప్రస్తుతం దేవుని సామ్రాజ్యం లేదని ఇంజీల్ బోధిస్తుంది. కావున ఇంజీల్ ప్రకారముగా దేవుని కరుణా, దయా, పోషణ, మంచి చెడుల ప్రతిఫలమునిచ్చు ఏ లక్షణము భూ మండలంపై పని చేయడం లేదు. అందుకు కారణం ఇప్పటి వరకు భూమండలంపై దేవుని సామ్రాజ్యం రాలేదు. కాని ఫాతిహా అధ్యాయము ప్రకారము భూమండలంపై దేవుని సామ్రాజ్యమే కొనసాగుతుందని తెలుస్తుంది. అందుకే ఫాతిహా అధ్యాయములో చక్రవర్తిత్వపు విశిష్టతలన్ని తెలుపబడినవి. ప్రజల శ్రేయస్సుకు పాటుపడే ఒక చక్రవర్తిలో ఈ విశిష్టతలన్నియు ఉండవలెనని తెలుస్తుంది. కావున ఫాతిహా అధ్యాయములో ఉన్నటు వంటి సకల లోకాల సంరక్షకుడు అనే పదం ఈ విశిష్టతకు ఊతమిస్తుంది. ఒక చక్రవర్తికి ఉండవలసిన మరొక విశిష్ట లక్షణమేమనగా తమ రాజ్య ప్రజలకు, వాస్తవ్యులకు కావలసిన నిత్యవసర వస్తువులను ఎలాంటి ప్రతి ఫలం ఆశించకుండా వారికి అందుబాటులోకి తీసుకురావలెను. కావున "**అర్రహ్మాన్**" అనే పదం ఈ విశిష్టతను సూచిస్తుంది. ఒక చక్రవర్తికి ఉండవలసిన మూడవ విశిష్ట లక్షణమే మనగా, తమ రాజ్య ప్రజలు తమ ప్రయత్నాల ద్వారా ఏదేని కార్యక్రమమును పూర్తి చేయకున్నచో, దానిని పూర్తి చేయుటకు తగిన సహాయ సహకారములను అందించవలెను. కావున "**అర్రహీం**" అనే పదం ఈ విశిష్టతను సూచిస్తుంది. ఒక చక్రవర్తికి ఉండవలసిన నాలుగో విశిష్టత ఏమిటనగా, ప్రతిఫలమిచ్చుటకు, శిక్షించుటకు పూర్తి అధికారం కలిగి ఉండవలెను. తద్వారా అతని రాజకీయ పరిపాలన వ్యవహారములో ఎలాంటి ఆటంకములు ఏర్పడకుండా ఉండును. కావున "**మాలికి యౌమిద్దీన్**" అనే పదం ఈ విశిష్టతను సూచిస్తుంది. సారంశమేమనగా పైన తెలుపబడిన

అధ్యాయములో ఒక చక్రవర్తికి ఉండవలసిన విశిష్టతలన్నింటిని ప్రస్తావించడం జరిగింది. వీటి ద్వారా తెలియునదేమనగా ఈ భూమండలంపై దేవుని సామ్రాజ్యం మరియు అతని చక్రవర్తిత్వం గలదు. కావున ఈ భూమండలంపై అతని రబూబియ్యత్ (సంరక్షణ) గలదు, అతని రహ్మానియ్యత్ (కరుణా) గలదు, అతని రహీమియ్యత్ (దయాగుణం) గలదు. ఆపై సహాయము నందించు పరంపర కూడ గలదు. శిక్షించు పరంపర కూడ గలదు. ఒక విధముగా చెప్పదలచినచో ఒక చక్రవర్తికి ఉండవలసిన లక్షణాలన్ని ఈ భూమండలంపై గల దేవుని పరిపాలనలో మనకు కనిపిస్తు న్నాయి. ఒక్క అణువు కూడ అతని ఆదేశం నుండి బయట పడలేదు. అన్ని ఫలాలు అతని ఆధినములోనే ఉన్నవి. అన్ని కరుణలు అతని చేతులలోనే ఉన్నవి. కాని ఇంజీల్ మాత్రం దేవుని సామ్రాజ్యం ఇంకా మీలో స్థిరపడలేదని, దాని రాకకోసం మీరు దేవున్ని యాచించండి, ఫలితముగా అది వస్తుందని నేర్పుతుంది. అనగా ఇప్పటి వరకు వారి దేవుడు ఈ భూమండలానికి యజమాని కాదు, అతని రాజ్యం ఇక్కడ లేదు. అలాంటప్పుడు అలాంటి దేవుడి నుండి ఏమి ఆశించగలము. కావున వినండి, అర్థం చేసుకోండి, ఇందులోనే గొప్ప విజ్ఞత గలదు. ఏ విధముగానైతే ఆకాశపు అణువణువు దేవుని చక్రవర్తిత్వంలో ఉన్నదో అదే విధముగా భూమండలపు అణువణువు కూడ దేవుని ఆధీనంలో, అధికారంలోనే ఉన్నది. ఏ విధముగానైతే ఆకాశంలో అతనికి వైభవోపేతమైన ప్రాచుర్యమున్నదో అదే విధముగా ఈ భూమండలం పై కూడ అతనికి వైభవోపేతమైన ప్రాచుర్యమున్నది. ఆకాశపు ప్రాచుర్యం ఒక విశ్వాస ప్రక్రియ. సాధారణ వ్యక్తులెవరు ఆకాశము పైకి వెళ్ళి ఆ ప్రాచుర్యమును వీక్షించలేదు. కాని భూమండలంపై

దేవుని చక్రవర్తిత్వపు ప్రాచుర్యం గలదు. అది ప్రతి ఒక్కరి కన్నులకు ఎంతో స్పష్టముగా కనుపించును. ۞[10] ప్రతి వ్యక్తి అతడు ఎంతటి ధనవంతుడైనను, అతని అభిరుచికి భిన్నముగా మరణపు ద్రావణం ను త్రాగవలసినదే. ఆ చక్రవర్తి యొక్క స్వచ్ఛమైన ఆదేశపు ప్రభావం ఈ భూమిపై ఏ విధముగా ఉందో చూడండి. అతని ఆదేశము వచ్చినచో ఏ ఒక్కరు కూడ తమ మరణంను ఒక్క క్షణం పాటు పొడిగించుకోలేరు. అతి భయంకరమైన, చికిత్సరహిత రోగాలు వచ్చినచో వాటికి ఏ వైద్యుడు కూడ చికిత్స చేయలేడు. కావున రద్దు కాబడునటు వంటి అతని ఆదేశమును చూసి దేవుని చక్రవర్తిత్వపు ప్రభావం ఈ భూమండలంపై ఎంతగా ఉన్నదో ఒక్కసారి ఆలోచించండి. అలాంటప్పుడు దేవుని రాజ్యం ఈ భూమండలంపై ప్రస్తుతం లేదని, రాబోవు కాలంలో ఏర్పడునని ఎందుకు ప్రచారం చేస్తున్నారు? ఈ కాలంలో దేవుని ఆకాశ ఆదేశం ప్లేగ్ వ్యాధి రూపంలో ఏ విధముగా భూమండలంను కుదుపుతుందో చూడండి. ఫలితముగా ఇది అతని మసీహ్ మౌవూద్ కొరకు ఒక సంకేతముగా నిలుచును. అతని ఆకాంక్ష లేకుండానే దీనిని దూరం చేయువారెవరు. అయినా కూడ భూమిపై అతని రాజ్య స్థాపన జరగలేదని ఎందుకంటున్నారు. అవును! ఒక దుష్టుడు

---

۞(10) وَحَمَلَهَا الْاِنْسَانُ (అహ్జాబ్-33:73) (అనగా కాని మానవుడు దానిని మోసికొనెను.) అను సూక్తి కూడ మానవులే నిజమైన దేవుని విధేయులని సూచిస్తుంది. అంతేగాకా వారు తమ విధేయతను అభిమానం, అభీష్టమనే స్థాయి వరకు తీసుకెళ్ళుతారని, వేల సమస్యలను తలపై వేసుకొని దేవుని చక్రవర్తిత్వంను భూమండలంపై నిరూపిస్తారని తెలుపు తుంది. కావున మనోవేదన వలన లభించిన ఈ విధేయతను దేవదూతలు ఏ విధముగా ప్రదర్శించగలరు. ***సమాప్తం.***

ఈ భూమండలంపై ఒక ఖైది వలే జీవితంను గడుపును. పైగా ఎన్నడు మరణించ కూడదని కోరుకుంటాడు. కాని దేవుని స్వచ్ఛమైన సార్వభౌమాధికారం అతనిని నాశనం చేస్తుంది. అలా చివరికి ఆ దుష్టుడు మృత్యువు ఒడిలోకి చేరుకొనును. అయినా కూడ భూమిపై దేవుని చక్రవర్తిత్వం లేదని ఎలా చెప్పగలరు. చూడండి! దేవుని ఆదేశంతో ఈ భూమిపై ఒక్క క్షణంలోనే కొన్ని కోట్ల మంది మానవులు మరణిస్తారు, అతని కోరిక మేరకు కోట్లాది మంది జన్మిస్తుంటారు. కోట్లాది మంది అతని అభీష్టము మేరకు పేదరికం నుండి సంపన్నులుగా, సంపన్నుల నుండి పేదవారిగా పరివర్తనం చెందుతుంటారు. అయినా కూడ భూమిపై దేవుని చక్రవర్తిత్వం లేదని ఎలా చెప్పగలరు. ఆకాశంలో కేవలం దేవదూతలే ఉంటారు. కాని భూమండలంపై మానవులతో పాటు దేవునికి సహాయకులుగా, అతని సామ్రాజ్యంనకు సేవకులుగా మరియు మానవుల వివిధ రకాల పనులను కాపాడుటకు దేవదూతలుంటారు. వారు ఎల్లప్పుడు దేవుని పట్ల విధేయతను కనబరుస్తారు. వారి నివేదికలను ఎప్పటికప్పుడు దేవునికి పంపుతుంటారు. అయినా కూడ ఈ భూమండలంపై దేవుని చక్రవర్తిత్వం లేదని ఎలా చెప్పగలరు. వాస్తవానికి దేవుడు ఈ భూమండలపు చక్రవర్తిత్వంతోనే ఎక్కువగా గుర్తింపబడుతాడు. ఎందుకనగా ఆకాశపు రహస్యాలన్నియు గోప్యముగా ఉంటాయి, ఎవరికి కనిపించవని ప్రతి ఒక్కరు భావిస్తుంటారు. ఒక రకముగా చెప్పదలచినచో నేటి కాలపు క్రైస్తవులు, వారి తత్వవేత్తలు ఇంజీల్‌లో పేర్కొన్నట్లుగా దేవుని సామ్రాజ్యానికి పునాదులైన ఆకాశమనేది ఏది లేదు అనే ఒక అభిప్రాయాన్ని కల్గియున్నారు. కాని ప్రస్తుతం భూగోళపు ఒక భాగం మన కాళ్ల క్రింద గలదు. కొన్ని వేల విధి ధర్మపు సంకేతాలు

దానిపై బహిర్గత మవుచున్నాయి. ఈ మార్పులు చేర్పులు, దుర్ఘటనలు, వినాశాలు అన్ని ఏదో ఒక ప్రత్యేక యజమాని ఆదేశము తోనే జరుగుతున్నాయని అర్థం చేసుకోవచ్చును. అయినా కూడ ఈ భూమండలంపై దేవుని చక్రవర్తిత్వం లేదని ఎలా చెప్పగలరు?. నేటి కాలంలో ఒకవైపు క్రైస్తవులు ఆకాశాన్ని తిరస్కరిస్తున్న సమయంలో ఇలాంటి బోధనలు బోధించడం సరి కాదు. ఎందుకనగా దేవుని చక్రవర్తిత్వం భూమిపై లేదనే దుఆను ఇంజీల్‌లో స్వీకరించబడింది. పైగా మరోవైపు క్రైస్తవ పరిశోధకులు అనగా నూతన పరిశోధనల ద్వారా ఆకాశమనేది ఏదియు లేదని, అలాంటి ఉనికి కనిపించడం లేదని తేల్చిన విషయాన్ని స్వీకరించారు. కావున దీని ద్వార తెలియునదేమనగా వారి ప్రకారం దేవుని సామ్రాజ్యం ఆకాశంలో లేదు, భూమిపై లేదు. ఆకాశాన్ని క్రైస్తవులు తిరస్కరించారు. భూమండలపు సామ్రాజ్యం గూర్చి ఇంజీల్ చేతులెత్తేసింది. వారు తెల్పిన దాని ప్రకారం ప్రస్తుతం దేవుని వద్ద ఆకాశపు సామాజ్ర్యం గాని, భూమండలపు సామ్రాజ్యం గాని ఏవియును లేవు. కాని మన ఆరాధ్యదేవుడు మాత్రం ఫాతిహా ఆధ్యాయములో ఆకాశపు పేరును గాని, భూమండలపు పేరును గాని ఎక్కడా ప్రస్తావించలేదు. పైగా అతడు సకల లోకాల సంరక్షకుడిని అనే వాస్తవాన్ని మనకు అందించాడు. అనగా ప్రాణులున్నంత వరకు, ۞(11) జనులు ఉన్నంత వరకు. భౌతిక కాయాన్ని, ఆత్మలన్నింటిని సృష్టించువాడు, సంరక్షించువాడు

۞(11) رَبُّ الْعٰلَمِيْنَ (రబ్బుల్ ఆలమీన్) అను పదము ఎంతటి గొప్ప పరిపూర్ణతను కల్గియుందో చూడండి. ఒకవేళ ఇతర గ్రహాలలో కూడ ప్రాణులున్నాయని నిరూపించ బడినచో ఆ ప్రాణులుకూడ ఈ పద భావంలోనే పరిగణించబడుతాయి. ***సమాప్తం.***

అల్లాహ్‌యే. అనుక్షణం వాటిని పోషిస్తుంటాడు. వాటికి అనుగుణముగా పరిస్థితులను ఏర్పరుస్తాడు. లోకాలన్నింటిపై అతని సంరక్షణ, కరుణా, దయా, ప్రతిఫల మరియు శిక్ష తత్వాలు ఒకే విధముగా కొనసాగుతాయి. మరల గుర్తుంచుకోవలసిన విషయమే మనగా, ఫాతిహా ఆధ్యాయములో మాలికి యౌమిద్దీన్ అని తెల్పిన పదం యొక్క అర్థం కేవలం ప్రళయ దినమున తీర్మానం చేయుట మని కాదు. ప్రళయ దినమనేది వాస్తవానికి ప్రపంచం అంతరించిన సమయంలో వెలుగులోకి వచ్చేదే అయినప్పటికి దాని ఒక రకం ఈ భూమండలం నుండే ప్రారంభమగుననే విషయాన్ని పవిత్ర ఖుర్ఆన్ పదే పదే స్పష్టముగా తెల్పుతుంది. ఈ విషయం వైపే يَجْعَلْ لَّكُمْ فُرْقَانًا (అల్ అన్‌ఫాల్-8:30) (అనగా అతడు మీ కొరకు ఒక గొప్ప స్థానమును సృష్టించును.) అను సూక్తి సూచిస్తుంది.

ఇప్పుడు మీరు తెలుసుకోవలసిన మరొక విషయమేమనగా, ఇంజీల్ ప్రార్థనలో ప్రతి రోజు రొట్టెలు అనుగ్రహించుమని యాచించడం జరిగింది. అనగా “మాకు అనుగ్రహించవలసిన రొట్టెలలో నుండి నేటి రొట్టెలను నేడు అనుగ్రహించుము” అని ప్రార్థనలో గలదు. కాని ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయమేమనగా, నేటి వరకు భూమండలంపై దేవుని రాజ్యం ఏర్పడనప్పుడు దేవుడు ఎందుకని వారికి రొట్టెలను అనుగ్రహించును. వారి ప్రకారంగా ఇప్పటి వరకు దేవుని ఆదేశం లేకుండానే పంటలు, పండ్ల తోటలన్నియు వాటికి అవియే పండినాయి. వర్షం కూడ స్వయముగా కురుస్తుంది. అలా అన్ని స్వయముగా నడుచుకుంటున్నప్పుడు మరి వారికి రొట్టెలు ఇచ్చు అధికారం అతనికి ఎక్కడుంది? భూమండలంపై దేవుని రాజ్యం ఏర్పడినప్పుడే దేవుడిని రొట్టెలు అనుగ్రహించమని యాచించవలెను. ప్రస్తుతం దేవుడు భూమండల

పు విషయాలలో ఎలాంటి ప్రమేయంను కల్గి లేదు. ఈ భూమండలం ను తన ఆధీనంలోకి తెచ్చుకున్న తరువాతయే ఎవరికైన రొట్టెలను ప్రసాదించగలడు. కావున ప్రస్తుతం అతనిని రొట్టెలు అడుగడం కూడ న్యాయబద్ధత కాదు. ఆ తరువాత "మేము మా ఋణగ్రస్తులకు ఋణమాఫి చేసినట్లుగా నీవు కూడ మాకు ఋణమాఫి చేయుము" అను వాక్యము గలదు. ఇలాంటి పరిస్థితులలో ఈ వాక్యము కూడ సరికాదనిపిస్తుంది. ఎందుకనగా భూమండలపు అధికారము నేటికి అతనికి లభించలేదు. క్రైస్తవులు అతని చేతుల మీదుగా పొంది ఆరగించినదేమియు లేదు. అలాంటప్పుడు ఋణమాఫి ఎక్కడిది? ఇలాంటి నిస్సహాయ దేవుని నుండి ఋణమాఫి చేయించుకోవలసిన అవసరం ఏమియు లేదు, అతనికి భయపడవలసిన అవసరం ఏ మాత్రం లేదు. ఎందుకనగా ఈ భూమండలంపై అతనికి ఎలాంటి అధికారమే లేదు. అలాంటి సమయంలో అతడు తన అధికార ప్రభావమునెలా ప్రదర్శించగలడు? ఒక నేరస్తుడిని శిక్షించే అధికారం అతనికెక్కడి నుండి లభిస్తుంది. లేదా మూసా (అ) కాలము నాటి అవిధేయత గల జాతి వలే వీరిని ప్లేగు వ్యాధి ద్వారా నాశనం చేయు అధికారం అతనికి ఎక్కడుంది? లేదా లూత్ జాతి వలే వీరిపై రాళ్ళ వర్షం కురిపించు అధికారం అతనికి ఎక్కడుంది? లేదా భూకంపాలు, పిడుగులు లేక మరే ఇతర శిక్షల ద్వారనైన అవిధేయులను శిక్షించు అధికారం అతనికి ఎక్కడుంది?. ఎందుకనగా నేటి వరకు ఈ భూమండలంపై దేవుని రాజ్యం ఏర్పడ లేదు కదా! క్రైస్తవుల దేవుడు బలహీనుడు కావున అతని కుమారుడు కూడ బలహీనుడిగా ఉండెను. తండ్రి నిస్సహాయుడై నట్లుగానే కుమారుడు కూడ నిస్సహాయుడిగానే నిలిచెను. కావున మాకు ఋణమాఫి చేయుమని అతనికి ప్రార్థనలు చేయడం

నిష్ప్రయోజనమే అవుతుంది. అతడు ఋణమాఫి చేయుటకు ఋణాన్ని ఎప్పుడు ఇచ్చాడు? నేటి వరకు ఈ భూమండలంపై అతని రాజ్యమే ఏర్పడ లేదు. కావున భూమండలంపై అతనికి అధికారం లేనప్పుడు అతని ఆదేశ రహితముగానే ఈ భూమండలం పై పచ్చదనం చిగురించెను. భూమండలంపై గల ప్రతి వస్తువు అతని ఆదేశంతో గాకుండ స్వయముగా వెలుగులోకి వస్తున్నాయి. ఎందుకనగా అతని ఆదేశం భూమండలంపై ఆచరణయోగ్యం కాదు. భూమండలానికి అతడు పాలకుడు, చక్రవర్తి కానప్పుడు భూమండలంలో ఉన్నటువంటి ఈ విలాసాలన్ని అతని ఆదేశంతో ఏర్పడలేదు. అలాంటప్పుడు అతనికి శిక్షించు అధికారం, హక్కు రెండు లభించవు. కావున ఇలాంటి నిస్సహాయుడిని తమ దైవంగా భావించి, అతనితో ఈ భూమండల పనులు చేయించుకోవాలను కోవడం మూర్ఖత్వమే అవుతుంది. ఎందుకనగా నేటి వరకు అతనికి భూమండలంపై అధికారమే లేదు. కాని ఫాతిహా అధ్యాయము మాత్రం ఇతర లోకాలపై అధికారం ఉన్నట్లుగానే ఈ భూమండలం పై కూడ అన్ని వేళల దేవునికి అధికారం ఉందని బోధిస్తుంది. ప్రపంచములోని మరే ఇతర గ్రంథాలలో లేని విధముగా ఫాతిహా అధ్యాయపు ప్రారంభములోనే దేవుని సంపూర్ణ విశిష్ట గుణాలను గూర్చి ప్రస్తావించడం జరిగింది. ఆ విశిష్ట గుణగణాలను గూర్చి అల్లాహ్ తఆలాయే ఈ విధముగా అనగా అతడు దయామయుడు, కారుణ్యమూర్తి, ప్రళయదినపు అధికారి అని తెల్పుచున్నాడు. ఆపై అతనినే ప్రార్థించమని బోధించడం జరిగింది. కావున అతనినే ప్రార్థిస్తున్నాము. పైగా అతడు మసీహ్ వలే కేవలం ప్రతి రోజు రొట్టెలు అనుగ్రహించమనే దుఆను నేర్పించకుండా మానవ స్వభావానికి ఆది నుండి అనుగ్రహించిన శక్తి సామర్థ్యాల దప్పికను

తీర్చునట్టి దుఆను నేర్పించడం జరిగింది. అనగా

اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ۙ- صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ

(ఫాతిహా-1:6,7) అనగా ఓ సంపూర్ణ విశిష్ట గుణగణాలు కల్గిన యజమాని! అణువణువు నీ నుండి పోషణ పొందునట్టి అనుగ్రహం గలవాడా! నీ దయ, కారుణ్యం, ప్రళయదిన అధికారం వంటి శక్తులు మాలో ఈ విధమైన కోరికలను రేకెత్తిస్తున్నాయి. అనగా గతించిన సన్మార్గులకు మమ్ములను వారసులుగా నిలుపుము, వారికి అనుగ్రహించిన ప్రతి అనుగ్రహమును మాకు కూడ అనుగ్రహించుము, నీ పట్ల అవిధేయత ప్రదర్శించి నీ కోపాగ్రహానికి బలికాకుండా ఉండునట్లు చూడుము, నీ సహాయ సహకారములను పొందని దురదృష్టవంతులు మార్గభ్రష్టులైనట్లుగా మమ్ములను మార్గభ్రష్టులుగా కాకుండ చూడుము. **ఆమీన్.**

ఇప్పుడు ఈ పరిశోధనల తరువాత ఇంజీల్ ప్రార్థనలో మరియు పవిత్ర ఖుర్ఆన్ ప్రార్థనలో ఉన్నటువంటి వ్యత్యాసం కూడ బహిర్గతమైనది. ఒక విధముగా చూసినచో దేవుని అధికారం వస్తుందనే వాగ్దానంతో ఇంజీల్ నిండియున్నది. కాని పవిత్ర ఖుర్ఆన్ మాత్రం దేవుని అధికారం మీపై కొనసాగుతుందని, కర్మల పరంగా మిమ్ము అనుగ్రహిస్తుందని కూడ తెల్పుతుంది. మొత్తానికి ఇంజీల్‌లో కేవలం వాగ్దానం మాత్రమే గలదు. కాని పవిత్ర ఖుర్ఆన్ మాత్రం కేవలం వాగ్దానాన్ని మాత్రమే గాకుండా కొనసాగుతున్న అధికారమును, దాని అనుగ్రహాలను కూడ చూపిస్తుంది. అంతేగాకా ఈ ప్రాపంచిక జీవితంలోనే సన్మార్గులకు రక్షకుడు, సౌభాగ్యశీలుడైన అల్లాహ్‌ను ఈ పవిత్ర ఖుర్ఆన్ పరిచయం చేస్తున్నందున వీటి ద్వారా పవిత్ర ఖుర్ఆన్ యొక్క విశిష్టత బహిర్గతమవుచున్నది. ఏ ఆత్మ కూడ అతని అనుగ్రహ

రహితముగా లేదు. ప్రతి ఆత్మ దాని సామార్థ్యమునకు అనుగుణము గా దేవుని దయా, కరుణా, పోషణ వంటి లక్షణాల నుండి అనుగ్రహాలను పొందుతున్నది. కాని ఇంజీల్ మాత్రం ఇంకా ఈ భూమండలంపై అధికారం చేజిక్కించుకోకుండా కేవలం వాగ్దానం చేసినట్టి దేవున్ని పరిచయం చేస్తుంది. కావున విజ్ఞత ఎవరిని అనుసరించాలని చూస్తుందో ఒక్కసారి ఆలోచించండి.

مرید پیر مغانم زمن مرنج اے شیخ
چراکہ وعدہ تو کر دی واو بجا آورد

(అనగా నేను నా సంపూర్ణ గురువుకు అభిమానిని. కావున ఓ సంబోధకుడా! నన్ను కోపగించుకోకుము. ఎందుకనగా మీరు చేసిన వాగ్దానమును వారు నెరవేర్చిరి.)

ఇంజీల్‌లో శాంతి స్వభావులను, రిక్త స్వభావులను, దీన స్వభావులతో పాటు పీడితులను, నిస్సహాయులను గూర్చి పొగడడం జరిగింది. కాని పవిత్ర ఖుర్‌ఆన్ మాత్రం మీరు ఎల్లప్పుడు దీనులుగా నే ఉండమని, చెడుకు వ్యతిరేకముగా పోరాటం చేయకుము అని బోధించ లేదు. పైగా మీరు శాంతి స్వభావమును, రిక్త తత్వమును, దీనత్వమును ప్రదర్శించుట మంచిదే కాని, వాటిని అసందర్భ సమయంలో ప్రదర్శించడం చెడు అని బోధిస్తుంది. కావున మీరు సమయస్ఫూర్తికి అనుగుణముగా సత్కార్యములు చేయుము. ఎందుకనగా సమయస్ఫూర్తికి భిన్నముగా చేయునట్టి సత్కార్యము దుష్ఫలితాలనిచ్చును. వర్షం ఎంతో విలువైనది. నిత్యవసరమైనది. కాని ఆ వర్షమే కాలాతీతముగా వర్షించినచో నష్టము వాటిల్లడంను మీరు చూస్తూనే ఉంటారు. అదే విధముగా చల్లదనమునిచ్చు ఆహారము, వెచ్చదనమునిచ్చు ఆహారములలో ఏదో ఒక

ఆహారమును చాలా కాలం పాటు తీసుకున్నచో మీ ఆరోగ్యం కూడ పాడవడాన్ని మీరు చూస్తూనే ఉంటారు. కాలానుగుణముగా, సందర్భానుసారంగా అన్నపానీయాలలో మార్పులు తీసుకున్నప్పుడే మీరు ఆరోగ్య వంతులుగా ఉంటారు. కావున ఔచిత్యపు సమయము కల్గిన మీ ఈ కఠినత్వము, మృదు స్వభావం, క్షమాగుణం, ప్రతీకారం, ఆశీర్వదించడం, శపించడం మొదలగు ఇతర గుణ గణాలన్ని కూడ ఇలాంటి మార్పులనే ఆశిస్తుంటాయి. ఉన్నత స్థాయికి చెందిన శాంతి స్వభావమును, సభ్యతను కల్గి యుండుము. కాని సమయస్ఫూర్తిని అనుసరించే గాని అసందర్భముగా కాకూడదు. కావున ఇక్కడ గుర్తుంచుకోవలసిన మరొక విషయమేమనగా, నిష్కల్మషమైన, స్వచ్ఛమైన సభ్యత సంస్కారములు ఆకాశం నుండి పరిశుద్ధ ఆత్మ సహాయంతోనే లభించును. కావున ఆకాశం నుండి మీకు ఆ సభ్యత సంస్కారములు లభించనిదే మీరు కేవలం మీ ప్రయత్నాల ద్వారా ఆ సభ్యత సంస్కారములను ఏ మాత్రం పొందలేరు. కావున ఆకాశం నుండి పరిశుద్ధ ఆత్మతో ఆ సభ్యత సంస్కారములను పొందకుండా తమ గుణగణాలను గూర్చి గొప్పగా చెప్పుకునేవారు అసత్యులనబడుదురు. వారు సేవించు నీటి క్రింద చాలా బురద మరియు అధికశాతం పేడ మాత్రమే ఉన్నది. మనస్సు ఉద్రేకం చెందినప్పుడు అవి బహిర్గతమవుతాయి. కావున మీరు ఎల్లప్పుడు దేవుని సహాయ సహకారములను యాచించుము. ఫలితముగా ఆ బురద మరియు పేడ నుండి ముక్తిని పొందెదరు. ఆపై పరిశుద్ధాత్మ మీలో స్వచ్ఛమైన పవిత్రతను, రమణీయతను జనింపజేయును. మరల గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, పవిత్రమైన సద్గుణాలు సన్మార్గుల మహత్యములు. వాటిలో మరెవరి ప్రమేయం ఉండదు. ఎందుకనగా దైవంలో లీనం కానివారు పై

నుండి శక్తులను పొందలేరు. అందుకే పవిత్రమైన సద్గుణాలను పొందడం వారికి సాధ్యం కాదు. కావున మీరు మీ దేవునితో స్పష్టమైన అనుబంధమును కొనసాగించుము. హేళన చేయడం, కుట్రలు చేయడం, దూషించడం, అబద్దము పలుకడం, చెడు తలపెట్టడం, చెడుదృష్టితో చూడడం, చెడుగా ఆలోచించడం, ప్రపంచానికే అంకితమై పోవడం, గర్వము, అహం, స్వార్థం, పోకిరి తనం, వితండవాదం మొదలగు వాటినన్నింటిని వదిలి వేయవలెను. ఆ తరువాత ఇవన్నియు మీకు ఆకాశం నుండి లభించును. మిమ్ము ఆకాశం వైపు ఆకర్షించునట్టి ఆ శక్తి మీలో మమేకం కానంత వరకు ఇది సాధ్యం కాదు. జీవితాన్ని అనగ్రహించునట్టి ఆ పరిశుద్దాత్మ మీలో ప్రవేశించనంత వరకు మీరు బలహీనముగా, అంధకారంలోనే పడి యుండెదరు. ఒక విధముగా చెప్పదలచినచో మీరు ప్రాణం లేని జీవశ్చవములు. ఇలాంటి స్థితిలో మీరు ఏ సమస్యను ఎదుర్కొన లేరు, సిరిసంపదలు సమకూరిన సమయంలో గర్వము, అహంను వీడనాడలేరు. అన్ని రకాలుగా మీరు షైతాన్ మరియు మనోవాంచలకు బానిసలగుదురు. కావున దేవుని హస్తముల ద్వారా ప్రత్యేకమైన పరిశుద్ధాత్మ క్రింది దిగి, సత్కార్యము, సన్మార్గముల వైపు మీ శ్రద్దను మరలించడమే ఇందుకు సరైన చికిత్స. మీరు భూదేవి పుత్రులుగా గాకుండా ఆకాశ పుత్రులుగా నిలువుము. అంధకారమును ప్రేమించు వారిగా కాకుండా అద్వితీయ తేజస్సుకు వారసులు కండి. ఫలితముగా షైతాను మార్గముల నుండి రక్షింపబడుదురు. ఎందుకనగా షైతాన్ కు చీకటియే కావలెను. పగలుతో పనిలేదు. ఎందుకనగా అది రాత్రివేళలో దొంగతానికి పాల్పడు దొంగలాంటిది.

ఫాతిహా అధ్యాయము కేవలం అద్భుత బోధనలతోనే

గాకుండా ఒక గొప్ప భవిష్యవాణిని కూడ కల్గియుంది. అదేమన గా, అల్లాహ్ తఆలా తన దయాగుణం, కారుణ్యమూర్తి, సంరక్షకుడు మరియు ప్రళయ దినపు యజమాని అనగా పుణ్య, పాపముల ప్రతిఫలముల నిచ్చువాడు అని నాలుగు లక్షణాలను ప్రస్తావించి తన అసాధారణ శక్తిని ప్రకటిస్తూ, ఆ తదుపరి ఓ అల్లాహ్! గత సన్మార్గులకు, ప్రవక్తలకు సందేశహరులకు మమ్ము వారసులను చేయుము. వారి మార్గములను మాపై తెరువుము. వారికి ప్రసాదించిన అనుగ్రహములను మాకు ప్రసాదించుము. ఓ దైవమా! ఈ ప్రపంచములలోనే నీ శిక్షకు గురైన జాతులకు పోలిన వారిగా మారకుండా మమ్ము కాపాడుము. అనగా యూదులు. వీరు హజ్రత్ మసీహ్ కాలంను పొంది, ప్లేగ్ వ్యాధితో నాశనమైనారు. ఓ దైవమా! నీ సన్మార్గం లభించని మరియు మార్గభ్రష్టులైన ఆయా జాతులలో మేము కలసిపోకుండా మమ్ము కాపాడుము అని దుఆను నేర్పించెను. అనగా క్రైస్తవులు. ఈ దుఆలో ఒక భవిష్యవాణి దాగి యున్నది. అదేమనగా, ముసల్మానులలో కొందరు తమ స్వచ్ఛత, స్వాభిమానం వలన గత ప్రవక్తలకు వారసులుగా నిలిచెదరు. ఫలితముగా ప్రవక్తృత్వం, సందేశహరుత్వం వంటి అనుగ్రహము లను పొందెదరు. మరి కొందరు యూదుల లక్షణములను అలవర్చు కొందురు. అలాంటి వారిని ప్రపంచములో కూడ శిక్షించడం జరుగుతుంది. మరి కొందరు క్రైస్తవులను అనుసరించెదరు. ఎందుకనగా దేవుని వాక్యములో దాగియున్న సాంప్రదాయమే మనగా, అతడు ఒక జాతిని ఒక పనిని చేయకూడదని నివారించిన చో అందులో కొందరు ఆ పనినే చేయుటకు సిద్ధముగా ఉన్నారని దేవునికి తెలియును. మరి కొందరు పుణ్య, పావనమైన కార్యములను తలపెట్టెదరు. ప్రపంచం ఆరంభమైనప్పటి నుండి నేటి వరకు

దేవుడు అవతరింపజేసిన దైవగ్రంథములన్నింటిలో పేర్కొనబడిన దైవ సాంప్రదాయ మేమనగా, అతడు ఒక జాతిని ఏదేని ఒక పని నుండి నివారించినచో లేదా ఏదేని ఒక కార్యమును చేపట్టుమని ప్రోత్సహించినచో వారిలో కొందరు ఆ పనిని చేయువారుందురు, మరి కొందరు చేయని వారుందురనే విషయం అల్లాహ్ తఆలాకు తెలిసే ఉంటుంది. కావున ఈ సమాజంలో ఒక వ్యక్తి పరిపూర్ణ స్థాయిలో ప్రవక్తల రూపంలో బహిర్గతమగునని ఈ అధ్యాయము భవిష్యవాణి చేయుచున్నది. ఫలితముగా صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ అను సూక్తి ద్వారా సేకరించబడుచున్న ఆ భవిష్యవాణి సంపూర్ణ స్థాయిలో, నిశ్చయముగా పూర్తి గావించబడును. అప్పుడు హజ్రత్ ఈసా (అ) శపించడం వలన దైవ వినాశనంనకు గురి అయిన వారివలే వారిలో నుండి కూడ ఒక వర్గము ఆ యూదుల లక్షణాలతో వెలువడును. తద్వారా غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ లో దాగియున్న ఆ భవిష్యవాణి పూర్తి గావించబడును. మరల మద్యపానం, దుష్కార్యములు, నీచ, నికృష్ట పనులలో మునిగి పోవడం వలన దేవుని మార్గదర్శకంను పొందలేక పోయిన క్రైస్తవుల వలే వారిలో నుండి ఒక వర్గము కూడ వెలువడను. ఒక విధముగా వారు క్రైస్తవుల వలే గోచరించెదరు. ఫలితముగా وَلَا الضَّالِّينَలో దాగియున్న ఆ భవిష్యవాణి కూడ పూర్తిగావించబడును. పైగా కలియుగ కాలంలో ముసల్మానులు అనబడే వేలాది మంది యూదుల లక్షణాల ను అలవర్చుకొందురనే అభిప్రాయమును ముసల్మానులు తమ సిద్ధాంతములో కల్పుకున్నారు. పవిత్ర ఖుర్ఆన్‌లో ఎన్నో చోట్ల ఈ భవిష్యవాణి గలదు. వందల మంది ముసల్మానులు క్రైస్తవులుగా మారడం, లేదా క్రైస్తవుల వలే విచ్చల విడిగా, స్వతంత్రపు జీవితము నకు అలవాటు పడుటను స్వయముగా చూడవచ్చును, సాక్షిగా

నిలబడవచ్చును. అంతేగాకా ముసల్మానులనబడే వారిలో అనేకులు క్రైస్తవుల జీవిత విధానాన్ని ఇష్టపడుచున్నారు. ముసల్మానులైనప్పటికి నమాజ్, రోజా, హలాల్, హరామ్ వంటి వాటిని ద్వేషించు చున్నారు. ఈ రెండు వర్గములు అనగా యూదుల వర్గము, క్రైస్తవుల వర్గము ఈ దేశంలో విస్తరించడంను కూడ నేడు మనము చూస్తూనే ఉన్నాము. కావున ఫాతిహా అధ్యాయములోని ఈ రెండు భవిష్యవాణులు పూర్తిగావడంను నేడు మీరు చూస్తూనే ఉన్నారు. ముసల్మానులు ఏ స్థాయి మేరలో యూదుల లక్షణాలను, క్రైస్తవుల సాంప్రదాయాలను అలవర్చుకుంటున్నారో స్వయముగా మీ కన్నుల తో మీరే చూస్తున్నారు. కావున ఇప్పుడు మూడవ భవిష్యవాణి కూడ అమోదయోగ్యమే అగును. పైగా ముసల్మానులు యూదులు, క్రైస్తవుల వలే మారడం వలన వారు యూదులు, క్రైస్తవుల చెడులలో భాగస్వాములైన విధముగానే ఇస్రాయీల్ సంతతిలోని వారి మహాత్ములు, పుణ్యులు పొందిన స్థానాన్ని, గౌరవాన్ని పొందడం కూడ ముసల్మానులలోని కొందరు వ్యక్తుల హక్కుగా భావించ బడుతుంది. దేవుడు ఒకవైపు ముసల్మానులకు యూదులు, క్రైస్తవుల చెడులలో భాగస్వామ్యమునిచ్చి వారిని కూడ యూదులు గానే నిర్ధారించి, వారి ప్రవక్తలు, సందేశహరుల స్థానములలో ముస్లిం సమాజాన్ని భాగస్వామ్యం చేయలేదని భావించడం అతని పట్ల చెడు అభిప్రాయమును కల్గియుండడమే అవుతుంది. అలాంటప్పుడు ఈ ముస్లిం సమాజం ఉత్తమ సమాజమని ఎలా అనబడుతుంది? అన్ని రకాల చెడులకు వీరిని వారసులను చేసి, మంచికి వారసులను చేయనప్పుడు ఈ సమాజం దుష్టసమాజమే అనబడుతుంది. ఇస్రాయీల్ సంతానములో అవతరించిన ప్రవక్తలందరికి వారసులు గా, వారి ప్రతిఛాయలుగా ముస్లిం సమాజంలో ఎవరు కూడ

ప్రవక్తలుగా, సందేశహరులుగా అవతరించడం అనివార్యము కాకూడదా? ఎందుకనగా, దేవుడు నేటి కాలంలో ముస్లిం సమాజికులలో వేలాది మందిని యూదుల లక్షణాలను అలవర్చుకొనుటకు అనుమతినిచ్చి, వేలాది మందిని క్రైస్తవ ధర్మములో ప్రవేశించుటకు అవకాశమును కల్పించి ముస్లిం సమాజంలో ఒక్క వ్యక్తిని కూడ గత ప్రవక్తల వారసులుగా, దేవుని అనుగ్రహాన్ని పొందువారిగా అవతరింపజేయకపోవడం దేవుని కరుణా ప్రపూర్ణతకు విరుద్ధమనబడును. ఈ భవిష్యవాణి

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۙ- صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ

(అల్ ఫాతిహా-1:6,7) అను సూక్తితో నిరూపించబడుతుంది. కావున యూదులు, క్రైస్తవులను గూర్చి చేసిన భవిష్యవాణి పూర్తిగా వించ బడినట్లుగా ఈ భవిష్యవాణి కూడ పూర్తి గావించబడాలి. వీరి స్థితిని బట్టి ఈ ముస్లిం సమాజాన్ని వేలాది చెడు పేర్లతో పిలవడం జరిగింది. వీరు యూదులుగా పరివర్తనం చెందుదరని కూడ పవిత్ర ఖుర్ఆన్ మరియు హదీస్‌ల ద్వారా కూడ నిరూపితమవుచున్నది. ఇలాంటి పరిస్థితులలో స్వయముగా దేవుని అనుగ్రహము వారిని వరించవలసి యుండెను. గత క్రైస్తవుల నుండి చెడును స్వీకరించిన విధముగా, వారు మంచిని స్వీకరించుటకు కూడ అర్హులుగా నిలుచుదురు. అందుకోసమే అల్లాహ్ తఆలా ఫాతిహా అధ్యాయములో اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ అనే సూక్తిలో ముస్లిం సమాజానికి చెందిన కొందరు వ్యక్తులు గత ప్రవక్తల అనుగ్రహాల ను పొందుదురని శుభవార్తనివ్వడం జరిగింది. కేవలం వారు యూదులుగా, క్రైస్తవులుగా మారుతారని, వారి చెడు మార్గాలను అలవర్చుకుంటారనే గాని పుణ్యములను అలవర్చుకోరని శుభ వార్త నివ్వలేదు. ఈ విషయమును గూర్చియే తహరీమ్

అధ్యాయములో కూడ తెలుపడం జరిగింది. కొందరు వ్యక్తులు ఈ సమాజంలో పవిత్రురాలైన మరియమ్మను పోలి ఉండెదరు. వారు కన్యగానే ఉండాలని నిర్ణయించుకున్నారు. కాని అప్పుడే వారి గర్భంలో ఏసు ఆత్మను ఊదడం జరిగింది. అలా వారి కడుపున ఏసు జన్మించారు. అంతేగాకా ఈ సమాజంలో ఒక వ్యక్తికి సూక్తిలో ముందుగా మరియమ్మ స్థానం లభిస్తుందని, ఆ తరువాత వారిలో ఏసు ఆత్మను ఊదడం జరుగుతుందని, అప్పుడు మరియమ్మ నుండి ఏసు బహిర్గతమవునని కూడ ఈ సూక్తిలో సూచికగా పేర్కొనడం జరిగింది. అనగా మరియమ్మ లక్షణం నుండి ఏసు లక్షణం వైపు మరలించబడును. ఒక విధముగా మరియమ్మ అనబడే లక్షణం ఏసు అనబడే స్వభావం గల బాలుడిని ఇచ్చును. ఈ విధముగా ఆ వ్యక్తి మరియమ్మ కుమారుడని పిలువబడును. బరాహీనె అహ్మదియ్యాలో ముందుగా నాకు మరియం అని నామకరణం చేయడం జరిగింది, కనుక ఆ నామము కూడ ఈ విషయాన్నే సూచిస్తున్నది. అదే విధముగా పుట 241లో ఉన్నటువంటి సువార్తవాణి اَنّٰى لَكِ هٰذَا అనగా ఓ మరియమ్మ! ఈ అనుగ్రహాన్ని నీవు ఎక్కడి నుండి పొందావు? కూడ ఈ విషయాన్నే సూచిస్తున్నది. అదే విధముగా పుట 226లో వ్రాయబడిన సువార్తవాణి అనగా هز اليك بجذع النخلة (తహరీమ్-66:13) ఓ మరియమ్మ! నీవు ఖర్జూరపు గెలను ఊపుము. మరల బరాహీనే అహ్మదియ్య పుట 496లో

يامريم اسكن انت وزوجك الجنة نفخت فيك من لدنى روح الصدق

అను సువార్త గలదు. అనగా ఓ మరియమ్మ! నీవు నీ మిత్రులతో కలసి స్వర్గములోకి ప్రవేశించుము. నేను నా వైపు నుండి నీ గర్భంలో ఒక సత్యతతో కూడిన ఆత్మను ఊదినాను. అల్లాహ్

తఆలా ఈ సూక్తిలో నా పేరు రూహుస్సిద్‌ఖ్ (పవిత్ర ఆత్మ)గా తెల్పినాడు. ۞[12] ఈ సువార్తవాణి نَفَخۡنَا فِيۡهِ مِنۡ رُّوۡحِنَا అను సూక్తికి అనుగుణముగా ఉన్నది. కావున ఇక్కడ ఒక సామెత పరంగా మరియమ్మ గర్భములో ఏసు ఆత్మ ఊదబడినది. దాని పేరే పరిశుద్ధాత్మ. ఆ తరువాత బరాహీనే అహ్మదియ్య చివరి పుట 556లో మరియమ్మ గర్భంలో గల ఏసు జననంను గూర్చి ఈ విధముగా దైవవాణి అందినది.

یاعیسٰی انی متوفّیک ورافعک الیّ وجاعل الذین اتبعوک
فوق الذین کفروا الیٰ یوم القیامۃ

ఈ సూక్తిలో నాపేరు ఈసా అని నామకరణం చేయడమైనది. పుట 496లో ఆత్మను ఊదబడినటు వంటి ఏసు జన్మించినాడని ఈ దైవవాణి నిరూపించినది. ఈ విధముగా నేను మరియమ్మ కుమారుడైన ఏసుగా పిలువబడుతాను. ఎందుకనగా నా ఏసు లక్షణము, మరియమ్మ లక్షణము రెండు దేవుని అనుగ్రహం వల్లనే కలిగినవి. ఇందుకు బరాహీనే అహ్మదియ్య పుట 496 మరియు 556లను చూడండి. అంతేగాకా ఈ సంఘటననే తహరీమ్ అధ్యాయములో ఎంతో విపులీకరించి భవిష్యవాణి రూపంలో తెలుపడమైనది. ఈ సమాజంలో ఈసా ఇబ్నే మరియం (మరియమ్మ కుమారుడైన ఏసు) ఏ విధముగా అవతరించుననగా, ముందుగా ఒక వ్యక్తి (స్వభావరీత్య) మరియమ్మగా తీర్చిదిద్దబడి, ఆ తరువాత అతనిలో ఏసు ప్రాణం (స్వభావము)ను పోయ బడును. అనగా అతడు మరియమ్మ తత్వంలో కొంత కాలం సంరక్షించబడి, ఆ

۞(12) ఇక్కడ సూక్తి అనగా దివ్యవాణి. ఎందుకనగా ఇంతకు ముందు కొద్ది వరుసల క్రితమే దీనిని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దివ్యవాణి అని పేర్కొన్నారు. ***సమాప్తం*** (ప్రచురణకర్త)

తరువాత ఏసు ధార్మికతతో జన్మించును. ఈ విధముగా అతడు మరియమ్మ కుమారుడైన ఏసు అనబడును. ముహమ్మది ఇబ్నే మరియమ్మను గూర్చిన ఈ వార్త పవిత్ర ఖుర్‌ఆన్‌లో అనగా తహ్‌రీమ్ అధ్యాయములో నేటి నుండి 1300ల సంవత్సరాలకు పూర్వము తెలుపడం జరిగింది. మరల ఈ తహరీమ్ అధ్యాయపు ఈ సూక్తులను బరాహీనే అహ్మదియ్యలో అల్లాహ్ తఆలాయే స్వయముగా విపులీకరించడం జరిగింది. నేడు పవిత్ర ఖుర్‌ఆన్ కూడ అందుబాటులో గలదు. కావున ఒకవైపు పవిత్ర ఖుర్‌ఆన్‌ను మరోవైపు బరాహీనే అహ్మదియ్యను పట్టుకోండి. ఈ రెండింటిని న్యాయబద్ధముగా పరిశీలించుము. తహరీమ్ అధ్యాయములో గల ఈ భవిష్యవాణిని గూర్చి వివేకముతో, న్యాయబద్ధముగా, ధార్మికత తో ఆలోచించుము. అనగా ఈ సమాజంలో కూడ ఒకరు (స్వభావరీత్య) మరియమ్మగా పిలువ బడును, ఆ తరువాత మరియమ్మ నుండి ఏసుగా పరివర్తనం చెందించబడును. ఒక రకముగా అతడు మరియమ్మ నుండి జన్మించినట్లు అగును. అవన్నియు బరాహీనే అహ్మదియ్యలో పేర్కొన్న భవిష్యవాణులతో ఎలా పూర్తి గావించబడినవి? ఇవి మానవుని శక్తితో సాధ్యమా? ఇవి నా ఆధీనంలో ఉన్నవా? నన్ను ఇబ్నే మరియంగా పేర్కొనుటకు ఒక సూక్తిని అవతరింప జేయుమని మరియు నిన్ను ఎందుకు ఇబ్నే మరియంగా పేర్కొన బడడం జరిగింది అనే ఆరోపణ నుండి నన్ను విముక్తిడిని చేయుమని ప్రాధేయపడుటకు పవిత్ర ఖుర్‌ఆన్ అవతరిస్తున్న సమయంలో నేను అక్కడ ఉన్నానా? నేటి కంటే 20 నుండి 22 సంవత్సరాల పూర్వము అంతకు మించిన కాలంలో నేను నా గురించి ఒక దైవవాణిని సృష్టించుకొని అందులో మొదట నా పేరును మరియమ్మగా పేర్కొనబడిందని, ఆ తరువాత

మిమ్ములను మోసము చేయుటకు పూర్వ కాలపు మరియమ్మ వలే నాలో కూడ ఏసు ఆత్మను ఊదడం జరిగిందని తెల్పు మరొక దైవవాణిని సృష్టించుకొని, చివరిలో ఇప్పుడు నేను మరియమ్మ నుండి ఏసుగా మారినానని బరాహీనే అహ్మదియ్య పుట 556లో పేర్కొని ప్రసిద్ధుడనగుటకు నా వైపు నుండి నేను ఏమైన ఒక వ్యూహాన్ని రచించడం సాధ్యమయ్యే పనియేనా? ఓ మిత్రులారా! క్షుణ్ణముగా పరిశీలించండి, ఆపై దేవుడికి భయపడండి. ఇది ఏ మాత్రము మానవుని కార్యాచరణ కాదు. ఈ సూక్ష్మాంశములు, వివేకములు మానవుని అవగాహన శక్తికి అతీతమైనవి. ఒకవేళ బరాహీనే అహ్మదియ్య రచించుచున్న కాలంలో, అది రచించి కూడ చాలా కాలమైనది. ఇలాంటి వ్యూహాన్ని రచించాలనే ఆలోచనే నాకు ఉన్నచో ఆ బరాహీనే అహ్మదియ్యలో మరియమ్మ కుమారుడైన ఏసు మరల ఆకాశము నుండి వచ్చునని నేను ఎందుకు వ్రాస్తాను. ఈ వాస్తవము తెలిసిన రోజు ఆ వాదన బలహీన పడుతుందనే విషయము దేవునికి తెలుసు. అందుకే అతడు బరాహీనే అహ్మదియ్య యొక్క మూడవ భాగములో నా పేరును మరియమ్మ అని పేర్కొనడం జరిగింది. మరల బరాహీనే అహ్మదియ్య ద్వారా బహిర్గతమైనట్లుగా రెండు సంవత్సరాల వరకు నేను మరియమ్మ లక్షణాలతో పోషించబడ్డాను. అలా చాటుగా నేను పోషించ బడుతు వచ్చాను. ఇలా రెండు సంవత్సరాలు గడిచిన తరువాత బరాహీనే అహ్మదియ్య భాగం నాలుగు, పుట 496లో పేర్కొనట్లుగా మరియమ్మ వలే నాలో ఏసు ఆత్మను ఊదడం జరిగింది. జాతీయతగా నన్ను గర్భినితో పోల్చడం జరిగింది. అలా కొన్ని నెలల తరువాత అనగా పది నెలలకు మించకుండా బరాహీనే అహ్మదియ్య భాగం 4, పుట 556 చివరిలో పేర్కొన్నట్లుగా దైవవాణి ద్వారా నన్ను

మరియమ్మ నుండి ఏసుగా మార్చడం జరిగింది. ఈ విధముగా నేను మరియమ్మ కుమారుడైన ఏసుగా పిలువబడ్డాను. అల్లాహ్ తఆలా బరాహీనే అహ్మదియ్య కాలంలో ఈ గోప్యతను నాపై బహిర్గతం చేయలేదు. వాస్తవానికి ఇంత గోప్యతతో కూడిన దైవవాణి ఆ సమయంలోనే నాపై అవతరించ బడింది. అలా బరాహీనే అహ్మదియ్యలో పొందు పర్చబడింది. అంతేగాని నాకు ఆ పదాల నిగూడతను గాని, ఆ పదాల అమరికను గూర్చి గాని ఎలాంటి సమాచారంను అందించలేదు. అందుకోసమే నేను ముసల్మానుల సాంప్రదాయ సిద్ధాంతమును బరాహీనే అహ్మదియ్యలో పొందు పర్చాను. తద్వారా ఆ సిద్ధాంతము నా అమాయకత్వమునకు, కల్పిత రహితమునకు సాక్ష్యముగా నిలుచును. నేను దానిని దైవవాణి ఆధారముగా వ్రాయలేదు. కేవలం సాంప్రదాయకముగానే వ్రాసాను. అంతేగాని వ్యతిరేకులను తప్పుద్రోవ పట్టించుటకు కాదు. ఎందుకనగా అల్లాహ్ తఆలా నాకు వివరించి చెప్పనంత వరకు ఎలాంటి గోప్యతలను నేను ఎరుగననునదే నా వాగ్దానం. కావున సమయం ఆసన్నం కానంత వరకు బరాహీనే అహ్మదియ్యలో పేర్కొన్నటువంటి రహస్యాలు తెలియక పోవడమే దైవ ఉద్ధేశముగా భావించబడును. సమయం ఆసన్నమైనప్పుడే వాటిని గూర్చి నాకు విడమర్చి తెలుపడం జరిగింది. అప్పుడు నేను మసీహ్ మౌవూద్ గా ప్రకటన చేయడంలో ఎలాంటి నూతనత్వం లేదనే విషయాన్ని గ్రహించాను. ఇది బరాహీనే అహ్మదియ్యలో పదే పదే ఎంతో విపులముగా పేర్కొన్నటువంటి వాగ్దానము. ఇచట నేను మరొక దైవవాణిని గూర్చి కూడ ప్రస్తావించెదను. ఆ దైవవాణిని నేను నా సంచికలో గాని, ప్రకటనలో గాని ప్రచురించినట్లు నాకు సరిగా గుర్తుకు లేదు. కాని అసంఖ్యాక ప్రజానికానికి వినిపించినట్లు

నాకు బాగా గుర్తున్నది. పైగా నాకు బాగా గుర్తున్నటువంటి దైవవాణులలో ఇది కూడ ఒకటి. అల్లాహ్ తఆలా మొదటి సారిగా నన్ను మరియమ్మ అని సంబోధించిన కాలం నాటిది ఆ దైవవాణి. ఆ తరువాత ఆత్మను ఊదాను అనే దైవవాణిని అవతరింపజేసెను. ఆ తరువాత మరల

فاجاءها المخاض الی جذع النخلة قالت یالیتنی مت قبل هذا و کنت نسیا منسیا

అను దైవవాణి అవతరించినది. అర్థం: మరల ప్రసవ వేదన మరియమ్మను అనగా ఈ భవదీయుడిని ఎండిన ఖర్జూరపు చెట్ల వైపు తీసుకవచ్చింది. అనగా సామాన్య ప్రజలు, మూర్ఖులు మరియు అవగాహన లేని ఉలమాలతో తలపడవలసి వచ్చింది. వారి వద్ద విశ్వాసపు ఫలములు లేవు. వారు మరియమ్మను అవిశ్వాసులని ప్రకటించిరి, అవమానించిరి, దూషించిరి. అలా ఒక తూఫాన్‌ను సృష్టించిరి. అప్పుడు మరియమ్మ ఈ రోజులు చూడక ముందే బహుశ నేను మరణించినచో ఎంత బాగుండును, నా పేరు, ఆనవాళ్ళు ఉండేవి కావని తలిచెను. నేను ఆరంభములో ఎదుర్కొన్న టువంటి మౌల్వీల వ్యతిరేకతతో కూడిన అలజడులను గూర్చి ఇది సూచిస్తుంది. వారు నా ఈ వాగ్దానమును స్వీకరించుటకు ఏ మాత్రం సిద్దముగా లేకుండిరి. పైగా నన్ను అంత మొందించుటకు వారు అన్ని విధాలుగా ప్రయత్నించారు. ఆ సమయంలో ఆ అవివేకుల అలజడులతో నా మనస్సులో కల్గిన బాధ, ఆవేదన, తపనను అల్లాహ్ తఆలా ఇక్కడ ఈ విధముగా చూపడం జరిగింది. ఈ విషయాన్ని తెల్పు మరి కొన్ని దైవవాణులు కూడ గలవు. వాటిలో ఇదొకటి.

لقد جئت شیئا فریا۔ ما کان ابوك امرء سوء وما کانت أمّك بغیا

మరల ఈ దైవవాణితో పాటు మరొక దైవవాణి బరాహీనే

అహ్మదియ్య పుట 521లో ఈ విధముగా గలదు.

اليس الله بكاف عبده ولنجعله اية للناس ورحمة منا وكان امرا مقضيا ۔
قول الحق الذى فيه تمترون

బరాహీనే అహ్మదియ్య పుట 516లో చూడండి.

(అనువాదం) ఓ మరియమ్మ! నిశ్చయముగా నీవు సన్మార్గము నుండి దూరం చేయునట్టి గొప్ప దుష్కార్యమే చేసితివి గదా! నీ తండ్రి దుష్టుడు కాడే. ۞[13] నీ తల్లి దుష్కార్యము చేసేది కాదే అని ప్రజలు ప్రశ్నించిరి. కాని దైవం తన దాసున్ని అట్టి ఆరోపణల నుండి విముక్తిడిని చేయును. మేము ప్రజల కొరకు వారిని ఒక సంకేతముగా చేసి చూపెదము. ఈ కార్యాచరణ ఆరంభములోనే నిర్ణయించబడినది. కావున అలానే జరగవలసి యుండెను. వీరే మరియమ్మ కుమారుడైన ఏసు. వీరి విషయంలోనే ప్రజలు అనుమానించ సాగిరి. ఇదే వాస్తవము. ఇవన్నియు బరాహీనే అహ్మదియ్య పంక్తులు. వాస్తవానికి ఈ దైవవాణి హజ్రత్ ఈసా మరియు వారి తల్లిని గూర్చి అవతరించబడిన పవిత్ర ఖుర్ఆన్

---

۞(13) ఈ దైవవాణి ద్వారా నాకు గుర్తుకొచ్చిన విషయమేమనగా, బటాలాలో ఫజల్ షా లేదా మెహర్ షా అనే ఒక సయ్యద్ ఉండేవాడు. అతనిని మా తండ్రి గారు చాలా అభిమానించేవారు. పైగా చాలా మంచి అనుబంధం ఉండేది. నేను మసీహ్ మౌవూద్‌గా ప్రకటన చేసిన విషయాన్ని ఎవరి ద్వారనో వారికి తెలిసింది. అందుకు వారు చాలా ఏడ్చారు. ఆపై ఇలా అన్నారు. వారి తండ్రిగారు చాలా మంచి వారు. అనగా ఈ వ్యక్తి ఎవరి గుణగణాలతో జన్మించాడు. వారి తండ్రి ఉత్తముడు, మోసపూరిత పనులు చేసేవాడు కాదు. చక్కనివాడు, స్వచ్ఛమైన మనస్థత్వం గలవాడు. అలాగే అనేకులు నీవు ఇలాంటి దావా (ప్రకటన) చేసి నీ వంశానికి మచ్చ తెచ్చావు అని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. సమాప్తం.

సూక్తులతో కూడినదే. ఈ సూక్తులలో ఏ ఏసునైతే ప్రజలు అక్రమ సంతానమని నిందించారో అట్టి ఏసు గూర్చియే అల్లాహ్ తఆలా ఈ విధముగా తెల్పుచుండెను. “మేము అతనిని మా సంకేతముగా మార్చుకుంటామని” తెలిపెను. ఈ ఏసును గూర్చియే ప్రజలు వేచి యున్నారు. దైవ పంక్తులలో పేర్కొనబడినట్లు మరియమ్మ మరియు ఏసు అనగా నేనే అని అర్థం. మేము అతనిని ఒక చిహ్నముగా మార్చుకుంటామని నా గురించియే ఇక్కడ తెలుపడం జరిగింది. మరల ఇలా తెలుపబడెను. అవతరించవలసిన మరియమ్మ కుమారుడైన ఏసు ఇతడే. ఇతని విషయములోనే ప్రజలు సంశయంలో ఉన్నారు. ఇదే సత్యము, అవతరించవలసిన వారు కూడ వీరే. సంశయం అనేది కేవలం అర్థం చేసుకోకపోవడం వల్లనే ఏర్పడింది. వీరు అల్లాహ్ మహిమల ఆంతర్యమును అర్థం చేసుకోలేని వారు, కేవలం రూపురేఖలు చూచుదురే గాని వాస్తవంపై వీరికి ఎలాంటి అవగాహన లేదు.

ఫాతిహా అధ్యాయపు గొప్ప ఉద్దేశములలో

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ـ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ـ

అను దుఆ ఒకటి అను విషయంను గుర్తుంచు కోగలరు. ఏ విధముగానైతే ఇంజీల్‌లో రొట్టె ముక్కల కోసం దుఆ చేయబడిందో అదే విధముగా ఈ దుఆలో అల్లాహ్ తఆలాతో గత ప్రవక్తలకు సందేశహరులకు అనుగ్రహింపబడిన వరములన్నింటిని అనుగ్ర హించమని వేడుకోవడం జరిగింది. ఈ పోటాపోటి కూడ వీక్షించ దగింది. ఏ విధముగానైతే మసీహ్ దుఆ స్వీకరించబడి క్రైస్తవులకు రొట్టెలకు చెందిన అపారమైన వస్తువు లభించినదో, అదే విధముగా ఈ ఖుర్ఆన్ దుఆ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మాధ్యమముతో స్వీకరించబడినందున అనేక మంది సజ్జన,

పావన ముసల్మానులు, ప్రత్యేకించి వారి(స)ను పరిపూర్ణముగా అనుసరించు మహానుభావులు బనీ ఇస్రాయిల్ ప్రవక్తలకు వారసులుగా నిలిచారు. వాస్తవానికి మసీహ్ మౌవూద్ ఈ సమాజంలో అవతరించడం కూడ ఒక విధముగా ఆ దుఆ యొక్క ఆమోద ఫలితమనే చెప్పుకోవచ్చును. ఎందుకనగా ఒక విధముగా అంతరంగికముగా చూసినచో అనేక మంది సజ్జనులు, పావనులు బనీ ఇస్రాయీల్ ప్రవక్తలను పోలియున్నట్లు కనిపించును. కాని ఈ సమాజపు మసీహ్ మౌవూద్ దేవుని ఆదేశం, అనుమతితో ఇస్రాయీలీ మసీహ్‌కు భిన్నముగా బహిరంగముగానే నిలబడడం జరిగింది. తద్వారా మూస్వీ మరియు ముహమ్మదీయ పరంపరల పోలికలు సులువుగా అర్థమవును. అందువల్లనే ఈ మసీహ్‌ని మరియమ్మ కుమారుడితో అన్ని కోణాలతో పోల్చడం జరిగింది. చివరికి ఇబ్నే మరియంకు వచ్చిన కష్టాలు ఈ మసీహ్‌కు వచ్చునని కూడ తెలుపడం జరిగింది. మొదటి విషయమేమనగా మరియమ్మ కుమారుడైన ఏసు కేవలం దేవుడు ఊదడం వల్లనే జన్మించెను. అదే విధముగా ఈ మసీహ్ కూడ తహరీమ్ ఆధ్యాయములో గల వాగ్దానమును అనుసరించి కేవలం దేవుడు ఊదడం వల్లనే మరియం లక్షణపు గర్భము నుండి జన్మించెను. మరల ఏ విధముగా నైతే మరియమ్మ కుమారుడైన ఏసు జన్మించినప్పుడు అలజడి చెలరేగినదో, మరియు అంధత్వపు వ్యతిరేకులు మరియంను لَقَدْ جِئْتِ شَيْـًٔا فَرِيًّا (మర్యమ్-19:28) అని నిందించిరో, అదే విధముగా ఇక్కడ కూడ నిందించారు. ఆపై ప్రళయం సంభవించు నట్లు అలజడులను సృష్టించారు. పైగా ఇస్రాయీలీ మరియం ప్రసవించిన సమయంలో వ్యతిరేకుల ఆరోపణలను ఖండిస్తూ దేవుడు وَلِنَجْعَلَهٗۤ اٰيَةً لِّلنَّاسِ وَرَحْمَةً مِّنَّا ۚ وَكَانَ اَمْرًا مَّقْضِيًّا

(మర్యమ్-19:22) అని సమాధాన మిచ్చినట్లుగా, బరాహీనే అహ్మదియ్యలో తెల్పినట్లుగా అల్లాహ్ తఆలా నా విషయంలో కూడ అదే సమాధానమును కాకతాళీయమైన నా ఆధ్యాత్మిక ప్రసవ సమయంలో వ్యతిరేకులకు ఇచ్చెను. ఆపై మీరు మీ మోసకారి తనంతో అతనిని నాశనం చేయలేరని, అతనిని నేను ప్రజల కొరకు ఒక సంకేతముగా నిలుపెదనని కూడ తెలిపెను. ఇలా జరుగవలెనని ప్రారంభములోనే నిర్ణయించబడింది. మరల యూదుల పండితులు హజ్రత్ ఈసాపై అవిశ్వాస ఫత్వాను జారి చేశారు, ఒక దుష్ట యూద పండితుడు ఒక అవిశ్వాస తీర్మాణ పత్రమును తయారు చేయగా, ఇతర పండితులందరు ఆ ఫత్వాను బలపర్చారు. చివరికి బైతుల్ ముఖద్దస్‌లో ఉన్నటువంటి హదీస్‌ల ను విశ్వసించు వందలాది యూద పండితులు హజ్రత్ ఈసాను అవిశ్వాసుడని ముద్రించారు. ۞(14) ఇలాగే నాతో పాటు

۞(14) హజ్రత్ ఈసా అలైహిస్సలాం కాలంలో కూడ యూదులు అనేక వర్గాలుగా విడిపోయినప్పటికి సత్యంను అనుసరించునవి కేవలం రెండు వర్గాలే అని భావించబడేవి. (1) మొదటి వర్గం తౌరాత్ ప్రకారం నడుచుకునే వారు. దానిని ఆధారము చేసుకొనియే తమ సమస్యలకు పరిష్కారాలను అన్వేషించుకునేవారు. (2) రెండవ వర్గీయులు హాదీస్‌లను విశ్వసించే వారు. వీరు తౌరాత్‌పై హాదీస్‌లకు ప్రాధాన్యతనిచ్చేవారు. ఈ అహాదీస్ వర్గీయులు ఇస్రాయీల ప్రాంతాలలో చాలా అధికముగా వ్యాపించారు. పైగా వీరు తౌరాత్‌కు భిన్నమైన మరియు దానిని బలహీన పర్చునట్టి హాదీస్‌లను ఆదర్శంగా తీసుకొని ఆచరించేవారు. ఇందుకు వారు కొన్ని ధర్మ సమస్యలు ఉదా॥ ప్రార్థనలు, వ్యవహారాలు, శిక్షా స్మృతుల వంటి అంశాలు కూలంకుశంగా తౌరాత్‌లో లేవని, ఇవన్నియు హాదీస్‌ల ద్వారానే తెలుస్తున్నాయని వాదించేవారు. వారి హాదీస్‌ల గ్రంథం పేరు తాల్మూద్. ఆ గ్రంథంలో ప్రవక్తలందరి ఉల్లేఖనములు ఉండేవి. ఈ హాదీస్‌లను

వ్యవహరించడం జరిగింది. హజ్రత్ ఈసాను గూర్చి జారీ చేసిన అవిశ్వాస తీర్మాణం తరువాత వారిని చాలా ఇబ్బందులకు గురి చేశారు. కఠిన దుష్పదాలను ఉచ్ఛరించారు. వారిని అవమానిస్తూ, వారిని కించపరుస్తూ రచనలు కూడ చేశారు. నా విషయంలో కూడ ఆ విధముగానే వ్యవహరించారు. ఒక విధముగా చూసినచో 1800 సంవత్సరాల తరువాత కూడ మరల ఆ ఈసాయే తిరిగి అవతరించినట్లు, మరల ఆ యూదులే జన్మించినట్లుగా అనిపిస్తుంది. غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ అనే భవిష్యవాణి యొక్క అర్థం కూడ ఇదియే. అల్లాహ్ తఆలా ముందు నుండే జాగరూకులను

---

చాలా కాలం పాటు కంఠస్తం చేసి కాపాడుకున్నారు. కాని తరువాత కాలంలో వీటిని కూర్పు చేశారు. అందుకే వాటిలో కొన్ని బోధనాంశాలు కూడ కలిసిపోయాయి. ఇవి గాకుండా ఆ సమయంలోనే యూదులు 73 వర్గాలుగా విడిపోయారు. ఆ క్రమంలో ప్రతి వర్గం వారు తమ తమ హాదీస్‌లను వేరు చేసుకున్నారు. అహదీస్‌లను కూర్పు చేయువారు తౌరాత్‌ను ఏ మాత్రం పట్టించుకో లేదు. అధికులు హదీస్‌లకు అనుగుణము గా ఆచరించేవారు. ఫలితముగా తౌరాత్ నిరుపయోగముగా, అప్రయోజన కారిగా మిగిలిపోయింది. అహాదీస్‌కు అనుగుణముగా ఉన్నచో ఆచరించేవారు. లేనిచో వదిలి వేసేవారు. అట్టి కాలంలో హజ్రత్ ఈసా అలైహిస్సలాం జన్మించారు. కావున వారి ముఖ్యోద్దేశకులు తౌరాత్‌కన్న అధికముగా హాదీస్‌లను గౌరవించే ఈ అహ్లే హదీస్ వారే నిలిచారు. ప్రవక్తల ప్రతులలో ముందు నుండే భవిష్యవాణి చేయబడింది. యూదులు అనేక వర్గాలలో విడిపోయినప్పుడు, దైవ గ్రంథాన్ని వీడి అందుకు భిన్నముగా నడుచుకున్నప్పుడు, వారి కొరకు ఒక న్యాయకర్తను పంపబడును. అతడే మసీహ్ నామముతో పిలువ బడును. అతనిని వారు స్వీకరించరు. ఫలితముగా వారిపై కఠినమైన శిక్ష విధించబడును. అది తావూన్ శిక్ష. ***సమాప్తం.***

చేశాడు. కాని వారే యూదుల వలే **మఘ్జూబి అలైహిం** గా మారనంత వరకు సహనంను ప్రదర్శించలేక పోయారు. మరియమ్మ కుమారుడైన ఏసు ఏ విధముగానైతే 14వ శతాబ్ధపు ప్రారంభములో అవతరించెనో, అదే విధముగా అల్లాహ్ తఆలా నన్ను కూడ నిశ్చయముగా 14వ శతబ్దాపు ప్రారంభములో అవతరింపజేసి తన స్వహస్తాలతో ఈ పోలికలకు ఒక ఇటుకతో శంకుస్థాపన చేసెను. నన్ను ఇస్లాం మసీహ్‌గా అవతరింపజేసి నా కొరకు తన గొప్ప గొప్ప సంకేతాలను ప్రదర్శించసాగెను. ఆ సంకేతాలను ఎదురించు శక్తి ఆకాశము క్రింద ఏ ముస్లిం, యూద, క్రైస్తవ వ్యతిరేకికి లేదు. ఒక బలహీన, స్థాయిరహిత మానవుడు దేవుడిని ఎదురించ గలడా? ఇది దేవుని వైపు నుండి ఒక పునాది రాయి. ఈ పునాది రాయిని పగలగొట్టాలని ప్రయత్నించువారెవ్వరు కూడ దీనిని పగల గొట్టలేరు. కాని ఈ రాయి ఎవరిపైన పడుతుందో అతడిని ముక్కలు ముక్కలుగా చేస్తుంది. ఎందుకనగా రాయి మరియు చేయి రెండు దేవునివే. నా వ్యతిరేకులు ఆ కాలంలో యూదులు సిద్ధము చేసుకున్నట్లుగా నాకు భిన్నముగా ఉపయోగించుకోవడం కోసం దేవుని రాయికి పోటీగా మరొక రాయిని వారు సిద్దము చేసుకున్నారు. నన్ను అంతమొందించడం కోసం చివరికి నాపై హత్యా నేరమును కూడ మోపారు. ఈ విషయమును గూర్చి నా దేవుడు నాకు ముందుగానే సమాచారమును అందించాడు. నాపై మోపబడిన వ్యాజ్యము హజ్రత్ ఈసా ఇబ్నే మరియమ్‌పై మోపబడిన వ్యాజ్యము కంటే క్లిష్టమైనది. ఎందుకనగా హజ్రత్ ఈసా పై మోపబడిన వ్యాజ్యము కేవలం ధార్మిక విభేదాల వలన మోపబడినది మాత్రమే. అక్కడి న్యాయమూర్తి ముందు అది చాలా చిన్న విషయం. ఒక విధముగా చెప్పదలచినచో దానికి

ఎలాంటి ప్రాముఖ్యత లేదు. కాని నాపై మోపిన వ్యాజ్యము మాత్రము అది హత్యకు సంబంధించినది. ఏ విధముగానైతే మసీహ్‌కు వ్యతిరేకముగా యూద పండితులు సాక్షమిచ్చారో అదే విధముగా కొందరు మౌల్వీలు కూడ నాకు వ్యతిరేకముగా సాక్షమివ్వవలసి యుండెను. అందుకోసమే ఇట్టి సాక్ష్యమునిచ్చుటకు అల్లాహ్ తఆలా మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వీని ఎంచుకున్నాడు. అతడు చాలా పొడువాటి జుబ్బాను ధరించి సాక్ష్యమిచ్చుటకు వచ్చెను. యూదుల నాయకుడు మసీహ్‌ను సిలువపై శిక్షింపజేయుటకు న్యాయస్థానమునకు సాక్ష్యమిచ్చుటకు వచ్చినట్లే ఇతడు కూడ న్యాయస్థానానికి వచ్చాడు. కాని వ్యత్యాసమేమనగా, అక్కడ తాంత్రికుల నాయకుడికి ఫిలాతూస్ న్యాయస్థానములో కుర్చీ ఇవ్వడం జరిగింది. ఎందుకనగా యూదుల నాయకులకు రోమన్ ప్రభుత్వం వారి గౌరవార్థం కుర్చీని ఇస్తుంది. పైగా వారిలో కొందరు తాత్కాలిక న్యామూర్తులు కూడ గలరు. అందువలనే ఆ తాంత్రిక నాయకుడు న్యాయస్థాన నిబంధనల ప్రకారం న్యాయస్థానములో కుర్చీని పొందినాడు. మసీహ్ ఇబ్నే మరియం ఒక దోషిలాగా న్యాయస్థానంలో నిలబడి ఉన్నాడు. కాని నా వ్యాజ్యములో అందుకు పూర్తి భిన్నముగా జరిగింది. అనగా శత్రువుల కోరికకు భిన్నముగా న్యాయస్థానములో ఫిలాతూస్‌కు బదులుగా కెప్టెన్ డగ్లస్ న్యాయమూర్తి స్థానములో కూర్చొని నాకు కుర్చీనిచ్చాడు. ఈ ఫిలాతూస్ మసీహ్ ఇబ్నే మరియం నాటి ఫిలాతూస్ కన్న చాలా సద్గుణవంతుడని నిరూపించుకున్నాడు. ఎందుకనగా న్యాయ వ్యవస్థలో అతడు చాలా ధైర్యమును, స్థిరత్వమును ప్రదర్శించెను. పై అధికారుల ఒత్తిడిని అతడు ఏ మాత్రం లెక్కచేయ లేదు. అంతేగాకుండా జాతి, ధర్మ భేదాలు కూడ అతనిని ఏ మాత్రం

ప్రభావితం చేయ లేదు. అతడు న్యాయస్థానములో ఎంతో సహనోపేతమైన నిర్ణయాన్ని తీసుకోవడం జరిగింది. వారి నడవడికను జాతి మరియు ధర్మకర్తలకు ఆదర్శమని తెలిపినచో అది అతిశయోక్తి కాదు. న్యాయవ్యవస్థ ఒక క్లిష్టమైన వ్యవస్థ. మానవుడు అన్ని రకాల బాంధవ్యాలను వీడి నిష్కల్మషమైన మనస్సు తో న్యాయమూర్తి స్థానములో కూర్చోనంత వరకు అతడు సరైన న్యాయం చేయలేడు. కావున మేము ఈ వ్యాజ్యములో ఈ ఫిలాతూస్ నిశ్చయముగా తన బాధ్యతలను నెరవేర్చినాడని నిజాయితిగా సాక్ష్యమిస్తున్నాము. కాని మొదటి ఫిలాతూస్ రోమన్ ప్రభుత్వానికి చెందిన వాడైనందున అతడు తన బాధ్యతను సరైన విధముగా నిర్వర్తించ లేదు. అతడి పిరికితనం మసీహ్‌కు చాలా పెద్ద కష్టాలను తీసుకవచ్చింది. ప్రపంచం ఉన్నంత వరకు మన జమాఅత్ సభ్యులు ఈ ప్రత్యేకతను పదే పదే గొప్పగా చెప్పుకుంటారు. ఈ జమాఅత్ లక్షలలో నుండి కోట్ల సంఖ్యకు చేరినకొద్ది ఈ సత్సంకల్ప న్యాయమూర్తిని గూర్చి అంతే గొప్పగా ప్రతి ఒక్కరు చెప్పుకుంటారు. ఈ కార్యము కొరకు అల్లాహ్ తఆలా వారిని ఎంచుకోవడం నిజంగా దీనిని వారి అదృష్టంగానే చెప్పుకోవచ్చును. ఇరు పక్షాల వారు న్యాయమూర్తి వద్దకు వచ్చినప్పుడు వారిలో ఒకరు తన జాతికి చెందిన మిష్నరి అయినప్పుడు, మరొకరు వారి సిద్ధాంతాన్ని తీవ్రముగా వ్యతిరేకించు జాతికి చెందిన వారని తెలిసినప్పుడు న్యాయబద్ధముగా వ్యవహరించడం నిజముగా ఒక న్యాయమూర్తికి పరీక్షయే అనబడుతుంది. కాని ఆ ధైర్యవంతుడైన ఫిలాతూస్ ఎంతో సాహసంతో, ఓర్పుతో ఆ పరీక్షను ఎదుర్కొన్నాడు. పైగా అతనికి అజ్ఞాన క్రైస్తవులు వారిని దూషించినట్లుగా భావించిన పదాలను కూడ నా రచనల నుండి వారికి చూపించడం జరిగింది. అతనిలో

ఒక వ్యతిరేక భావాన్ని కల్పించుటకు ప్రయత్నించడం జరిగింది. అయినా కూడ అతని ముఖంలో ఎలాంటి మార్పు కనిపించలేదు. ఎందుకనగా అతడు తన వివేకం ద్వారా వాస్తవాన్ని గ్రహించెను. అతడు ఈ వ్యాజ్యము వెనుక గల అసలైన కారణములను స్వచ్ఛమైన మనస్సుతో తెలుసుకొనుటకు ప్రయత్నించినందున అల్లాహ్ తఆలా కూడ అతనికి సహకరించెను. అతని హృదయంలో సత్యాన్ని గూర్చిన వాణిని అవతరింపజేసెను. ఫలితముగా అతనికి నిజా నిజాలు తెలిసినవి. ఫలితముగా అతనికి న్యాయబద్ధమైన మార్గము కనిపించడంతో అతడు చాలా సంతోషించెను. అతడు కేవలం వాస్తవాన్ని గ్రహించినందుకే నా ప్రత్యర్థికి భిన్నముగా నాకు న్యాయస్థానములో కుర్చిని ఏర్పాటు చేయించెను. కాని మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ తాంత్రిక నాయకుని వలే నాకు వ్యతిరేకముగా సాక్ష్యము చెప్పుటకు న్యాయస్థానమునకు వచ్చి నప్పుడు నేను కుర్చీపై కూర్చొని ఉండటాన్ని చూసి, అతడు ఆశించిన మేరకు నాకు అవమానం జరగలేదని గ్రహించి చివరికి సమానమైన గౌరవం లభించినచో చాలనే భావనతో అప్పుడు ఆ ఫిలాతూస్‌ను కుర్చి అడిగినాడు. కాని ఆ ఫిలాతూస్ అతనిని కోపగిస్తూ నీకు గాని, నీ పూర్వీకులకు గాని గతంలో ఎన్నడు కుర్చీ ఇవ్వబడ లేదని, నీకు కుర్చి ఇవ్వాలని మాకు ఎలాంటి ఆదేశాలు అందలేదని గట్టిగా హెచ్చరించెను. ఈ వ్యత్యాసం కూడ గమణించదగినది. ఆ కాలపు ఫిలాతూస్ యూదులకు భయపడి వారి సాక్షులలో కొందరు పెద్దలకు కుర్చీలు వేసి, దోషిగా ప్రవేశ పెట్టబడిన హజ్రత్ మసీహ్‌ని నిలబెట్టడం జరిగింది. వాస్తవానికి మసీహ్ పట్ల ఫిలాతూస్‌కు చాలా గౌరవం ఉండేది. ఒక విధముగా వారిని మసీహ్ (అ) శిష్యునిగా కూడ చెప్పుకోవచ్చును. అంతేగాకా

వారి శ్రీమతి కూడ మసీహ్‌కి పరమ శిష్యురాలు. ఆమె కూడ దైవ జనురాలిగా చెప్పుకోబడేది. కాని అతని భయం అతనిని ఇంతటి తప్పును చేయించింది. అనగా అమాయకుడైన మసీహ్‌ని అన్యాయముగా యూదులకు అప్పగించడం జరిగింది. నాపై మోపబడినట్లు కూడ వారిపై ఎలాంటి హత్యారోపణ మోపబడలేదు. వారి మధ్య కేవలం ఒక చిన్న ధార్మిక భేదమే గలదు. పైగా ఆ రోమన్ ఫిలాతూస్‌కు గట్టి మనస్థత్వము లేకుండెను. తనపై ఖైసర్‌కు ఫిర్యాదు చేయుదుమని యూదులు చేసిన హెచ్చరికను విని భయపడెను. అదే విధముగా పూర్వపు ఫిలాతూస్ మరియు నేటి ఫిలాతూస్‌లో చెప్పుకోదగినటు వంటి మరొక పోలికేమనగా ఆ కాలంలో పూర్వపు ఫిలాతూస్ ఎదుట మసీహ్ ఇబ్నే మరియం ప్రవేశపెట్ట బడినప్పుడు మసీహ్ ఏదైన తప్పు చేసినట్లు నాకు కనిపించడం లేదని అతడు యూదులకు తెలిపెను. ఆదే విధముగా ఈ కాలపు మసీహ్‌ను చివరి ఫిలాతూస్ ముందు ప్రవేశపెట్టి నప్పుడు, నాపై హత్యారోపణ మోపినందున సమాధానము ఇచ్చుటకు నాకు కొన్ని రోజుల గడువు కావాలని ఈ మసీహ్ సమయంను కోరగా, అప్పుడు ఈ చివరి కాలపు ఫిలాతూస్ నేను మీపై ఎలాంటి హత్యారోపణ చేయడం లేదని సమాధానమిచ్చెను. ఈ ఇరు వాక్యలు ఆ ఇరువురు ఫిలాతూస్‌లను ఒకే పోలికలో చేర్చాయి. ఒకవేళ ఏమైనా తేడా ఉన్నచో అది కేవలం పూర్వపు ఫిలాతూస్ తన మాటపై నిలబడలేక పోయాడు. నీపై ఖైసర్ వద్ద ఫిర్యాదు చేస్తామని హెచ్చరింగానే భయపడి, తప్పని పరిస్థితులలో ఆ రక్త పిశాచులైన యూదులకు హజ్రత్ మసీహ్‌ని అప్పగించెను. అలా చేసినందుకు అతడు తరువాత బాధ పడెను. అతని భార్య కూడ ఆవేదనకు గురైనది. ఎందుకనగా వారివురు మసీహ్‌ని

చాలా అభిమానించే వారు. కాని యూదుల అరుపులు, అల్లర్లను చూసి అతనిలో పిరికితనం ఏర్పడెను. కాని తరువాత మసీహ్‌ని సిలువపై నుండి ప్రాణాలతో కాపాడుటకు అతడు రహస్యముగా చాలా ప్రయత్నించాడు. చివరికి తన ప్రయత్నములో అతడు సఫలీకృతుడైనాడు. కాని మసీహ్‌ని సిలువపైకి ఎక్కించడం వలన ఏర్పడిన తీవ్ర గాయాలకు మసీహ్ మరణించినట్లుగా తీవ్ర స్థాయి లో సొమ్మసిల్లిపోయెను. మొత్తానికి రోమన్ ఫిలాతూస్ చేసిన ప్రయత్నం వలన మరియమ్మ కుమారుడు మసీహ్ ప్రాణాలతో బయటపడెను. పైగా ప్రాణాలను కాపాడమని మసీహ్ చేసిన దుఆ ముందుగానే ఆమోదించబడింది. ఇందుకై ఇబ్రానియా అధ్యాయం 5, వచనం 7ను చూడండి. ۞[(15)] ఆ తరువాత మసీహ్ ఆ ప్రాంతము నుండి రహస్యముగా పారిపోయి కాశ్మీర్‌కు వలస వచ్చిరి. అక్కడే మరణించిరి. శ్రీనగర్‌లోని ఖాన్‌యార్ వీధి లో వారి సమాధి ఉన్నదనే విషయాన్ని కూడ మీరు వినే ఉంటారు.

۞(15) మసీహ్ కూడ స్వయముగా భవిష్యవాణి రూపంలో ఈ విధముగా తెలిపెను. యూనుస్ సంకేతము కాకుండా మరే విధమైన సంకేతము చూపబడదు. కావున మసీహ్ తన ఈ వాక్యము ద్వారా ఏ విధముగానైతే యూనుస్ సజీవముగా చేప ఉదర భాగంలో ప్రవేశించి, మరల సజీవము గానే బయటికి వచ్చెనో అదే విధముగా నేను కూడ ప్రాణాలతో సమాధిలోకి వెళ్ళి మరల ప్రాణాలతోనే బయటకు వచ్చెదనని ముందుగానే తెలిపెను. కావున మసీహ్‌ను ఒకవేళ సిలువపై నుండి ప్రాణాలతో దించకుండా, ప్రాణాలతో సమాధిలో చేర్చకుండ ఉన్నచో ఈ సంకేతము ఏ విధముగా పూర్తి గావించబడును. ఇంతకు మించి మరే సంకేతము ప్రదర్శించబడదని మసీహ్ చెప్పిన వాక్యము కూడ, మసీహ్ ఈ సంకేతమును ప్రదర్శించి, ఆకాశముపైకి వెళ్ళినాడని ప్రచారం చేయు ప్రజల అభిమతంను పూర్తిగా ఖండిస్తుంది. సమాప్తం

ఇదంతయు ఫిలాతూస్ చేసిన ప్రయత్నముల ఫలితము. కాని పోలికపరంగా చూసినచో మొదటి ఫిలాతూస్ వ్యవహారము పిరికితనంతో కూడినదనుటకు ఎలాంటి సందేహము లేదు. ఒకవేళ అతడు నాకు మసీహ్‌లో ఎలాంటి తప్పు కనిపించడం లేదని తన అభిప్రాయాన్ని వ్యక్తపర్చి మసీహ్‌ని వదిలివేసినచో అతనికి ఎలాంటి నష్టము వాటిల్లేది కాదు. అతనికి వదిలివేయు అధికారం కూడ యుండెను. కాని అతడు ఖైసర్ వద్ద ఫిర్యాదు చేయుదురనే విషయమును విని భయపడెను. కాని ఈ చివరి కాలపు ఫిలాతూస్ పాద్రీల సమూహమును చూసి ఏ మాత్రం భయపడలేదు. వాస్తవానికి ఇక్కడ కూడ ఆంగ్లేయ ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. పైగా ఈ కాలపు విక్టోరియా రాణి ఆ కాలపు ఖైసర్ కన్న చాలా గొప్పది. అందుకే అధికారిపై ఒత్తిడి పెంచడానికి గాని, న్యాయాన్ని కప్పిపుచ్చడానికి గాని ఎవరు కూడ ధైర్యసహాసాలు ప్రదర్శించలేదు. మొత్తానికి పూర్వపు మసీహ్ కన్న ఈ చివరి కాలపు మసీహ్‌పైనే ఎక్కువగా ఆరోపణలు, నిందలు మోపబడినాయి. నాకు వ్యతిరేకముగా అన్ని జాతుల నాయకులు ఏకమయ్యారు. కాని ఈ చివరి కాలపు ఫిలాతూస్ న్యాయాన్ని ఇష్టపడెను. పైగా నా పట్ల తనకున్న అభిప్రాయమును అనగా "నేను నీపై ఎలాంటి హత్యారోపణ చేయడం లేదు" ను తాను నెరవేర్చి చూపెను. ఆ విధముగా అతడు నన్ను ఎంతో నిజాయితిగా, ధైర్యముగా నిరపరాధినని ప్రకటించెను. కాని మొదటి ఫిలాతూస్ మొదటి మసీహ్‌ని కాపాడుటకు సాకులను ఉపయోగించెను. కాని ఈ ఫిలాతూస్ మాత్రం న్యాయస్థానపు విధివిధానాల అనుసారం నడుచుకొని న్యాయస్థాన గౌరవాన్ని నిలబెట్టెను. అతనిలో పిరికితనమే లేకుండెను. నేను నిరపరాధినని తీర్పు ఇవ్వబడిన

రోజు ఆ న్యాయస్థానములో ఒక దొంగ కూడ హాజరు పర్చబడెను. మొదటి మసీహ్ సమయంలో కూడ ఒక దొంగను ప్రవేశపెట్టబడెను. ఈ విధముగా కూడ పోలికలు కలిసాయి. కాని మొదటి మసీహ్ సమయంలో పట్టుబడిన దొంగను మసీహ్‌తో కలపి సిలువపైకి ఎక్కించినట్లుగా ఈ చివరి మసీహ్‌తో పాటు ప్రవేశపెట్టబడిన దొంగను సిలువపైకి ఎక్కించలేదు, అతని ఎముకలను విరగ గొట్ట లేదు. కేవలం అతనికి మూడు నెలల సాధారణ జైలు శిక్షను విధించడం జరిగింది.

ఇప్పుడు మేము మా మొదటి విషయం వైపు తిరిగి వస్తున్నాము. ఫాతీహా అధ్యాయములో ఎన్నో వాస్తవాలు, సూక్ష్మ అంశాలు, సత్యాలు దాగి ఉన్నవి. ఒకవేళ వాటినన్నింటిని ఇక్కడ వ్రాయదలచినచో ఒక గ్రంథము సరిపోదు. ఈ ఆధ్యాయములో నేర్పబడిన వివేకవంతమైన దుఆను చూడండి. అనగా اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ఈ దుఆలో ఒక సంపూర్ణ భావము కేంద్రీకృతమై యున్నది. ధార్మిక, ప్రాపంచిక లక్ష్య సాధనకు ఇదియే తాళం చెవి లాంటిది. ఏదేని లక్ష్యమును చేదించుటకు మనకు సరైన మార్గం లభించనిచో, దానికి సంబంధించిన పూర్తి వాస్తవికత ను మనము తెలుసుకోలేము. దాని ప్రయోజనాలన్నింటి నుండి మనము పూర్తి స్థాయిలో లాభమును పొందలేము. ప్రపంచములో గల కష్టాలు, సమస్యలన్నియు అవి పాలనాధికార, మంత్రిత్వ శాఖల బాధ్యతలకు చెందినవి గాని, సైన్యానికి చెందినవి లేదా యుద్ధానికి సంబంధించినవే గాని, సామాజిక మరియు సిద్ధాంత పరమైన అతి సూక్ష్మమైన అంశాలే గాని, కర్మాగార లేదా వైద్య సంబంధిత నిర్ణాయాల విషయంలోగాని, వ్యాపారము, వ్యవసాయ మునకు చెందిన అంశాలలోనే గాని మనకు వాటిని ఏ విధముగా

ప్రారంభించాలనే ఒక నిర్దేశిత ప్రామాణికము మన వద్ద లేనంత వరకు మనము ఆయా సమస్యలను అధిగమించడం కష్టతర మగును, అసాధ్యమగును. ఈ కష్టకాలములో అట్టి కష్టాల నుండి ఏ విధముగా బయటపడాలని ప్రతి వివేకవంతుడు ఆదే పనిగా రాత్రింబవళ్ళు ఆలోచిస్తూనే ఉంటాడు, ఫలితముగా ఆ కష్టాల నుండి బయటపడుటకు ఏదో ఒక మార్గము దొరుకుతుందనే ఆకాంక్ష అతనిలో ఏర్పడుతుంది. ప్రతి శ్రమ, ప్రతి పరిశోధన, ప్రతి సమస్య, ప్రతి అలజడి పరిష్కరించబడుటకు ఏదో ఒక మార్గము సుగమం కావాలని కోరుకుంటుంది. అలాంటప్పుడు ధార్మిక ప్రాపంచిక లక్ష్యసాధనలో మార్గం సుగమం కాబడుటకు కూడ దుఆయే ఆధారం. ఏదేని కర్తవ్యంలో సరైన దిశానిర్దేశం లభించినచో నిశ్చయముగా అల్లాహ్ తఆలా అనుగ్రహము వలన ఆ కర్తవ్యంను పొందగలరు. సర్వాధికారి, వివేకవంతుడైన దేవుడు ప్రతి లక్ష్యసాధనకై ఒక విధానమును నిర్ణయించినాడు. ఉదా॥ సరైన రోగ నిర్ధానచేయకుండా, సరైన ఔషధము సూచించకుండా ఒక అనారోగ్యునికి సరిగా వైద్యం చేయలేము. అందుకు ఈ విధానమును అనుసరించినప్పుడే స్వస్థత చేకూరునని అతని హృదయము కూడ సాక్ష్యమివ్వ వలెను. ఒక వ్యవస్థకు తగిన దిశా నిర్దేశం లేకుండా అసలు ఈ ప్రపంచములో ఏ వ్యవస్థ ఏర్పడలేదు. అందుకే మార్గమును ఎంచుకోవడం లక్ష్యసాధకుల విధి. ఏ విధముగానైతే ప్రాపంచిక సాఫల్యతను సరైన విధముగా చేపట్టుటకు ముందుగా అనుసరించుటకు ఒక మార్గ ఆవశ్యకత ఉన్నట్లుగా, అదే విధముగా దైవమిత్రుడనబడుటకు, దేవుని అభిమానము మరియు అనుగ్రహములను పొందుటకు పూర్వ కాలం నుండియే ఒక మార్గ ఆవశ్యకత గలదు. అందుకోసమే ఫాతిహా అధ్యాయము

తరువాత రెండవ అధ్యాయమైన అల్ బఖరహ్ అధ్యాయపు ప్రారంభములో هُدًى لِّلْمُتَّقِيْنَ అని తెలుపడం జరిగింది. అనగా మేము తెల్పునట్టి మార్గము అనుగ్రహములను కల్పించునట్టి మార్గము. ۞[16] కావున ఈ దుఆ అనగా اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ఒక పరిపూర్ణమైన దుఆ. ధార్మిక ప్రాపంచిక కష్టాల సమయంలో వాటిని దూరం చేసుకొనుటకు అన్నింటికన్న ముందు మానవుడు అన్వేషించవలసిన మొదటి మార్గం సన్మార్గమేనని ఈ దుఆ మానవు లందరికి గుర్తు చేస్తుంది. అనగా సులువుగా ఆ స్థావరం వరకు చేరుటకు చక్కటి, చదునైన మార్గంను అన్వేషించవలెను. ఆపై మనస్సు కూడ అన్ని రకాల అనుమానాలను వీడి పూర్తి నమ్మకాన్ని కల్గి ఉండాలి. కాని ఇంజీల్ మార్గదర్శకం ప్రకారం రొట్టెలు యాచించువాడు దైవప్రసన్నతను పొందు మార్గమును అనుసరించ లేదు. అతని లక్ష్యము కేవలం రొట్టెలు పొందడమే. రొట్టెలు లభించినచో అతనికి దేవునితో ఏ పని ఉండును? ఈ కారణం చేతనే క్రైస్తవులు సన్మార్గం నుండి వైదొలిగినారు. అలా మానవున్ని దేవునిగా మలుచునట్టి ఎంతో సిగ్గుచేటు అయినా సిద్ధాంతంను వారు ఏర్పర్చుకున్నారు. ఇతర ప్రవక్తల కన్న మరియమ్మ కుమారుడై న ఏసులో ఏ ఇతర ప్రత్యేకతలు ఉన్నాయో, మరి వారిని దేవుడిని చేయాలనే ఆలోచన వీరికి ఎందుకు కల్గినదో నాకు అర్థం కావడం లేదు. అద్భుతాల విషయానికి వచ్చినచో వీరి కన్న ఇతర ప్రవక్తలు అత్యధిక అద్భుతాలను చూపించారు. ఉదా॥ మూసా ప్రవక్త, యసఅ ప్రవక్త, ఏలియా ప్రవక్త. ఎవరి చేతిలో నా ప్రాణం ఉన్నదో అతని

۞(16) ఫాతిహా అధ్యాయములో సన్మార్గమును చూపమని దుఆ చేయడం జరిగింది. మరొక అధ్యాయములో ఆ దుఆ ఆమోదం పొంది సన్మార్గంను చూపినట్లు తెలుపడం జరిగింది. ***సమాప్తం.***

సాక్షిగా తెల్పుచున్నాను ఒకవేళ నేను పొందిన ఈ కాలంను మరియమ్మ కుమారుడైన ఏసు పొందినచో నేను చేసి చూపిన పనులను అతడు ఏమాత్రం చేసి చూపేవాడు కాదు. నా ద్వారా ప్రదర్శింపబడిన సంకేతములను అతడు ఎన్నడు ప్రదర్శించక పోవును.۞(17) పైగా తన కన్నా నా పైనే దైవానుగ్రహములు అధికముగా కురవడంను చూసేవారు. ఒక మహోన్నతమైన సందేశహరుడికి శిష్యుడనని తెల్పుకుంటున్న నా స్థాయియే ఇలా ఉన్నచో మరి ఆ మహోన్నతమైన సందేశహరుడి స్థాయి ఇంకెంత గొప్పగా ఉండునో ఒక్కసారి ఆలోచించండి. ذٰلِكَ فَضۡلُ اللّٰهِ يُؤۡتِيۡهِ مَنۡ يَّشَآءُ (అల్ మాయిదహ్–5:55) ఇక్కడ ఎలాంటి ఈర్ష్య, అసూయలను వ్యక్త పర్చవలసిన అవసరం లేదు. అల్లాహ్ ఆశించునదే జరుగును.

---

۞(17) ఈ అంశంను బలపర్చు విషయమును మీరు అతి త్వరలోనే నుజూలుల్ మసీహ్ అను పుసక్తములో చూచెదరు. ఈ పుస్తకము ప్రచురించబడుతుంది. ప్రస్తుతం పది భాగాలు ప్రచురించబడ్డాయి. అతి త్వరలో ప్రచురించబడు ఈ పుస్తకము వాస్తవానికి పీర్ మెహర్ అలీ గోల్డవీ గారి పుస్తకము "తంబూరే చిష్తియాయి"ను ఖండిస్తూ లిఖించ బడింది. పీర్ మెహర్ అలీ గారు ముహమ్మద్ హుసేన్ బటాల్వీ వ్యాసాన్ని దొంగలించి తన వ్యాసముగా వ్రాసుకున్న విషయాన్ని ఈ పుస్తకములో నిరూపించబడింది. కావున అతడు ఎంత పెద్ద తప్పు చేశాడనగా, ఆ తప్పును చర్చించినచో సిగ్గుతో అతని జీవితమే భారమైపోతుంది. ఆ దురదృష్టవంతుడు నేను ఏజాజుల్ మసీహ్‌లో పేర్కొన్న భవిష్యవాణి ప్రకారమే మృతి చెందాడు. ఈ రెండవ దురదృష్టవంతుడు అన్యాయముగా ఒక పుస్తకమును వ్రాసి اِنِّیۡ مُهِیۡنٌ مَنۡ اَرَادَ اِهَانَتَكَ (అనగా నిన్ను అవమానించుటకు సంకల్పించిన వానిని నేను అవమానింతును.) అను భవిష్యవాణికి నిదర్శనముగా నిలిచాడు. فَاعۡتَبِرُوۡا يٰۤاُولِى الۡاَبۡصَارِ (అనగా ఓ వివేకవంతులారా! గ్రహించండి.) **సమాప్తం.**

అతని ఆకాంక్షను వ్యతిరేకించు వారు కేవలం దురదృష్టవంతులే గాకా మరణించి నరకంలో ప్రవేశించుదురు. ఒక సామాన్య మానవున్ని దైవంగా మలుచుకొనువారు నాశనమైపోయారు. ఒక మహోన్నతమైన సందేశహరున్ని స్వీకరించని వారు నాశన మగుదురు. నన్ను గుర్తించిన వారు అదృష్టవంతులు. దేవుని మార్గములన్నింటిలో నేనే చివరి మార్గమును. అతని తేజస్సులన్నింటి లో నేనే చివరి తేజస్సును. నన్ను వదిలివేయువాడు దురదృష్ట వంతుడు. ఎందుకనగా నేను లేని ప్రతి చోటు అంధకారమయమే.

ముసల్మానులకు ఇచ్చిన రెండవ మార్గదర్శకము సున్నత్. అనగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆచరణల విధానము. వాటిని వారు (స) పవిత్ర ఖుర్ఆన్ ఆదేశాలను విపులీకరించి ఆచరించి చూపించారు. ఉదా॥ పవిత్ర ఖుర్ఆన్‌లో చూసినచో ఐదు పర్యాయముల నమాజ్‌ల యొక్క రకాతులు స్పష్టము గా కనిపించవు. అనగా ఉదయం వేళ ఎన్ని రకాతులు చదువ వలెను, ఇతర వేళలలో ఎన్ని రకాతులు చదువవలెను అనే విషయం. కాని సున్నత్ ఈ విషయాలన్నింటిని విపులీకరించి తెల్పుచున్నది. అందుకని సున్నత్ మరియు హదీసులు రెండు ఒకటే అని మోసపోకూడదు. ఎందుకనగా హదీసులు వంద, నూట యాభై సంవత్సరాల తరువాత కూర్పు చేయబడినవి. కాని సున్నత్ మాత్రం పవిత్ర ఖుర్ఆన్ ఆదేశాలతో పాటు వెలుగులోకి వచ్చింది. పవిత్ర ఖుర్ఆన్ తరువాత సున్నత్‌యే ముసల్మానులకు చాలా పెద్ద ఉపకారం చేసింది. అల్లాహ్ మరియు అతని ప్రవక్త నిర్వాహణ బాధ్యతలు కేవలం రెండు విధాలుగానే ఉండేవి. అవి ఏమిటనగా, ఒకటి అల్లాహ్ ఖుర్ఆన్‌ను అవతరింపజేసి ప్రాణకోటికి తన వాక్కుల ద్వారా తన ఆకాంక్షను తెలియ జేసాడు. ఇది దేవుని

విధి ధర్మం. రెండవది దేవుని వాక్కులను ఆచరణ రూపంలో ఆచరించి చూపుతూ ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించడం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బాధ్యత. కావున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ వాక్కులను ఆచరణ రూపంలో చూపించారు. తమ సాంప్రదాయమునకు అనుగుణము గా అనగా ఆచరణల ద్వారా సందిగ్ధమైన మరియు క్లిష్టమైన సమస్యలను పరిష్కరించారు. కాని హదీస్‌లలో కూడ ఇందుకు పరిష్కారం ఉన్నదని వాదించడం అర్థరహితం. ఎందుకనగా హదీసులు వెలుగులోకి రాక ముందే ఇస్లాం భూమండలంపై స్థిరపడి పోయింది. ۞(18) హదీస్‌లు వెలుగులోకి రానంత కాలం ప్రజలు నమాజ్‌లే సల్పలేదా?, జకాత్ చెల్లించలేదా?, హజ్ చేయలేదా?. లేక హలాల్ (అనుమతి), హరామ్ (నిషేధము)ను గూర్చి అవగాహన లేకుండా ఉన్నారా ఏమిటి?. మూడవ మార్గదర్శకము హదీస్. ఎందుకనగా చాలా వరకు ఇస్లాం చరిత్రను, విశిష్టతలను, ధార్మిక విషయాలను హదీస్‌లు వివరణాత్మకముగా వెల్లడించాయి. హదీస్‌ల యొక్క గొప్ప ప్రయోజనమేమిటనగా, అవి ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌లకు సేవకుడి స్థాయిని కలిగి యున్నాయి. యూదులు తమ హదీస్‌లను గూర్చి చెప్పుకున్నట్లుగా ఖుర్‌ఆన్ ప్రాముఖ్యత గుర్తెరుగని వారు హదీస్‌లను ఖాజియే ఖుర్‌ఆన్

۞(18) అహ్‌లే అహదీసు వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వాక్కులను, ఆచరణలను రెండింటిని హదీస్‌లుగానే పేర్కొంటారు. వారు ఏమను కుంటారు అనే విషయంతో మనకు సంబంధం లేదు. వాస్తవానికి సున్నత్ అనునది వేరు. ఈ సున్నత్‌ను స్వయముగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు వ్యాపింప జేశారు. హదీసులు వేరు, అవి తరువాత కాలంలో క్రోడికరించబడ్డాయి. ***సమాప్తం.***

(ఖుర్ఆన్‌కు న్యాయాధిపతి) అని ప్రచారం చేస్తూంటారు. కాని మేము మాత్రం హదీస్‌లను ఖుర్ఆన్ మరియు సున్నత్‌లకు సేవకుడిగానే నిర్ధారిస్తాము. సేవకులు ఉన్నప్పుడే యజమాని గొప్పతనం బహిర్గతమవుతుంది. ఖుర్ఆన్ దేవుని వాక్కు, సున్నత్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆచరణలు. హదీస్ సున్నత్‌కు ఒక నిర్థిష్ట సాక్ష్యం. అంతేగాని హదీస్‌ను ఖాజియే ఖుర్ఆన్ అనడం ముమ్మాటికి తప్పు. నవూజుబిల్లాహ్. ఒకవేళ ఖుర్ఆన్‌పై ఖాజీని నిర్ణయించినచో స్వయముగా ఖుర్ఆన్‌నే నిర్ణయించవచ్చును. నమ్మకంతో పొందుపర్చిన హదీస్‌లు ఎన్నడు ఖుర్ఆన్‌కు న్యాయధికారి కాలేవు. అవి కేవలం ఆధారమును చూపుటకే గలవు. ఖుర్ఆన్ మరియు సున్నత్ చేయవలసిన పనిని చేసి చూపినవి. హదీస్ కేవలం అందుకు సాక్ష్యము మాత్రమే. అలాంటి హదీస్ ఏ విధముగా ఖుర్ఆన్‌పై న్యాయాధికారిగా నిలుస్తుంది? ఈ పొందుపర్చబడిన న్యాయాధికారి వెలుగులోకి రాకముందే ఆ కాలంలో ఖుర్ఆన్ మరియు సున్నత్‌లు మార్గదర్శకం చేశాయి. కావున హదీస్‌ను ఖాజియే ఖుర్ఆన్ అనకుము. కాని ఖుర్ఆన్ మరియు సున్నత్‌లకు సాక్ష్యం హదీస్ అని పలుకుము. మొత్తానికి ఖుర్ఆన్ ఆకాంక్షను సున్నత్ వివరముగా తెలియజేస్తుంది. సున్నత్ అనగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ అనుచరులను నడిపించినటువంటి మార్గము. వంద, నూట యాభై సంవత్సరముల తరువాత పుస్తకాలలో పొందుపర్చిన విషయాలు సున్నత్ కాబడవు. వాటిని హదీస్‌లని అంటారు. సత్పురుష ముసల్మానుల ఆచరణ రూపంలో ఆది నుండి కొనసాగుతూ వచ్చిన కార్యరూప ఉదాహరణకు మారుపేరుయే సున్నత్. ఇందుకై వేలాది ముసల్మానులు అనుసరిస్తూ వచ్చారు.

హదీస్‌లలోని అధిక భాగం నమ్మకముపైనే పొందుపర్చబడినప్పటికి ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌లకు వ్యతిరేకముగా లేనిచో ఆచరణకు యోగ్యమైనది, ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌ను బలపర్చునది. ఇస్లామీయ అనేక సమస్యలకు తగిన పరిష్కార సంపద అందులో గలదు. కావున హదీస్‌ను గౌరవించక పోవడమనగా ఇస్లాం యొక్క ఒక అవయవమును కోసివేయడమనే అర్థం. అవును! ఒకవేళ ఒక హదీస్ ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌కు భిన్నముగా ఉన్నచో లేదా ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌కు అనుకూలముగా ఉన్న హదీస్‌కు భిన్నముగా ఉన్నచో అనగా ఉదా॥ సహి బుఖారిలో గల హదీస్‌కు భిన్నముగా ఏదేని హదీస్ ఉన్నచో అట్టి హదీస్‌లు ఆమోద యోగ్యము కావు. ఎందుకనగా ఒకవేళ ఆ హదీస్‌ను ఆమోదించిన చో ఖుర్‌ఆన్ మరియు ఖుర్‌ఆన్‌కు అనుకూలముగా ఉన్న హదీసు లన్నింటిని రద్దు చేయవలసి వస్తుంది. కావున ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌కు భిన్నముగా ఉన్నవేగాకా, ఖుర్‌ఆన్ మరియు సున్నత్ అనుకూలముగా ఉన్న హదీస్‌లకు కూడ భిన్నముగా ఉన్న హదీస్‌ను విశ్వసించుటకు ఏ సత్పుర్షుడు కూడ సాహసించలేడని నేను అర్థం చేసుకోగలను. మొత్తానికి హదీస్‌లను గౌరవించుము. వాటి నుండి ప్రయోజనము పొందుము. అవి హజ్రత్ ముమహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వైపు సూచించబడినవి. ఖుర్‌ఆన్ మరియు సున్నత్ వాటిని తిరస్కరించనంత వరకు మీరు కూడ వాటిని తిరస్కరించ కుము. పైగా వాటిని కదిలించకుండా, వాటిని ప్రక్కకు పెట్టకుండా, వాటిని ఆచరించకుండా, వాటిని వదిలి వేయకుండ ఉండునట్లుగా అహాదీసే నబ్వీయాను అనుసరించుము. అందుకు నిదర్శనముగా నీ వద్ద తగిన హదీస్ కూడ ఉండవలెను. కాని ఖుర్‌ఆన్ తెలుపునట్టి విషయాలకు పూర్తి భిన్నముగా ఏదేని హదీస్ ఉన్నచో దాని

ఆంతర్యమును అర్థం చేసుకొనుటకు శోధించుము. బహుశా నీవు అర్థం చేసుకోవడంలోనే పొరపాటుపడి ఉండవచ్చును. ఒకవేళ ఆ పొరపాటు ఏ విధముగాను దూరం కానిచో అది రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉచ్చరించినది కాదని అట్టి హదీస్‌ను నీవు వదిలి వేయుము. ఒకవేళ ఏదేని హదీస్ బలహీనముగా ఉన్నను, అది ఖుర్‌ఆన్‌కు అనుకూలముగా ఉన్నచో అట్టి హదీస్‌ను స్వీకరించుము. ఎందుకనగా ఖుర్‌ఆన్ దానిని బలపరుస్తుంది. ఒకవేళ ఏదేని హదీస్ భవిష్యవాణి రూపంలో ఉండి, హదీస్ వెల్లడించు వారి దృష్టిలో బలహీనముగా ఉన్నచో అట్టి హదీస్ మీ కాలంలో లేదా మీకన్న ముందు కాలంలో పూర్తి గావించబడినచో అట్టి హదీస్‌ను సత్యమైనదని విశ్వసించుము. ఇలాంటి హదీస్‌లను బలహీనమైనవిగా, అల్పమైనవిగా నిర్ధారించినటువంటి హదీస్ సేకరులను, కథకులను అసత్యులుగా, ప్రతి వాదులుగా భావించుము. భవిష్యవాణులతో కూడిన ఇలాంటి హదీసులు కొన్ని వందల సంఖ్యలో గలవు. వాటిలో అనేక హదీసులను హదీస్ సేకరులు అంశం పరంగా, ఉల్లేఖన పరంగా, బలహీనమైనవిగా పేర్కొన్నారు. కావున వాటిలో ఏదేని హదీస్ తరువాత కాలంలో పూర్తి గావించబడినచో ఆ హదీస్ బలహీనమైనది కావున మేము దానిని విశ్వసించమని లేదా దాని ఉల్లేకులు నమ్మకస్తులు కారని దానిని తిరస్కరించకుము. దేవుడు ఒక హదీస్ సత్యతను తానే స్వయముగా బహిర్గతం చేసినప్పుడు దానిని తిరస్కరించినచో అది అవిశ్వాసమనబడుతుంది. ఒకవేళ ఇలాంటి హదీస్‌లు వేల సంఖ్యలో ఉండి, వేల సంఖ్యలో వాటి సత్యత బహిర్గతమైనను హదీస్ సేకరుల దృష్టిలో అవి బలహీనమైనచో అట్టి వేలాది ఇస్లాం ఆధారములను రద్దు చేయుదురా? ఒక్కసారి ఆలోచించండి. అలా

చేసినచో మీరు ఇస్లాంకు శత్రువులగుదురు. అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. عٰلِمُ الْغَيْبِ فَلَا يُظْهِرُ عَلٰى غَيْبِهٖٓ اَحَدًا- اِلَّا مَنِ ارْتَضٰى مِنْ رَّسُوْلٍ(అల్‌జిన్-72:27,28) కావున స్వచ్ఛమైన భవిష్యవాణి సత్యప్రవక్తలపై కాకుండా మరెవరి వైపు సూచించడం జరుగుతుంది. అలాంటి సమయంలో స్వచ్ఛమైన హదీస్‌ను బలహీన హదీస్‌గా పేర్కొనుటలో హదీస్ ఉల్లేఖులు పొరపాటు బడ్డారని తెలుపడంలో విశ్వాసం ఉన్నదా!, లేకా బలహీన హదీస్‌ను సత్యమని నిదర్శనము చూపి దేవుడు తప్పు చేశాడని భావించడం సమంజసమా? ఒకవేళ ఏదేని ఒక హదీస్ బలహీనమైనదని పేర్కొన్నప్పటికి, అది ఖుర్‌ఆన్, సున్నత్‌కు మరియు ఖుర్‌ఆన్‌కు అనుకూలముగా ఉన్న హదీస్‌లకు వ్యతిరేకముగా లేకున్నచో అట్టి హదీస్ ప్రకారం నడుచుకొనుము. కాని చాలా జాగ్రత్తలు తీసుకుంటూ హదీస్‌లకు అనుగుణముగా నడుచుకోవాలి. ఎందుకనగా ఎన్నో ఆమోదయోగ్యమైన హదీస్‌లే ఇస్లాంలో విబేధాలు సృష్టించాయి. ప్రతి వర్గము వారు తమకు అనుకూలముగా హదీస్‌లను మార్చుకున్నారు. చివరికి నమ్మకమైన, క్రమం తప్పకుండా ఆచరించు నమాజ్ విషయంలో కూడ హదీస్‌ల ద్వారా వివిధ రకాల విభేదాలను సృష్టించారు. కొందరు గట్టిగా ఆమీన్ అంటారు. కొందరు నోటిలోనే ఆమీన్ అంటారు. కొందరు ఇమామ్ వెనుక ఫాతిహా చదువుతుంటారు, మరి కొందరు అలా చదవడంను తప్పుగా భావిస్తుంటారు. కొందరు యదపై చేతులు కట్టుకుంటారు, మరి కొందరు బొడ్డుపై చేతులు కట్టుకుంటారు. ఈ బేధాలన్నింటికి హదీస్‌లే కారణం. كُلُّ حِزْبٍۭ بِمَا لَدَيْهِمْ فَرِحُوْنَ (మిమినూన్-23:54) (అనగా ప్రతి వర్గము వారు అవలంభించిన ముక్కపై గర్వపడసాగెను.) కాని సున్నత్ మాత్రం ఒకే విధానాన్ని ఆచరింప

జేసింది. కథనాల ప్రవేశము ఆ విధానంలోనే ప్రకంపనలను సృష్టించింది. అంతేగాకా హదీస్‌ల అవగాహన రహితం అనేకులను నాశనం చేసింది. షియ్యావారు కూడ ఈ విధముగానే నాశన మయ్యారు. ఒకవేళ వారు ఖుర్‌ఆన్‌ను ఆధారము చేసుకొని నడిచినచో కేవలం ఒక్క నూర్ అధ్యాయమే వారిలో వెలుగులను నింపేది. కాని హదీస్‌లే వారి నాశనానికి కారణమయ్యాయి. అదే విధముగా యూదులలో అహ్లే హదీస్ అని పిలువబడే వారు కూడ హజ్రత్ మసీహ్ అవతరించిన సమయంలో నాశన మైనారు. ۞(19) కొంత కాలం తరువాత వారు తౌరాత్‌ను అనుసరించడం వదిలిపెట్టినారు. తౌరాత్‌పై హదీస్‌లే ఆధిక్యతను కలిగియున్నాయనే విశ్వాసం నేటికి వారిలో గలదు. ఇదే వారి సిద్ధాంతంగా మారింది. కావున ఏలియా మరల ఆకాశం నుండి తన శరీరముతో పాటు అవతరించనంత వరకు వారి మసీహ్ మౌవూద్ అవతరించడని తెలుపే హదీస్‌లు కూడ వాటిలో అనేకము గానే ఉన్నాయి. అట్టి హదీస్‌లే వారిని సరిదిద్దుకోలేని విధముగా త్రప్పుద్రోవ పట్టుటకు కారణమైనాయి. వారు అట్టి హదీస్‌లపైనే

۞(19) తాల్మూద్ యొక్క హదీస్‌లు మరియు కథనాలలో పేర్కొన్న విషయాల వలన ఇంజీల్‌లో పేర్కొన్న విషయాలను ఎంతో తీవ్రముగా వ్యతిరేకించడం జరిగింది. ఈ హదీస్‌లను కూడ ఒక్కొక్కరి ద్వారా హజ్రత్ మూసా అలైహిస్సలాం వరకు అనుసంధానం చేసేవారు. పైగా ఇవి హజ్రత్ మూసా గారి భవిష్యవాణులని ప్రచారం చేసేవారు. చివరికి పరిస్థితి ఎంతగా దిగజారిందనగా, ప్రజలు తౌరాత్‌ను వీడి సమయమంతయు ఈ హదీస్‌లనే అధ్యయణం చేయసాగారు. కొన్ని విషయాలలో తాల్మూద్ తౌరాత్ బోధనకు భిన్నముగా ఉండెను. అయినా కూడ యూదులు తాల్మూద్‌కు అనుగుణముగానే ఆచరించేవారు. తాల్మూద్‌ను యూసుఫ్ బార్‌కలి పొందుపర్చారు. ప్రచురణ లండన్ 1878. **సమాప్తం**

పట్టుబడుతూ ఏలియా అనగా యోహన్న లేదా యహ్యా ప్రవక్త అని, వీరే ఏలియా రూపంలో, వారి గుణగణాలతో అవతరించారు. ఛాయ ప్రకారముగా వారి రూపములో అవతరించారు అని హజ్రత్ మసీహ్ చెప్పినట్టి ఆంతర్యమును అర్థం చేసుకొనలేక పోయారు. వారు ఇలా మోసపోవుటకు కారణం కూడ ఆ హదీస్‌లే. చివరికి అవి వారిని అవిశ్వాసులుగా మార్చినవి. బహుశా వారు ఆ హదీస్‌ల అర్థాలను కూడ మార్చి ఉండ వచ్చును. లేదా అట్టి హదీస్‌లలో మానవ వాక్యములు చేరి ఉండవచ్చును. మొత్తానికి హజ్రత్ మసీహ్‌ని తిరస్కరించింది యూదులలో హదీస్‌లను నమ్ముకున్నవారే అనే వాస్తవం బహుశా ముసల్మానులకు తెలిసి ఉండక పోవచ్చును. వారే హజ్రత్ మసీహ్‌పై నిందలు మోపారు, అవిశ్వాస తీర్మాణాలు వ్రాసారు, వారిని మార్గభ్రష్టులని నిర్ణయించారు. పైగా ఈ వ్యక్తి దేవుని గ్రంథాలను విశ్వసించడం లేదని, ఇల్యాస్ మరల అవతరించునని దేవుడే తెల్పినప్పటికి అట్టి భవిష్యవాణులకు ఈ వ్యక్తి ఆంతర్యాలు వివరిస్తున్నాడని, ఎలాంటి బలమైన నిదర్శనాలను చూపకుండానే ఈ వ్యక్తి ఆ భవిష్యవాణులన్నింటిని తనకు అనుకూలముగా మార్చుకుంటున్నాడని నిందించారు. ۞[20] అంతే

---

۞(20) హజ్రత్ ఈసా అలైహిస్సలాంను మార్గ భ్రష్టుడని తీర్మాణించిన సమయంలో పోలూస్ కూడ తిరస్కరించువారిలో చేరినాడు. తరువాత కాలంలో అతడే తనకు తానుగా మసీహ్ దూతగా ప్రాముఖ్యత గాంచినాడు. ఈ వ్యక్తి మసీహ్‌ని వారి జీవిత కాలంలోనే తీవ్రంగా వ్యతిరేకించాడు. హజ్రత్ మసీహ్ పేరుతో లిఖించబడిన ఇంజీల్ అన్నింటిలో ఎక్కడ కూడ, నా తరువాత పోలూస్ ప్రాయశ్చిత్తం చేసుకొని నా దూతగా వెలుగొందును అని మసీహ్ భవిష్యవాణి చేసినట్లు పేర్కొనబడలేదు. అట్టి వ్యక్తి గత జీవితమును గూర్చి చర్చించుకోవలసిన అవసరం మనకు ఏమాత్రం

గాకుండా వారు హజ్రత్ మసీహ్‌ని అవిశ్వాసుడనే గాకుండా అధర్మికుడని నామకరణం చేశారు. అంతటితో ఆగకుండా ఒకవేళ ఈ వ్యక్తిని సత్యవంతుడిగా విశ్వసించినచో మూసా పరంపర అసత్యమవుతుందని కూడ ప్రచారం చేశారు. వారికి అది అంధకార కాలం. అసత్య హదీస్‌లు వారిని మోసం చేశాయి. మొత్తానికి హదీస్‌లను అధ్యయనం చేయునప్పుడు ఒక జాతి వారు ఈ హదీస్‌లకు తౌరాత్‌పై అధికత్యను కల్పించి ఒక సత్య ప్రవక్తను అవిశ్వాసుడు, దజ్జాల్ అని నామకరణం చేసి వారిని తిరస్కరించు స్థాయికి చేరుకున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. కాని మన ముస్లిములకు సహి బుఖారి ఎంతో నమ్మకమైన, శుభప్రదమైన ప్రయోజనకరమైన గ్రంథము. హజ్రత్ ఈసా అలైహిస్సలాం మరణించారని ఎంతో స్పష్టముగా ఈ గ్రంథములో పేర్కొనబడింది. అదే విధముగా ముస్లిం మరియు ఇతర హదీస్ పుస్తకాలు కూడ అనేక పరిజ్ఞానంను, పరిష్కారముల సంపదను తమలో ఇమడింప జేసుకున్నాయి. కావున ఖుర్‌ఆన్, సున్నత్ మరియు ఖుర్‌ఆన్‌కు అనుగుణముగా ఉన్నటువంటి హదీస్‌లకు వ్యతిరేకముగా లేని

---

లేదు, అతని గూర్చి క్రైస్తవులకు బాగా తెలుసు. విచారకరమైన విషయమేమనగా ఈ వ్యక్తియే హజ్రత్ మసీహ్‌ని తన దేశంలో ఉన్నంత కాలం చాలా ఇబ్బందులకు గురి చేశాడు. మసీహ్ సిలువపై నుండి రక్షింపబడి కశ్మీర్‌కు చేరుకున్న తరువాత అతడు ఒక అసత్య స్వప్నంను ఆధారము చేసుకొని మసీహ్ అనుచరులలో కలిసిపోయాడు. ఆపై త్రైత్రిక సిద్ధాంతంను ప్రారంభించి, తౌరాత్‌లో శాశ్వితముగా నిషేధించబడిన పంది మాంసంను క్రైస్తవుల కొరకు అనుమతించాడు. అంతేగాకా మద్యపానంనకు ప్రాచుర్యతనిచ్చాడు. ఇంజీల్ ధర్మములో కూడ త్రైత్రిక సిద్ధాంతాన్ని కలిపినాడు. తద్వారా యూనానికి చెందిన విగ్రహారాధకులు ఈ దురాచారములను చూసి సంతోషించునని భావించెను. ***సమాప్తం.***

హదీస్‌లను అనుసరించుటలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఓ అల్లాహ్‌ను అన్వేషించు ప్రజలారా! చెవులు విప్పి వినుము. నమ్మకమును మించిన మరొక సాధనము లేదు. నమ్మకమే పాపము నుండి మోక్షమును కలిగించును. నమ్మకమే సత్కార్యములు చేయుటకు శక్తిని ఇస్తుంది. నమ్మకమే దేవుని స్వచ్ఛమైన దాసుడిగా మార్చును. నమ్మకము లేకుండానే మీరు పాపమును వీడగలరా?, నమ్మకము లేకుండానే మీరు మీ మనోభావాల నుండి దూరముండ గలరా?, నమ్మకము లేనిదే మీరు సంతృప్తి పొందగలరా?, నమ్మకము లేకుండానే మీరు నిజమైన మార్పును పుట్టించు కోగలరా?, నమ్మకము లేకుండానే మీరు సత్యానందమును పొందగలరా?, మీ నుండి పాపమును దూరం చేయునట్టి పరిహారము గాని, దండుగా గాని ఆకాశము క్రింద ఏదైన గలదా?, మరియమ్మ కుమారుడైన ఏసు కల్పిత రక్తము మిమ్ములను పాపముల నుండి విముక్తి చేయించగలదా? ఓ క్రైస్తవులారా! భూమి పగిలి తునాతునకలు అగునట్టి అసత్యమును పలుకకుము. ఏసు స్వయము గా తన మోక్షానికై నమ్మకాన్ని ఆధారం చేసుకొనెను. ఏసు నమ్మకాన్ని పెంచుకొని మోక్షమును పొందినాడు. కాని ఏసు రక్తము చిందించడం వలన మేము పాపముల నుండి మోక్షము పొందామని ప్రచారం చేస్తూ జనులను మోసగించు క్రైస్తవులపై విచారము! వాస్తవానికి వారు తల నుండి అరి కాలు వరకు పాపములో మునిగి ఉన్నారు. వారి దేవుడు ఎవరో వారికే తెలియదు. వారి జీవితము అశ్రద్ధ పూరితము. వారి మెదడులో సారాయి మత్తు గలదు. ఆకాశము నుండి దిగునట్టి పవిత్రమైన మత్తును గూర్చి వారికి ఏమాత్రం తెలియదు. అల్లాహ్‌తో గడుపు జీవితము నుండి మరియు పరిశుద్ధ జీవిత ప్రతిఫలముల నుండి వారు దూరముగా

ఉన్నారు. నమ్మకము లేనిదే మీరు అంధకారము నుండి బయటపడలేరని, మీకు పరిశుద్ధాత్మ లభించనే లభించదని గుర్తుంచుకొనుము. నమ్మకము గలవారే ధన్యులు. ఎందుకనగా వారే అల్లాహ్‌ను చూస్తారు. అనుమానాలు, సందేహాల నుండి నివృత్తి పొందిన వారే ధన్యులు. ఎందుకనగా వారే పాపముల నుండి మోక్షమును పొందెదరు. నమ్మకము అనే సంపద లభించి నందుకు మీరు ధన్యులు. ఆ తరువాత మీ పాపములు అంతమగును. పాపము, నమ్మకము రెండు ఒకేచోట ఉండలేవు. ఒక విష సర్పము పుట్టలో ఉన్నదనే విషయం తెలిసినప్పటికి మీరు ఆ పుట్టలో మీ చేయిని పెట్టగలరా? అగ్ని పర్వతము నుండి రాళ్ళ వర్షము కురియు చోట గాని, పిడుగు పడు చోట గాని, సింహమున్నచోట గాని, మానవులందరిని నాశనమొనర్చు మహామ్మారి వ్యాపించు చోటగాని మీరు నిలబడుదురా? ఒకవేళ మీకు సర్పము, పిడుగు, సింహము, మహమ్మారిపై ఉన్నట్లుగానే అల్లాహ్‌పై నమ్మకం ఉన్నచో అందుకు భిన్నముగా వ్యవహరిస్తూ, అల్లాహ్‌ను ఎదురించి అతని శిక్షను పొందు మార్గము అవలంభించుదురా? సత్యము, విశ్వాసపు బంధమును త్రెంచుకొందురా?.

సన్మార్గము మరియు సత్కార్యముల కొరకు అహ్వానించ బడిన ఓ ప్రజలారా! మీ హృదయములు నమ్మకముతో నిండినప్పుడే మీలో దైవాకర్షణ ప్రారంభమగును మరియు పాపపు మచ్చల నుండి కూడ మీరు పవిత్రులవుతారని నిశ్చయముగా తెలుసు కొనుము. మాకు నమ్మకము ఉన్నదని బహుశ మీరు అంటారు కావచ్చు, కాని అది కేవలం భ్రమే అని మీరు గుర్తుంచుకొనుము. మీకు ఇంకా నమ్మకమే కలుగ లేదు. ఎందుకనగా మీకు ఇంకా దైవానుభూతులే కలుగ లేదు. అందుకు కారణం, మీరు పాపపు

మార్గములను వీడకపోవడం, వేయవలసిన ముందడుగు మీరు వేయక పోవడం, భయపడు విధముగా మీరు భయపడక పోవడం. పుట్టలో పాము ఉన్నదనే నమ్మకం కల్గిన తరువాత ఎవరైన అందులో చేయి పెట్టుటకు సాహసించునా?, తాను తిను అన్నంలో విషము ఉన్నదని నమ్మువాడు ఆ అన్నంను తినగలడా?, ఒక అడవిలో ఒక వెయ్యికిపైగా భయంకరమైన సింహాలున్నాయని తెలిసిన వ్యక్తి అడుగులు నిశ్చేష్ఠముగా, నియంత్రణ రహితముగా ఆ అడివి వైపు ఎందుకు పడుతాయి?. ఒకవేళ మీకు అల్లాహ్ మరియు ప్రళయ దినపు శిక్షాఫలములపై నమ్మకమున్నచో మీ చేతులు, మీ కాళ్ళు, మీ చెవులు, మీ కన్నులు పాపము చేయుటకు ఎందుకు సాహసించుచున్నాయి?. నమ్మకమును పాపము అధిగమించలేదు. భస్మము చేసి కబళించుటకు సిద్ధముగా ఉన్న అగ్నిని మీరు చూస్తూ కూడ ఎందుకు తామంతట తామే ఆ అగ్నిలో పడిపోవుచున్నారు?. నమ్మకపు గోడలు అకాశమంత ఎత్తున్నాయి. షైతాన్ వాటిని అధిగమించలేదు. నమ్మకముతోనే ప్రతి ఒక్కరు పవిత్రులవుతారు. దుఃఖమును తట్టుకొను శక్తిని కూడ నమ్మకమే అందిస్తుంది. చివరికి ఈ నమ్మకమే ఒక రాజును కూడ సింహాసనం నుంచి దించుతుంది, సాధువుగా మార్చుతుంది. నమ్మకమే అన్ని రకాల దుఃఖములను సులభతరము చేయును. నమ్మకమే అల్లాహ్‌ను దర్శింపజేయును. రక్త సమర్పన సిద్ధాంతం అసత్యము. పాప పరిహారపు విధానము అనైతికం. నమ్మకపు మార్గము నుండే పవిత్రత చేకూరును. పాపముల నుండి మోక్షమును చేకూర్చునది, అల్లాహ్ సన్నిధికి చేర్చునది, దైవదూతల సత్యత, నిలకడల స్థాయి కంటే ముందుకు తీసుకవెళ్ళునది కూడ నమ్మకమే. నమ్మక మార్గమును చూపని ప్రతి ధర్మము అసత్యమైనదే. నమ్మక మార్గము

ద్వారా దైవ ప్రసన్నత చేకూర్చని అన్ని మతాలు అబద్ధమైనవే. ప్రాచీన గాథలు తప్ప ఇతర విశిష్టతలు లేని ప్రతి ధర్మము కల్పిత ధర్మమే. అల్లాహ్ పూర్వము ఉన్నట్లుగానే నేడు కూడ ఉన్నాడు. గతంలో ఉన్నట్లుగానే నేడు కూడ అతనికి శక్తులు గలవు. గతంలో చూపించిన విధముగానే అతడు నేడు కూడ సంకేతములు, అధికారములను చూపించు శక్తిని కల్గి ఉన్నాడు. అయినా కూడ మరి మీరు ఎందుకు  కేవలం గాథలపై సంతృప్తి పడుతున్నారు? మహిమలను, భవిష్యవాణులను కేవలం గాథలుగా పేర్కొనబడిన ధర్మము నశింపబడిన ధర్మము. దైవవాణులు అవతరించని మతము, నమ్మక మార్గము ద్వారా దైవ హస్తములతో పవిత్రించబడని మతము మృత మతముతో సమానం. ఐచ్ఛిక అభిరుచులను చూసి మానవుడు వాటి వైపు ఆకర్షించబడినట్లు, మానవుడు నమ్మకము ద్వారా ఆధ్యాత్మిక అభిరుచులను అస్వాధించినప్పుడు అతడు అల్లాహ్ వైపు ఆకర్షించ బడును. అతని సౌందర్యము మానవున్ని ఇతర వస్తువులన్నింటిని విస్మరింపజేయునంతగా ముగ్ధుడిని చేస్తుంది. శిక్షించుటలో అల్లాహ్ ఎంత కఠినుడో, ఫలమును ఇచ్చుటలో అంతే దయామయుడని గుర్తించిన రోజే మానవుడు పాపము నుండి ముక్తిని పొందును.  అజ్ఞానమే ఎదురుదాడికి పునాది. నమ్మక ప్రదమైన దైవజ్ఞానం నుండి కొంత విజ్ఞత పొందిన ఏ వ్యక్తి కూడ అజ్ఞానిగా వ్యవహరించడు.  తన  ఇంటి వైపు అతి వేగముగా వరద ముంపు వస్తుందని తెలిసిన లేదా తన ఇంటి చుట్టు మంటలు అలుము కున్నాయి అని తెలిసిన ఏ ఇంటి యజమాని కూడ ఆ ఇంట్లో కొంత భాగం సురక్షితముగా ఉందని భావించి ఆ ఇంట్లోనే కూర్చొని ఉండడు. అలాంటిది మరి ప్రళయ దినమున అల్లాహ్ పాప పుణ్యములకు పరిహారమును ఇచ్చుననే  నమ్మకమును

కలిగి ఉండి కూడ మీరెందుకు అపాయకర స్థితులపై నిలకడగా ఉన్నా రు? కావున మీరు కన్నులు తెరిచి ప్రపంచమంతా వ్యాపించివున్న అల్లాహ్ సృష్టి ధర్మమును చూడుము. పాతాళమునకు పారిపోవు ఎలుకల వలే మీరు మారకుము. ఆకాశ అంచులను తమ కోసం ఇష్టపడి పైకి ఎగిరి పోవు పావురాల వలే మారుము. పశ్చాత్తపంతో ప్రతిజ్ఞ చేసిన తరువాత మరల మీరు పాపము దరి చేరకుము. కుబుసము వీడిన తరువాత కూడ సర్పముగా పిలువబడే పాము వలే మీరు మారకుము. మీ సమీపమునకు చేరువవుతున్న మృత్యువును మీరు విస్మరించకుము. అది ఎప్పుడొచ్చునో మీకు తెలియదు. పవిత్రులగుటకు ప్రయత్నించుము. మానవుడు స్వయము గా పవిత్రతను అలవర్చుకున్నప్పుడే పవిత్రుడగును. కాని మీరు ఆ వరమును ఎలా పొందగలరు? అందుకు సమాధానమును కూడ అల్లాహ్ తఆలా స్వయముగా పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ విధముగా తెల్పినాడు. وَاسْتَعِيْنُوْا بِالصَّبْرِ وَالصَّلٰوةِ (అల్‌బఖరహ్-2:46) అనగా ప్రార్థన మరియు సహనములతో అల్లాహ్ సహాయమును అర్థింపుము. నమాజ్ అర్థం తెలుసా? ప్రశంసన, సంకీర్తన, పవిత్రత, పశ్చాత్తాపము, వినయ విధేయతలతో అర్జించు అభ్యర్థన యే నమాజ్. కనుక మీరు నమాజ్ సలుపు చున్నప్పుడు అవగాహన రహితుల వలే కేవలం అరబి పదాలలోనే అభ్యర్థిస్తూ ఉండకుము. ఎందుకనగా వాస్తవికత కలిగివుండనందున వారి ప్రార్థనలు, పశ్చాత్తాపములన్నియు కేవలంప్రదర్శనలే అనబడును. కావున మీరు ప్రార్థన సలుపునప్పుడు అల్లాహ్ వచనములైన ఖుర్ఆన్‌ను, ప్రవక్త ప్రవచనములైన నిర్దేశిత దుఆలను గాక మీ మాతృ భాషలో, మీకు తెలిసిన భావోద్వేగమైన భక్తి పదాలలో దుఆలను యాచించుము. ఫలితముగా మీ మనస్సుపై కూడ ఆ ఉద్వేగభరిత దుఆల ప్రభావం

పడుతుంది. ఐదు పర్యాయపు నమాజ్‌ల వాస్తవికత గురించి మీకు తెలుసా?. అవి మీ విభిన్న స్థితిగతుల ఛాయ చిత్రములు. మీ జీవితపు సంక్లిష్ట సమయంలో తప్పకుండా మిమ్ములను ఐదు స్థితులు ఆవహించును. మీ స్వభావ ప్రయోజన రీత్య వాటి అవగాహన కూడ తప్పని సరియే.

(1) ఈ స్థితిలో నీకు ఒక ఆపద రాభోవుచున్నదని ముందు గానే తెలుపడం జరుగుతుంది. ఉదా॥ న్యాయస్థానం ద్వారా నీకు వారెంట్ జారి చేయబడడం, ఇది మొదటి స్థితి. ఈ సమాచారం నీ సంతృప్తి, నీ ఆనందంలో అలజడిని సృష్టిస్తుంది. కావున ఈ స్థితి నీ పతనానికి చిహ్నం వంటింది. ఎందుకనగా దీని వలన నీ ఆనందమయ జీవితం పతనం కావడం ప్రారంభమవుతుంది. ఈ స్థితికి భిన్నముగానే జుహర్ నమాజ్‌ను నిర్ణయించడం జరిగింది. మిట్ట మధ్యాహ్నం దాటిన తరువాత సూర్య తేజస్సు తగ్గుముఖం పడుతుంది.

(2) నీవు ఆపదకు అతి సమీపమున ఉన్న సమయంలో నీలో మార్పు ఏర్పడుతుంది. అదే రెండవ స్థితి. అందుకు ఉదా॥ ఆ వారెంట్ వలన నీవు పట్టుబడి న్యాయమూర్తి ముందు ప్రవేశ పెట్టబడుదువు. ఈ స్థితిలో నీలో కల్గిన భయం వలన నీ రక్తం ఆవిరి అయిపోవును. మనశ్శాంతి పూర్తిగా నీ నుండి దూరమ వుతుంది. కావున ఈ స్థితి సూర్య తేజస్సు తగ్గుముఖం పట్టిన దానిని పోలి ఉంటుంది. అప్పుడు సూర్యుని వృత్తాకారాన్ని కూడ చూడవచ్చును. ఇక అది పూర్తిగా మునిగిపోవు సమయం ఆసన్న మైనదని దానిని చూసిన వారు అర్థం చేసుకుంటారు. ఈ ఆధ్యాత్మిక స్థితికి భిన్నముగానే అస్ర్ నమాజ్‌ను నిర్ణయించడం జరిగింది.

(3) నీకు వచ్చిన ఆపద నుండి ఇక నీవు తప్పించుకోలేవని

నీకు తెలిసినప్పుడు నీలో కల్గిన మార్పుయే ఆ మూడవ స్థితి. ఉదా॥ నీపై మోపిన నేరారోపణ లిఖించబడుతుంది, నీ ప్రత్యర్థులు నీకు వ్యతిరేకముగా సాక్ష్యము ఇచ్చుటకు సిద్ధముగా ఉంటారు. ఈ స్థితిలో నీ తెలివి తేటలన్ని గాలిలో కలిసిపోతాయి. ఇక నిన్ను నీవే ఒక ఖైదీగా భావించుకుంటావు. ఈ స్థితి సూర్యా స్తమయంను పోలి ఉంటుంది. పగటి వెలుగు కనుమరుగు అయినట్లుగా నీ ఆశలన్ని అడియాశలవుతాయి. ఈ ఆధ్యాత్మిక స్థితికి భిన్నముగానే మఘ్రిబ్ నమాజ్‌ను నిర్ణయించడం జరిగింది.

(4) ఆపదలో నీవు పూర్తిగా చిక్కుకున్నప్పుడు, దాని దుష్ప్రాభావా లకు నీవు బలి అయినప్పుడు నీలో కలిగే మార్పుయే నాలుగవ స్థితి. ఉదా॥ నీపై మోపబడిన అభియోగం సాక్ష్యాధారాల తో ఋజువైనట్లు నిర్ధారించుకొని, న్యాయమూర్తి నీకు శిక్షను విధిస్తూ, నిన్ను ఖైదిఖానాలో బంధించుటకు ఒక పోలీస్ అధికారికి నిన్ను అప్పగించు స్థితిని ఇది పోలి ఉండును. కావున ఈ స్థితి అంధకార స్థితిని పోలి ఉంటుంది. నలు దిక్కుల గాఢాంధకారమే ఉండును. ఈ ఆధ్యాత్మిక స్థితికి భిన్నముగానే ఇషా నమాజ్‌ను నిర్ణయించడం జరిగింది.

(5) కొంత కాలం వరకు నీవు ఇబ్బందితో ఈ గాఢాంధ కారమయ జీవితంను గడిపిన తరువాత చివరికి దేవుడు నిన్ను కరుణిస్తూ, నిన్ను ఆ అంధకారము నుండి బయటికి తీసుక వచ్చినప్పుడు నీలో కలిగే మార్పుయే ఐదవ స్థితి. ఉదా॥ అంధకారము తరువాత ఉదయపు కిరణాలు వెదజల్లినట్లుగా. ఉదయపు ఆ లేలేత కిరణాలే పగలు ప్రకాశవంతమైన తేజస్సుగా పరివర్తనం చెందుతుంది. కావున ఈ ఆధ్యాత్మిక స్థితికి భిన్నముగానే ఫజ్ర్ నమాజ్‌ను నిర్ణయించడం జరిగింది. ఇలా అల్లాహ్ తఆలా

మీ స్వభావరీత్య మార్పు చెందునట్టి ఐదు స్థితులకు భిన్నముగా మీ కొరకు ఐదు పూటల నమాజ్‌లను నిర్ణయించాడు. తద్వారా ఈ నమాజ్‌లు కేవలం మీ స్వభావానికి ప్రయోజనం చేకూర్చునవే అని మీరు అర్థం చేసుకోగలరు. కావున మీరు ఈ ఆపదల నుండి రక్షించబడాలనుకున్నచో మీరు ఈ ఐదు పూటల నమాజ్‌లను వదిలి వేయకూడదు. అవి మీ అంతర్గత బహిర్గతల మార్పుకు ప్రతి రూపాలు. రాబోవు ఆపదలకు నమాజ్‌లో చికిత్స గలదు. పైగా ఉదయించే ప్రతి ఉదయం మీకోసం ఎలాంటి భవిష్యత్తును తీసుకవస్తుందో మీకు తెలియదు. కావున సూర్యోదయం కాకముందే మీరు మీ దేవుని ఆస్థానంలో భక్తి శ్రద్ధలతో మోకరిల్లుతూ మీ కొరకు శుభములను, సౌభాగ్యములను యాచించుకొనుము.

ఓ అధికారులారా! ఓ అధినేతలారా! ఓ ధనికులారా! అల్లాహ్‌కు భయపడువారు, అతని సర్వ మార్గముల యందు నిజాయితిగా వ్యవహరించువారు మీలో కొందరే ఉన్నారు. మీలో అనేకులు ప్రాపంచిక అధికారముల కోసం, ప్రపంచ భోగభాగ్యాల కోసం ఎదురుచూస్తున్నారు. వాటి సాధనకై జీవిస్తున్నారు గాని, మరణంను ఏ మాత్రం గుర్తుంచుకోవడం లేదు. నమాజ్‌లు చేయకుండా, అల్లాహ్‌తో సంబంధము లేకుండా వ్యవహరించు ప్రతి శ్రీమంతుడిపై అతని సేవకుల, పరిచారకుల పాప భారము మోపబడును. మద్యపానము సేవించు ప్రతి సంపన్నుడి మెడకు అతనితో కలిసి మద్యం సేవించు అనుచరుల పాప భారము మోపబడును. ఓ బుద్ధిమంతులారా! ఈ ప్రపంచము శాశ్వత స్థానము కాదు. మీరు నిలకడగా ఉంటూ, అన్ని రకాల అపసవ్య వ్యవహారములను వదిలి వేయుము. అన్ని రకాల మత్తు పదార్థములను వదిలి వేయుము. మద్యపానం, నల్లమందు,

మత్తుమందు, గంజాయి, కల్లు మొదలైనవన్ని మానవున్ని నాశనం చేయును. అవి మెదడును చెరపి, చివరికి అంత మొందించును. కనుక మీరు వాటి నుండి దూరముండ గలరు. ప్రతి సంవత్సరము మత్తుకు బానిసలై మీ వంటి వారు కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోవడంను చూస్తూ కూడ మీరు ఆ పదార్థాలను ఎందుకు ఉపయోగిస్తున్నారో నాకు అర్థమవడం లేదు. ۞(21) ప్రళయ దినపు శిక్షలు అధికము. నిష్టాపరులుగా మారుము. మీ ఆయుష్యు పెరుగవలెను. ఇందుకు అల్లాహ్ నుండి శుభములను పొందుము. అవసరాన్ని మించి విచ్చలవిడిగా జీవించడం కూడ శాపగ్రస్త జీవితమే అనబడుతుంది. హద్దులు మీరిన చెడు లక్షణాలతో, విచక్షణ రహితముగా జీవించడం కూడ శాపగ్రస్త జీవితమే అనబడుతుంది. ఒక యాచకుడిని అంతకంటే హీనుడిని ప్రశ్నించి నట్లే ధనవంతులను కూడ దేవుని హక్కులు, అతని దాసుల హక్కుల విషయంలో ప్రశ్నించడం జరుగుతుంది. తాత్కాలిక జీవితమును నమ్మి అల్లాహ్‌కు పూర్తిగా దూరమైన వారెంతో దురదృష్టవంతులు.

---

۞(21) యూరప్ ప్రజలకు మద్యపానం చాలా నష్టాన్ని కల్గించింది. అందుకు ఈసా అలైహిస్సలాం మద్యం సేవించడానికి కారణాన్ని చూపుతారు. బహుశా వారు ఏదేని అనారోగ్య కారణం వలన లేదా అంతకు ముందు ఉన్నటు వంటి అలవాటు కారణంగా మద్యం సేవించి ఉండవచ్చును. కాని ఓ ముసల్మానులారా! మీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు అన్ని రకాల మత్తు మందులకు దూరముగా ఉండే వారు. పైగా అమాయకులు. వాస్తవానికి వారు స్వభావరీత్య అమాయకు లే. అలాంటి మీరు ముసల్మానులై ఉండి ఎవరిని అనుసరిస్తున్నారు?. ఇంజీల్ వలే ఖుర్ఆన్ మద్యపానానికి అనుమతినివ్వడం లేదు. మరి మీరు ఏ ఆధారాన్ని చూపుతూ మద్యపానాన్ని తమకు సమ్మతిగా చేసుకుంటున్నారు. మీరు మరణించరా? ***సమాప్తం.***

అల్లాహ్ నిషేధించిన వాటిని కూడ అవి నిషేధితాలు గాక అనుమతించబడిన వాటి వలే ఎంతో నిర్భయముగా తన కొరకు బాహాటముగా ఉపయోగించుకొనును. పైగా ఆగ్రహంతో ఒకరిని దూషించడం, మరొకరిని గాయపర్చడం, ఒకరిని హత్య చేయు వంటి వాటికి కూడ సిద్ధ పడును. కామోద్రేకములతో అతి నీచాతినీచముగా ప్రవర్తించెదరు. అయినా కూడ మృతి చెందు వరకు స్వచ్ఛమైన ఆనందమును పొందలేరు. ఓ మిత్రులారా! మీరు కొన్ని రోజుల కొరకే ఈ ప్రపంచానికి వచ్చారు. వాటిలో చాలా రోజులు గడిచిపోయాయి కూడ. కావున మీ దేవునికి ఆగ్రహాన్ని కల్గించకుము. మీచేత నిర్మించబడిన మీ మానవ ప్రభుత్వానికి మీపై కోపం వచ్చినచో అది మిమ్ములను నాశనము చేయవచ్చును. అలాంటప్పుడు మరి మీరు అల్లాహ్ ఆగ్రహం నుండి ఎలా తప్పించు కోగలరు? అని ఆలోచించరా! ఒకవేళ మీరు అల్లాహ్ దృష్టిలో నిష్టాపరులైనచో మిమ్ములను ఎవ్వరు నాశనం చేయలేరు. స్వయముగా అతడే మిమ్ములను కాపాడును. మీ ప్రాణములు తీయాలని ఎదురు చూసే శత్రువులు కూడ మిమ్ములను లోబర్చుకోలేరు. అలా కానిచో మీ ప్రాణాలను కాపాడువాడు మరెవ్వరు ఉండరు. అదే జరిగినచో మీరు శత్రువులకు భయ పడుచు, కష్టనష్టాలలో చిక్కుకొని నిరాశజనకంగా జీవించవలసి వస్తుంది. అంతేగాకా మీ జీవితపు చివరి రోజులను కూడ ఎంతో చిరాకు పరాకుగా జీవించవలసి వస్తుంది. అల్లాహ్ సాన్నిహిత్యంను అవలంభించిన వారికే అల్లాహ్ అభయమును ఇచ్చును. కావున అల్లాహ్ వైపు పరుగెత్తుము. అతని పట్ల గల వైరుధ్య ధోరణిని వీడుము. అతని హక్కులను చెల్లించు విషయంలో అశ్రద్ధ చూపించకుము. అతని దాసులకు నోటితో గాని, చేతులతో గాని

అన్యాయము చేయకుము. ۞[22] కావున దేవుని ఆగ్రహావేశపు శిక్షలకు భయపడుము. ఇదే ముక్తి మార్గము.

ఓ ముస్లిం ధార్మిక పండితులారా! నన్ను తిరస్కరించుటలో తొందరపడకుము. మానవుడు త్వరగా అర్థం చేసుకోలేని రహస్యాలు ఎన్నో ఉన్నాయి. ఒక విషయము విన్నవెంటనే దానిని ఖండించుటకు సిద్ధపడకుము. ఇది నిష్టాపరుల పద్దతి కాదు. ఒకవేళ మీలో తప్పిదాలే లేకున్నచో, మీరు హదీస్‌లను తప్పుగా

---

۞(22) మానవ జాతిపై బల ప్రయోగం చేయువారు చివరికి బల ప్రయోగం తోనే నాశనమగును. అందుకోసమే అల్లాహ్ తఆలా ఫాతిహా అధ్యాయము లో యూదులకు مَغۡضُوۡبِ عَلَيۡهِمۡ (మఘ్జూబి అలైహిం) అని నామకరణం చేశాడు. ప్రళయ దినమున ప్రతి దోషి దేవుని ఆగ్రహానికి బలి అవుతాడని, కాని అన్యాయము గా ఈ ప్రపంచములో ఇతరులపై బల ప్రయోగం చేయువారు ఈ ప్రపంచంలోనే దైవాగ్రహానికి బలి అవుతారని పై విషయం సూచిస్తుంది. యూదులు ఈ ప్రపంచంలో దైవాగ్రహానికి గురినైట్లుగా క్రైస్తవులు గురి కాలేదు. అందుకే ఫాతిహా అధ్యాయములో వారికి ضَآلِّيۡنَ (జ్వాల్లీన్) అని నామకరణం చేయడం జరిగింది. జ్వాల్లీన్ అనే పదానికి రెండు అర్థాలు గలవు. ఒకటి మార్గభ్రష్టులు కావడం, రెండవది తప్పిపోవడం. నా దృష్టిలో ఇదొక భవిష్యవాణి. ఒక సమయంలో వీరు ఈ అసత్య ధర్మాన్ని వీడి, ఇస్లాంలో మమేకమైపోతారు. అలా నెమ్మది నెమ్మదిగా వారి అన్యారాధన సిద్ధాంతాల ను, నిరాధారమైన, సిగ్గుమాలిన ఆచారాలను వీడి నిష్టాపరులైన ముస్లిం యోగ్యులుగా పరివర్తనం చెందుతారు. మొత్తానికి ఫాతిహా అధ్యాయపు చివరలో ఉన్నటు వంటి జ్వాల్లీన్ పదానికి ఉన్నటు వంటి రెండవ అర్థం ప్రకారం అనగా ఒక వస్తువు మరొక వస్తువులో కలిసిపోవడంను చూసినచో రాబోవు కాలంలో క్రైస్తవుల ధార్మిక స్థితిని తెలియజేయు భవిష్యవాణి అని అర్థమవుతుంది. ***సమాప్తం.***

అర్థం చేసుకోకుండ ఉన్నట్లయితే మసీహ్ మౌవూద్ న్యాయ నిర్ణేతగా అవతరించడమనేది అనవసరంగా భావించబడేది. మీరు ఏ అంశాలను ప్రత్యేకముగా చూపుతున్నారో ఆయా అంశాలలోనే మీ పూర్వీకులు గుణపాఠంను నేర్చుకున్నారు. మీరు అడుగులు వేసిన చోటనే గతంలో యూదులు కూడ అడుగులు వేసారు. అనగా హజ్రత్ ఈసా అలైహిస్సలాం మరల అవతరించునని మీరు ఎదరుచూస్తున్నట్లుగానే యూదులు కూడ ఇల్యాస్ ప్రవక్త మరల వచ్చునని ఎదురు చూశారు. అంతేగాకా ఆకాశంపైకి తీసుకోబడిన ఇల్యాస్ ప్రవక్త మరల ప్రపంచానికి వచ్చిన తరువాతనే మసీహ్ అవతరించునని ఇల్యాస్ (అ) మరల అవతరించడానికి ముందు ఏ వ్యక్తి మసీహ్‌గా ప్రకటన చేసినా అతడు అసత్య వంతుడని వాదించేవారు. ఈ విషయంలో వారు కేవలం వారి హదీస్ పుస్తకాలలో నుండే గాకుండా దైవ గ్రంథమైన మలాకి ప్రవక్త ప్రతుల నుండి ఆధారములను చూపేవారు. కావున తన ప్రకటనకు నిబద్ధుడైన ఇల్యాస్ (అ) ఆకాశం నుండి రాకముందే హజ్రత్ ఈసా అలైహిస్సలాం తాను యూదులకు మసీహ్ మౌవూద్ నని ప్రకటించుకున్నారు. అప్పుడు యూదుల అభిమతాలన్నియు అసత్యమని నిరూపితమైనాయి. అదే విధముగా ఏలియ ప్రవక్త తన శరీరంతో ఆకాశం నుండి అవతరించును అనే అభిమతాన్ని కూడ చివరికి వారు ఇల్యాస్ (అ) యొక్క స్వభావం, లక్షణాలను అనుసరించి మరొక వ్యక్తి అవతరించును అనే అర్థాన్ని తీసుకున్నారు. ఈ అర్థాన్ని హజ్రత్ ఈసా అలైహిస్సలాం స్వయముగా తెలియ పరిచారు. అలాంటిది వారినే మీరు ఆకాశం నుండి దింపాలని చూస్తున్నారు. కావున మీ కంటే పూర్వము యూదులు మోసపోయి నట్లుగా మీరు ఎందుకు మోసపోవుచున్నారు. మీ దేశంలో వేలాది

మంది యూదులు ఉన్నారు. కావున వారిని అడిగి చూడుము. యూదుల అభిమతాన్నే నేడు మీరు ప్రచారం చేయడం లేదా?. ఈసా కొరకు ఏలియా ప్రవక్తను ఆకాశం నుండి దింపకుండా అది తప్పుడు అభిమతమని తెల్పిన దేవుడు, నేడు మీరు మరల ఈసాను దింపాలని చూసినప్పుడు ఏ కారణం చేత అతడు మీ కోసం దింపుతాడు?. అతని తీర్మాణ రీత్య మీరు తిరస్కృతులై నారు. ఒకవేళ మీకు అనుమానం ఉన్నచో ఈ దేశంలో కొన్ని లక్షల మంది క్రైస్తవులు ఉన్నారు. వారి ఇంజీల్ కూడ వారి వద్ద ఉన్నది. కావున రెండవసారి రావలసిన ఏలియానే యోహన్నా అని హ్రజత్ ఈసా చెప్పినది నిజం కాదా? అని మీరే వారిని అడిగి తెలుసుకోండి. అనగా యాహ్యా. ఈ ఒక్క మాటతోనే అనాధిగా వస్తున్నటు వంటి యూదుల నమ్మకాలను మట్టిలో కలిపారు. ఒకవేళ నేడు ఈసా ప్రవక్తయే ఆకాశం నుండి రావలసి యున్నచో ఈ పరిస్థితులలో హ్రజత్ ఈసా అలైహిస్సలాం సత్య ప్రవక్తగా నిలబడలేరు. ఎందుకనగా ఒకవేళ ఆకాశం నుండి తిరిగి రావడం దైవ సాంప్రదాయమైనచో ఏలియా ప్రవక్త ఎందుకు తిరిగి రాలేదు. వారి స్థానములో యహ్యాను ఇల్యాస్‌గా పేర్కొనుచు ఎందుకు పొరపాటు చేశారు. విజ్ఞులు ఆలోచించదగిన స్థానమిది.

మీ ఏ అభిమతం మేరకు మరియమ్మ కుమారుడైన ఏసు ఆకాశం నుండి దిగివచ్చును. అనగా వారు మహ్దీతో కలిసి ప్రజలను బలవంతముగా ముసల్మానులుగా మార్చును. ఈ అభిమతం నిశ్చయముగా ఇస్లాంకు తలంపులు ఆపాదించును. మత విషయంలో బలవంతం సమంజసమే అని పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఎక్కడ పేర్కొనబడింది. నిజానికి చూసినచో అల్లాహ్ తఆలా పవిత్ర

ఖుర్‌ఆన్‌లో لَاۤ اِکۡرَاہَ فِی الدِّیۡنِ (అల్ బఖరహ్–2:257) అనగా మతం విషయంలో ఎలాంటి బలవంతం లేదని ఎంతో స్పష్టముగా తెల్పినాడు. అలాంటప్పుడు (కనీసం జిజియాను కూడ స్వీకరించుటకు సుముఖముగా లేకుండా ఇస్లాంను స్వీకరించడమా? లేదా హత్యచేయబడడమా?అనే అభిమతం గల) మరియమ్మ కుమారుడైన మసీహ్‌కి బలవంతం చేయు అధికారంను ఎందుకు ఇచ్చెదరు. ఈ సిద్ధాంతం పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఎక్కడ, ఏ అధ్యాయములో, ఏ భాగంలో ఉన్నదో చూపండి. ❁(23) మతం విషయంలో ఎలాంటి బలవంతం లేదని పవిత్ర ఖుర్‌ఆన్ పదే పదే తెల్పుచున్నది. అదే విధముగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో ప్రజలు చేసిన యుద్ధాలు ఇస్లాం ధర్మమును బలవంతంగా

---

❁(23) బలవంతముగానైన ముసల్మానులను చేయవచ్చుననే ఆదేశం అరబ్‌ల కొరకు ఉన్నదని భావించినచో ఈ భావన పవిత్ర ఖుర్‌ఆన్ ద్వారా ఏ మాత్రం నిరూపించబడదు. అరబ్ ప్రజలందరు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను చాలా కఠినంగా బాధించారు అనే విషయం తప్పకుండా నిరూపించబడుతుంది. అనుచరులలోని కొందరు పురుషులను, స్త్రీలను హత్య చేశారు. మిగిలిన వారిని ఖడ్గపు బలంతో దేశం నుండి వెల్లగొట్టారు. ఈ కారణం చేతనే హత్యలో పాల్గొన్న, బహిష్కరించిన నేరంతో ముడిపడి ఉన్నవారందరు ఈ రక్త పాతానికి పాల్పడినందున దేవుని దృష్టిలో వారు కూడ రక్తపాతానికి గురి కావలసి ఉండెను. వారి నుండి ప్రతీకారం తీర్చుకోవడం కోసం వారిని హత్య చేయడమే వారికి సరైన శిక్ష. కాని అత్యంత దయామయుడైన అల్లాహ్ తన వైపు నుండి ఒక అవకాశాన్ని కల్పించాడు. అనగా ఒకవేళ ఆ దోషులలో నుండి ఎవరైన ఇస్లాంను స్వీకరించినచో గత నేరాల వలన వారికి విధించిన మరణ శిక్ష క్షమించబడుతుంది. కావున ఇంతటి కరుణ ఉండగా, బలవంతం ఎక్కడి నుండి చేరింది. ***సమాప్తం.***

వ్యాపింపజేయడం కోసం కాదని, అది కేవలం శిక్షించడం కోసం చేసినవని ఎంతో స్పష్టముగా తెల్పుచున్నది. అనగా ఎవరైతే ముసల్మానుల అంతం చేయాలని చూశారో, ఎవరైతే వారిని తమ ప్రాంతాల నుండి వెళ్ళగొట్టాలని చూశారో, ఎవరైతే వారిపై దౌర్జన్యం చేశారో వారిని శిక్షించడం కోసం ఆ యుద్ధాలు చేయబడ్డాయి. ఈ విషయాన్నే అల్లాహ్ తఆలా ఈ విధముగా తెల్పినాడు.

أُذِنَ لِلَّذِينَ يُقَاتَلُونَ بِأَنَّهُمْ ظُلِمُوا ۚ وَإِنَّ اللَّهَ عَلَىٰ نَصْرِهِمْ لَقَدِيرٌ

(అల్ హజ్-22:40) అనగా ముసల్మానులతో అవిశ్వాసులు యుద్ధం చేస్తున్నందున వారు పీడితులైనారు. అందుకే వారికి ప్రతియుద్ధం చేయుమని అనుమతి నివ్వడం జరిగింది. వారికి సహాయ సహకారాలను అందించుటకు దేవుడు స్వరశక్తిమంతుడు. కావున వారు చేసిన యుద్ధాలు ప్రతిదాడులు మాత్రమే. అనగా ఇస్లాంను నామరూపాలు లేకుండా చేయాలని ఎవరైతే ముందుకు వచ్చారో లేదా తమ తమ ప్రాంతాలలో ఇస్లాం వ్యాపించకుండా క్రూరత్వంతో అడ్డుకున్నారో వారి నుండి తమను తాము రక్షించుకోవడం కోసం లేదా స్వాభిమానంగా మరియు తాము ఉంటున్న ప్రాంతములో స్వేచ్ఛను కల్పించుకోవడం కోసం యుద్ధాలు చేశారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు వారి పవిత్ర ఖలీఫాలు కూడ ఈ మూడు షరతులతో కాకుండా మరే అంశం కోసం యుద్ధాలు చేయలేదు. ఒక విధముగా చెప్పదలచినచో అన్యజాతుల చేతిలో ముసల్మానులు భరించినంత దౌర్జన్యాన్ని మరే జాతి కూడ భరించలేదు. అలాంటప్పుడు ఈసా మసీహ్ మరియు మహ్దీలు వచ్చి రాగానే కనీసం దైవ గ్రంథాలు పొందిన ప్రజల నుండి జిజియా కూడ స్వీకరించకుండా ప్రజలను హతమార్చు కార్యక్రమమును ఎలా ప్రారంభించెదరు? అదే విధముగా

حَتّٰى يُعْطُوا الْجِزْيَةَ عَنْ يَّدٍ وَّهُمْ صٰغِرُوْنَ (అత్తౌబహ్-9:29) అను సూక్తిని ఏ విధముగా రద్దు చేయుదురు. వచ్చిరాగానే ఖుర్ఆన్ సూక్తులను రద్దు చేయు వీరు ఏ విధముగా ఇస్లాం ధర్మ సహాయకులుగా పిలువబడుతారు. నిజానికి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో కూడ ఈ సూక్తులు రద్దు చేయబడలేదు. ఈ స్థాయి మేరకు పోరాటం నిర్వహించిన కూడ ఖత్మేనబువ్వత్‌కు ఎలాంటి హాని జరుగదా? నేటికి 1300ల సంవత్సరాలు గడిచి పోయాయి. ఒక వైపు ఇస్లాం 73 వర్గాలలో అంతర్గతముగా చీలి పోయింది. కావున స్వచ్ఛమైన మసీహ్ ఆధారాలను చూపు ప్రజల హృదయాలను గెలుచుకోవాలి గాని ఖడ్గాలతో కాదు. ఖచ్చితమైన, సత్యమైన సాక్ష్యాలతో క్రైస్తవ సిద్ధాంతాలను రూపు మాపాలి గాని బంగారం, వెండి, రాగి, కర్రలతో చేయబడిన సిలువలను ముక్కలు చేస్తూ తిరుగుతూ కాదు. ఒకవేళ మీరు దౌర్జన్యం చేసినచో మీరు చేయునట్టి దౌర్జన్యమే మీ వద్ద ఎలాంటి సత్య నిదర్శనం లేదని చెప్పడానికి ఒక పెద్ద సాక్ష్యం అవుతుంది. ۞(24) అజ్ఞానులు,

۞(24) ఈ వ్యక్తి ఆంగ్లేయుల ప్రభుత్వంలో ఉంటున్నందున జిహాద్‌ను అడ్డుకుంటున్నాడు అని మినార్ పత్రిక సంపాదకుని వలే మరి కొందరు దుష్టులు నాపై ఆరోపణలు చేస్తున్నారు. ఒకవేళ నేను అబద్ధంతో ఈ ప్రభుత్వాన్ని సంతోష పెట్టాలని చూస్తున్నచో, మరి నేను ఎందుకు పదే పదే మరియమ్మ కుమారుడైన ఏసు సిలువపై నుండి మోక్షాన్ని పొంది కాశ్మీరులోని శ్రీనగర్ ప్రాంతంలో సాధారణ మరణాన్ని పొందారని ప్రకటన చేస్తున్నాను అనే విషయం ఈ మూర్ఖులకు తెలియదా? అతడు దేవుడు కాదు, దేవుని కుమారుడు అంతకన్న కాదు. ఆంగ్లేయ మతస్థులు నా ఈ వాక్యములతో విసిగెత్తిపోవడం లేదా? కావున ఓ మూర్ఖులారా! శ్రద్ధగా వినండి! నేను ఈ ప్రభుత్వాన్ని ఏ మాత్రం సంతోష పెట్టడం లేదు. వాస్తవమేమనగా, ఇస్లాం ధర్మము మరియు ధార్మిక ఆచారములను

దుష్ట స్వభావులు మాత్రమే ఆధారాలు లేని సమయంలో ఖడ్గము లేదా తుపాకిని చేత పట్టుకొనుటకు ప్రయత్నిస్తారు. ఇతర మార్గాల ద్వారా గాకుండా కేవలం ఖడ్గ సహాయంతో వ్యాపించునట్టి ధర్మము అసలైన దైవ ధర్మము కాదని నేను పదే పదే తెల్పుచున్నాను. ఒకవేళ మీరు ఇలాంటి జిహాద్‌ను వీడకుండా, కేవలం కోపతాపా లకు గురై సత్య ప్రియులను దజ్జాల్, నాస్తికుడు అని నామకరణం

---

ఆచరించుకోవడంలో ఆటంకం కల్గించని మరియు మన ధర్మాన్ని వ్యాపింప జేసుకుంటున్నందుకు అడ్డుకోని ఈ ప్రభుత్వంతో మతపరమైన యుద్ధాలు చేయడం పవిత్ర ఖుర్ఆన్ ప్రకారం కూడ సమంజసం కాదు. ఎందుకనగా వారు కూడ ఎలాంటి మతపరమైన యుద్ధాలు చేయడం లేదు. మనం మక్కా మదీనాలో కూడ ఆచరింపలేని ఎన్నో ధార్మిక ఆచరణలను ఈ ప్రభుత్వంలో ఆచరిస్తున్నందుకు మనం ఈ ప్రభుత్వానికి కృతజ్ఞత పూర్వకముగా ఉండాలి. దేవుని విజ్ఞత మేరకే నేను ఈ దేశంలో జన్మించాను. అలాంటప్పుడు నేను దేవుని వైభవమైన విజ్ఞతను అవమానించాలా?. అదే విధముగా పవిత్ర ఖుర్ఆన్‌లోని وَاٰوَيۡنٰهُمَاۤ اِلٰى رَبۡوَةٍ ذَاتِ قَرَارٍ وَّمَعِيۡنٍ (అల్ ము'మినూన్-23:51) (అనగా మేము వారికి నివాస యోగ్యమైన ప్రవహించు నీరు గల ఎత్తైన స్థానమును శరణముగా ఒసంగితిమి.) సూక్తిలో కూడ అల్లాహ్ తఆలా సిలువ ఘటన తరువాత మేము ఈసా మసీహ్‌ని క్రైస్తవ ప్రాంతాల నుండి కాపాడుతూ అతనికి అతని తల్లికి ఎత్తైన దిబ్బలపై అభయాన్ని ఇచ్చాము. అది చాలా విశ్రాంత ప్రదేశం. అందులో చెలిమలు కూడ ఉన్నాయి అనగా కాశ్మీర్‌లోని శ్రీనగర్ అని ఎంతో స్పష్టముగా తెలియజేశాడు. అదే విధముగా అల్లాహ్ తఆలా నాకు ఈ ప్రభుత్వపు ఎత్తైన దిబ్బల ప్రాంతంలో విద్రోహులు చేరని ప్రాంతంలో ఆశ్రయాన్ని కల్పించాడు. ఇది చాలా విశ్రాంత ప్రదేశం. ఈ ప్రాంతంలో విజ్ఞాన చెలిమలు పారుతున్నాయి. విద్రోహుల దాడుల నుండి సురక్షితము గా, శాంతియుత వాతవరణంలో ఉన్నారు. అలాంటప్పుడు మేము ఈ ప్రభుత్వ ఉపకారాలకు కృతజ్ఞతలు తెలుపకూడదా? ***సమాప్తం.***

చేస్తున్నచో మేము قُلْ يَاأَيُّهَا الْكٰفِرُوْنَ لَآ اَعْبُدُ مَا تَعْبُدُوْنَ (కాఫిరూన్ -109:2,3) అనే రెండు పదాలతో మా ప్రసంగాన్ని ముగిస్తాము. అంతర్గత కలహాలు, విభేదాలు గల ఈ కాలంలో మీ నామ మాత్రపు మసీహ్ మరియు మహ్దీ ఎవరెవరిని ఖడ్గముతో సంహరించును. సున్నీల దృష్టిలో షియ్యాలు ఖడ్గముతో సంహరించుటకు అర్హులు కారా? షియ్యాల దృష్టిలో సున్నీలు ఖడ్గముతో సంహరించుటకు, వినాశం చేయుటకు అర్హులు కారా? ఇలా మీ వర్గీయులే మీ సిద్ధాంతాల ప్రకారం శిక్షించుటకు అర్హులైనచో మీరు ఎవరెవరితో జిహాద్ చేయుదురు? కాని దేవునికి ఖడ్గము అవసరం లేదనే విషయాన్ని నిశ్చయముగా గుర్తుంచుకోండి. అతడు తన ధర్మాన్ని ఆకాశ సంకేతాల ద్వారా భూమండలంపై వ్యాపింపజేయును. అతనినెవరు అడ్డుకోలేరు. గుర్తుంచుకోవలసిన మరొక విషయమేమనగా ఇకపై ఈసా ఎన్నడు అవతరించడు. ఎందుకనగా అతడు فَلَمَّا تَوَفَّيْتَنِيْ అని ప్రళయ దినమున స్వీకరించు ఈ సూక్తిలోనే తాను ఎంతో స్పష్టముగా మరల ఈ ప్రపంచానికి రానని అంగీకరించినట్లు తెలుస్తున్నది. అందుకే క్రైస్తవులు ఎలా మార్గభ్రష్టులైనారో తనకు తెలియదని ప్రళయ దినమున సమాధాన మిచ్చును. ఒకవేళ వారు మరల ప్రపంచానికి వచ్చినచో క్రైస్తవులు ఎలా మార్గభ్రష్టులైనారో నాకు తెలియదని ఎందుకు సమాధానం ఇచ్చెదరు? కావున తాను మరల ఈ ప్రపంచానికి వెళ్ళలేదని వారు ఎంతో స్పష్టముగా ఈ సూక్తి ద్వారా సమాధానమిచ్చిరి. ఒకవేళ వారు ప్రళయ దినము కంటే ముందే మరల ఈ ప్రపంచానికి వచ్చినచో, వారు 40 సంవత్సరాలు జీవించి యున్నచో క్రైస్తవుల గురించి నాకు ఏమి తెలియదని వారు అబద్ధం పలుకుదురు అన్నమాట! వాస్తవానికి వారు నేను మరల ప్రపంచానికి వెళ్ళి

నప్పుడు ప్రపంచంలో 40 కోట్ల మంది క్రైస్తవులను కలిసాను. వారి గురించి పూర్తిగా తెలుసుకున్నాను. వారు మార్గభ్రష్టులైన విషయాన్ని గ్రహించాను. అందుకే నేను వారందరిని ముసల్మాను లుగా మార్చివేసి, సిలువలను ముక్కలు ముక్కలు చేశాను. కావున నేను నీ బహుమానానికి అర్హుడను అని దేవునికి చెప్పాలి. అంతే గాని నాకు ఏమి తెలియదని ఈసా అలైహిస్సలాం ఎందుకు అబద్ధం పలుకుదురు? మొత్తానికి వారు మరల ఈ ప్రపంచానికి తిరిగి రాలేదని స్వయముగా ఈసా (అ) ఎంతో స్పష్టముగా ఈ సూక్తి ద్వారా తెలియ జేశారు. మసీహ్ మరణించారు. ۞(25), శ్రీనగర్

۞(25) కేరియల్ డిలాసేరా అను ఒక దక్షిణ ఇటలి ప్రముఖ వార్త పత్రిక ఒక విచిత్రమైన కథనాన్ని ప్రచురించినది.

"13 జులై 1879న యురోషిలంలో తన జీవితంలో ఒక దైవ జనుడిగా పేరు గాంచిన మస్మి కోర్మారా అను ఒక వృద్ధ సన్యాసికి కొన్ని ఆస్తులు ఉన్న విషయం వెలుగులోకి వచ్చింది. అక్కడి గవర్నర్ వారి బంధువులను ఆరాతీసి వారికి అతని రెండు లక్షల ఫ్రాంక్‌లను (ఒక లక్ష, 28 వేల 750 రూపాయలను) అప్పగించాడు. అవి అనేక దేశాలకు చెందిన చిల్లర నాణేములు. ఆ సన్యాసి చాలా కాలం నుండి సాధన చేసిన ఒక గుహలో ఆ నాణేములు లభించాయి. నాణేములతో పాటు కొన్ని దస్తావేజులు కూడ లభించాయి. వాటిని కూడ వారి బంధువులకు అప్పగించడం జరిగింది. కాని వాటిని వారు చదవలేక పోయారు. కొంత మంది ఇబ్రాని పండితులకు ఆ దస్తావేజులను చూపించగా, ఇబ్రాని బాషలో ఉన్నటు వంటి ఆ పురాతనమైన దస్తావేజులను చూడగానే ఆశ్చర్య పోయారు. వాటిని చదవగా వాటిలో ఈ విషయం పొందు పర్చబడింది.

"మరియమ్మ కుమారుడైన ఏసు సేవకుడు పిత్రస్ మాహిగీర్, ప్రజలకు దేవుని పేరున అతని ఇష్టానికి అనుగుణంగా ప్రసంగిస్తున్నాడు. అని గలదు. మరియు ఆ లేఖ ఈ విధముగా ముగిసింది. పిత్రస్ మాహిగీర్

(జమ్ము కాశ్మీర్ రాష్ట్రము) లోని ఖాన్‌యార్ వీధిలో వారి సమాధి

అనబడే నేను ఏసు పేరున, మరియు నా 90 సంవత్సరాల జీవితంలో అమితాభిమానంతో ఈ పదాలను మన నాయకుడు, మిత్రుడైన మరియమ్మ కుమారుడు యేసు మరణించిన 3 పండగల తరువాత అనగా మూడు సంవత్సరాల తరువాత దేవుని పవిత్రమైన గృహములో వ్రాయవలెనని తీర్మాణించడమైనది.”

ఆ పండితులు ఈ లేఖ పిత్రస్ కాలం నుండి కొనసాగుతు వస్తుందని నిర్ధారించారు. లండన్ బైబిల్ సోసైటి వారు కూడ ఇదే అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. వాటిని క్షుణ్ణముగా పరిశీలించిన పిదప బైబిల్ సోసైటి వారు 4 లక్షల లేరాలకు (రెండు లక్షల ముప్పైఐదు వేల ఐదు వందల రూపాయలకు) ఆ లేఖను దాని యజమానుల నుండి కొనుగోలు చేయాలని నిశ్చయించుకున్నారు.

మరియమ్మ కుమారుడైన ఏసు దుఆ వారిరువురికి శాంతి చేకూరు గాకా!. అతడిట్లనెను: ఓ దేవుడా! నేను దేనినైతే చెడుగా భవించుచున్నానో దానిపై ఆధిక్యతను సాధించు సామర్థ్యం నాకు లేదు. నాలో కల్గిన సత్కార్యపు ఆలోచనను కూడ నేను ఆచరించలేక పోవుచున్నాను. నా కర్తవ్యంతోనే నా కీర్తి ప్రతిష్టలు ముడిపడి ఉన్నాయి. నా కన్న క్రింది స్థాయిలో మరెవరు లేరు. కనుక అత్యున్నత శిఖరాన్ని అధిష్టించు ఓ దేవా! నా పాపములను క్షమించుము. నా శత్రువులకు నాపై నిందారోపణలు చేయు అవకాశాన్ని కల్పించకుము. నా మిత్రుల దృష్టిలో నన్ను అల్పుడిని చేయకు. నా నిష్టాపరత నన్ను కష్టాలకు గురి చేయకుండునట్టు చేయుము. ఈ ప్రపంచమే నాకు అమితానందమును ఇచ్చునదిగా, లేదా ముఖ్య సాధనమైనట్లుగా చేయకుము. నాపై కనికరం చూపని వ్యక్తిని నాకు అధికారున్ని చేయకుము. అపార దయామయుడవైన ఓ దేవా! నీ కరుణతో నన్ను కరణించుము. నీ దయానుగ్రపు ఆవశ్యకత గలవారిపై నీవు దయ చూపుతావు. **సమాప్తం**. (ఉర్దు పుస్తకము మొదటి ముద్రణలోని 69వ పుటలో గల ఫుట్‌నోట్) (ప్రచురణకర్త)

గలదు అనునదే సత్యం. ۞[26] ఇకపై దేవుడే స్వయముగా దిగి వచ్చును. నిజాయితి పరులతో పోరాడు వారితో అతడే పోరాడును. దేవుడు పోరాడడం ఆశ్చర్యకరమైన విషయమేమి కాదు. ఎందుకనగా అతడు సంకేతాల రూపంలో పోరాడును. కాని మానవుని పోరాటం నిశ్చయముగా అభ్యంతరకరమైనదే. ఎందుకనగా అతడు దౌర్జన్యంగా పోరాడును.

ఆ మౌల్వీలపై విచారకరం! ఒకవేళ వారిలో న్యాయబద్ధత ఉన్నచో వారు నిష్టాపరత మార్గంలోనే అన్ని విధాలుగా సంతృప్తిని

---

۞(26) శ్రీనగర్‌లో ఉన్నటు వంటి సమాధి విధానంను చూసి అది యూదుల ప్రవక్తలకు చెందిన సమాధియే అని ఒక యూదుడు కూడ అంగీకరించాడు.

## شهد شاهد من بنی اسرائیل

**(మసీహ్ సమాధి గురించి బైబిల్ విద్యావంతులైన ఒక ఇస్రాయీలీ సాక్ష్యము)**

మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ గారి పరిశోదన ద్వారా వెలువడిన ఒక చిత్రమును నేను చూశాను. అది నిజమైనదే. ఇస్రాయిల్ సంతతి సమాధులలో ఒక సమాధి. అది ఇస్రాయిల్ మహాత్ముల సమాధుల లో ఒకటి. నేను ఆ చిత్రమును నేడు అనగా 1899 జూన్ 12వ తేదీన తిలకించాను. కావున ఈ సాక్ష్యము వ్రాస్తున్నాను. సల్మాన్ ఇస్‌హాఖ్ వ్యాపారి, సల్మాన్ యూదుడు నా సమక్షములో ఈ సాక్ష్యము వ్రాసిరి.

**ఇట్లు ముఫ్తీ ముహమ్మద్ సాదిఖ్ భేర్వీ**

**క్లర్క్ అకౌంటెంట్ జనరల్ లాహోర్**

ఇస్రాయిల్‌లో గొప్ప వ్యక్తి అయిన సల్మాన్ వల్దు యూసుఫ్ అనే వ్యక్తి ఈ సాక్ష్యము వ్రాశారని నేను అల్లాహ్ సాక్ష్యముగా తెలుపుతున్నాను.

**సంతకము: సయ్యద్ అబ్దుల్లాహ్ బఘ్దాదీ.**

***సమాప్తం.***

పోందేవారు. అల్లాహ్ తఆలా పుణ్యాత్ములకు సంతృప్తిని చేకూర్చి నాడు. కాని అబూజహల్ పుట్టించబడిన మట్టితో పుట్టించబడిన వారందరు మాత్రం అబూజహల్ అనుసరించిన మార్గాలనే అనుసరిస్తున్నారు. అమృత్‌సర్‌లో నద్వతుల్ ఉలమాల ఆధ్వర్యంలో జల్సా నిర్వహించబడుతుంది. కావున అక్కడికి వచ్చి వాగ్వివాదాము లు చేయండి అని మీరట్‌కు చెందిన ఒక మౌల్వీ రిజిస్ట్రీ ద్వారా సమాచారమును పంపాడు. ఇక్కడ స్పష్టముగా తెల్పునదేమనగా, ఒకవేళ ఆ వ్యతిరేకులు సదుద్దేశాలను కల్గియుండి, జయాపజయాల ను గూర్చి ఆలోచించకుండా ఉన్నవారే అయితే అలాంటి వారిని సంతృప్తి పర్చుటకు నద్వా వంటి వారి అవసరం ఎందుకు ఉండును? నద్వా మరియు అమృత్‌సర్ ఉలమాలను మేము వేరు వేరుగా భావించడం లేదు. వారందరు ఒకే సిద్ధాంతంను, ఒకే అభిప్రాయమును, ఒకే లక్షణాన్ని కల్గియున్నారు. ప్రతి ఒక్కరు ఖాదియాన్‌కు రావచ్చును. కాని వాగ్వివాదాముల కొరకు కాదు. కేవలం సత్యాన్వేషణలో మా ఉపన్యాసాలను వినుటకు మాత్రమే రండి. ఒకవేళ ఏమైనా సందేహాలు ఉన్నచో సామరస్యముగా, గౌరవ పూర్వకముగా తమ తమ సందేహాలను దూరం చేసుకోండి. ఖాదియాన్‌లో ఉన్నంత కాలం వారు అతిథులు గానే ఉంటారు. నద్వా వంటి ప్రాంతాల అవసరం మాకు ఏ మాత్రం లేదు. వారి సహాయం మాకు అంతకన్న అవసరం లేదు. వీరందరు సన్మార్గ వ్యతిరేకులు. కాని సత్యమే ప్రపంచంలో వ్యాపిస్తుంది. నీవు సఫలీకృతడవు కాకూడదని ప్రజలు ప్రయత్నిస్తుంటారని, వారు చివరి వరకు అడ్డుకుంటారని కాని అల్లాహ్ తఆలా ఒక గొప్ప సమాజాన్ని నీకు అందిస్తాడు అని నేటి నుండి 20 సంవత్సరాలకు పూర్వమే బరాహీనే అహ్మదియ్యలో తన దైవవాణి ద్వారా ఈ

విషయాన్ని తెలియజేయడం దేవుని యొక్క అద్భుతమైన మహిమ కాదా! ఈ దైవవాణి అవతరించిన సమయంలో నాకు తోడుగా ఒక్కరు కూడ లేకుండెను. నేను నా వాగ్దానాలను ప్రచురించిన తరువాత వ్యతిరేకులు చివరి క్షణాల వరకు ప్రయత్నించారు. చివరికి పైన పేర్కొనబడిన భవిష్యవాణి ప్రకారం ఈ జమాఅత్ వ్యాపించినది. నేటి తేది వరకు బ్రిటిష్ ఇండియాలో ఈ జమాఅత్ లక్ష మందికి పైగా సభ్యులను కల్గియున్నట్లు పొందు పర్చడమైనది. నద్వతుల్ ఉలమాలకు ఒకవేళ మరణం గుర్తుకున్నచో వారు బరాహీనే అహ్మదియ్యాను మరియు ప్రభుత్వ పత్రాలను చూసి ఇది అద్భుతమా? కాదా? చెప్పండి. ఇప్పుడు ఖుర్ఆన్ మరియు అద్భుతాలను సాక్ష్యముగా చూపిన తరువాత మరల వాగ్వివాదాము ల అవసరం ఏమున్నది?

అదే విధముగా ఈ దేశపు పీఠాధిపతులు మరియు పీరులు ధర్మము నుండి అనుబంధరహితముగా ఉంటూ దురాచారములలో ఎంతగా లీనమై పోయారనగా ఇస్లాం ఎదుర్కొంటున్న కష్ట నష్టాలను గూర్చిన అవగాహనయే లేకుండ పోయింది. వారి సమావేశాలకు వెళ్ళినచో వివిధ రకాల తంబూర, సన్నాయి, మద్దెల చప్పుళ్లతో పాటు ఖవాలీ వంటి దురాచారములు మనకు కనిపిస్తుంటాయి. ఒకవైపు వీటి అన్నింటిని కొనసాగిస్తూనే మరో వైపు ముసల్మానులకు మార్గదర్శకులమని, ప్రవక్త అనుయాయులమని దావాలు, ప్రకటనలు చేస్తుంటారు. వారిలో కొందరు మహిళల దుస్తులు ధరిస్తుంటారు, కొందరు చేతులకు గోరింటాకు పెట్టుకుంటారు. మరి కొందరు గాజులు వేసుకుంటారు. పవిత్ర ఖుర్ఆన్ గొప్పతనమును గూర్చి కవితలు వ్రాసి తమ సమావేశాలలో వినిపిస్తుంటారు. ఇలా చాలానే త్రుప్పు పట్టిపోయింది. వాటిని

వదిలించడం కూడ కష్టతరమే అవుతుంది. కాని అల్లాహ్ తఆలా తన శక్తిని తప్పకుండ ప్రదర్శిస్తాడు. ఇస్లాంను రక్షిస్తాడు.

# మహిళలకు ఉపదేశాలు

మనం జీవిస్తున్న నేటి కాలంలో మహిళలు కూడ కొన్ని ప్రత్యేక దురాచారములకు గురైనారు. బహుబార్యత్వంను వారు చాలా చెడుగా చూస్తుంటారు. ఒక విధముగా చెప్పదలచినచో వారికి ఈ అంశంపై విశ్వాసమే లేదని చెప్పాలి. దేవుని ధర్మ గ్రంథం అన్ని రకాల పరిష్కార మార్గాలను కల్గియుంటుంది. కావున ఒకవేళ ఇస్లాంలో బహుబార్యత్వం లేనిచో పురుషులు రెండవ వివాహం చేసుకోవలసి వచ్చిన పరిస్థితులలో ధర్మశాస్త్రం వారికి ఎలాంటి పరిష్కారాన్ని చూపించేది కాదు. ఉదా॥ మహిళలకు పిచ్చి పట్టినచో, లేదా కుష్టి వ్యాధి సోకినచో, మరేదైన శాశ్వత అనారోగ్యానికి గురై జీవచ్ఛవంలా మారిపోయినచో లేదా మరే ఇతర కారణాల వలనైన మహిళ వైవాహిక జీవితానికి పనికి రానిస్థితిలో ఉన్నచో పురుషుడు తన మనోవాంచలను అదుపు చేసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు అతనికి మరల వివాహం చేసుకో వడానికి అనుమతి నివ్వనిచో అతనిపై దౌర్జన్యం చేసినట్లు అవుతుంది. కావున దైవ గ్రంథం ఇలాంటి వాస్తవాలను దృష్టి యందుంచుకొని పురుషుల కోసం ఈ మార్గాన్ని తెరిచింది. అదే విధముగా వైవాహిక జీవితానికి పనికి రాని పురుషులున్నచో ఆ మహిళ ధర్మాధికారి ద్వారా తలాక్‌కు సమానమైన ఖుల (విడాకులు) ను తోసుకోవచ్చని మహిళలకు కూడ మార్గం తెరిచింది. దైవ గ్రంథం ఔషధాలను విక్రయించే దుకాణం వంటిది. కావున ఒకవేళ ఆ దుకాణంలో అన్ని రకాల జబ్బులకు తగిన ఔషధాలు

లేనిచో ఆ దుకాణం నడవదు. అందుకే ఆలోచించండి! ఊహించిన సమస్యలు పురుషులకు ఎదురవుతాయి. అనగా తప్పని పరిస్థితులలో రెండవ వివాహం చేసుకోవలసిన పరిస్థితి వస్తుంది. కావున అన్ని సమస్యల కు పరిష్కారం చూపని ఆ ధర్మ గ్రంథం ఎందుకు? ఇంజీల్‌ను చూడండి. విడాకులు తీసుకోవడం కోసం వ్యభిచారాన్ని షరతుగా విధించింది. కాని స్త్రీ పురుషుల ప్రాణాలకే హాని కల్గించే ఇతర కొన్ని వందల కారణాలను మాత్రం అది పేర్కొనలేదు. అందుకే క్రైస్తవ జాతి ఈ లోపాన్ని జీర్ణించుకోలేక పోయింది. చివరికి అమెరికా విడాకులకు చెందిన ఒక చట్టాన్ని తీసుకవచ్చింది. కావున ఇప్పుడు ఆలోచించండి. ఈ చట్టాన్ని తీసుకరావడం వలన ఇంజీల్ కు ఏ స్థానం దక్కుతుంది? కావున ఓ మహిళలారా! మీరు చింతించకండి! మీకు అనుగ్రహించబడిన గ్రంథం ఇంజీల్ వలే మానవ మార్పుల అవసరాన్ని కల్గిలేదు. ఆ గ్రంథములో పురుషుల హక్కులకు రక్షణ కల్పించినట్లే మహిళల హక్కులకు కూడ రక్షణ కల్పించబడింది. ఒకవేళ మహిళలు పురుషుల బహుబార్యత్వపు ఆదేశం పట్ల కోపంగా ఉన్నచో ధర్మాధికారుల ద్వారా విడాకులను పొందవచ్చును. ముసల్మానులు ఎదుర్కొనబోయే విభిన్న అంశాలను తన దైవ గ్రంథంలో పేర్కొనడం దేవుని బాధ్యత. ధర్మ గ్రంథం అసంపూర్ణముగా ఉండకూదనేది దైవేచ్ఛ! కావున ఓ మహిళలారా! మీ భర్తలు రెండవ వివాహం చేసుకోవాలని సంకల్పించుకున్నప్పుడు మీరు శాపనార్థాలు పెట్టకండి. మీకు ఎదురయ్యే సమస్యలు, కష్టాల నుండి కాపాడమని మాత్రమే దుఆలు చేయండి. రెండు వివాహాలు చేసుకోని ఇరువురు భార్యలను సమానంగా చూడని భర్త చాలా దౌర్జన్యవంతుడగును. అతడు శిక్షించబడును. కాని మీకు మీరే దైవాదేశాల పట్ల అవిధేయత

ను ప్రదర్శిస్తూ దైవాగ్రహానికి గురి కాకండి. తాము చేయు పనులను గూర్చి ప్రతి ఒక్కరు ప్రశ్నించ బడుతారు. ఒక వేళ  మీరు దేవుని దృష్టిలో పుణ్య స్త్రీలుగా పరిగణించబడినచో మీ భర్తలు కూడ పుణ్య పురుషులుగా తీర్చిదిద్దబడుతారు. అనేక కారణాలను దృష్టి యందుంచుకొని ధర్మ శాస్త్రం బహు భార్యత్వంనకు అనుమతి నిచ్చింది. దానితో పాటు దైవ న్యాయస్థానం, దైవ అభీష్ట మార్గాలు మీ కొరకు తెరువబడి యున్నాయి. ఒకవేళ దైవగ్రంథంలో పేర్కొనబడిన ఆదేశం మీకు ఆమోదయోగ్యముగా లేనిచో మీరు దుఆలు చేస్తూ దైవ న్యాయస్థానం నుండి ప్రయోజనంను పొంద వచ్చును. ఎందుకనగా దైవన్యాయస్థానం దైవగ్రంథంపై ఆధిక్యతను కల్గియుంటుంది. నిష్టాపరతను అవలంభించండి. ఈ ప్రపంచం మరియు ప్రపంచ అంద చందాల కు మీరు ముగ్దులు కాకండి. జాతి అహంకారాన్ని ప్రదర్శించకండి. ఏ మహిళను కించ పర్చకండి. మీ భర్తల స్థోమతను మించి కోరికలు కోరకండి. మీరు పుణ్య స్త్రీలుగా, పవిత్రురాల్లుగా సమాధి గావించబడుటకు ప్రయత్నించండి. నమాజ్, జకాత్ వంటి దేవుని హక్కులను చెల్లించుటలో అలసత్వం వహించకండి. మీరు మనస్ఫూర్తిగా మీ భర్తలకు విధేయులుగా జీవించండి. వారి అధికశాతం గౌరవ మర్యాదలు మీ చేతులలోనే ఉన్నాయి. కావున మీరు దేవుని సన్నిధిలో గుణవంతురాలుగా, శీలవంతురాలుగా పరిగణించబడు విధముగా మీ భాధ్యతలను మీరు శ్రద్ధగా నెరవేర్చండి. వృధా ఖర్చులు చేయకండి. మీ భర్తల సంపాదనను విచ్చల విడిగా ఖర్చు చేయకండి. మోసం, దొంగతనం చేయకండి. నిందలు వేయకండి, ఒక మహిళ మరో మహిళపై లేదా పురుషులపై అబంధాలు వేయకండి.

# చివరి పలుకులు

ఈ ఉపదేశాలన్నింటిని మేమిక్కడ వ్రాయడానికి గల కారణం ఏమిటనగా, మన జమాఅత్ దైవభీతిలో చాలా అభివృద్ధి చెందాలి. ఈ భూమండలంపై ఆవహిస్తున్న దైవాగ్రహం వారి వరకు చేరకుండా ఉండాలి. తావూన్ వ్యాపిస్తున్న ఈ రోజులలో వారు రక్షించబడాలి. నిజమైన ధార్మికత (నిజమైన ధార్మికత చాలా తక్కువగా ఉన్నది) దేవున్ని సంతృప్తి పరుస్తుంది. సంపూర్ణ విశ్వాసిని దేవుడు సాధారణముగా కాకుండా ఒక సంకేత రూపం లో కాపాడుతాడు. ప్రతి మోసగాడు, అజ్ఞానుడు తనకు తాను ధార్మికుడనని ప్రకటించుకుంటాడు. కాని దేవుని సంకేతాల ద్వారా నిష్టాపరుడని నిరూపించ బడినవాడే అసలైన ధార్మికుడు. నేను దేవున్ని ప్రేమిస్తున్నాను అని ప్రతి ఒక్కరు చెప్పుకోగలరు. కాని ఎవరి ప్రేమను గూర్చి ఆకాశం సాక్ష్యం ఇస్తుందో వారే ప్రేమించు వారగుదురు. తమదే అసలైన మతమని ప్రతి ఒక్కరు వాదించ గలరు. కాని ఈ ప్రపంచంలోనే ఒక తేజస్సును అనుగ్రహించు నది నిజమైన మతం. తనకు మోక్షం లభిస్తుందని ప్రతి ఒక్కరు భావించవచ్చును. కాని ఈ ప్రపంచంలోనే మోక్షపు తేజస్సును దర్శించుకున్నవారే అసలైన మోక్షపరులు. కావున మీరు దేవున్ని ప్రేమించుటకు ప్రయత్నించుము. తద్వారా మీరు అన్ని రకాల ఆపదల నుండి కాపాడబడుతారు. నిజమైన విశ్వాసి తావూన్

నుండి కాపాడబడుతాడు. ఎందుకనగా అతడు దేవుని రక్షణలో ఉంటాడు. అందుకే మీరు కూడ నిజమైన విశ్వాసులుగా మారండి. తావూన్‌ను గూర్చి దేవుడు చెప్పిన విషయాలను మీరు విన్నారు. అది ఒక ఆగ్రహపు జ్వాల. కావున మీరు ఆ జ్వాల నుండి రక్షించు కొనుడు. నిజాయితితో నన్ను అనుసరించు వ్యక్తి, ద్రోహం చేయని వ్యక్తి, అలసత్వం, నిర్లక్ష్యం వహించని వ్యక్తి, మంచి పనులతో చెడు పనులను కలుపని వ్యక్తి తప్పకుండా కాపాడ బడుతాడు. కాని ఈ మార్గంలో చాలా బద్ధకంతో అడుగులు వేయు వ్యక్తి, నిష్టాపరతను పూర్తిగా అనుసరించని వ్యక్తి, లేక ప్రపంచంలో మునిగిపోయినటు వంటి వ్యక్తి వారికి వారే సమస్యలను కొని తెచ్చుకొను వారగుదురు. అన్ని కోణాల నుండి దేవుని పట్ల విధేయతను చూపండి. బైఅత్ చేసిన వారిలో తమను తాము పరిగణించుకొను ప్రతి వ్యక్తి తన ఆదాయంతో ఈ జమాఅత్‌కు సేవ చేయు సమయమిది. ఏ వ్యక్తి అయినా ఒక్క పైసా చెల్లించు స్థోమతను కల్గియున్నచో అతడు క్రమం తప్ప కుండా ప్రతి నెల ఒక్క పైసాను ఈ జమాఅత్‌కు చెల్లించండి. ఎందుకనగా ఆతిథ్య గృహ ఖర్చులే గాకుండా ధార్మిక నిర్వాహణ ఖర్చులు కూడ పెరిగి పోతున్నాయి. వందల సంఖ్యలో అతిథులు వస్తున్నారు. కాని మన వద్ద తగినంత ధనం లేకపోవడం వలన నేటి వరకు అతిథుల కోసం ఒక ఆతిథ్య గృహాన్ని నిర్మించలేక పోయాము. అదే విధముగా మంచాలు కూడ లేవు. మస్జిద్‌ను కూడ పెంచవలసి ఉన్నది. వ్యతిరేకుల ఆరోపణలను ఖండించుటకు రచనలు, ప్రచురణలు కూడ చాలా తక్కువ స్థాయిలోనే జరుగుచున్నాయి. క్రైస్తవులు 50 వేల సంఖ్యలో ప్రతులనే గాకుండా ధార్మిక పత్రికలను కూడ ప్రచురిస్తున్నారు. కాని మనం ప్రతి నెల వెయ్యి ప్రతులను కూడ

ప్రచురించలేక పోవుచున్నాము. బైఅత్ చేసిన ప్రతి వ్యక్తి ఈ అంశాలను దృష్టియందుంచుకొని తమ స్థోమత మేరకు సహాయాన్ని అందించాలి. అప్పుడే దేవుడు కూడ వారికి సహాయంను అందించును. గుర్తుకు వచ్చినప్పుడే నగదును పంపిస్తూ చేసే సహాయం కన్న క్రమం తప్పకుండా ప్రతినెల సాధ్యమైనంత మేరకు చేసే చిన్న సహాయమే చాలా గొప్పది. ప్రతి వ్యక్తి యొక్క స్వచ్ఛత వారి సేవల ద్వారానే గుర్తించ బడుతుంది. ఓ ప్రియులారా! ధర్మము మరియు ధార్మిక లక్ష్యాల కొరకు సేవ చేయు సమయమిది. ఈ అవకాశాన్ని అదృష్టంగా భావించండి. ఇలాంటి అవకాశం మరల ఎన్నడు లభించదు. కావున జకాత్ చెల్లించువారు తప్పకుండా ఇక్కడికి జకాత్‌ను పంపించగలరు. ప్రతి వ్యక్తి తన వృధా ఖర్చులను తగ్గించుకొని, పొదుపుగాబడిన ధనమును దైవ మార్గంలో ఖర్చు చేయండి. ఏది ఏమైనప్పటికి మీ నిజాయితిని నిరూపించుకోండి. ఫలితముగా అనుగ్రహం మరియు పరిశుద్ధ ఆత్మల బహుమతులను కూడ పొందగలరు. ఎందుకనగా ఈ బహుమతులు ఈ జమాఅత్ లో చేరునట్టి వారి కొరకే సిద్ధం చేయబడ్డాయి. మన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించిన పరిశుద్ధాత్మ యొక్క కాంతి ఇతర అన్ని కాంతుల కంటే చాలా గొప్పది. పరిశుద్ధాత్మ కొన్ని సందర్భాలలో పావురం రూపంలో బహిర్గతమైనది. మరి కొన్ని సందర్భాలలో కొంత మంది అవతార పురుషులకు, ప్రవక్తలకు ఆవు రూపంలో బహిర్గతమైనది. మరి కొందరికి తాబేలు లేదా చాప రూపంలో బహిర్గతమైనది. పరిపూర్ణ మానవుడు అనగా మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించనంత వరకు ఆ పరిశుద్ధాత్మ మానవ రూపంలో బహిర్గతం కాలేదు. కాని పరిపూర్ణ మానవుడైన హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం

అవతరించగానే పరిశుద్ధాత్మ కూడ మానవరూపంలో బహిర్గత మైనది. పరిశుద్ధాత్మకు అద్భుత శక్తులున్నందున అది భూమ్యాకాశపు అంచులను తన శక్తులతో నింపడం ద్వారా ఖుర్ఆన్ బోధనలు అన్యారాధన నుండి కాపాడబడినాయి. కాని క్రైస్తవ ధర్మ స్థాపకునిపై పరిశుద్ధాత్మ చాలా బలహీనమైన రూపంలో అనగా పావురపు రూపంలో బహిర్గతమైనందున దుష్ట ఆత్మ అనగా షైతాన్ వారి ధర్మముపై ఆధిక్యతను సాధించినది. ఆ దుష్ట ఆత్మ తన ప్రతాపాన్ని, శక్తులను ఆ ధర్మముపై ఎంతగా చూపినదనగా అదొక కాలకూట విష సర్పం వలే దాడి చేసినది. ఈ కారణం చేతనే పవిత్ర ఖుర్ఆన్ క్రైస్తవ ధర్మపు మార్గభ్రష్ఠత్వంను ప్రపంచంలోనే అతి పెద్ద మార్గ భ్రష్టత్వంగా పేర్కొన్నది. అందుకే ఇలా తెల్పినది, బహుశా భూమ్యాకాశములు పగిలిపోయి ముక్కలు ముక్కలు అగును. మానవున్ని దేవుడు, దేవుని కుమారుడిని చేసి ఈ ప్రపంచంలోనే వారు అతి పెద్ద పాపంనకు ఒడిగట్టారు. అందుకే పవిత్ర ఖుర్ఆన్ ఆరంభంలోనే క్రైస్తవ ధర్మ ఖండన గలదు. అదేమనగా إِيَّاكَ نَعْبُدُ, మరియు وَلَا الضَّالِّينَ అనే సూక్తులతో విషయాన్ని అర్థం చేసుకో వచ్చును. అదే విధముగా పవిత్ర ఖుర్ఆన్ చివరిలో కూడ అనగా قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ اَللّٰهُ الصَّمَدُ لَمْ يَلِدْ وَلَمْ يُوْلَدْ (అల్ ఇఖ్లాస్-112:2-4) (అల్లాహ్ వంటరివాడు. అందరి అవసరాలను తీర్చు వాడే అల్లాహ్. అతనికెవరి సహాయము అవసరము లేదు. అతనికి సంతానము లేదు, అతడు ఎవని చేత పుట్టింపబడలేదు.) అనే సూక్తి ద్వారా కూడ క్రైస్తవ ధర్మాన్ని ఖండించినదని అర్థం చేసుకోవచ్చును. అంతేగాకా పవిత్ర ఖుర్ఆన్ మధ్య భాగంలో కూడ క్రైస్తవ ధర్మపు విపత్తును గూర్చి ప్రస్తావన గలదు. అనగా تَكَادُ السَّمٰوٰتُ يَتَفَطَّرْنَ مِنْهُ (మర్యమ్-19:91) (మీ మాటల వలన సమీపములోనే ఆకాశములు

పగిలి పడిపోవచ్చును.) అను సూక్తి ద్వారా కూడ ఈ విషయాన్ని గ్రహించవచ్చును. అంతేగాకా ప్రపంచంపై మానవజీవితం మొదలైనప్పటి నుండి ఏనాడు కూడ ఇంతటి ఘోరంగా ప్రాణులను పూజించడం, మోసపూరిత మార్గాల ను ఎంచుకోవడం జరగలేదని పవిత్ర ఖుర్ఆన్ ద్వారా తెలుస్తుంది. అందుకోసమే వాగ్వివాదానికి క్రైస్తవులనే ఆహ్వానించడం జరిగింది కాని అన్యారాధకులను కాదు. పూర్వ కాలంలో ఈ పరిశుద్ధాత్మ పక్షుల రూపంలో, జంతువుల రూపంలో బహిర్గతమవడంలో గల ఆంతర్యంమేమిటి? దీనిని అర్థం చేసుకునేవారే స్వయముగా అర్థం చేసుకోగలరు. కాని ఇక్కడ మేము తెల్పునదేమనగా, మా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మానవ నైజం ఎంత బలిష్టముగా ఉన్నదనగా పరిశుద్ధాత్మనే మానవ రూపంలో బహిర్గత మవునట్లుగా ఆకర్షించింది. కావున మీరు ఇంతటి మహోన్నతుని సమాజికులైనను ఎందుకు అధైర్యపడు చున్నారు? దేవదూతలు కూడ ఆకాశంలో మీ స్వచ్ఛత, నిజాయితిని చూసి ఆశ్చర్యపడి మీపై దురూద్ పంపునట్టి ఆదర్శమును మీరు నిలుపుము. మీరు ఒక మరణంను స్వీకరించు ము, ఫలితముగా మీకు ఒక క్రొత్త జీవితం లభించును. మీరు మీ మనోవాంచలన న్నింటిని మీలో నుండి తీసిపారవేయుము, ఫలితము గా దైవం మీలో సమకూరిపోవును. ఒకవైపు పూర్తి శక్తి సామర్థ్యాలతో తెగతెంపులు చేసుకొనుము, మరోవైపు పటిష్టమైన అనుబంధాన్ని పెంపొందించుకొనుము. ఫలితముగా దైవం మీకు సహకరించును.

ఇప్పుడు నేను ముగిస్తున్నాను. మరియు దుఆ చేయు చున్నాను. ఈ బోధనలు నాకు మీకు ప్రయోజనంను చేకూర్చు గాకా!, భూమండలపు నక్షత్రముల వలే రూపుదిద్దుకొను పరివర్తనం మీలో కలుగును గాకా!, మీ సంరక్షకుని నుండి మీకు లభించిన

తేజస్సు వలన ఈ భూమండలం కూడ ప్రకాశించును గాకా! (ఆమీన్ సుమ్మ ఆమీన్).

يَا عِبَادَاللهِ اُذَ كِّرُ كُمْ اَيَّامَ اللهِ وَاُذَ كِّرُ كُمْ تَقْوَى الْقُلُوْبِ

అనగా ఓ అల్లాహ్ దాసులారా! నేను మీకు దైవ దినములను గుర్తుచేస్తున్నాను. నిష్టాపరత రోజులను కూడ గుర్తు చేస్తున్నాను.

اِنَّهٗ مَنْ يَّاْتِ رَبَّهٗ مُجْرِمًا فَاِنَّ لَهٗ جَهَنَّمَ ۭ لَا يَمُوْتُ فِيْهَا وَلَا يَحْيٰى

(తాహా-20:75) అనగా వాస్తవముగా తమ ప్రభువు వద్ద అపరాధిగా ఉపస్థితుడైన వ్యక్తికి నిశ్చయముగా నరకము లభించును. అతడు దానిలో మరణించడు, జీవించడు.

فَلَا تُخْلِدُوْا اِلٰى زِيْنَةِ الدُّنْيَا وَزُوْرِهَا وَاتَّقُوا اللهَ

ఇహలోక సౌందర్యము వైపు మొకరిల్లకుము, దానిని విడిచిపెట్టి అల్లాహ్‌తో భయపడుము.

وَاسْتَعِيْنُوْا بِالصَّبْرِ وَالصَّلٰوةِ

(అల్ బఖరహ్-2:46) అనగా శాంతి చిత్తులై ప్రార్థనలు (నమాజ్) చేయుచూ సహాయ్యమును అర్థింపుము.

اِنَّ اللهَ وَمَلٰٓئِكَتَهٗ يُصَلُّوْنَ عَلَى النَّبِيِّ ۭ يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا صَلُّوْا عَلَيْهِ وَسَلِّمُوْا تَسْلِيْمًا

(అల్ అహ్‌జాబ్-33:57) అనగా అల్లాహ్ నిశ్చయముగా ఈ సందేశహరునిపై తమ అనుగ్రహమును అవతరింప జేయు చున్నాడు. ఇతని దేవదూతలు కూడ (ఇతని కొరకు నిశ్చయము గా ప్రార్థిస్తున్నారు కనుక ఓ విశ్వాసులారా! మీరు కూడ ఈ సందేశహరునికి 'దురూద్' పంపుతు వారి కొరకు ప్రార్థిస్తుండుము. భక్తిభావాలతో వారి కొరకు శాంతిని యాచిస్తుండుము.

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّ عَلٰى اٰلِ مُحَمَّدٍ وَبَارِكْ وَسَلِّمْ

అనగా ఓ అల్లాహ్! ముహమ్మద్‌పై, ముహమ్మద్ కుటుంబంపై శాంతి ఆశీస్సులు పంపుము.

## پیشگوئی متعلق طاعون در نظم

نشان اگرچہ نہ در اختیار کس بودست — مگر نشان بدہم از نشان زِ دا دارم
کہ آن سعید زِ طاعون نجات خواہد یافت — کہ جَست و جُست پناہے بچار دیوارم
مرا قسم بخداوند خویش و عظمت او — کہ ہست این ہمہ از وحی پاک گفتارم
چہ حاجت است بہ بحث دِگر ہمیں کافیست — برائے آنکہ سیہ شد دلش زِ انکارم
اگر دروغ براید ہر آنچہ وعدۂ من — رواست گر ہمہ خیزند بہر پیکارم

# తావూన్ (ప్లేగ్ వ్యాధి) గురించి పద్య రూపంలో భవిష్యవాణి

(1) వాస్తవానికి సంకేతములు ఎవరి అధీనంలో వుండవు. కాని నేను దేవుని తరపున ఒక సంకేతము గురించి తెలుపుతున్నాను.
(2) పరుగెత్తుకొచ్చి నా ప్రహారి గోడ లోపల ఆశ్రయము పొందిన అదృష్టవంతుడే తావూన్ నుండి మోక్షము పొందును.
(3) నేను నా దేవుని, అతని పవిత్రత ప్రమాణము చేసి చెప్తున్నాను. నేను చెప్తున్న ఈ మాటలన్ని దైవవాణీలో భాగమే.
(4) నన్ను నిరాకరించినందున ఎవరి హృదయము నల్లబడినదో అతని గురించి మరో చర్చ అవసరమే లేదు. ఈ విషయము మాత్రమే సరిపోవును.
(5) నేను చేసిన వాగ్దానము అసత్యమైనచో నిస్సందేహంగా అందరు నాకు వ్యతిరేకంగా నిలబడినచో సమంజసమే అగును.

# గృహాన్ని విశాలంగా నిర్మించుటకు చందాల విన్నపం

రాబోవు రోజులలో ఈ దేశంలో చాలా భయంకరముగా తావూన్ వ్యాపిస్తుందనే అంచనా ఉన్నది. మా గృహములో కొంత భాగంలో పురుషులు అతిథులుగా ఉంటారు. మరికొన్ని భాగాలలో మహిళలు అతిథులుంటారు. కావున చాలా కొరత ఏర్పడుతుంది. ఈ గృహ నాలుగు గోడల మధ్య ఉన్న వారందరు రక్షించబడుతారని వైభవోపేతుడైన అల్లాహ్ వాగ్దానం చేసిన విషయం కూడ మీకు తెలిసిందే. మీరు కూడ విన్నారు. కీ॥ శే॥ గులాం హైదర్ గృహంలో కూడ మాకు భాగమున్నది. కావున మా భాగస్వాములు మాకు మా భాగాన్ని ఇవ్వడంతోపాటు మిగిలిన భాగాన్ని కూడ అమ్ముటకు సిద్ధముగా ఉన్నారు. నా దృష్టిలో ఈ భవనం 2 వేల రూపాయలలో పూర్తిగా సిద్ధమై మా భవనంలో ఒక భాగముగా తయారవుతుంది. మరో వైపు తావూన్ కాలం సమీపిస్తున్నది. ఆ సమయంలో ఈ గృహము దైవావాణి ద్వారా అందిన శుభ వార్త మేరకు తావూన్‌కు చెందిన తూఫాన్‌లో పడవను పోలినట్లు ఉండును. వాగ్దానం చేయబడిన ఈ శుభవార్తలో ఎవరెవరికి భాగం లభించునో తెలియదు. అందుకే ఈ పనిని త్వరగా పూర్తి చేయాలి. కావున సృష్టికర్త, సిరి సంపదలను అనుగ్రహించు, సత్కార్యములను పర్యవేక్షించు దేవునిపై నమ్మకాన్ని పెంచుకొనుచు ప్రయత్నించాలి. మా ఈ గృహమును నేను కూడ ఒక పడవ మాదిరిగానే చూస్తున్నాను. కాని రాబోవు రోజులలో ఈ పడవలో పురుషులకు

గాని, స్త్రీలకు గాని ఎలాంటి చోటు మిగలదు. కావున ఈ గృహాన్ని విశాలంగా నిర్మించవలసి ఉన్నది.

సన్మార్గమును పాటించిన వారికి అల్లాహ్ శాంతి కలిగించుగాక!

**ప్రకటనకర్త**
**మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని**

